
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 285

SUNDAY Special | ఆదివారం | 5-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



145 పరుగుల ఆధిక్యంలో భారత్

ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరుగుతున్న చివరి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 6 వికెట్లకు 141 పరుగులు చేసింది. రిషభ్ పంత్ అర్ధ సెంచరీ సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 181 పరుగులు చేసింది.

14లో



పిట్టలు వాలిన చెట్టు

నేడు జాతీయ పక్షుల దినోత్సవం సందర్భంగా 'బర్డ్ ఉమన్ ఆఫ్ ఇండియా'గా పేరెన్నికగన్న జమాల్ ఆరాతో పాటు పక్షులకు ఆమె చేసిన సేవపై ప్రత్యేక కథనం.

13లో



అంతరిక్షంలో జీవం 'పురుడు'..

అంతరిక్షంలో అద్భుతాలతో అబ్బురపరుస్తున్న ఇస్రో మరో ఘనత సాధించింది. అంతరిక్షంలో జీవసృష్టి చేసి చూపించింది.

- వివరాలు 6లో▶



116 ఏళ్ల మహిళ ఇక లేరు

ప్రపంచంలోనే అత్యధిక కాలం జీవించిన వ్యక్తిగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కిన జపాన్ బామ్మ టొమికో ఇటూకా కన్నుమూశారు.

- వివరాలు 6లో▶



శాస్త్రవేత్త చిదంబరం కన్నుమూత

భారత అణ్వస్త్ర ప్రయోగాల్లో కీలక భూమిక పోషించిన శాస్త్రజ్ఞుడు డాక్టర్ రాజగోపాల చిదంబరం శనివారం తుదిశ్వాస విడిచారు.

- వివరాలు 6లో▶



శిక్షాకాలం లేకుండా తీర్పిస్తా

అనైతిక నగదు చెల్లింపుల కేసులో దోషిగా తేలిన ట్రంప్‌కు శిక్షాకాలం లేకుండా శిక్ష విధిస్తానని మాన్‌హట్టన్ కోర్టు జడ్జి చెప్పారు.

- వివరాలు 6లో▶

సాగు యోగ్యతతోనే భరోసా!

రైతు భరోసాకు ఏటా రూ. 12 వేలు పెట్టుబడి సాయం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గుట్టలు, రాళ్లు, రోడ్లు, పరిశ్రమలు, నాలా కన్వర్షన్, ప్రభుత్వం సేకరించిన భూములకు వర్తించదు

రూ. 12,000 భూమి లేని వ్యవసాయ కుటుంబాలకు ఏటా సాయం

- ఈ పథకానికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'గా నామకరణం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వెసులుబాటు మేరకు ఇస్తున్నాం
- రేషన్‌కార్డులు లేని పేద కుటుంబాలన్నింటికీ కొత్త కార్డుల జారీ
- జనవరి 26 నుంచి ఈ మూడు పథకాల అమలు ప్రారంభిస్తామని వెల్లడి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ . చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల

రాష్ట్ర మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా పథకం కింద ఎకరాకు ఏటా రూ.12 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. భూమి లేని వ్యవసాయ కుటుంబాలకు కూడా ఏటా రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. ఈ కొత్త పథకానికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' అని పేరుపెట్టినట్టు తెలిపారు. ఇక రాష్ట్రంలో రేషన్‌కార్డు లేని పేద కుటుంబాలన్నింటికీ కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం అమల్లోకి వచ్చి జనవరి 26తో 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ మూడు పథకాల అమలును ప్రారంభించాలని నిర్ణయించామని తెలిపారు. శనివారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో కలసి రేవంత్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

వారికి రైతు భరోసా వర్తించదు..

రైతుభరోసా విషయంలో ఎలాంటి గందరగోళం అవసరం లేదని సీఎం రేవంత్ పేర్కొన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములంటే.. రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్ల నిర్మాణంలో పోయిన భూములు, మైనింగ్ భూములు, నాలా కన్వర్షన్

మిగతా 2వ పేజీలో ▶

కేబినెట్ తీసుకున్న ఇతర కీలక నిర్ణయాలివే..

- పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని నిర్ణయం
- సింగూరు ప్రాజెక్టు కెనాల్‌కు మంత్రి దామోదర రాజనర్సింహ తండ్రి, మాజీ మంత్రి రాజనర్సింహ పేరు పెట్టేందుకు ఆమోదం.
- జూరాల జలాశయం నుంచి కృష్ణా జలాలను తరలించి మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తగా ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఉన్న మార్గాలు, ప్రత్యామ్నాయాల పరిశీలన కోసం టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కమిటీ నియామకం. ఎంత నీటి లభ్యత ఉంది? ఎక్కడ ఉంది? ఎక్కడి నుంచి ఎంతెంత నీటిని తీసుకునే వీలుంది? ఎక్కడెక్కడ రిజర్వాయర్లు నిర్మించాలనే అంశాలతో పాటు ఇప్పుడున్న ప్రాజెక్టుల ద్వారా మరింత నీటిని తీసుకునేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై ఈ కమిటీతో అధ్యయనం చేయించాలని నిర్ణయం.
- మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను తాగునీటి అవసరాల కోసం హైదరాబాద్‌కు తరలించేందుకు ప్రతిపాదించిన గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్-2,3లకు ఆమోదం. గతంలో 15 టీఎంసీల తరలింపునకు ఈ ప్రాజెక్టు ప్రతిపాదించగా.. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 20 టీఎంసీలకు పెంచేందుకు నిర్ణయం.
- కొత్తగూడెం మున్సిపాలిటీకి మున్సిపల్ కార్పొరేషన్‌గా హోదా పెంపు.



కులం పేరిట విషం చిమ్ముతున్నారు

విపక్షాలపై ప్రధాని మోదీ ఆగ్రహం


- గ్రామీణ సంస్కృతిని బలోపేతం చేసుకోవాలంటే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు
- ఢిల్లీలో గ్రామీణ భారత్ మహోత్సవం ప్రారంభం

6లో

సొంత లాభం కోసం కులం పేరిట సమాజంలో విషం చిమ్ముతున్నాయంటూ ప్రతిపక్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. మన గ్రామీణ సంస్కృతి, వారసత్వం, విలువలను బలోపేతం చేసుకోవాలంటే విపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలంటూ ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేయడాన్ని పరోక్షంగా తప్పుపట్టారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్య సాధనలో గ్రామసీమల పాత్ర అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. పల్లెలు ప్రగతి సాధిస్తేనే దేశం ముందుకెళ్తుందని స్పష్టంచేశారు.

న్యూస్‌రీల్

హెచ్‌ఎంపీవీపై అప్రమత్తం!



చైనాలో హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) వేగంగా వ్యాప్తి చెందుతోందన్న వార్తల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రజలకు శనివారం పలు సూచనలు చేసింది.

- వివరాలు 5లో▶

సంక్రాంతికి సొంతూరు వెళ్లేదెలా?



సంక్రాంతి సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న నగరవాసులకు ఇప్పటినుంచే బస్సులు, రైళ్లు చుక్కలు చూపిస్తున్నాయి. ప్రస్తుతం శబరిమలకు నడుస్తున్న రైళ్లను క్రమంగా ప్రయాగ్‌రాజ్‌కు మళ్లిస్తున్నారు. దీంతో సంక్రాంతికి ప్రత్యేక రైళ్ల సంఖ్య గణనీయంగా తగ్గనుంది.

- వివరాలు 15లో▶

గగుర్పొడిచే సాహసాలకు గిన్నిస్ గుర్తింపు



ఒళ్లు గగుర్పొడిచే సాహసాలకు కేరాఫ్ అడ్రస్ అయిన పనికెర క్రాంతికుమార్ మరో రికార్డు నెలకొల్పాడు. అంతర్జాతీయ వేదికపై అరుదైన సాహసాలు ప్రదర్శించి ఒకేసారి 4 గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లు అందుకొన్నాడు.

- వివరాలు 12లో▶

పేరెంట్స్ అనుమతి ఉంటేనే 'సోషల్' ఖాతా



సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలపై ఇకపై మైనర్లు ఇష్టంవచ్చినట్లు ఖాతాలు తెరిచేందుకు వీలుపడదు. వారి తల్లిదండ్రుల అనుమతి ఉంటేనే ఖాతా తెరిచేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర సమాచార శాఖ విడుదల చేసిన డీపీడీపీ చట్ట ముసాయిదాలో నిబంధన చేర్చారు.

- వివరాలు 2లో▶

పేదల రేషన్‌పై హమాలీల 'సమ్మె'ట

రేట్లు పెంచకపోవడంతో హమాలీల ఆందోళన

హైదరాబాద్, రంగారెడ్డి మినహా మిగిలిన జిల్లాల్లో కదలని బియ్యం

- మండల స్థాయి స్టాక్ పాయింట్ల నుంచి ఎక్కడికక్కడ నిలిచిన సరఫరా
- ఫలితంగా 4 రోజులుగా గ్రామాల్లో రేషన్ దుకాణాలను తెరవని డీలర్లు
- ఇంత జరుగుతున్నా పట్టించుకోని పౌరసరఫరాలశాఖ అధికారులు



సాక్షి, హైదరాబాద్: కొత్త సంవత్సరంలో రేషన్ బియ్యం కోసం పేదలు పడిగాపులు పడుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు మినహా ఇప్పటివరకు చాలా జిల్లాల్లో రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా కాలేదు. స్టేజ్-1 గోడౌన్ల నుంచి జిల్లాల్లోని మండల స్థాయి స్టాక్ (ఎంఎల్‌ఎస్) పాయింట్లకు బియ్యం వచ్చినప్పటికీ ఎంఎల్‌ఎస్ పాయింట్లలో ఈ నెల ఒకటో తేదీ నుంచి హమాలీలు సమ్మె చేస్తున్న కారణంగా చాలా చోట్ల బియ్యం గ్రామాలకు చేరడం లేదు. రెండేళ్లకోసారి పెంచాల్సిన హమాలీ రేట్లను గడువు దాటి ఏడాదైనా పెంచకపోవడంతోపాటు ఇటీవల ఇచ్చిన హామీని

మిగతా 3వ పేజీలో ▶



విదేశాల వైపు 'టీ-హబ్' చూపు

- అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ స్టార్టప్‌ల విస్తరణకు ప్రయత్నాలు
- ఇప్పటికే 42 దేశాలకు చెందిన సంస్థలతో భాగస్వామ్యం
- ఫాల్కన్ ఎక్స్, కొస్మె సంస్థలతో ఒప్పందాలు

- తాజాగా నేపాల్ పరిశ్రమల శాఖ, డొల్మెతోనూ ఒప్పందం
- అంతర్జాతీయ మార్కెట్లోకి అడుగు పెట్టిన మన స్టార్టప్‌లు 300కుపైనే..
- 'టీ-బ్రిడ్జ్'తో దేశ విదేశీ సంస్థలతో అనుసంధానానికి మార్గం సుగమం

3లో

రైతు భరోసాపై రేవంత్ పేచీ..



సంక్షేమానికి కోతపెట్టడం తప్ప ఏమీ చేయడం లేదు: కేటీఆర్


- భూకంపం వచ్చినా మేడిగడ్డ బరాజ్‌కు ఏమీ కాలేదు
- కోటిన్నర ఎకరాలకు రైతుబంధు ఇవ్వాల్సి వస్తుందనే రిపేర్లు చేయకుండా కుట్ర

3లో

- పంటలపై డిక్లరేషన్ ఇవ్వాలంటూ రైతులను దొంగలుగా చిత్రీకరిస్తారా?
- స్థానిక ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయాలని ప్రజలకు పిలుపు

విమానంలోనూ వైఫై

- దేశీయ ప్రయాణికులకు ఇంటర్‌నెట్
- 2025 జనవరి 1 నుంచి అందుబాటులోకి తెచ్చిన ఎయిర్ ఇండియా
- దేశంలో మొట్టమొదటిసారి



వివరాలు 16లో▶

లోకల్ టు గ్లోబల్..!

- మరో 22 ప్రత్యేక ఉత్పత్తులకు జీఐ గుర్తింపు కోసం తెలుగు రాష్ట్రాల దరఖాస్తు
- వ్యవసాయం మొదలు చేనేత, హస్తకళల్లో వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటేందుకు కృషి



- హైదరాబాద్ ముత్యాలు, ఆర్మూర్ పసుపు సహా తెలంగాణ నుంచి పోటీలో 10 ఉత్పత్తులు
- ఏపీ నుంచి పోటీపడుతున్న 12 ఉత్పత్తులు

2లో

పోలవరం ముంపుపై అధ్యయనం



- భద్రాచలం ఆలయానికి పొంచి ఉన్న ముప్పుపై కూడా..
- ఐఐటీహెచ్‌కు నిర్వహణ బాధ్యత.. మంత్రి ఉత్తమ్‌తో కలిసి ప్రత్యేక సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఏపీ చేపడుతున్న 'గోదావరి-బనకచర్ల'పై అభ్యంతరం తెలపాలని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల గరిష్ట నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్) మేరకు నీళ్లను నిల్వ చేస్తే తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్ నిపుణుల బృందంతో సర్వే చేయించి నెల రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పోలవరం ముంపు అంశంపై శనివారం సీఎం రేవంత్ సచివాలయంలో

మిగతా 3వ పేజీలో ▶

18 తర్వాత ఉమ్మడి సర్వేకు సిద్ధం

పోలవరంలో గరిష్ట నీటిమట్టం దాకా నీటిని నిల్వ చేస్తే కిన్నెరసాని, ముర్రేడువాగులు ఉప్పొంగి తెలంగాణ భూభాగంలో ముంపునకు గురికానున్న ప్రాంతాలను గుర్తించి డీమార్కింగ్ చేసేందుకు వీలుగా ఈ నెల 18 తర్వాత ఉమ్మడి సర్వేకు ఏపీ ప్రభుత్వం సంసిద్ధత తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖకు లేఖ రాసింది. ఎన్జీటీ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉమ్మడి సర్వే నిర్వహించగా తదుపరి క్షేత్రస్థాయిలో ముంపు ప్రాంతాన్ని గుర్తిస్తూ డీమార్కింగ్ చేయాల్సి ఉంది.

ఇదంతే సంగతి



వాళ్ల పనితీరుతో పాటు మీ పనితీరు ఇంకా అధ్వానంగా ఉంది. సూపర్ సిక్స్ ఎగ్గొట్టారుగా!

క్లుప్తంగా...

బీడీ ఆకుల సీజన్‌కు సలహా కమిటీ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది బీడీ ఆకుల సీజన్‌కు సంబంధించి.. చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (ప్రొడక్షన్) చైర్మన్‌గా సలహా కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సీజన్‌లో బీడీ ఆకుల కొనుగోలు ధరను ఖరారు చేసే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించారు. బీడీ ఆకుల ఉత్పత్తిదారుల (గ్రోయర్స్) నుంచి కొనుగోళ్ల ధరల నిర్ణయంపై ప్రభుత్వానికి ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. కమిటీ పదవీ కాలం ఈ ఏడాది జూన్ 30 వరకు ఉంటుంది. ఈ కమిటీకి హైదరాబాద్‌లోని స్టేట్ ట్రేడింగ్ సర్కిల్ డీఎఫ్‌వో/కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఆర్థిక, ప్రణాళిక సంఘం కార్యదర్శి నియమించే ఒక ప్రతినిధి సభ్యునిగా ఉంటారు. రిజిస్టర్డ్ ట్రేడర్స్/మాన్యుఫాక్చరర్స్ ప్రతినిధులు, టీజీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జీఎం (ఆపరేషన్స్), వరంగల్ ఎల్‌బీనగర్‌కు చెందిన బి.విశ్వప్రకాశ్, బీడీఆకుల కలెక్షన్ లేబర్ తరఫున పాల్వంచకు చెందిన తాటి ఖతీజా సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు శనివారం అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

షెడ్యూల్డ్ ట్రైబ్ జేఏసీ డిమాండ్

పంజగుట్ట (హైదరాబాద్): గిరిజన సంక్షేమ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేసి వెంటనే ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తామని షెడ్యూల్డ్ ట్రైబ్ జేఏసీ హెచ్చరించింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్.ధర్మానాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్యనాయక్, లంబాడీహక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్.రాంబాల్ నాయక్, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం అధ్యక్షుడు లోకిని రాజు మాట్లాడారు. గిరిజన మంత్రి, గిరిజన ఎమ్మెల్యేలతో రాజ్యాంగబద్ధంగా ఏర్పడాల్సిన ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌ను ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని తెలిపారు. పెండింగ్ రుణాలు చెల్లించేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.219 కోట్లు మంజూరు చేసిందని, రుణాలు మంజూరైన లబ్ధిదారులు ఎప్పుడు ఇస్తారా? అని ఎదురు చూస్తున్నారని చెప్పారు. సమావేశంలో ఆయా సంఘాల నేతలు ఆర్.శ్రీరామ్‌నాయక్, స్వరూపాబాయి, ఇస్లావత్ అశోక్ నాయక్, కుతాడి రవికుమార్, ఆత్రం యాదగిరి పాల్గొన్నారు.

చర్చా వేదికగా కాన్‌స్టిట్యూషన్ క్లబ్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో 'కాన్‌స్టిట్యూషన్ క్లబ్'ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ శనివారం ఆమోదం తెలిపింది. ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధుల మధ్య రాజ్యాంగపరమైన అంశాలు, సమకాలీన రాజకీయాలపై చర్చకు ఇది వేదికగా నిలవనుంది. నగరంలోని ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఈ క్లబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. సీఎం, అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ సీఎంలు, మాజీ స్పీకర్లు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలకు సభ్యత్వం కల్పిస్తారు. సీఎస్, డీజీపీ, ఇతర సీనియర్ అధికారులకు కూడా క్లబ్‌లో సభ్యత్వం కల్పించే అవకాశం ఉంది. ఈ క్లబ్ అసెంబ్లీ ఆధ్వర్యంలో నడుస్తుందని సమాచారం. ఢిల్లీ, రాజస్థాన్ మినహా ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి కాన్‌స్టిట్యూషన్ క్లబ్ లేదు. 1947 ఫిబ్రవరిలో ఢిల్లీలో కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ప్రారంభమైంది. అప్పటి రాజ్యాంగ సభ సభ్యుల మధ్య చర్చలకు, వారి తాత్కాలిక వసతికి ఇది వేదికగా ఉండేది. హైదరాబాద్‌లో నిర్మించే కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో వసతి గదులు, ప్రజాప్రతినిధులకు జిమ్, రాయితీతో కెఫటేరియా వంటివి ఉంటాయి. ప్రజాప్రతినిధులు సిఫారసు చేసేవారికి ఇందులో ఉండడానికి అవకాశం ఇస్తారు. క్లబ్ నిర్వహణకు అయ్యే వ్యయాన్ని దానిని వినియోగించుకునే వారి నుంచే వసూలు చేస్తారు. ఈ క్లబ్ ఏర్పాటుకు ఢిల్లీ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌తో కలిసి ప్రభుత్వం పనిచేయనున్నట్టు తెలుస్తోంది.

లోకల్ టు గ్లోబల్!

మరో 22 ప్రత్యేక ఉత్పత్తులకు జీఐ గుర్తింపు కోసం తెలుగు రాష్ట్రాల దరఖాస్తు

- వ్యవసాయం మొదలు చేనేత, హస్తకళల్లో వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటేందుకు కృషి
- హైదరాబాద్ ముత్యాలు, ఆర్మూర్ పసుపు సహా తెలంగాణ నుంచి పోటీలో 10 ఉత్పత్తులు
- ఏపీ నుంచి పోటీపడుతున్న 12 ఉత్పత్తులు.. జాబితాలో జమ్మలమడుగు సిల్క్, మాధవరం చీరలు
- ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో 36 ఉత్పత్తులకు జీఐ ట్యాగ్



సాక్షి, హైదరాబాద్: చేనేత, హస్తకళలతోపాటు వ్యవసాయ రంగంలో ఘన సాంస్కృతిక వారసత్వాన్ని, నైపుణ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పేందుకు తెలుగు రాష్ట్రాలు సిద్ధమయ్యాయి. తెలుగు నేలపై ప్రత్యేకత సంతరించుకున్న మరికొన్ని ఉత్పత్తులకు ఈ ఏడాది భౌగోళిక గుర్తింపు (జీఐ) సాధించేందుకు పోటీపడుతున్నాయి. ఇందులో తెలంగాణ నుంచి మరో 10 ఉత్పత్తులు, ఏపీ నుంచి ఇంకో 12 ఉత్పత్తులు జీఐ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తుకు రానున్నాయి. ఈ మేరకు ఆయా చేనేత, హస్తకళల గుర్తింపు కోసం ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ ఉత్పత్తులకు గుర్తింపు కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ విశ్వవిద్యాలయం, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ కసరత్తు ప్రారంభించాయి. ఇప్పటికే తెలంగాణలో 17 ఉత్పత్తులకు జీఐ గుర్తింపు లభించగా ఏపీలో 19 ఉత్పత్తులకు జీఐ హోదా లభించింది. తాజా ప్రతిపాదనలకు కూడా జీఐ ట్యాగ్ లభిస్తే తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 58 ఉత్పత్తులకు ఆ ఘనత లభించినట్లు అవుతుంది.

జీఐ ఉత్పత్తులకు ఉండాల్సిన అర్హతలు ఇవే..

- ఆయా ఉత్పత్తి తప్పనిసరిగా స్థానిక భౌగోళిక ప్రాంతానికి చెందినదై ఉండాలి
- భౌగోళిక స్థానంతో కొంత అనుసంధానమై ఉండాలి
- స్థానికంగా, జాతీయంగా లేదా ప్రపంచ స్థాయిలో ఖ్యాతిని కలిగి ఉండాలి
- ఆయా ఉత్పత్తులకు చారిత్రక ఆధారాలు, ఉనికి కలిగి ఉండాలి
- ఇతర ఉత్పత్తులతో కొంత ప్రత్యేకత కలిగి ఉండాలి
- స్థానిక సంఘం ద్వారా తయారై లేదా ఉత్పత్తి అయి ఉండాలి

టాప్-5 జీఐ రాష్ట్రాలివీ..

ఉత్తరప్రదేశ్	తమిళనాడు	మహారాష్ట్ర	కర్ణాటక	కేరళ
74	59	49	44	35

తెలంగాణ నుంచి జీఐ దరఖాస్తులివీ..

హైదరాబాద్ ముత్యాలు, ఆర్మూర్ పసుపు, నారాయణపేట ఆభరణాల తయారీ కళ, మెదక్‌కు చెందిన బాటిక్ పెయింటింగ్, నల్లగొండలోని బంజారా కుట్లు–అల్లికలు, బంజారా గిరిజన ఆభరణాలు, బాలానగర్ సీతాఫలం, నల్లగొండ దోసకాయ (ఓరియెంటల్ పిక్లింగ్ మెలన్), అనబ్–ఈ–షాహీ ద్రాక్ష, ఖమ్మం మిర్చి.

ఏపీ నుంచి జీఐ దరఖాస్తులివీ..

తిరుపతిలోని మాధవమాల హస్తకళా శిల్పాలు, జమ్మలమడుగులోని డూపియన్ సిల్క్, వైఎస్సార్ కడపలోని మాధవరం కాటన్ అండ్ సిల్క్ చీరలు, పోలవరం చీరలు, బొబ్బిలి చీరలు, కడపగుంట తెల్లజిల్లేడు చెక్క విగ్రహాలు, పాలమ్నేరు టెర్రకోట, సుగంధాల అరటి, మైదుకూరు పసుపు, పోలూరు వంకాయ, దుర్గాడ మిర్చి, కాకినాడ గులాబీ.

జీఐ గుర్తింపు ఎందుకు?

మన సంప్రదాయాన్ని, ఆర్థికాభివృద్ధిని ప్రపంచానికి చాటిచెప్పే సాధనమే జీఐ. దీని వల్ల నిర్దిష్ట భౌగోళిక ప్రాంతాలకు చెందిన ప్రత్యేక ఉత్పత్తులను గుర్తించి పరిరక్షించడం వీలవుతుంది. ప్రస్తుతం దేశంలో 1,408 ఉత్పత్తులు జీఐ గుర్తింపు కోసం దరఖాస్తు చేయగా వాటిలో 658 ఉత్పత్తులు జీఐ గుర్తింపు పొందాయి.

చట్టపరమైన రక్షణ..

భౌగోళిక గుర్తింపు వల్ల ఆయా ఉత్పత్తులకు చట్టపరమైన రక్షణ లభిస్తుంది. అలాగే వాటికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లలో డిమాండ్ ఏర్పడుతుంది. ఫలితంగా ఉత్పత్తుల ఎగుమతితో ఉత్పత్తిదారులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది.

జీఐ గుర్తింపుతో వారసత్వ పరిరక్షణ

సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందుతున్నప్పటికీ మన వారసత్వం, విలువలు, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసేవి సాంస్కృతిక, హస్త, చేనేత కళలే. జీఐ గుర్తింపుతో ఉత్పత్తుల వారసత్వ పరిరక్షణతో పాటు ప్రపంచ దేశాలలో వ్యాపార డిమాండ్‌కు అవకాశం ఏర్పడుతుంది.

- సుభాజిత్ సాహా, జీఐ ప్రాక్టీషనర్

సాగు యోగ్యతతోనే 'భరోసా'!



మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహ, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, సీఎస్ శాంతికుమారి

▶ మొదటి పేజీ తరువాయి

పొందిన భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, పరిశ్రమల కోసం సేకరించిన భూములు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయబోమని సీఎం స్పష్టం చేశారు. రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా (లబ్ధిదారుల) సమాచారం సేకరించి గ్రామసభల ద్వారా ప్రజలకు వివరిస్తారని తెలిపారు. ప్రభుత్వం, అధికారుల వద్ద ఉన్న సమాచారం ఆధారంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను వర్తింపజేస్తామని వెల్లడించారు. రెవెన్యూ రికార్డుల్లో, ధరణిలో లోపాలతో గతంలో వ్యవసాయానికి యోగ్యంకాని భూములకూ రైతుబంధు వచ్చిందని.. వారే స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రభుత్వానికి వివరాలు అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక పరిస్థితి, వెసులుబాటు మేరకు..

రైతు భరోసా కింద ఎకరాకు ఏటా రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విషయాన్ని మీడియా గుర్తు చేయగా.. గత ప్రభుత్వం రైతు బంధు కింద ఎకరాకు రూ.10 వేలు ఇస్తే తాము రూ.12 వేలకు పెంచామని సీఎం రేవంత్ బదులిచ్చారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, వెసులుబాటును బట్టి భూమి లేని వ్యవసాయ కుటుంబాలకు సైతం రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ఆదాయం పెంచి పేదలకు పంచడమే తమ ప్రభుత్వ విధానమని చెప్పారు. ఎంత వెసులుబాటు ఉంటే అంతగా రైతులకు మేలు చేయాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు.

భూమి లేని వారి ఆవేదన తీర్చడానికి..

"తమకు భూములు లేకపోవడం ఒక శాపమైతే, ప్రభుత్వం పట్టించుకోకపోవడం మరో శాపమని గతంలో నేను, భట్టి విక్రమార్క, ఇతర సహచరులు నిర్వహించిన పాదయాత్రల సందర్భంగా తండాల్లో, మారుమూల ప్రాంతాల్లోని భూమి లేని వ్యవసాయ కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. వాళ్లు కూడా సమాజంలో, మనలో భాగమని గుర్తించి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాన్ని తీసుకొచ్చాం. చాలా ఏళ్ల నుంచి రేషన్‌కార్డుల సమస్య పేదవాళ్లను పట్టి పీడిస్తోంది. రేషన్‌కార్డులు లేని వారందరికీ జనవరి 26 నుంచి కొత్త కార్డులు ఇస్తాం" అని సీఎం రేవంత్ చెప్పారు.

కేసీఆర్ కుటుంబం వెయ్యేళ్లు జైలుకు వెళ్లాల్సి ఉంటుంది

రైతుబంధు కింద అనర్హులకు చెల్లించిన రూ.వేల కోట్లను తిరిగి వసూలు చేస్తారా? అని మీడియా ప్రశ్నించగా.. "గతంలో ఏం జరిగిందో వెనక్కి వెళితే కేసీఆర్ కుటుంబం వెయ్యేళ్లు జైలు శిక్షకు వెళ్లాల్సి ఉంటుంది. రైతు భరోసాకు సంబంధించి విపక్షాలు శాయశక్తులా ఊహాగానాలు రేపాయి. ఉన్నవి లేనివి ప్రభుత్వ నిర్ణయాలంటూ ప్రచారం చేసి రైతుల్లో గందరగోళం సృష్టించాయి. రైతులకు మేం శుభవార్త వినిపించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం" అని సీఎం రేవంత్ చెప్పారు. కొత్త సంవత్సరంలో మొదటిసారి పత్రికా సమావేశం నిర్వహిస్తున్నామని.. రాష్ట్ర రైతాంగానికి మంచి జరగాలని, ఈ ప్రభుత్వం వాళ్లను అన్నిరకాలుగా ఆదుకోవాలని సీఎం ఆకాంక్షించారు. వ్యవసాయం దండుగ కాదు పండుగ చేయాలని తమ ప్రభుత్వం పట్టుదలతో ఈ పథకాలను చేపట్టిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు 'భరోసా' దిశగా..!

- గ్రామ పంచాయతీ ఎన్నికలు, రైతు భరోసానే ప్రధాన ఎజెండాగా కేబినెట్ భేటీ
- రుణమాఫీ నేరుగా రైతు చేతికి వెళ్లలేదని, భరోసా అందిస్తేనే 'స్థానికం'గా లాభమన్న పలువురు మంత్రులు
- ఆర్థిక వెసులుబాటు మేరకు రూ.12 వేలకు పెంచుదామన్న సీఎం, డిప్యూటీ సీఎం..
- ఇందిరమ్మ ఇళ్ల జోలికి ఇప్పుడు వెళ్లకపోవడమే మంచిదని కొందరు మంత్రుల అభిప్రాయం
- రేషన్‌కార్డులు వీలైనంత త్వరగా పంపిణీ చేయాలన్న ప్రతిపాదనపై చర్చ

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలు, వాటికి ముందే రైతు భరోసా, ఇతర పథకాల అమలు ప్రధాన ఎజెండాగా శనివారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ భేటీలో చర్చ జరిగినట్టు తెలిసింది. త్వరలో గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్న తరుణంలో.. ఎన్నికలను ఎదుర్కొనేందుకు అవసరమైన కీలక అంశాలపై రెండు గంటలకుపైగా చర్చించినట్టు సమాచారం. అయితే ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినా.. ఆ డబ్బు నేరుగా రైతులకు వెళ్లలేదని, రైతులకు నేరుగా సాయం అందకుండా స్థానిక ఎన్నికలకు వెళ్లడం ఇబ్బందికరమని కొందరు మంత్రులు అభిప్రాయపడినట్టు తెలిసింది. 'రైతు భరోసా' పథకాన్ని అమలు చేశాకే స్థానిక ఎన్నికలకు వెళితే మంచిదని సూచించినట్టు సమాచారం. ఈ పథకం అమలు తీరు ఎలా ఉండాలన్న దానిపై దాదాపు మంత్రులంతా తమ అభిప్రాయాలను వెల్లడించినట్టు తెలిసింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని గతంలో ఏటా రూ.10 వేలు పెట్టుబడి సాయం ఇవ్వగా ఇప్పుడు రూ.12 వేలకు పెంచుదామని... భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తున్నందున ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందని సీఎం, డిప్యూటీ సీఎంలు వివరించినట్టు సమాచారం. ఈ మేరకు రూ.12 వేలు రైతు భరోసా ఇచ్చేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

ఇందిరమ్మ ఇళ్ల విషయంలోనూ..: ఇక రుణమాఫీ అనుకున్న ప్రకారం చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయని.. రుణమున్న ప్రతి రైతుకు మాఫీ జరగలేదనే చర్చ జరుగుతోందని కొందరు మంత్రులు ప్రస్తావించినట్టు తెలిసింది. రైతు రుణమాఫీ కోసం రూ.31 వేలకోట్లు అవసరమనే అంచనాల నేపథ్యంలో రూ.21 వేల కోట్లే ఇచ్చామని, ఇంత తేడా ఎలా వచ్చిందని కేబినెట్ భేటీకి హాజరైన ఉన్నతాధికారులను ఓ మంత్రి అడిగినట్టు సమాచారం. ఇలాంటి సమయంలో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చే కార్యక్రమం మొదలుపెట్టినా ప్రయోజనం ఉండకపోవచ్చని... ఎంపిక కాని వారి నుంచి ప్రతికూలత ఎదురవుతుందనే చర్చ జరిగినట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీని వాయిదా వేయాలనే అభిప్రాయం వ్యక్తమైనట్టు తెలిసింది. మరోవైపు కొత్త రేషన్‌కార్డుల జారీ చాలా ముఖ్యమని, వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభించాలనే చర్చ జరిగినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ఈ నెల 26వ తేదీ నుంచి రూ.12 వేలు రైతు భరోసా, రూ.12 వేల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీకి నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

అజ్మీర్ దర్గాకు చాదర్ పంపిన సీఎం



చాదర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సురేఖ తదితరులు

సాక్షి, హైదరాబాద్: అజ్మీర్‌లోని హజ్రత్ ఖాజా మొయినొద్దీన్ చిస్తీ దర్గాకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చాదర్‌ను పంపించారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రేపు చర్లపల్లి టెర్మినల్ ప్రారంభించనున్న ప్రధాని మోదీ

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్‌లోని చర్లపల్లి టెర్మినల్‌ను ఈనెల 6న వర్చువల్‌గా ప్రారంభిస్తారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. భాగ్యనగర మణిహారంలో ఈ టెర్మినల్ మరొక మణిపూసగా చేరనుందన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చాక తెలంగాణలోనే మొదటి టెర్మినల్‌గా చర్లపల్లి టెర్మినల్ చరిత్రలో నిలిచిపోనుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్లలో నెలకొన్న ప్రయాణికుల రద్దీని తగ్గించేలా, ప్రతి రోజు 24 ట్రైన్లు చర్లపల్లి టెర్మినల్ కేంద్రంగా రాకపోకలు సాగించనున్నాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. రాబోయే కాలంలో గూడ్స్ రైళ్ల రాకపోకలకు కేంద్రంగా, హైదరాబాద్ పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఈ టెర్మినల్ మరింత దోహదపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో రూ.32 వేల కోట్లు కేటాయించి, 40 రైల్వేస్టేషన్లు, పలు రైల్వే లైన్ల ఆధునీకరణ, 5 వందేభారత్ ట్రైన్లను కేటాయించిందని, ఇవన్నీ తెలంగాణ పట్ల బీజేపీకున్న ప్రత్యేక అభిమానాన్ని చూపుతున్నాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను రూ.720 కోట్లతో, నాంపల్లి రైల్వేస్టేషన్‌ను రూ.350 కోట్లతో ఆధునీకరించినట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయినా చర్లపల్లి టెర్మినల్ ప్రారంభోత్సవానికి సిద్ధమైనట్లు కిషన్‌రెడ్డి చెప్పారు.

నాంపల్లి కోర్టుకు అల్లు అర్జున్

వ్యక్తిగత పూచీకత్తుతోపాటు రూ.50 వేల రెండు పూచీకత్తుల దాఖలు



సిటీ కోర్టులు (హైదరాబాద్): పుష్ప–2 బెనిఫిట్ షో సమయంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న హీరో అల్లు అర్జున్ శనివారం నాంపల్లి కోర్టుకు స్వయంగా హాజరయ్యారు. వ్యక్తిగత పూచీకత్తుతోపాటు రూ.50 వేలతో రెండు పూచీకత్తులు కోర్టులో దాఖలు చేశారు. సంధ్య థియేటర్‌లో పుష్ప–2 బెనిఫిట్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతిచెందగా ఆమె కొడుకు చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు వచ్చినందుకు ఈ ఘటన జరిగిందని రేవతి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను ఏ–11గా చేర్చి కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో ఇప్పటికే హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొందిన అల్లు అర్జున్‌కు శుక్రవారం నాంపల్లిలోని 2వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. అల్లు అర్జున్ వ్యక్తిగత పూచీకత్తుతోపాటు రూ.50 వేల రెండు పూచీకత్తులను కోర్టులో దాఖలు చేయాలని, ప్రతీ ఆదివారం సంబంధిత (చిక్కడపల్లి) పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని ఆదేశిస్తూ బెయిల్ ఇచ్చింది. దీంతో ఈమేరకు అల్లు అర్జున్ న్యాయవాది అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పూచీకత్తులను అందజేశారు.

దక్షిణ మధ్య రైల్వేలో బెడ్‌షీట్ల కుంభకోణం

నాసిరకం బెడ్‌షీట్ల సరఫరాతో కోట్లలో నష్టం

కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన సీబీఐ



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేకు నాసిరకం బెడ్‌షీట్ల సరఫరాలో జరిగిన కుంభకోణంపై సీబీఐ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. కాన్పూర్‌కు చెందిన బున్కర్ జతియా హత్‌కర్గా శాఖరి లిమిటెడ్ (బీజేహెచ్‌ఎస్ఎస్ఎల్) సహకార సంఘం బెడ్‌షీట్ల సరఫరా కోసం దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌తో కాంట్రాక్టు కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా మొత్తం రూ.7.87 కోట్ల విలువైన 2,54,657 యూనిట్ల కాటన్ బెడ్‌షీట్లను సరఫరా చేయాల్సి ఉంది. ఇందులో మొదటి విడతగా బీజేహెచ్ఎస్ఎస్ఎల్ 2023 అక్టోబర్‌లో 1,40,000 బెడ్‌షీట్లను సరఫరా చేసింది. అయితే వీటిని పరీక్షించిన హైదరాబాద్ టెక్స్‌టైల్ కమిటీ బెడ్‌షీట్ల నాణ్యత ఒప్పందాల మేరకు లేదని తేల్చింది. ఈ వివాదం ఉండగానే బీజేహెచ్ఎస్ఎస్ఎల్ రెండో విడతగా 1,14,657 బెడ్‌షీట్లను 2023 నవంబర్‌లో సరఫరా చేసింది. ఎలాంటి నాణ్యత పరీక్షలు లేకుండానే రెండో విడత బెడ్‌షీట్లకు దక్షిణ మధ్య రైల్వేలోని కొందరు అధికారులు రూ.3.5 కోట్లు విడుదల చేశారు. ఈ మొత్తం అవకతవకలకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు సీబీఐ రంగంలోకి దిగింది. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్ (పీసీఎంఎం)లోని కొందరు అధికారులు, బీజేహెచ్ఎస్ఎస్ఎల్‌తో కుమ్మక్కైనట్టు సీబీఐ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. బీజేహెచ్ఎస్ఎస్ఎల్‌తోపాటు అవినీతికి పాల్పడిన గుర్తు తెలియని అధికారులపై సీబీఐ అధికారులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

'నార్లాపూర్' అంచనాలు పైపైకి!

- రూ. 1,400 కోట్ల నుంచి రూ. 1,748 కోట్లకు పెంచుతూ మంత్రివర్గ ఆమోదం!
- ఏదుల నుంచి డిండి ఎత్తిపోతలకు నీటి తరలింపు

సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ సవరణ అంచనాలను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ప్యాకేజీ–2 కింద రూ. 800 కోట్ల అంచనా వ్యయంతో రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రారంభించగా గతంలో రూ. 1,448 కోట్లకు అంచనాలు పెంచారు. తాజాగా రూ. 1,784 కోట్లకు అంచనాలను సవరించాలనే ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించినట్టు తెలియవచ్చింది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్–కేఎన్ఆర్ జాయింట్ వెంచర్ ఈ రిజర్వాయర్‌ను నిర్మిస్తోంది.

ఏదుల–డిండి అలైన్‌మెంట్ పనులకు పచ్చజెండా

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఏదుల (వీరాంజనేయ) రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీళ్లను తరలించడానికి రూ. 1,788.89 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన అలైన్‌మెంట్ పనులకు మంత్రివర్గం ఆమోదించింది. ఏదుల రిజర్వాయర్ నుంచి పోతిరెడ్డిపల్లి చెక్‌డ్యామ్‌కు గ్రావిటీ ద్వారా నీటిని తరలించేందుకు 800 మీటర్ల అప్రోచ్ కాల్వను.. ఆ తర్వాత వరుసగా 2.525 కి.మీ.ల ఓపెన్ కెనాల్, 16 కి.మీ.ల సొరంగం, 3.05 కి.మీ.ల ఓపెన్ కెనాల్, 6.325 కి.మీ.ల వాగు నిర్మాణం కలిపి మొత్తం 27.9 కి.మీ.ల పొడవున కాల్వలు, సొరంగం పనులు చేపట్టనున్నారు. పోతిరెడ్డిపల్లి చెక్‌డ్యామ్ వద్ద రబ్బర్ డ్యామ్‌ను సైతం నిర్మించనున్నారు. వనపర్తి జిల్లాలోని ఏదుల రిజర్వాయర్ నుంచి పోతిరెడ్డిపల్లి చెక్‌డ్యామ్‌కు.. అక్కడి నుంచి ఉల్పర బరాజ్, డిండి, సింగరాజుపల్లి, ఎర్రపల్లి–గోకవరం, ఇర్వేన్, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్లకు నీటిని తరలిస్తారు.

నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటి తరలింపు ప్యాకేజీ–3 అంచనా వ్యయాన్ని రూ. 416 కోట్ల నుంచి రూ. 780 కోట్లకు పెంచాలన్న ప్రతిపాదనలను మంత్రివర్గం తిరస్కరించినట్లు తెలిసింది. సరైన రీతిలో ప్రతిపాదనలను తమ ముందుంచాలని ఉంచాలని సూచించినట్లు సమాచారం.

'పీఆర్'లో 588 కారుణ్య నియామకాలకు ఓకే

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కారుణ్యనియామకాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 588 కారుణ్య నియామకాలపై ఆర్థిక శాఖ, సీఎంను ఒప్పించి కారుణ్య నియామకాలకు మంత్రి సీతక్క అడ్డంకులు లేకుండా చేశారు. ఈ సందర్భంగా కారుణ్య నియామకాల్లో చేరబోతున్న అభ్యర్థులు మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు.

201 కొత్త గ్రామ పంచాయితీలు, 11 కొత్త మండలాలు, మరో 11 కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

పేరెంట్స్ అనుమతి ఉంటేనే 'సోషల్' ఖాతా

18 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరి కన్‌సెంట్

- కన్‌సెంట్ ఇచ్చేవారూ పెద్దోళ్లమని నిర్ధారించాలి
- భారతీయుల డేటా భారత్‌లోనే నిల్వచేయాలి
- డీపీడీపీ చట్ట ముసాయిదాలో పేర్కొన్న ఐటీశాఖ.. ఫిబ్రవరి 18 వరకు అభిప్రాయాలు తెలిపేందుకు అవకాశం



సాక్షి, హైదరాబాద్: సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలపై ఇకపై మైనర్లు ఇష్టంవచ్చినట్లు ఖాతాలు తెరిచేందుకు వీలు పడదు. వారి తల్లిదండ్రుల అనుమతి (వెరిఫయబుల్ కన్‌సెంట్) ఉంటేనే ఖాతా తెరిచేందుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర సమాచార శాఖ విడుదల చేసిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్ట ముసాయిదాలో నిబంధన చేర్చారు. 18 ఏళ్లలోపు పిల్లలకు ఈ నిబంధన వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే తల్లి దండ్రులు లేదా గార్డియన్ అనుమతి ఇచ్చిన తర్వాతే మైనర్లు సోషల్ మీడియా ఖాతాలు, ఈ–కామర్స్, గేమింగ్ యాప్‌లు వాడాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎలాంటి నిబంధనలు లేకపోవడంతో కొందరు తమ పుట్టిన తేదీ, వయస్సును తప్పుగా నమోదు చేసి సోషల్‌మీడియా ఖాతాలు తెరుస్తున్నారు. ఇకపై అది కూడా కుదరదు. పిల్లలకు తల్లిదండ్రులుగా సమ్మతి తెలిపే వారు కూడా తప్పకుండా పెద్దవాళ్లే అని నిర్ధారించాల్సి ఉంటుందని ముసాయిదాలో పేర్కొన్నారు. దివ్యాంగులకు సైతం వారి చట్టబద్ధమైన గార్డియన్ ద్వారా సమ్మతి ఉంటేనే సోషల్ మీడియా వాడేలా నిబంధనలు తీసుకొచ్చారు.

మన డేటా మనదేశంలోనే

డీపీడీపీ ముసాయిదాలో మరో కీలక నిబంధన కూడా చేర్చారు. మనదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సోషల్‌మీడియా సంస్థలు.. వారివద్ద ఉన్న భారతీయుల డేటాను ఇక్కడే నిల్వచేయాలని ముసాయిదాలో పేర్కొన్నారు. దేశం బయటకు తరలించేందుకు వీలుండదు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ముసాయిదాలో నిబంధనలు చేర్చింది. అయితే ఈ కొత్త నిబంధనలు మెటా, గూగుల్, యాపిల్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి టాప్ సోషల్ మీడియా, ఇంటర్నెట్ కంపెనీలకు చికాకు కల్గించే అవకాశం ఉంది. ఈ ముసాయిదాపై అభిప్రాయాలు తెలిపేందుకు ఫిబ్రవరి 18 వరకు కేంద్ర ప్రభుత్వం గడువు ఇచ్చింది. అందువల్ల సదరు కంపెనీలు ఈ నిబంధనలు వ్యతిరేకించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

విదేశాల వైపు 'టీ–హబ్' చూపు



- అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ స్టార్టప్‌ల విస్తరణకు ప్రయత్నాలు
- ఇప్పటికే 42 దేశాలకు చెందిన సంస్థలతో భాగస్వామ్యం
- ఫాల్కన్ ఎక్స్, కొస్మె తదితర సంస్థలతో ఒప్పందాలు
- తాజాగా నేపాల్ పరిశ్రమల శాఖ, డొల్మెతోనూ ఒప్పందం
- అంతర్జాతీయ మార్కెట్లోకి అడుగుపెట్టిన మన స్టార్టప్‌లు 300కుపైనే..
- 'టీ-బ్రిడ్జ్'తో దేశ విదేశీ సంస్థలతో అనుసంధానానికి మార్గం సుగమం

సాక్షి, హైదరాబాద్: భారత స్టార్టప్ రంగంలో విప్లవాత్మక మార్పులకు బాటలు వేస్తున్న 'టీ–హబ్'... విదేశాల్లోనూ తనదైన ముద్ర వేసే దిశగా దూసుకువెళుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో భారతీయ స్టార్టప్‌ల కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. విదేశీ మార్కెట్లలోకి భారతీయ స్టార్టప్‌ల ప్రవేశం, కార్యకలాపాలకు ఊతమివ్వడం, అక్కడి నిపుణుల మార్గదర్శనం, నిధుల సేకరణ లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇదే సమయంలో విదేశీ స్టార్టప్‌లు భారత్‌తోపాటు దక్షిణాసియా దేశాల్లో కార్యకలాపాలు విస్తరించుకునేందుకు సాయం అందిస్తోంది. దీనికోసం ప్రత్యేకంగా 'టీ–బ్రిడ్జ్' అనే అనుబంధ విభాగాన్ని కూడా ఏర్పాటు చేసింది. భారతీయ స్టార్టప్‌ల ఆవిష్కరణలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేసి వ్యాపారపరంగా విజయవంతం అయ్యేలా తీర్చిదిద్దడంలో 'టీ–బ్రిడ్జ్' క్రియాశీలకంగా పనిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ సంస్థలు, స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లు, యాక్సిలేటర్లు (ప్రోత్సాహక సంస్థలు), విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థలను 'టీ–బ్రిడ్జ్' అనుసంధానం చేసి... భారతీయ స్టార్టప్‌లు అంతర్జాతీయ మార్కెట్‌లో కార్యకలాపాలు విస్తరించేందుకు అనువైన వాతావరణాన్ని సిద్ధం చేసింది.

42 దేశాల్లో మార్కెట్‌తో అనుసంధానం..

భారతీయ, అంతర్జాతీయ స్టార్టప్‌ల ఆవిష్కరణలు, మార్కెటింగ్, నిధుల సేకరణకు వీలుగా టీ-హబ్ 42 దేశాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇప్పటివరకు 300కు పైగా భారతీయ స్టార్టప్‌లు, మరో 200కుపైగా అంతర్జాతీయ స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలను మార్కెటింగ్ చేసుకునేందుకు టీ-హబ్ అంతర్జాతీయ ఒప్పందాలు దోహదం చేసినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అంతర్జాతీయంగా భారతీయ స్టార్టప్‌లను విస్తరించేందుకు 'ఇండియా మార్కెట్ యాక్సెస్ ప్రోగ్రామ్ (ఐమ్యాప్), గ్లోబల్ మార్కెట్ యాక్సెస్ ప్రోగ్రామ్ (జీమ్యాప్)' వంటి కార్యకలాపాలను చేపట్టింది. అమెరికా మార్కెట్లోకి భారతీయ స్టార్టప్‌ల ప్రవేశం, అక్కడి నిపుణుల మార్గనిర్దేశనం కోసం సిలికాన్ వ్యాలీలోని 'ఫాల్కన్ ఎక్స్' సంస్థతో టీ-హబ్ ఒప్పందం కుదుర్చుకుంది. 'కొరియాకు చెందిన చిన్న, మధ్యతరహా సంస్థల స్టార్టప్ ఏజెన్సీ (కొస్మె)'తోనూ టీ-హబ్‌కు భాగస్వామ్య ఒప్పందం ఉంది. అంతర్జాతీయ సంస్థ రెడ్‌బెర్రీతో కుదిరిన భాగస్వామ్య ఒప్పందం ద్వారా ఉత్తర అమెరికాలో ఆవిష్కరణల ఔట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసింది. గ్లోబల్ మార్కెట్ యాక్సెస్ ప్రోగ్రామ్ ద్వారా పేమాట్రిక్స్, ఆన్‌కానీ విజన్, డేటావెర్స్ వంటి భారతీయ స్టార్టప్‌లు అంతర్జాతీయంగా మార్కెట్‌ను విస్తరించుకోవడంతోపాటు అనేక భాగస్వామ్యాలు, పెట్టుబడులను సాధించగలిగాయి.

నేపాల్ సంస్థలతోనూ ఒప్పందాలు

నేపాల్, భారత్ నడుమ ఆవిష్కరణలు, వాణిజ్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా టీ-హబ్ ఇటీవల నేపాల్ పరిశ్రమలు, వాణిజ్య శాఖతోపాటు అక్కడి మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ సంస్థ 'డొల్మె'తోనూ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఎంఎస్ఎంఈలకు సంబంధించిన స్టార్టప్‌లను ప్రోత్సహించడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక బదిలీ, రెండు దేశాల నడుమ దృఢమైన ఆర్థిక బంధం ఏర్పడేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని పేర్కొంటోంది.

టీ-హబ్ ప్రయాణంలో మైలు రాళ్లు ఇవీ..

- వివిధ రంగాలకు చెందిన 2వేలకుపైగా స్టార్టప్‌లకు మార్గదర్శనం, నిధుల సేకరణ, నెట్‌వర్కింగ్‌లో ఊతం అందించింది.
- పెట్టుబడి సంస్థలు, కార్పొరేట్ సంస్థలు తదితరాల నుంచి స్టార్టప్‌లకు రూ.1,300 కోట్లకు పైగా నిధుల సేకరణలో సాయం చేసింది.
- ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు, పైలట్ ప్రాజెక్టులు తదితర అంశాల్లో 200కుపైగా కార్పొరేట్ సంస్థలతో స్టార్టప్‌లు భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకోవడంలో కీలకంగా వ్యవహరించింది.
- ఎంట్రప్రెన్యూర్‌షిప్, ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం పరస్పర బదిలీ తదితరాల కోసం 100కు పైగా కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లను నిర్వహించింది.
- అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ స్టార్టప్‌లకు అవకాశాల కోసం విదేశీ సంస్థలు, ఇంక్యుబేటర్లు తదితరాలతో భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుంది.

క్లుప్తంగా...

నేటి నుంచి టీపీసీసీ అధ్యక్షుడి జిల్లాల పర్యటన



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం నుంచి జిల్లాల్లో పర్యటించనున్నారు. జనవరి 5న నాగార్జునసాగర్, 6న ఆదిలాబాద్, 7న నిజామాబాద్ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాథన్ పాల్గొంటారు. నాగార్జునసాగర్‌లో ఆదివాసీ కాంగ్రెస్ సమావేశం, ఆదిలాబాద్, నిజామాబాద్‌లలో కార్యకర్తల విస్తృత సమావేశంలో ఇన్‌చార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు, సీనియర్ నాయకులు పాల్గొంటారు.


దరఖాస్తు చేసిన అందరి ఇళ్లకూ అధికారులు

- ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులు ఆందోళన చెందవద్దు
- గృహనిర్మాణ సంస్థ ఎండీ

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు తమ ఇంటికి అధికారులు రాలేదని ఆందోళన చెందవద్దని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అందరి ఇళ్లకు 15 రోజుల్లోగా అధికారులొచ్చి వెరిఫికేషన్‌చేస్తారని తెలంగాణ గృహనిర్మాణ సంస్థ ఎండీ పేర్కొన్నారు. తమ ఇళ్లకు ఇంకా వెరిఫికేషన్‌కు రాలేదన్న ఆందోళనతో ప్రజలు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రజలు ఇళ్ల వద్దనే ఉండి, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కట్టబోయే ఇంటి స్థలానికి సంబంధించిన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకొని, అధికారులు వచ్చినప్పుడు వెరిఫికేషన్ చేయించుకోవాలని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 10.71 లక్షల దరఖాస్తులు రాగా, 2,249 మంది అధికారులను సర్వే కోసం నియమించినట్లు పేర్కొన్నారు. వీరు దరఖాస్తుదారులు పేర్కొన్న చిరునామాలకు వెళ్లి ప్రస్తుతం వారు నివసిస్తున్న ఇల్లు సొంతమా లేక అద్దెదా? ఆ ఇల్లుదేనితో నిర్మించారు వంటి వివరాలు సేకరించి సంబంధిత మొబైల్‌యాప్‌లో నమోదు చేస్తున్నారని వివరించారు. అలాగే దరఖాస్తుదారు ఫొటోతో పాటు ఇంటి బయట, లోపల, రూఫ్‌ల వివరాలు కూడా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తారని తెలిపారు.

హరీశ్‌రావ్! ప్రజావాణికి వచ్చి చూడు..

ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రజాభవన్‌లో ప్రజల కష్టాలు విని, వారి నుంచి అర్జీలను స్వీకరించి మేలు చేస్తున్న ప్రజావాణి కార్యక్రమంపై మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేయడం ఏంటని ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్‌లో ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. హరీశ్‌రావు వీలుచేసుకుని ప్రజావాణి కార్యక్రమానికి స్వయంగా వచ్చి చూడాలని డిమాండ్ చేశారు. ప్రజావాణి కార్యక్రమంపై హరీశ్ పనిగట్టుకొని బురద చల్లుతున్నారని, ఇలాంటి వ్యాఖ్యలతో ఆయనపై ఉన్న కాస్త గౌరవం కూడా మంటకలిసిపోతుందని చెప్పారు. 2023 డిసెంబర్ 8 నుంచి 92,115 అర్జీలను స్వీకరించి, అందులో 63 శాతం సమస్యలను పరిష్కరించామని వివరించారు. ప్రజావాణిపై బీఆర్ఎస్ నాయకులు, హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని చిన్నారెడ్డి అన్నారు.

రైతు భరోసాపై రేవంత్ పేచీ..

- **సంక్షేమ పథకాలకు కోతపెట్టడం తప్ప ఏమీ చేయడం లేదు: కేటీఆర్**
- భూకంపం వచ్చినా మేడిగడ్డ బ్యారేజీకి ఏమీ కాలేదు
- కోటిన్నర ఎకరాలకు రైతుబంధు ఇవ్వాల్సి వస్తుందనే రిపేర్లు చేయకుండా కుట్ర
- పంటలపై డిక్లరేషన్ ఇవ్వాలంటూ రైతులను దొంగలుగా చిత్రీకరిస్తారా? అని మండిపాటు
- స్థానిక ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయాలని ప్రజలకు పిలుపు



సిరిసిల్లలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల టౌన్: రేవంత్‌రెడ్డి సీఎం అంటే చీఫ్ మినిస్టర్‌గా కాకుండా కటింగ్ మాస్టర్‌లా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు విమర్శించారు. సంక్షేమ పథకాలకు కోతలుపెట్టడం తప్ప ఏడాదిలో చేసిందేమీ లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు గగ్గోలు పెడుతున్నట్టుగా పర్రె (పగులు) వచ్చింది మేడిగడ్డ బ్యారేజీకి కాదని.. సర్కారు పుర్రెకే పర్రె వచ్చిందని ఇటీవల మేడిగడ్డ వద్ద భూకంపం వచ్చినా పటిష్టంగా నిలిచిన బ్యారేజీపై కాంగ్రెస్ సర్కారు అనవసరపు రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. బ్యారేజీకి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తే.. కోటిన్నర ఎకరాలకు రైతుబంధు ఇవ్వాల్సి వస్తుందనే సర్కారు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

రైతులను దొంగలుగా చిత్రీకరిస్తారా?

''కేసీఆర్ రైతుబంధు పథకాన్ని పదేళ్లపాటు ఇచ్చి.. రైతులను కడుపులో పెట్టుకుని చూసుకున్నారు. మీరేమో డిక్లరేషన్ ఇవ్వాలంటూ రైతులను దొంగలుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో మా ప్రభుత్వం ఠంఛన్‌గా రైతుబంధు ఇచ్చింది. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ మాత్రం అనేక పేచీలు పెడుతోంది..'' అని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని నడపడం చేతగాక ప్రధాన ప్రతిపక్షంపై నోరుపారేసుకోవడం, తనపై, కేసీఆర్‌పై కేసులు పెట్టడానికి కుట్రలు చేయడం తప్ప ఏడాదిగా సీఎం రేవంత్ పేదలకు చేసిందేమీ లేదని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ వాళ్లను నిలదీయండి..

రేవంత్ సర్కారు ఇప్పటికే ఒక్కో రైతుకు రైతు భరోసా కింద రూ.17,500, వృద్ధులకు ఒక్కొక్కరికి పింఛన్లలో రూ.30వేల చొప్పున బకాయిపడ్డారని కేటీఆర్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ వాళ్లను దీనిపై నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల ఈశ్వర్, సుంకె రవిశంకర్, కోరుకంటి చందర్, పుట్ట మధు, ఇతర నేతలు పాల్గొన్నారు.

సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాలి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సాక్షి, హైదరాబాద్: దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. భారతదేశ శాస్త్రీయ కళల వారసత్వం చిరకాలం వర్ధిల్లాలని, సాంస్కృతిక కార్యక్రమాలలో యువత చురుకుగా పాల్గొనేలా ప్రేరేపించడానికి వినూత్న మార్గాలపై ఆలోచన చేయాలని ఆయన కోరారు. సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్ యూత్ (స్పిక్ మాకే) 10వ అంతర్జాతీయ సదస్సు మే 26 నుంచి జూన్ వరకు ఐఐటీ హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాజ్‌భవన్‌లో సలహా మండలి సమావేశం జరిగింది. గవర్నర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సాంస్కృతిక, విద్య, పాలనా రంగాలకు చెందిన ప్రముఖులతో సహా సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు దాని ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. ఈ సదస్సులో పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత హరిప్రసాద్ చౌరాసియా, పద్మభూషణ్ అవార్డు గ్రహీతలు అమ్జద్ అలీ ఖాన్, షబనా అజ్మీ, జావేద్ అక్తర్, బేగం పర్వీన్ సుల్తానా, పద్మశ్రీ కళాకారులు కన్యాకుమారి, వెంకటేశ్‌లు తదితరులు పాల్గొంటారని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి తెలిపారు.

తెలంగాణ తల్లి రూపాన్ని చెరిపేయలేరు: మాజీ సీఎం కేసీఆర్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ సీఎం కేసీఆర్. చిత్రంలో గౌరీశంకర్, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అస్తిత్వ ప్రతీకగా ప్రజలు తమ హృదయాలలో పదిలపరుచుకున్న తెలంగాణ తల్లి రూపాన్ని ఎవ్వరూ చెరిపేయలేరని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని స్వరాష్ట్ర సాధన ఉద్యమంలోనే రూపొందించారన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో వెలువరించిన 'అందరికీ అమ్మ' పుస్తకాన్ని కేసీఆర్ శనివారం ఎర్రవల్లి నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తల్లి రూపాన్ని గుండెల్లో దాచుకుని ప్రజలు స్వరాష్ట్ర సాధనకు మహోగ్రంగా ఉద్యమించారన్నారు. తెలంగాణ తల్లులు ఎత్తిన బోనాలలో, బతుకమ్మలలో, వంటావార్పుల్లో, సబ్బండ వర్ణాలు చేసిన ఉద్యమాల్లో గడప గడపకూ తెలంగాణ తల్లి భావోద్వేగ రూపం ప్రతిబింబించిందన్నారు. చరిత్రను ఎవ్వరూ చెరిపేయలేరని, చరిత్ర చెరిపితే చెరిగేది కాదని, చరిత్రే పాఠం చెబుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, ఉపేందర్ రెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డి, శాసనమండలి సభ్యుడు తాతా మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ మోజులో పడి తెలుగును నిర్లక్ష్యం చేస్తున్నారు

ప్రపంచ తెలుగు భాష సమాఖ్య మహాసభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మాదాపూర్ (హైదరాబాద్): డిజిటల్ సెక్టార్‌లో తెలుగుభాషను క్రోడీకరించి, భద్రపరిచి భావి తరాలకు అందించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో రెండవరోజు శనివారం ప్రపంచ తెలుగు భాష సమాఖ్య మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగుభాష చిన్నచూపునకు గురవుతోందన్నారు. ఉద్యోగం కోసం ఇంగ్లిష్ మోజులో పడి తెలుగును నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. సోషల్ మీడియాలో, లెటర్లు రాయడంలో తెలుగుభాషను ఇంగ్లిష్‌లో రాస్తున్నారన్నారు. చైనా, దక్షిణకొరియా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, స్పెయిన్‌లతో పాటు అనేక దేశాల్లో ఆయా మాతృభాషల్లో విద్య, పరిపాలన చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఇంగ్లిష్ అనేది వలస పాలకులు అందించిన చీకటి వారసత్వమన్నారు. మానవ మేధ మాతృభాషలో వికసించడానికి అలవాటుపడి ఉంటుందని కిషన్‌రెడ్డి తెలిపారు. విదేశాల్లో ఉన్నా, స్వదేశంలో ఉన్నా ప్రతి ఇంట్లో భగవద్గీతలాగా పెద్దబాల శిక్ష ఉండాలని సూచించారు. తెలుగు సాహిత్యం, వ్యాకరణం డిజిటల్ రూపంలో అందించాలన్నారు. లంచ్, డిన్నర్, బాత్రూం, డైనింగ్ టేబుల్ లాంటి ఇంగ్లిష్ పదాలకు పూర్వం పేర్లు లేవా? అని ప్రశ్నించారు. తెలుగు పదాలలో ఉండే ఆత్మీయత, అనుబంధం, మమకారం ఇంగ్లిష్‌లో ఉండవన్నారు. తెలుగు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల్లేక విద్యాసంస్థలు మూతపడుతున్నాయని, తెలంగాణలో 4 వేల తెలుగు మీడియం పాఠశాలలు మూతపడ్డాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్రమోదీ తెచ్చిన నూతన విద్యా విధానాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ప్రాంతీయ భాషలు రక్షించాలంటే ప్రాథమిక విద్య మాతృభాషలోనే ఉండాలని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల్లో మాతృభాషలో చదువుకోవడం, పరీక్షలు రాసే విధంగా మార్పులు తీసుకువచ్చినట్టు వివరించారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పేరుతో సీఎం ప్రకటన దుర్మార్గం

కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపాటు



సాక్షి, హైదరాబాద్: 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పేరుతో రైతులకు ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం దుర్మార్గమని కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 'రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను పరిశీలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అదనంగా నయాపైసా కూడా సాయం చేయలేదని తేటతెల్లమైంది. ఎగ్గొట్టిన ఏడాది రైతు భరోసా బకాయి మొత్తాన్ని విభజించి ఏటా రెండేసి వేల రూపాయల చొప్పున రాబోయే నాలుగేళ్లకు జోడించి చెల్లించాలనుకుంటున్నారే తప్ప.. రైతులకు అదనంగా ఒరగబెట్టిందేమీ లేదు. ఇంకా చెప్పాలంటే గతంతో పోలిస్తే కాంగ్రెస్ పాలనలో రైతులు ఎకరాకు మరో రూ.2 వేలు నష్టపోయినట్లు అయింది' అని ఒక ప్రకటనలో విమర్శించారు. 'ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. అయినా ఏడాదిపాటు రైతు భరోసా చెల్లించకుండా ఎగ్గొట్టారు. ఆలస్యమైనా ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారని, గతేడాది చెల్లించాల్సిన బకాయి కూడా చెల్లిస్తారని ఆశించిన రైతులకు పూర్తి నిరాశే ఎదురైంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో రైతు భరోసా బకాయిలు చెల్లించలేదు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన రైతు భరోసా హామీకి కూడా తూట్లు పొడిచి ఇందిరమ్మ అభయ హస్తమంటే.. భస్మాసుర హస్తం అని నిరూపించారు' అని సంజయ్ మండిపడ్డారు.

కులవృత్తులకు ప్రాధాన్యం దక్కేలా బడ్జెట్

బీసీ సంక్షేమ శాఖ అధికారులకు మంత్రి పొన్నం ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కులవృత్తులకు ప్రాధాన్యం దక్కే విధంగా 2025–26 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. 2024–25 బడ్జెట్‌లో బీసీ సంక్షేమ శాఖ రూపొందించిన ప్రతిపాదనలు, ఆయా కార్యక్రమాల అమలు, పురోగతి తదితర అంశాలపై శనివారం సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సంక్షేమ విద్యార్థుల డైట్ చార్జీలను ప్రభుత్వం 40 శాతం పెంచిందని, ఆ ప్రకారం అమలు చేసే విధంగా బడ్జెట్ తయారు చేయాలన్నారు. గీతకార్మికుల కోసం 10 వేల మందికి కాటమయ్య రక్షణ కవచాల పంపిణీ జరిగిందని, వచ్చే వార్షికంలో ఎక్కువ మందికి లబ్ధి కలిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కుల వృత్తిదారులకు చేయూత అందేలా, కుల వృత్తులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 17న బడ్జెట్ తయారీపై మరోసారి సమావేశం నిర్వహిస్తానన్నారు.

పోలవరం ముంపుపై అధ్యయనం

▶ మొదటి పేజీ తరువాయి

నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. గోదావరికి 2022లో 27 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు భద్రాచలం ముంపునకు గురైందని అధికారులు సీఎంకు వివరించారు. పోలవరం వల్ల భద్రాచలం ఆలయానికి ఏర్పడే ముప్పుపైనా అధ్యయనం నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఏపీ ప్రభుత్వం కేంద్ర అనుమతుల్లేకుండానే కొత్తగా గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేపట్టిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ఏపీ సీఎస్‌కు అభ్యంతరం తెలపాలని సీఎం రేవంత్ ఆదేశించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే గోదావరి బోర్డుతోపాటు కేంద్ర జలశక్తి శాఖకు సైతం లేఖలు రాయాలని కోరారు. సమావేశంలో నీటిపారుదల శాఖ సలహాదారులు ఆదిత్యనాథ్‌దాస్, కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిమితంగానే ఉమ్మడి సర్వే అంటున్న ఏపీ

పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణలో 950 ఎకరాలు ముంపునకు గురవుతాయని, దీనిపై సైతం జాయింట్ సర్వే చేయాల్సిందేనని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. కిన్నెరసాని, ముర్రెడువాగులతో పాటే మరో ఐదు వాగులకు ఉండనున్న ప్రభావంపై సైతం సర్వే నిర్వహించాలని కోరుతుండగా ఏపీ అంగీకరించడం లేదు. ఎన్జీటీ ఆదేశాల మేరకు ముర్రెడువాగు, కిన్నెరసానిలకే సర్వేను పరిమితం చేస్తామని ఏపీ అంటోంది. ఏపీ వాదనను తెలంగాణ అంగీకరించి కేవలం రెండు వాగులకే జాయింట్ సర్వే నిర్వహిస్తే మిగిలిన 5 వాగులకు ఉండనున్న ముంపుతో తెలంగాణ నష్టపోవాల్సి వస్తుందని విమర్శలు వచ్చాయి. సీఎం రేవంత్ శనివారం అధికారులతో సమీక్షలో ఈ అంశంపై వివరణ కోరినట్లు తెలిసింది. ప్రస్తుతం రెండు వాగులకు ముంపుపై సర్వే నిర్వహించాలని, మిగిలిన వాగులకు ముంపుపై తర్వాత నిర్ణయం తీసుకుంటామని కేంద్ర జల సంఘం గతేడాది సాంకేతిక కమిటీ సమావేశంలో ఇరు రాష్ట్రాలను చెప్పిందని అధికారులు సీఎంకు వివరించినట్లు తెలిసింది.

పేదల రేషన్‌పై హమాలీల 'సమ్మె'ట

▶ మొదటి పేజీ తరువాయి

కూడా పౌరసరఫరాల శాఖ కమిషనర్ పట్టించుకోకపోవడంతో సమ్మెలోకి వెళ్లినట్లు హమాలీలు చెబుతున్నారు. రేట్లు పెంచే వరకు సమ్మె కొనసాగిస్తామని హమాలీలు తెగేసి చెబుతున్నారు. సమ్మె ఫలితంగా నాలుగు రోజులుగా చాలా గ్రామాల్లో రేషన్ దుకాణాలు తెరుచుకోవడంలేదు. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించడం లేదు.

హమాలీలు సమ్మె నోటీసు ఇచ్చినా..

రాష్ట్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్లలో పనిచేస్తున్న హమాలీల రేట్లను రెండేళ్లకోసారి పెంచేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా 2022 వరకు రేట్ల పెంపు ప్రక్రియ కొనసాగింది. ఎంఎల్ఎస్ పాయింట్లకు వచ్చే బియ్యాన్ని దించడానికి, అక్కడి నుంచి రేషన్ దుకాణాలకు తరలించడానికి హమాలీలకు క్వింటాలుకు రూ. 26 లెక్కన కూలి చెల్లిస్తున్నారు. ఈ రేట్లను 2024లో సవరించాల్సి ఉండగా ప్రభుత్వం మారడంతో కాలయాపన జరుగుతూ వచ్చింది. ఎట్టకేలకు గతేడాది అక్టోబర్ 4న పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్ వద్ద జరిగిన సమావేశంలో కూలి రేట్లను రూ. 26 నుంచి రూ. 29కి పెంచేందుకు ఒప్పందం కుదిరింది. అయితే అందుకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల కాకపోవడంతో డిసెంబర్ 18న హమాలీలు పౌరసరఫరాల శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నెలాఖరులోగా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కాకుంటే జనవరి 1 నుంచి సమ్మెలోకి వెళ్తామని నోటీసు కూడా ఇచ్చారు. అలాగే గతేడాది డిసెంబర్ 28న మరోసారి నోటీసు పంపారు. అయినప్పటికీ రేట్ల పెంపు ఉత్తర్వులు కొత్త ఏడాదిలోనూ విడుదల కాకపోవడంతో ఒకటో తేదీ నుంచి సమ్మెకు దిగినట్లు హమాలీ సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. మునీశ్వర్, ఎస్. బాలరాజ్ తెలిపారు.

హైదరాబాద్, రంగారెడ్డి మినహా...

రాష్ట్రంలో 187 ఎంఎల్ఎస్ పాయింట్లు ఉండగా సుమారు 3,600 మంది హమాలీలు పనిచేస్తున్నారు. వారంతా ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, బీఆర్ఎస్‌కేయూ సంఘాల్లో సభ్యులుగా ఉండగా ఏఐటీయూసీ అనుబంధ హమాలీ సంఘం సమ్మెకు పిలుపునిచ్చింది. బీఆర్ఎస్‌కేయూ మినహా అన్ని సంఘాలు సమ్మెకు మద్దతిస్తున్నట్లు హమాలీ సంఘం నాయకులు చెప్పారు. రాష్ట్రంలో 17,335 దుకాణాలు ఉండగా అందులో శనివారం 9,319 తెరిచారు. అంటే దాదాపు సగం దుకాణాలు ఇప్పటికీ తెరవలేదు. తెరిచిన చోట కూడా కోటా పూర్తిస్థాయిలో బియ్యం రాలేదని సమాచారం.

కాంగ్రెస్ మోసానికి పరాకాష్ట

- రైతు భరోసా రూ.15 వేలు అని.. రూ.12 వేలకు కుదిస్తారా?
- అన్నదాతను మరోసారి దగా చేసిన కాంగ్రెస్ సర్కారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా పేరుతో ఏటా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఆశచూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. రైతులను దారుణంగా మోసం చేసిందని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు శనివారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'శనివారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం రైతుల ఆశలను అడియాశలు చేసింది. రైతు భరోసా పథకాన్ని రైతు గుండె కోతగా మార్చారు. రైతు భరోసా కింద ఎకరానికి ప్రతి సీజన్‌లో రూ.7,500 చొప్పున ఇస్తామని చెప్పి.. ఇప్పుడు రూ.6 వేలకు కుదించారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి ఇది పరాకాష్ట. మోసానికి పర్యాయపదం రేవంత్‌రెడ్డి అనే విషయం నగ్నంగా బయటపడింది' అని హరీశ్‌రావు మండిపడ్డారు.

కేబినెట్‌లో కౌలు రైతుల ఊసేలేదు

కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు కూడా గుండెకోత మిగిల్చిందని హరీశ్‌రావు ఆరోపించారు. 'కౌలు రైతులకు కూడా రెండు వ్యవసాయ సీజన్లలో కలిపి ఎకరాకు రూ. 15 వేలు పంట పెట్టుబడి సహాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రమాణం చేసింది. కానీ తాజా కేబినెట్ సమావేశంలో ఈ అంశమే చర్చించలేదు. కౌలు రైతులకు గుండె కోత కలిగిస్తూ దారుణంగా ధోకా చేశారు. తెలంగాణ రైతాంగం ఈ ద్రోహాన్ని క్షమించదు. తగిన సమయంలో బుద్ధి చెబుతారు' అని హెచ్చరించారు.

'పాస్‌పోర్టు' సమస్యలు.. సందేహాలా?

89777 94588

నంబర్‌కు వాట్సాప్ చేయండి..

పాస్‌పోర్ట్ ఆఫీసర్ స్నేహజ సమాధానాలిస్తారు



మీతో సాక్షి

పాస్‌పోర్టు కోసమే కాకుండా.. అది వచ్చిన తర్వాత కూడా ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పాస్‌పోర్టు సేవా కేంద్రాలు (పీఎస్‌కే), పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు (పీఓపీఎస్‌కే), వెబ్‌సైట్ లాంటివి ఉన్నా సామాన్యుడికి ఇప్పటికీ అనేక సందేహాలు, సమస్యలు తలెత్తుతున్నాయి. సాంకేతిక అంశాలు అర్థంకాక ఇప్పటికీ పలువురు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. కేవలం రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం జారీ చేసే పాస్‌పోర్టు విషయంలోనే కాదు.. దీనికి అనుబంధంగా ఉండే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ బ్రాంచ్ సెక్రటేరియట్ అందించే అటెస్టేషన్ అండ్ అపోస్టల్ సేవల పైనా పలు సందేహాలు ఉంటున్నాయి. ఈ సందేహాలన్నీ నివృత్తి చేసేందుకు ముందుకు వచ్చింది 'మీతో సాక్షి'. మీ వివరాలు, సమస్య, సందేహాన్ని 89777–94588 నంబర్‌కు టెక్ట్స్, వాయిస్ మెసేజ్‌ల రూపంలో వాట్సాప్ చేయండి. 'మీతో సాక్షి' వీటిని రీజనల్ పాస్‌పోర్టు అధికారిణి జొన్నలగడ్డ స్నేహజ దృష్టికి తీసుకెళుతుంది. మీ సందేహాలు, సమస్యలకు పరిష్కారం చూపుతుంది. ఇంకెందుకు ఆలస్యం? మీ సమస్యలు, సందేహాలు వెంటనే తెలియజేయండి.

దయను సత్యమును ఎన్నడును నిన్ను విడిచి పోనియ్యకుము.
వాటిని కంఠభూషణముగా ధరించుకొనుము.
నీ హృదయమను పలక మీద వాటిని వ్రాసికొనుము.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** శు.షష్ఠి రా.9.04 వరకు తదుపరి సప్తమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.9.54 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** సా.4.06 నుండి 4.52 వరకు, **అమృతఘడియలు:** ప.2.01 నుండి 3.44 వరకు.

సూర్యోదయం : 6.36
సూర్యాస్తమయం : 5.35
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నారాయణ మూర్తి (ఇన్ఫోసిస్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కంపెనీలు వర్కర్‌ల మీద ఆధారపడి పనిచేయవు. ఇంఛార్జిల మీద వర్కర్‌లు ఆధారపడేలా చేసి చక్కటి ఫలితాలను సాధిస్తుంటాయి.

ఎక్కడైనా చూడండి... ఇంఛార్జిలే, వర్కర్‌ల కన్నా ఎక్కువ కష్టపడి పని చేస్తుంటారు. వర్కర్‌లలో పని చేయనిదెవరో కనిపెట్టడానికి సెలవులు కూడా వాడుకోకుండా శ్రమిస్తూ ఉంటారు. అయితే అంత శ్రమ అవసరం లేదంటాన్నేను!

దేనికైనా టెక్నిక్ ఉండాలి. పని చేయని వారెవరో వెతకటం మాని, పని చేస్తున్న వారెవరో నిఘా పెట్టి చూస్తే ఇంచార్జిల పనికి ప్రయోజనం చేకూరుతుంది. మరింత మెరుగైన ఫలితాలను తొలి త్రైమాసికంలోనే సాధించి యాజమాన్యానికి చూపించగలుగుతారు!

సభాపర్వంలో ధర్మరాజుకు నారదుడు పని ఎలా చేయించుకోవాలో బోధిస్తుంటాడు. నేర్పరులనే సేవకులుగా పెట్టుకున్నావా? వారిలో పని చేస్తున్న వారిని గమనిస్తున్నావా? వారి పట్ల ఉదారంగా ఉంటున్నావా? అని అడుగుతాడు.

పని చేయని వారిని కనిపెట్టటం వల్ల ఒరిగే ప్రయోజనం కన్నా, పని చేసే వారిని కనిపెట్టుకుని ఉండకపోవటం వల్ల జరిగే నష్టమే ఎక్కువని నారద ప్రబోధం.



పని చేయని వారి వల్ల సంస్థలకు వచ్చే నష్టం ఏమీ లేదు. వాళ్ల పని కూడా మీద వేసుకుని చేయగల పనివాళ్లు పక్కనే అందు బాటులో ఉంటారు. వారానికి 70 గంటలైనా సరే, వాళ్లు అలా పని చేసుకుంటూ పోగలరు... ఇంఛార్జిలు కనుక వాళ్లకు అందరిముందూ చిన్న కాంప్లిమెంట్ ఇవ్వగలిగితే.

పని చేసే వాళ్లకు అందరిముందూ కాంప్లిమెంట్ ఇస్తే, పని చేయని వాళ్లు హర్ట్ అవుతారని చెప్పి, చాటుగా పిలిచి భుజం తట్టడం వల్ల ముందు తరాల సంస్థలకు మంచి ఇంఛార్జిలు తయారు అయితే అవొచ్చు, మంచి వర్కర్లు తయారుగా ఉండరు. వర్క్–లైఫ్ బ్యాలెన్స్ గురించి మాట్లాడేవారు మాత్రమే ఫైళ్లు పట్టుకుని ఇంటర్వ్యూలకొస్తారు.

అనుపమ్ మిట్టల్ ట్వీట్ ఒకటి చూశాను. షాదీ డాట్ కామ్ ఫౌండర్ అతడు. "70 గంటల పనికి భయపడుతున్న వారంతా 2025లో రిలాక్స్‌డ్ గా ఉండొచ్చు, ఏఐ మన ఉద్యోగాలన్నిటినీ ఊడబెరుక్కోబోతోంది. హ్యాపీ న్యూ ఇయర్" అని విష్ చేశాడు. శాడిస్ట్. మిట్టల్ ఫౌండర్ అయిపోయాడు కానీ... గొప్ప ఇంచార్జి కావలసినవాడు.

ఇంఛార్జి... ఫౌండర్‌లా ఉండాలి. ఇంకా చెప్పాలంటే గౌతమ్ అదానీలా ఉండాలి. "చేసే శక్తి, ఆసక్తి ఉన్న వాళ్లు... వద్దన్నా 70 గంటలు పని చేస్తారు. చేయనివ్వండి. ఒకటైతే నిజం. ఫ్యామిలీతో 8 గంటలు గడిపితే ఆ ఉక్కపోత భరించలేక జీవిత భాగస్వామి ఇంట్లోంచి పారిపోతుంది" అని పెద్దగా నవ్వుతారాయన.

భార్యాభర్తలిద్దరూ వాళ్ల వాళ్ల ఆఫీస్‌లలో 70 గంటలు పని చేసి వస్తే ఇద్దరిలో ఎవరూ ఇల్లొదిలి పారిపోయే సమస్యే ఉండదు. అయితే వాళ్లు ఆఫీస్ వదిలి పారిపోకుండా ఇంచార్జిలు చూసుకోవాలి.

మహా భారతంలో కర్ణుడు నాకు ఇష్టమైన క్యారెక్టర్. గొప్ప దాతృత్వం అతడిది. ఇంచార్జిలు కూడా ఎప్పుడైనా ఒకరోజు సెలవు ఇవ్వటానికి, హాఫ్ డే లీవు శాంక్షన్ చెయ్యటానికి కర్ణుడిలా గొప్ప దాతృత్వం ప్రదర్శిస్తే ఆఫీసంటే పడి చచ్చిపోని వర్కర్‌లు ఉంటారా?

వర్కర్‌లు కూడా ఒక విషయం అర్థం చేసుకోవాలి. 'వర్క్' అంటే ఆఫీసు మరియు ఇంచార్జి. 'లైఫ్' అంటే భార్య మరియు పిల్లలు. (ఉద్యోగినులకైతే భర్త మరియు పిల్లలు). వర్క్‌ను లైఫ్, లైఫ్‌ను వర్క్ వాటికవే బ్యాలెన్స్ చేసుకుంటాయి కనుక వర్కర్‌లు పని కట్టుకుని లైఫ్‌ని, వర్క్‌ని బ్యాలెన్స్ చేసుకోనక్కర్లేదు. పనిలో మునిగి వుంటే చాలు.

ఎండ్ ఆఫ్ ది డే... ఇంచార్జిలు కంపెనీకి మంచి ఫలితాలను సాధించి చూపేలా పని చేయటం వర్కర్‌ల కనీస బాధ్యత.

సాగునీళ్లూ షాక్ కొడతాయా?



జనతంత్రం

వర్ధెల్లి మురళి

"టంగుటూరు మిరియాలు తాటికాయలంత...". తెలుగు నాట ఇదొక సామెత. చేతలు గడప దాటకుండానే మాటల్ని కోటలు దాటించే కోతల రాయుళ్లపై ఇటువంటి సామెతలు చాలానే ఉన్నాయి. ఈ మధ్య ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎడాపెడా విసురుతున్న మాటల ఈటెల్నీ, పలుకుతున్న పద జాలాన్నీ చూస్తుంటే ఈ సామెతలు సరిపోవనిపిస్తున్నది. 'విజన్–2047' పేరుతో ఆయన అట్టహాసంగా ఓ డాక్యుమెంట్‌ను ఇటీవల విడుదల చేశారు. ఈ విజన్ దెబ్బకు ఇంకో ఇరవై మూడేళ్లలో ఏపీ స్టేట్ 'ఏక్ నంబర్ స్టేటస్' చేరుకోనున్నదని ఆ సందర్భంగా ఆయన ఉద్ఘాటించారు. 'ఏక్ నంబర్ స్టేటస్' వస్తున్నప్పుడు స్పెషల్ స్టేటస్ ఎందుకనుకున్నారేమో గానీ, ఆ డాక్యుమెంట్‌లో అటువంటి ప్రస్తావన లేదు.

చంద్రబాబు పార్టీకి గానీ, యెల్లో మీడియాకు గానీ ఇలా గొప్పలకు పోవడం, డప్పు వాయించుకోవడం కొత్తేమీ కాదు. కానీ, వారు ప్రగల్భాలకు మాత్రమే పరిమితం కావడం లేదు. జనం మీదకు తేనె పూసిన కత్తుల్ని విసురుతున్నారు. విష గుళికలకు విజన్ లేబుళ్లు వేస్తున్నారు. కాకుల్ని కొట్టి, గద్దల్ని మేపే సామాజిక దుర్నీతి ఆయన తాజా విజన్ నిండా పరుచుకున్నదనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఆ విజన్ డాక్యుమెంట్ మీద ఇంకా పూర్తి స్థాయి చర్చ ప్రారంభం కాక ముందే, అందులోంచి ఆయన ఓ జలపాత దృశ్యాన్ని బయటకు తీశారు. అరుంధతీ నక్షత్రం మాదిరిగా యెల్లో మీడియా దాన్ని ప్రజలకు చూపెట్టింది. ఈ నక్షత్రానికి ఆయన 'తెలుగుతల్లికి జలహారతి' అని నామకరణం కూడా చేసుకున్నారు.

ఈ 'జలహారతి' పథకం తన 'మానస పుత్రిక'ని కూడా బాబు ప్రకటించుకున్నారు. 'విజన్ డాక్యుమెంట్'లో పండంటి రాష్ట్రానికి పది సూత్రాలని చెప్పుకున్నారు. ఆ పది సూత్రాల్లో ఒకటి 'జలభద్రత'. నదుల అనుసంధానం ద్వారా 'జలభద్రత' కల్పించాలన్న ఒక అంశానికి కొనసాగింపుగా ఈ 'జలహారతి' పథకాన్ని ప్రకటించారు. ఈ విజన్‌ను కొంత లోతుగా తరచి చూస్తే, ఇందులో ఎంత ప్రజావ్యతిరేకత దాగి ఉన్నదో, పెత్తందారీతనపు ఫిలాసఫీ ఎలా ఇమిడి ఉన్నదో అవగతమవుతుంది.

2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే, నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గోదావరి – బనకచర్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. జల వనరుల అధికార్లు, ఇంజినీర్లతో పలు దఫాల సమీక్ష, సాంకేతిక అంశాల పరిశీలన తర్వాత ఒక సమగ్ర నివేదిక (డీపీఆర్)ను జగన్ ప్రభుత్వం తయారు చేసింది. పోలవరం కుడి కాల్వ ప్రవాహ సామర్థ్యాన్ని పెంచి, ఈ కొత్త ప్రాజెక్టుకు అవసరమైన నీటిని కూడా దాని ద్వారా తరలించి ప్రకాశం బరాజ్‌కు చేర్చాలని నిర్ణయించారు. అక్కడి నుంచి సాగర్ కుడి కాల్వను ఉపయోగించుకొని, బొల్లాపల్లి దగ్గర కొత్తగా నిర్మించే రిజర్వాయర్‌కు చేరుస్తారు. అక్కడి నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ దగ్గరికి చేర్చాలి. ఇదీ ప్రాజెక్టు.

ఈ ప్రాజెక్టు వల్ల సాగర్ కుడి కాలువతో పాటు, వెలిగొండ, తెలుగుగంగ, ఎస్సార్ బీసీ, గాలేరు–నగరి తదితర ప్రాజెక్టుల కింద ఉన్న 22 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం జరుగుతుంది. అదనంగా ఏడున్నర లక్షల ఎకరాల ఆయకట్టు చేరుతుందనీ, 80 లక్షల జనాభాకు తాగునీటి వసతి లభిస్తుందనీ అంచనా వేశారు. ఇందులో నదుల అనుసంధానానికి సంబంధించిన అంశం ఇమిడి ఉన్నందువల్ల అనుసంధానం కేంద్రం బాధ్యత కనుక ఈ ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇవ్వాలని ప్రధాన మంత్రికి జగన్ మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రధాని సూచన

> ప్రాజెక్టులు నిర్మించి, నిర్వహించినందుకు ప్రభుత్వమే వారికి (ప్రైవేట్ వ్యక్తులు) సొమ్ము చెల్లిస్తుందని ప్రస్తుతానికి ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నప్పటికీ అది నమ్మశక్యంగా లేదు. అంతటి ఆర్థిక సామర్థ్యమే ఉంటే, మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్టుగా జలయజ్ఞంలోని అసంపూర్తి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నడుం కట్టేవారు. ఈ ప్రాజెక్టు నదుల అనుసంధానంలో భాగం కనుక కేంద్ర నిధుల కోసం ఒత్తిడి చేసేవారు. పైగా తమ సంఖ్యా బలం మీద ఆధారపడిన ప్రభుత్వాన్ని ముక్కు పిండి ఒప్పించడం ఎంతసేపు? జగన్ సర్కార్ డీపీఆర్‌ను కాపీ కొట్టిన ప్రభుత్వం ఆయన అనుసరించిన వైఖరిని ఎందుకు అనుకరించడం లేదు?

మేరకు 'కేంద్ర జలసంఘం' అనుమతి కోసం 2022లోనే రాష్ట్రం ఈ ప్రాజెక్టుపై డీపీఆర్‌ను సమర్పించింది.

అదిగో అదే డీపీఆర్‌ను ఇప్పుడు బయటకు తీసి తన మానస పుత్రికగా చంద్రబాబు ప్రకటించుకున్నారు. నామకరణ మహోత్సవాన్ని కూడా జరుపుకున్నారు. అయితే ఇందులో ఒక్క మార్పు మాత్రం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. పోలవరం కుడి కాలువ సామర్థ్యం పెంచడం ద్వారా బనకచర్లకు కూడా వరద రోజుల్లో రోజుకు రెండు టీఎమ్‌సీల చొప్పున తరలించాలన్నది గత ప్రభుత్వ ప్రతిపాదన. చంద్రబాబు సర్కార్ ఇక్కడ మార్పు చేసింది. పోలవరం ప్రాజెక్టుకు దిగువన తాడిపూడి పాయింట్ దగ్గర ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి, కుడి కాల్వకు సమాంతరంగా మరో కాలువను తవ్వి, నీటిని తరలించాలని ప్రతిపాదించింది.

ఎత్తిపోతల పంపుల కోసం, కరెంట్ కోసం అదనపు ఖర్చు. మరో కాలువ తవ్వడానికి భూసేకరణ ఒక ప్రధాన సమస్య. అదనపు ఖర్చు కూడా. జగన్ పథకాన్ని యథాతథంగా కాపీ చేయకుండా ఈ ఒక్క మార్పును ఎందుకు చేసినట్టు? అదనపు ఖర్చు వల్ల అదనపు కమిషన్ లభిస్తుందన్న కండూతి ఒక కారణం కావచ్చు. దీంతోపాటు ఇంకో విమర్శ కూడా వినిపిస్తున్నది. పోలవరం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 45.72 మీటర్లకు బదులుగా 41.15 మీటర్లకే పరిమితం చేయడానికి బాబు సర్కారు అంగీకరించిందనీ, ఈ మేరకు కేంద్ర కేబినెట్‌లో కూడా నిర్ణయం జరిగిందనీ ఇటీవల సాక్షి మీడియాలో ప్రముఖంగా వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ తాడిపూడి ఎత్తిపోతల నిర్ణయం కూడా దాన్ని నిర్ధారిస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

41.15 మీటర్ల ఎత్తుకే నీటి నిల్వను పరిమితం చేస్తే కుడి కాలువ ఆయకట్టుకే సరిపోను నీటిని అందివ్వలేదనీ, అటువంటప్పుడు ఇక బనకచర్లకు తరలింపు ఎలా సాధ్యమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కనుక ప్రాజెక్టు దిగువన కూడా వరద రోజుల్లో ప్రవాహం ఉన్నప్పుడు ఎత్తిపోయడానికి ఈ పథకాన్ని మార్చి ఉండవచ్చని తెలుస్తున్నది. ఇంకొక ముఖ్యమైన మార్పు సిసలైన గేమ్ ఛేంజర్ వంటి అంశం మరొకటి ఉన్నది. నదుల అనుసంధానం కింద ఈ ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇవ్వాలని జగన్ ప్రభుత్వం కోరింది. కానీ, చంద్రబాబు ఆలోచన మరో విధంగా ఉన్నది. ఈ పాజెక్టును ప్రకటించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అసలు విషయాన్ని కొద్దిగా ఆయన బయట పెట్టారు.

ప్రాజెక్టు కోసం కేంద్రం నిధులిచ్చే అవకాశం లేదని చెబుతూ – ప్రైవేట్ వ్యక్తుల ద్వారా సేకరిస్తామని చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు పదేళ్లదాకా వాటి నిర్వహణను కూడా ప్రైవేట్ వారికే అప్పగిస్తామన్నారు. ఇటీవలే గ్రామీణ రోడ్ల నిర్మాణం – నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తామని చంద్రబాబు చెప్పిన విషయం పాఠకులకు గుర్తుండే ఉంటుంది. ప్రైవేట్ వ్యాపారులు, సేవా దృక్పథంతో రోడ్లేయరు కదా! జనం తోలు వలిచి టోల్ వసూలు చేస్తారు. ఇక సాగునీటి సరఫరాకు కూడా అదే పద్ధతి రాబోతుందన్న మాట.

ప్రాజెక్టులు నిర్మించి, నిర్వహించినందుకు ప్రభుత్వమే వారికి సొమ్ము చెల్లిస్తుందని ప్రస్తుతానికి ముఖ్యమంత్రి చెబుతున్నప్పటికీ అది నమ్మశక్యంగా లేదు. అంతటి ఆర్థిక సామర్థ్యమే ఉంటే, మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్టుగా జలయజ్ఞంలోని అసంపూర్తి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నడుం కట్టేవారు. ఈ ప్రాజెక్టు నదుల అనుసంధానంలో భాగం కనుక కేంద్ర నిధుల కోసం ఒత్తిడి చేసేవారు. పైగా తమ సంఖ్యా బలం మీద ఆధారపడిన ప్రభుత్వాన్ని ముక్కుపిండి ఒప్పించడం ఎంతసేపు? జగన్ సర్కార్ డీపీఆర్‌ను కాపీ కొట్టిన ప్రభుత్వం ఆయన అనుసరించిన వైఖరిని ఎందుకు అనుకరించడం లేదు?

> ఈ 'జలహారతి' పథకం తన 'మానస పుత్రిక'ని కూడా బాబు ప్రకటించుకున్నారు. 'విజన్ డాక్యుమెంట్'లో పండంటి రాష్ట్రానికి పది సూత్రాలని చెప్పుకున్నారు. ఆ పది సూత్రాల్లో ఒకటి 'జలభద్రత'. నదుల అనుసంధానం ద్వారా 'జలభద్రత' కల్పించాలన్న ఒక అంశానికి కొనసాగింపుగా ఈ 'జలహారతి' పథకాన్ని ప్రకటించారు. ఈ విజన్‌ను కొంత లోతుగా తరచి చూస్తే, ఇందులో ఎంత ప్రజావ్యతిరేకత దాగి ఉన్నదో, పెత్తందారీతనపు ఫిలాసఫీ ఎలా ఇమిడి ఉన్నదో అవగతమవుతుంది.

ఎందుకంటే, సంపూర్ణ ప్రైవేటీకరణ ఆయన విధానం కనుక. ప్రజలకు ఏదీ ఉచితంగా ఇవ్వడానికి వీల్లేదనీ, ప్రభుత్వ సేవలన్నిటికీ యూజర్ చార్జీలను వసూలు చేయాల్సిందేననీ గతంలోనే తన సిద్ధాంత పత్రాన్ని ఆయన రాసుకున్నారు కనుక. పాతికేళ్ల కింద ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ మాదిరిగానే 'విజన్ 2020'ని చంద్రబాబు ప్రకటించారు. అప్పుడు ఆకాంక్షించిన ఆర్థిక వృద్ధి జరిగిందా? కొందరు బలవంతులు మాత్రం మహాబలసంపన్నులుగా ఎదిగి పోయారు. ఆర్థిక అసమానతలు అమానవీయంగా పెరిగి పోయాయి. ఆ డాక్యుమెంట్‌కు కొనసాగింపే 'విజన్ – 2047'. అంతేగాకుండా, కేంద్ర సర్కార్ ఇప్పటికే ప్రకటించిన 'వికసిత్ భారత్–2047'కు అనుగుణంగా దీన్ని రూపొందించినట్టు స్వయంగా ముఖ్యమంత్రే చెప్పారు. దొందూ దొందే. మేడ్ ఫర్ ఈచ్ అదర్.

చంద్రబాబు ప్రైవేటీకరణ పదజాలంలోకి కొత్త మాటలు వచ్చి చేరుతున్నాయి. గతంలో పీత్రీ (P3) మోడల్‌ను తానే ప్రతిపాదించాననీ, ఇప్పుడింకో 'పీ'ని చేర్చి పీఫోర్ (P4)ని ప్రతిపాదిస్తున్నాననీ ఆయన చెప్పారు. పబ్లిక్–ప్రైవేట్ పార్టనర్‌షిప్‌లో పీపుల్‌ను కూడా చేర్చారట. 'పీత్రీ'ని అమలు చేసినప్పుడు పబ్లిక్ రంగ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారు. లాభసాటిగా నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ఖాయిలా పట్టించి కోట్ల విలువైన వాటి ఆస్తులతో సహా 54 సంస్థలను పప్పుబెల్లాలకు తన వారికి కట్టబెట్టిన ఉదంతాన్ని మరిచిపోగలమా?

ఇప్పుడు ఇంకో 'పీ' పేరుతో ప్రజల్ని చేర్చారు. ప్రజలు ఎలా భాగస్వాములు అవుతారు? ప్రైవేట్ ఆస్తులను ప్రజలకైతే అప్పగించరు కదా! ప్రజలే వారి దగ్గర ఉన్న భూముల్ని ఇవ్వాల్సి ఉంటుంది. ప్రైవేట్ సేవలకు మెచ్చి నీటి పన్ను, బాట పన్ను, బడి పన్ను, దవాఖానా పన్ను వంటి వాటిని అవసరాన్ని బట్టి చెల్లించవలసి ఉంటుంది. తమ రెక్కల కష్టాన్ని సమర్పించుకోవాల్సి ఉంటుంది. ప్రజల భాగస్వామ్యానికి సంబంధించి ఇంతకంటే భిన్నమైన ప్రతిపాదనలైతే విజన్‌లో కనిపించలేదు. ఆంధ్రప్రదేశ్ అడ్రస్‌ను వెతుక్కుంటూ వేలకోట్ల పెట్టుబడులు పరుగెత్తుకొస్తున్నాయని విడతల వారీగా ప్రకటనలు గుప్పిస్తున్నారు. తాజాగా చేసిన ప్రకటనలో రిలయన్స్‌వారు 'కంప్రెస్డ్ బయోగ్యాస్' ఉత్పాదన కోసం 65 వేల కోట్లు పెట్టుబడి పెడతారనే, కళ్లు చెదిరే లెక్క కూడా చెప్పారు. అందుకోసం వారికి ఐదులక్షల ఎకరాల భూమిని అప్పగిస్తారట. ప్రతిగా కంపెనీ వాళ్లు రెండున్నర లక్షలమందికి ఉపాధి కల్పిస్తారట. అంత భూమిని పేదలకు అసైన్ చేస్తే అంతకంటే ఎక్కువమందే ఉపాధి పొందవచ్చు గదా అనే సందేహాలు అజ్ఞానులకు మాత్రమే కలుగుతాయి. ఆర్థిక నిపుణులు వాటికి సమాధానం చెప్పరు.

vardhelli1959@gmail.com

పాతాళాన్ని తాకిన పార్లమెంట్ ప్రతిష్ఠ

సందర్భం



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

మన దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు జవాబుదారీతనం వహించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను చర్చించి సమీక్షించే అధికారాన్ని రాజ్యాంగం పార్లమెంట్‌కు దఖలు పర్చింది. ఈ ప్రక్రియ సజావుగా జరగడం కోసమే ప్రతి యేటా భారత పార్లమెంట్ మూడు పర్యాయాలు సమావేశాలు నిర్వహిస్తుంది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు జవాబుదారీతనం వహించడం అంటే ప్రాతినిధ్య ప్రజాస్వామ్య వ్యవస్థ అయిన మన దేశంలో దేశ ప్రజలకు బాధ్యత వహించడమేనని ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు.

ఇంత ఘనమైన రాజ్యాంగ బాధ్యత ఉన్నది కనుకనే భారత పార్లమెంట్‌ను దేశ ప్రజల భవిష్యత్తును రూపొందించే కార్యశాలగా పేర్కొంటారు. కానీ, గత రెండు దశాబ్దాల పైబడి భారత పార్లమెంట్ ప్రతిష్ఠ క్రమంగా మసకబారుతోంది. పార్లమెంట్ ఉభయ సభల్లో గతంలో కూడా అప్పుడప్పుడు సభ్యులు నిగ్రహం కోల్పోయి అరుపులు, కేకలు పెట్టడం వంటి అవాంఛనీయ ఘటనలు జరిగిన మాట వాస్తవమే అయినా, తాజాగా డిసెంబర్ 20తో ముగిసిన 18వ లోక్‌సభ శీతాకాల సమావేశాలలో అన్ని హద్దులు దాటి సభ్యులు బాహాబాహీకి దిగిన దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. అధికార, విపక్ష సభ్యులు పరస్పరం తోపులాటలకు దిగిన హీనస్థితికి లోక్‌సభ వేదిక కావడం దిగజారిన రాజకీయ సంస్కృతికి అద్దం పడుతుంది.

తగ్గిపోయిన ప్రశ్నోత్తరాల సమయం

దశాబ్ద కాలంగా పార్లమెంట్ సమావేశాల పని గంటలు తగ్గిపోతున్నాయి. 16వ లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం నిర్దేశిత వ్యవధిలో 77 శాతం, అదేవిధంగా రాజ్యసభలో 44 శాతం మాత్రమే నమోదైంది. కారణం– పార్లమెంట్ ఉభయ సభల్లో అవాంతరాలు ఏర్పడి సభలు తరచుగా వాయిదా పడటమే. పార్లమెంట్ బిజినెస్‌లో ఇతర అంశాల కోసం అదనపు గంటలు పనిచేసే వెసులుబాటు ఉంది గానీ, ప్రశ్నోత్తరాలు వాయిదా పడితే... ఆ సమయాన్ని పొడిగించరు. వాటికి కేవలం రాతపూర్వక జవాబుల్ని మాత్రమే సభ్యులకు పంపుతారు. సామాన్యంగా ప్రశ్నోత్తరాల సమయాన్ని కొత్తగా ఎన్నికయిన సభ్యులు ఎక్కువగా సద్వినియోగ పర్చుకొంటారు. సభ్యులు తాము ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర, నియోజకవర్గ సమస్యలకు సంబంధించి ప్రశ్నలు వేసి వాటికి జవాబులు ఆశిస్తారు. ప్రశ్నోత్తరాల సమయం రద్దయితే... సభ్యులు తమ విలువైన అవకాశాన్ని కోల్పోవడమేగాక, వారు ఆశించి ఎదురు చూస్తున్న అంశాలపై సమాధానం పొందలేకపోతారు.

పార్లమెంట్ సమావేశాలు సవ్యంగా సాగకపోవడానికి ప్రతిసారీ ఒక్కో విధమైన కారణాలు దోహదం చేస్తున్నాయి. ఈసారి శీతాకాల సమావేశాలలో పారిశ్రామికవేత్త అదానీ వ్యవహారంపై చర్చించాలని కాంగ్రెస్ పార్టీతో సహా మరికొన్ని విపక్ష పార్టీలు గట్టిగా పట్టుబట్టి ఉభయ సభల కార్యకలాపాల్ని అడ్డుకున్నాయి. ఈ సమావేశాలలోనే రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కడ్‌పై విపక్షం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ఇచ్చిన నోటీసును డిప్యూటీ చైర్మన్ తిరస్కరించడంతో గందరగోళం నెలకొని పలుమార్లు రాజ్యసభ వాయిదా పడింది. ఇక, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యపై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను ఆయన అవమానించారంటూ విపక్ష సభ్యులు గందరగోళాన్ని పరాకాష్ఠకు తీసుకువెళ్లడంతో... అడికాస్తా అధికార, విపక్ష సభ్యుల మధ్య తోపులాటలు, ముష్టిఘాతాలకు దారితీసింది. సభల్ని సజావుగా నిర్వహించా



ల్సిన బాధ్యత గలిగిన అధికార ఎన్డీఏ సైతం పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్ పార్టీ దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపిందంటూ ఆరోపణలు చేయడంతో ఉభయ సభల్లో విపక్ష పార్టీల సభ్యులు వాకౌట్ చేశారు. కారణాలు ఏవైనా, ఈ శీతాకాల సమావేశాలలో లోక్‌సభ నిర్ణీత వ్యవధిలో 54.5 శాతం, అదేవిధంగా రాజ్యసభ 40 శాతం మాత్రమే పనిచేశాయి. శీతాకాల సమావేశాలు అతి తక్కువ వ్యవధిలో పని చేయడం ఇదే ప్రథమం అని రికార్డులు వెల్లడిస్తున్నాయి.

ఆమోదం పొందిన బిల్లు ఒక్కటే!

నిజానికి, ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలకు విలువైన పెద్ద ఎజెండానే సిద్ధం చేశారు. మొత్తం 16 బిల్లుల్ని ప్రవేశపెట్టి అందులో మెజారిటీ బిల్లుల్ని ఆమోదింపజేసుకోవాలని అధికార కూటమి భావించింది. కానీ, విమానయాన రంగానికి సంబంధించిన 'భారతీయ వాయుయాన్ విధేయక్, 2024' బిల్లు ఒక్కటే ఉభయ సభల ఆమోదం పొందగలిగింది. ఆర్థిక రంగానికి సంబంధించి మొదటి విడత సప్లిమెంటరీ గ్రాంట్స్ కూడా ఆమోదం పొందవలసి ఉన్నాయి. అయితే కొన్ని బిల్లులు లోక్‌సభలో, మరి కొన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ముఖ్యంగా జమిలి ఎన్నికలకు సంబంధించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టి దానిని జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపించారు. దేశ ప్రయోజనాల రీత్యా అన్ని పక్షాలు ఏకాభిప్రాయానికి రావాల్సిన కీలక అంశాలపై కూడా అధికార, విపక్షాలు ఏకతాటిపైకి రాలేని అవమానకర దుఃస్థితి నెలకొంది.

చట్టసభలు క్రియాశీలంగా లేకపోవడం అంటే దేశంలో ప్రజాస్వామ్యం లేనట్టే. 'చర్చల ద్వారా పాలన సాగించడమే ప్రజాస్వామ్యం' అని పలువురు రాజనీతిజ్ఞులు చెప్పిన మాట మన దేశంలో క్రమేపి నవ్వులాటగా మారుతోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పురుడుపోసిన ఇంగ్లాండ్ పార్లమెంట్ భారత్‌తో సహా అనేక దేశాలకు ఆదర్శప్రాయం. వెస్ట్‌మినిస్టర్ తరహా పాలనను అనుసరిస్తున్నామని చెప్పుకోవడమే తప్ప... నిజానికి మన పార్లమెంటరీ పద్ధతులు, విధానాలు ఇంగ్లాండ్‌కు భిన్నంగా ఉన్నాయి. ఇంగ్లాండ్ పార్లమెంట్‌లో ప్రతిపక్షాల చర్చలకు ప్రత్యేకంగా 20 రోజులు కేటాయించే అవకాశాన్ని వారి రాజ్యాంగం కల్పించింది. ప్రధాన ప్రతిపక్షానికి 17 రోజులు, ఇతర విపక్ష పార్టీలకు 3 రోజులు మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తున్నారు. అదేవిధంగా, 40 మంది సభ్యుల మద్దతు కూడగడితే వారు కోరిన అంశాన్ని అనివార్యంగా సభ చర్చకు స్వీకరించాల్సిందే. మన పార్లమెంట్‌లో అటువంటి నిబంధనగానీ, ఆనవాయితీగానీ లేవు. నిజానికి మన రాజ్యాంగ కర్తలు భవిష్యత్తులో చట్టసభలలో విపరీత పరిణామాలు చోటుచేసుకొంటాయని ఆనాడు ఊహించలేదు. విపక్షాలు నిరసన తెలపడం, వాకౌట్ చేయడం వారి హక్కుగా, ప్రజాస్వామ్యంలో ఓ భాగంగానే భావించారు గానీ... రోజుల తరబడి చట్టసభలు వాయిదా పడతాయనీ, బిల్లులు చర్చకు నోచుకోకుండా గిలెటిన్ అవుతాయనిగానీ వారు అంచనా వేయలేకపోయారు.

కారణాలు ఏవైనా పార్లమెంట్ ఔన్నత్యం, ప్రతిష్ఠ నానాటికి తగ్గడం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ప్రజాప్రతినిధులు సభల నుంచి వాకౌట్ చేసి క్యాంటీన్లలో, లాబీల్లో కాలక్షేపం చేయడం సహించరానిది. చర్చకు నోచుకోకుండా బిల్లులు చట్టాలైతే అవి ప్రజలకు గుదిబండలుగా మారతాయి. అందువల్ల పార్లమెంట్ క్రియాశీలకంగా మారాలి. చట్టసభలు క్రియాశీలంగా పని చేయడానికి, సభ్యుల చురుకైన భాగస్వామ్యానికి అవసరమైన సంస్కరణలు తక్షణం చేపట్టాలి. అందుకు అన్ని పార్టీల సలహాలు, సూచనలు స్వీకరించాలి. లా కమిషన్‌కు కూడా బాధ్యత అప్పగించాలి. ఆ విధంగా పాతాళానికి పడిపోయిన పార్లమెంట్ ప్రతిష్ఠను పునరుద్ధరించడానికి కేంద్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలి. చట్టసభలు అలంకార ప్రాయంగా మారిపోవడాన్ని ప్రజలు ఇకపై ఎంత మాత్రం సహించరని అన్ని రాజకీయ పార్టీలు గ్రహించాలి.

వ్యాసకర్త ఏపీ శాసనమండలి సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి

స్వయం ప్రతిపత్తి కోసం శంఖారావం

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 77 సంవత్సరాలు అయినప్పటికీ ఈ దేశంలోని హిందూ దేవాలయాలకు నిర్వహణ విషయమై స్వయం ప్రతిపత్తి లేకపోవటం విచారకరం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 12, 25, 26 ప్రకారం చూసినా హిందూ దేవాలయాలను ప్రభుత్వం నిర్వహించటం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది. మనదేశంలో ఆదాయ వనరులు ఎక్కువగా ఉన్న దేవాలయాలన్నింటిపై ప్రభుత్వాలు అజమాయిషీ చేస్తున్నాయి. అదే సమయంలో ఎటువంటి ఆదాయ వనరులు లేనటువంటి దేవాలయాలను నిర్లక్ష్యం చేస్తున్నాయి.

అనాదిగా భారత దేశంలోని రాజులు తమ రాజ్యాలలోని దేవాలయాల నిర్వహణకు మాన్యాలు, ఆభరణాలు, అగ్రహారాలు దానంగా ఇచ్చేవారు. నేటి ఆధునిక కాలంలో కూడా భక్తులు ముడుపులు, కానుకల ద్వారా దేవాలయాలకు నిధులు సమకూర్చుతూ ఉన్నప్పటికీ వారికి కావలసిన మౌలిక సదుపాయాలను మాత్రం చాలా చోట్ల ప్రభుత్వాలు కల్పించడం లేదు. దేవాలయాలకు చెందిన భూములు కబ్జాలకు గురవుతున్నా వాటిని విడిపించేందుకు ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదు. ఇది హిందూ సమాజం పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తోంది.

అయోధ్య తీర్పులో సుప్రీంకోర్టు రామాలయ నిర్మాణాన్ని, నిర్వహణను రామ జన్మభూమి ట్రస్టుకు అప్పగించిన ఏడాది కాలంలోనే భవ్యమైన, దివ్యమైన రామాలయాన్ని అయోధ్యలో హిందూ ధార్మిక సంస్థలు నిర్మించాయి. సంవత్సర కాలంలోనే 13 కోట్ల 50 లక్షల మంది భక్తులకు తగిన వసతి సౌకర్యాలు కల్పించి వారికి బాలరాముని దర్శన భాగ్యాన్ని కల్పించాయి. దీనిని బట్టి ధార్మిక సంస్థలు దేవాలయాల నిర్వహణ ఎంతో సమర్థవంతంగా చేయగలవని రుజువైంది. కనుక దేశంలోని హిందూ దేవాలయాలను ప్రభుత్వాల నియంత్రణ నుంచి తప్పించి హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలి. ఇదే డిమాండుతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నేడు (జనవరి 5) విజయవాడలో 'హైందవ శంఖారావం' బహిరంగ సభ జరుగుతుండటాన్ని హిందువుల ఐక్యతకు, చైతన్యానికి ఒక ముందడుగుగా భావించాలి.

– ఆచార్య వై.వి. రామిరెడ్డి I అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ ఏపీ అధ్యక్షులు
(నేడు విజయవాడలో హైందవ శంఖారావం)

వామనావతారంలో రామయ్య



భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో స్వామివారు శనివారం వామనావతారంలో దర్శనమిచ్చారు. అర్చకులు స్వామివారి ఎదుట దివ్య ప్రబంధం పఠించిన తర్వాత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ మిథిలా స్టేడియం వేదికపై కొలువుదీర్చారు. భక్తుల దర్శనానంతరం తిరువీధి సేవ నిర్వహించారు.

మహా కుంభాభిషేకానికి రండి



సీఎం రేవంత్‌రెడ్డికి వేద ఆశీర్వచనం చేస్తున్న యాదగిరిగుట్ట ఆలయ అర్చక బృందం. చిత్రంలో మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

సీఎంకు మంత్రి సురేఖ ఆహ్వానం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య విమాన స్వర్ణ గోపుర మహా కుంభాభిషేకానికి రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆధ్వర్యంలో దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.శ్రీధర్, ఆలయ ఈవో భాస్కర్‌రావు, అర్చక బృందం కలిసి ఆహ్వానించారు. ఫిబ్రవరి 23వ తేదీన దివ్య విమాన స్వర్ణ గోపురానికి పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం మహా కుంభాభిషేకం నిర్వహిస్తామని సీఎంకు వివరించారు. అంతకుముందు ఆలయ అర్చక బృందం సీఎం రేవంత్‌రెడ్డికి వేద ఆశీర్వచనం చేసి.. శ్రీస్వామి వారి లడ్డూ ప్రసాదం, శేష వస్త్రాన్ని అందజేసింది.

యూరియా కోసం బారులు



వీర్నపల్లిలో ఎరువుల కోసం వరుసలో నిలబడి నిరీక్షిస్తున్న రైతులు

వీర్నపల్లి (సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వరినాట్లు మొదలై పదిహేను రోజులు దాటుతోంది. అయినా రైతులకు యూరియా బస్తాలు అందలేదు. శనివారం మండల కేంద్రానికి ఒక లారీ లోడ్‌లో యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు దాదాపు 200 మంది వరకు స్థానిక గ్రామపంచాయతీకి తరలి వచ్చారు. యూరియా కొరత ఉండడంతో సొసైటీ అధికారులు ఒక్కొక్క రైతుకు మూడు బస్తాలు మాత్రమే ఇచ్చారు. గంటల తరబడి బారులు తీరినా మూడు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో.. రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం

- మృతి చెందిన పెద్ద కొడుకు
- చికిత్స పొందుతున్న తల్లి, చిన్నకొడుకు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇద్దరు కొడుకులకు విషమిచ్చిన తల్లి.. తానూ తాగింది. ఈ సంఘటనలో పెద్ద కొడుకు కన్నుమూశాడు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. హైదరాబాద్‌లో నివసిస్తున్న కామారెడ్డి జిల్లా లింగంపేట మండల కేంద్రానికి చెందిన ఒంటరిపల్లి చాకలి సుకన్య తన ఇద్దరు కొడుకులకు విషమిచ్చి తానూ తాగింది. ఈ సంఘటనలో పెద్ద కొడుకు సొమిత్ (9) మృతి చెందగా.. చిన్న కొడుకు శ్రీనిత్, సుకన్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని లింగంపేట గ్రామస్తులు తెలిపారు. ఒంటర్‌పల్లి చాకలి రమేశ్, సుకన్య, ఇద్దరు కొడుకులతో హైదరాబాద్‌లోని గండిమైసమ్మ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఆమె ఐదారేళ్ల క్రితం కూలి పనుల కోసం హైదరాబాద్ వలస వెళ్లింది.

'హెచ్‌ఎంపీవీ'పై అప్రమత్తం!

- వైద్యాధికారులు, ప్రజలకు పలు సూచనలు చేసిన ప్రభుత్వం
- రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ కేసులు లేవని వెల్లడి
- అయినా సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రులకు ఆదేశం
- ప్రజలు చేయాల్సిన, చేయకూడని పనులపై మార్గదర్శకాలు
- 'కరోనా'నాటి జాగ్రత్తలనే పాటించాలని సూచనలు

సాక్షి, హైదరాబాద్: చైనాలో హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) వేగంగా వ్యాప్తి చెందుతోందన్న వార్తల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రజలకు శనివారం పలు సూచనలు చేసింది. హెచ్‌ఎంపీవీ గురించి ఆందోళన చెందకుండా, శ్వాసకోశ సంబంధ ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుకునేందుకు జాగ్రత్తలు పాటించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (డీజీహెచ్‌ఎస్) సూచించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటనపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం కూడా వైద్యాధికారులకు పలు ఆదేశాలు జారీచేసింది. ఎవరిలోనైనా వైరస్ లక్షణాలు బయటపడితే తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించింది. హైదరాబాద్‌లోని ఫీవర్, గాంధీ, ఉస్మానియా, రాం కోఠి, పేట్ల బురుజు వంటి ప్రధాన ఆసుపత్రులతో పాటు అన్ని జిల్లాల ఆసుపత్రులను అప్రమత్తం చేసింది. అదే సమయంలో అనారోగ్యంతో ఉన్న వారు కరోనా సమయంలో వ్యవహరించిన విధంగానే మాస్కులు, చేతి రుమాలుతో జాగ్రత్తలు పాటించాలని ప్రజారోగ్య సంచాలకుడు బి.రవీందర్ నాయక్ సూచించారు. ప్రజలు పాటించవలసిన జాగ్రత్తలు, చేయకూడని పనులకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేశారు. హెచ్‌ఎంపీవీ కూడా ఇతర శ్వాసకోశ వైరస్‌లలాగే శీతాకాలంలో ప్రధానంగా యువకులు, వృద్ధులలో సాధారణ జలుబు, ఫ్లూ వంటి లక్షణాలను కలిగిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణలో హెచ్‌ఎంపీవీ కేసులేవీ నమోదు కాలేదని చెప్పారు. అయితే శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లకు సంబంధించిన ప్రస్తుత డేటాను విశ్లేషిస్తున్నట్లు తెలిపారు.



హెచ్‌ఎంపీవీ విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలు

చేయాల్సిన పనులు..

- దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు నోరు, ముక్కును రుమాలు లేదా టిష్యూ పేపర్, మాస్క్‌తో కప్పుకోవాలి.
- చేతులను తరచుగా సబ్బు, నీరు లేదా ఆల్కహాల్ ఆధారిత శానిటైజర్‌తో కడగాలి.
- రద్దీగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాలి. ఫ్లూతో బాధపడుతున్న వ్యక్తుల నుంచి ఒక మూరెడు పొడవు కంటే ఎక్కువ దూరంలో ఉండాలి.
- మీకు జ్వరం, దగ్గు, తుమ్ములు ఉంటే బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండండి.
- పుష్కలంగా నీరు తాగాలి. పౌష్టికాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.
- అంటువ్యాధులను తగ్గించడానికి తగినంత గాలి వీచే ప్రదేశాలలో ఉండాలి.
- అనారోగ్యంతో ఉంటే ఇంట్లోనే ఇతరులను కలవకుండా ఉండాలి.
- కంటినిండా నిద్రపోవాలి.

చేయకూడనివి..

- ఇతరులతో కరచాలనం చేయకండి.
- ఒకటే టిష్యూ పేపర్, చేతి రుమాలును పదేపదే వాడకండి.
- అనారోగ్యంతో ఉన్న వ్యక్తులకు సన్నిహితంగా మెలగొద్దు.
- కళ్లు, ముక్కు, నోటిని తరచూ తాకవద్దు.
- బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయకండి.
- వైద్యుడిని సంప్రదించకుండా ఔషధాలు వాడకూడదు.

'ఇస్రో' రోబో హస్తం

కీలక ప్రయోగం విజయవంతం



న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ఘనత సాధించింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఇస్రో అభివృద్ధి చేసిన రోబోటిక్ హస్తం అంతరిక్షంలో తన కార్యాచరణ ప్రారంభించింది. భారతదేశ అంతరిక్ష ప్రయోగాల్లో ఇదొక కీలక పరిణామమని నిపుణులు చెబుతున్నారు. సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించుకొనే దిశగా స్పేడెక్స్(స్పేస్ డాకింగ్ ఎక్స్‌పర్మెంట్) మిషన్‌లో భాగంగా ఈ రిమోట్ రోబోటిక్ చెయ్యిని అంతరిక్షంలోకి పంపించారు. శ్రీహరి కోటలోని షార్ నుంచి గత నెల 30వ తేదీన అంతరిక్షంలోకి వెళ్లింది. మన దేశానికి చెందిన మొట్టమొదటి రోబోటిక్ హస్తం రీలొకేటబుల్ రోబోటిక్ మ్యానిప్యులేటర్-టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్(ఆర్ఆర్ఎం-టీడీ) కార్యాచరణ మొదలుపెట్టిందని, ఇది మనకు గర్వకారణమని ఇస్రో వెల్లడించింది. పూర్తి స్థాయిలో విజయవంతమైన ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఆర్ఆర్ఎం-టీడీని నడిచే రోబోటిక్ హస్తంగా పరిగణిస్తారు. ఇండియాలో ఇలాంటిది అభివృద్ధి చేయడంలో ఇదే మొదటిసారి. ఇందులో ఏడు జాయింట్లు ఉన్నాయి. అవి అన్ని వైపులా కదులుతాయి. అంతరిక్షంలోని స్పేడెక్స్ మిషన్‌లో భాగమైన పీఎస్4-ఆర్బిటాల్ ఎక్స్‌పెరిమెంట్ మాడ్యూల్(పోయెం-4) ప్లాట్‌ఫామ్‌పై చురుగ్గా నడవగలదు. నిర్దేశించిన చోటుకు వెళ్తుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ మర చెయ్యిని రూపొందించారు. ఇందులో కంట్రోలర్లు, కెమెరాలు, అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్‌ను అమర్చారు. భారతీయ అంతరిక్ష స్టేషన్(బీఏఎస్) పేరిట సొంత అంతరిక్ష కేంద్ర నిర్మాణానికి భారత్ సన్నాహాలు చేస్తున్న సంగతి తెలిసిందే. బీఏఎస్ నిర్మాణం, నిర్వహణకు రోబోటిక్ టెక్నాలజీ అవసరం. ఈ టెక్నాలజీని స్వయంగా అభివృదిచేసుకొనే దిశగా రోబోటిక్ హస్తం కీలకమైన ముందడుగు అని ఇస్రో సైంటిస్టులు చెబుతున్నారు.

అంతరిక్షంలో జీవం 'పురుడు' పోసుకుంది!


అలసందలకు మొలకలు

- 4 రోజుల్లోనే అద్భుతం
- ఇస్రో మరో ఘనత

న్యూఢిల్లీ: కొన్నేళ్లుగా అంతరిక్షంలో అద్భుతాలతో ప్రపంచాన్ని అబ్బురపరుస్తున్న ఇస్రో మరో ఘనత సాధించింది. అంతరిక్షంలో జీవసృష్టి చేసి చూపించింది. స్పేడెక్స్ మిషన్‌లో భాగంగా పీఎస్ఎల్‌వీ-సి60 ఆర్బిటాల్ ఎక్స్‌పెరిమెంట్ మాడ్యూల్ (పోయెమ్-4) ద్వారా డిసెంబర్ 30న అంతరిక్షంలోకి పంపిన అలసంద విత్తనాలు కేవలం 4 రోజుల్లోనే మొలకెత్తాయి! కాంపాక్ట్ రీసెర్చ్ మాడ్యూల్ ఫర్ ఆర్బిటాల్ ప్లాంట్ స్టడీస్ (సీఆర్‌ఓపీఎస్) టెక్నాలజీ ద్వారా ఈ ప్రయోగాన్ని ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. సూక్ష్మ గురుత్వాకర్షణ పరిస్థితుల్లో విత్తనాల అంకుర, మనుగడ ప్రక్రియను అధ్యయనానికి ఉద్దేశించిన ఆటోమేటెడ్ వ్యవస్థ అయిన సీఆర్ఓపీఎస్ పేలోడ్‌ను విక్రం సారాబాయ్ అంతరిక్ష కేంద్రం అభివృద్ధి చేసింది. ఇందులో భాగంగా ఎనిమిది అలసంద విత్తనాలను నియంత్రిత వాతావరణంతో కూడిన బాక్సులో ఉంచారు. వాటికి నిరంతరం కచ్చితత్వంతో కూడిన వెలుతురు అందేలా జాగ్రత్త తీసుకున్నారు. విత్తనాల్లో జరుగుతున్న మార్పుచేర్పులను అత్యంత హై రిజల్యూషన్‌తో కూడిన కెమెరా ఇమేజింగ్, ఉష్ణోగ్రత, సీఓటూ సాంద్రత, ఆర్ద్రత వంటివాటి తనిఖీ తదితరాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వచ్చారు. నాలుగు రోజుల్లోనే విత్తనాలు మొలకెత్తడంతో సైంటిస్టులు ఆనందోత్సాహాల్లో తేలిపోతున్నారు. ''అంతరిక్షంలో జీవం పురుడు పోసుకుంది. ప్రయోగం విజయవంతమైంది. విత్తనాలు విజయవంతంగా మొలకెత్తాయి'' అంటూ ఇస్రో హర్షం వెలిబుచ్చింది. ''త్వరలో వాటికి ఆకులు కూడా రానున్నాయి. అంతరిక్ష అన్వేషణ యాత్రలో అదో కీలక మైలురాయిగా నిలవనుంది''అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

స్పేడెక్స్ నుంచి పుడమి ఫొటోలు

స్పేడెక్స్ జంట ఉపగ్రహాల్లో ఒకటైన చేజర్ భూమిని తొలిసారి ఫొటోలు, వీడియోలు తీసింది. దాన్ని ఇస్రో శనివారం విడుదల చేసింది. చేజర్ 470 కి.మీ. ఎత్తున దిగువ కక్ష్యలో పరిభ్రమిస్తూ తీసిన ఈ వీడియోలో భూమి అత్యంత అందంగా కన్పిస్తోంది. ఉపగ్రహం తాలూకు అత్యంత అధునాతనమైన ఇమేజింగ్ సామర్థ్యంతో పాటు అత్యంత కీలకమైన తదుపరి దశ పరీక్షలకు దాని సన్నద్ధతకు ఈ వీడియో నిదర్శనమని ఇస్రో ఒక ప్రకటనలో పేర్కొంది. త్వరలో కీలక డాకింగ్ (ఉపగ్రహాల అనుసంధాన) పరీక్షకు చేజర్, టార్గెట్ శాటిలైట్లు సన్నద్ధమవుతున్నాయి. వీలైతే దాన్ని జనవరి 7న నిర్వహిస్తామని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ప్రకటించడం తెలిసిందే. ఈ పరీక్ష విజయవంతమైతే డాకింగ్ పరిజ్ఞానమున్న అమెరికా, రష్యా, చైనాల సరసన భారత్ సగర్వంగా చేరుతుంది. గగన్‌యాన్ మొదలుకుని పలు భావి అంతరిక్ష పరీక్షలకు డాకింగ్ పరిజ్ఞానం కీలకం కానుంది.



బాక్సులో మొలకలు వచ్చిన దృశ్యం

కులం పేరిట విషం చిమ్ముతున్నారు

ప్రతిపక్షాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం

- గ్రామీణ సంస్కృతి బలోపేతం చేసుకోవాలంటే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు
- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడి
- ఢిల్లీలో గ్రామీణ భారత్ మహోత్సవం ప్రారంభం



ఓ స్టాల్‌లో మోదీ

న్యూఢిల్లీ: ప్రతిపక్షాల తీరుపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. సొంత లాభం కోసం కులం పేరిట సమాజంలో విషం చిమ్ముతున్నాయని మండిపడ్డారు. మన గ్రామీణ సంస్కృతి, వారసత్వం, విలువలను బలోపేతం చేసుకోవాలంటే విపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలంటూ ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేయడాన్ని పరోక్షంగా తప్పుపట్టారు. సామాజిక నిర్మాణాన్ని బలహీనపర్చాలని చూస్తున్న శక్తులకు బుద్ధి చెప్పాలని అన్నారు. శనివారం ఢిల్లీలో గ్రామీణ భారత్ మహోత్సవం-2025ను ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం 2014 నుంచి గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్య సాధనలో గ్రామసీమల పాత్ర అత్యంత కీలకమని ఉద్ఘాటించారు. పల్లెలు ప్రగతి సాధిస్తేనే దేశం ముందుకెళ్తుందని స్పష్టంచేశారు. పల్లె ప్రజలకు గౌరవప్రదమైన జీవితం అందించాలన్నదే తమ ప్రభుత్వ ఆశయమని వివరించారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

గ్రోత్ సెంటర్లుగా మన గ్రామాలు


''గ్రామీణ భారతదేశాన్ని బలోపేతం చేయాలని సంకల్పించాం. ప్రజలు సాధికారత సాధించడానికి చర్యలు చేపట్టాం. పల్లెల్లో ఉపాధి అవకాశాలు పెరిగితే వలసలు తగ్గుతాయి. ఆ దిశగా కృషి చేస్తున్నాం. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నాం. గ్రామాలను గ్రోత్ సెంటర్లుగా, అవకాశాల గనిగా మార్చాలన్నదే మా లక్ష్యం. నూతన శక్తితో గ్రామాలు ప్రగతి పథంలో పరుగులు పెట్టాలి. మా ప్రభుత్వ ఉద్దేశాలు, విధానాలు, నిర్ణయాలన్నీ అందుకోసమే.

పదేళ్లుగా ఎంఎస్పీ పెంచుతున్నాం..

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా గత పదేళ్లలో రైతులకు రూ.3 లక్షల కోట్లు అందజేశాం. వ్యవసాయ రుణాల కింద ఇచ్చే సొమ్మును 3.5 రెట్లు పెంచాం. పదేళ్లుగా వివిధ రకాల పంటలకు కనీస మద్దతు ధరను పెంచుతూనే ఉన్నాం. మన ఉద్దేశాలు పవిత్రంగా ఉంటే ఫలితాలు సైతం గొప్పగా ఉంటాయి. గత పదేళ్లపాటు చేసిన కఠోర శ్రమకు తగిన ఫలితాలు ఇప్పుడు అందుతున్నాయి. ఇటీవల నిర్వహించిన సర్వే కొన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడించింది. 2011తో పోలిస్తే ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం మూడు రెట్లు పెరిగింది. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతోంది. ఖర్చు వెనుకాడకుండా ఇష్టమైన వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఆదాయంలో 50 శాతానికిపైగా సొమ్మును కేవలం ఆహారం కోసం ఖర్చు చేసే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అది 50 కంటే తక్కువ శాతానికి తగ్గిపోయింది'' అని ప్రధాని మోదీ అన్నారు.

గ్రామీణ పేదరికం 5 శాతమే

''మెజార్టీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు గ్రామాల్లోనే నివసిస్తున్నారు. గత ప్రభుత్వాలు వారిని విస్మరించాయి. దాంతో గ్రామాల నుంచి వలసలు పెరిగాయి. పేదరికం పెరిగింది. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి చాలావరకు మారిపోయింది. 2012లో గ్రామీణ పేదరికం 26 శాతం ఉండగా, 2024 నాటికి అది 5 శాతానికి పడిపోయినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్యయనంలో తేలింది. కొన్ని పార్టీలు, వ్యక్తులు పేదరిక నిర్మూలన అంటూ దశాబ్దాలపాటు నినాదాలు చేశారు. కానీ, వారు సాధించింది ఏమీ లేదు. పేదరికం నిజంగా తగ్గిపోవడాన్ని మనం ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం'' అని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.



చంద్రుడికి సమీపంలో కనిపిస్తున్న శుక్రుడు, శని

ఆకాశంలో అద్భుతం

చంద్రుడికి చేరువలో కనిపించిన శుక్రుడు, శని

న్యూఢిల్లీ: అంతరిక్షంలో కనువిందైన దృశ్యం కనిపించింది. అత్యంత ప్రకాశవంతమైన గ్రహం శుక్రుడు, భారీ వలయంతో కూడిన గ్రహం శని మన చందమామకు చాలా చేరువలో కనిపించాయి. శనివారం రాత్రి 8.30 గంటలకు ఈ అద్భుతాన్ని జనం వీక్షించారు. ఇండియాతోపాటు యూకే, అమెరికా, చైనా, తుర్కియే తదితర దేశాల్లో ఎలాంటి పరికరాలు అవసరం లేకుండానే ఇది కంటికి కనిపించడం విశేషం. బైనాక్యులర్స్ లేదా టెలిస్కోప్ ఉన్నవారు మరింత స్పష్టంగా చూడగలిగారు. ముఖ్యంగా శని గ్రహం చుట్టూ ఉన్న వలయాన్ని ఆసక్తిగా గమనించారు. అంతరిక్షంలో ఇలాంటి అద్భుతాలు చాలా అరుదుగా సంభవిస్తుంటాయని సైంటిస్టులు చెప్పారు. ఈ నెల 18వ తేదీన మళ్లీ ఇలాంటి దృశ్యం వీక్షించవచ్చని సూచించారు.



ఖనౌరీలో శనివారం జరిగిన మహా పంచాయత్ వేదికపై స్ట్రెచర్‌పై నుంచే మాట్లాడుతున్న రైతు నేత దల్లేవాల్

ఎంఎస్పీ పంజాబ్‌కే కాదు.. దేశమంతటికీ అవసరమే

- కేంద్ర ప్రభుత్వానికీ విషయం తెలిసేలా చేయండి
- నిరశన దీక్ష చేస్తున్న రైతు నేత దలేవాల్ సందేశం

చండీగఢ్: పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కు చట్టబద్ధత కేవలం పంజాబ్‌కే కాదు, దేశంలోని రైతులందరికీ అవసరమేనని నిరాహార దీక్ష చేస్తున్న పంజాబ్ రైతు నేత జగ్జీత్ సింగ్ దలేవాల్(70) పేర్కొన్నారు. ఈ విషయం కేంద్రానికి తెలిసేలా చేయాలన్నారు. ఈ పోరాటంలో పాల్గొనేందుకు ఇతర రాష్ట్రాల రైతులు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పంజాబ్-హరియాణా సరిహద్దుల్లోని ఖనౌరీ వద్ద దలేవాల్ చేపట్టిన దీక్షకు శనివారంతో 40 రోజులు పూర్తయ్యాయి. దీన్ని పురస్కరించుకుని ఖనౌరీలో ఏర్పాటైన 'కిసాన్ మహాపంచాయత్'నుద్దేశించి దలేవాల్ మాట్లాడారు. కార్యక్రమ వేదికపైకి దలేవాల్‌ను స్ట్రెచర్‌పై తీసుకువచ్చారు. బెడ్‌పై పడుకుని సుమారు 11 నిమిషాలపాటు మాట్లాడారు. 'ఎంఎస్పీ పంజాబ్ రైతులకు మాత్రమే దేశమంతటికీ అవసరమే. ఎంఎస్పీకి గ్యారెంటీ సహా మనం చేస్తున్న డిమాండ్లు సాధారణమైనవి కావన్న విషయం నాకు తెలుసు. వీటిని సాధించుకోవడం ఏ ఒక్కరి వల్లో అయ్యే పనికాదు కూడా. ఇప్పటి ఆందోళనల్లో రెండు రైతు సంఘాలు మాత్రమే పాలుపంచుకుంటున్నాయి. పంజాబ్ ఈ పోరాటాన్ని ముందుండి నడిపిస్తోంది. ఇతర రాష్ట్రాల రైతులు కూడా ఈ పోరులో పాల్గొనాలి. ఇది కేవలం పంజాబ్ డిమాండ్ మాత్రమే కాదు, యావద్దేశానిది. అనే సందేశాన్ని కేంద్రానికి వినిపించేలా చేయాలని చేతులు జోడించి వేడుకుంటున్నా' అని ఆయన పేర్కొన్నారు. 'మనం గెలుస్తామనే విశ్వాసం నాకుంది. బల ప్రయోగం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా మనల్ని మాత్రం ఓడించలేదు. నాకేమైనా పట్టించుకోను. మళ్లీ రైతులు ఆత్మహత్యలకు పాల్పడే అవసరం రాకూడదనే నా ప్రయత్నమంతా'అని వివరించారు. 'దలేవాల్ ప్రాణాలు ముఖ్యమని సుప్రీంకోర్టు అంటోంది. నేనూ మనిషిని సరే, దేశవ్యాప్తంగా బలవన్మరణాలకు పాల్పడిన 7 లక్షల మంది సంగతేమిటని గౌరవ సుప్రీంకోర్టును అడుగుతున్నా'అని దలేవాల్ అన్నారు.

సమస్య వస్తే పరిష్కారానికి సిద్ధం

చైనా వైరస్‌పై కేంద్రం ప్రకటన

న్యూఢిల్లీ: చైనాలో హ్యూమన్ మెటానిమో వైరస్(హెచ్ఎంపీవీ) ప్రబలుతోందన్న అంతర్జాతీయ మీడియా కథనాలతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఒకవేళ వైరస్ భారత్‌లో వ్యాప్తి చెంది మరింత విజృంభిస్తే చేపట్టాల్సిన చర్యలపై ముందస్తుగా సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈమేరకు శనివారం ఢిల్లీలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో సంయుక్త సమీక్ష బృందం సమావేశమై భారత్‌లో ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, వ్యాధులను ఎదుర్కొనే సన్నద్ధతపై సమీక్ష జరిపింది. శ్వాస సంబంధ వ్యాధుల వ్యాప్తి కట్టడికి సిద్ధంగా ఉన్నామని ఆ తర్వాత కేంద్ర ఆరోగ్య ప్రభుత్వం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ''ఫ్లూ వ్యాధులు ప్రబలే ప్రస్తుత సీజన్‌లో చైనా ఇప్పుడున్న పరిస్థితి సాధారణమే. ఈ సీజన్‌లో ఇన్‌ఫ్లూయెంజా వైరస్, ఆర్ఎస్‌వీ, హెచ్ఎంపీవీలు వ్యాప్తిచెందడం మామూలే. ఈ వ్యాధికారక వైరస్‌లో ప్రస్తుత సీజన్‌లో భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే సోకుతున్నాయి. సీజన్‌లో కనిపించే సంఖ్యతో పోలిస్తే ఇటీవలి కాలాల్లో అత్యధికంగా సోకిన దాఖలాలు లేవు''అని ఆరోగ్య శాఖ వెల్లడించింది.

అజ్మీర్ దర్గాకు మోదీ ఛాదర్

అజ్మీర్: రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ప్రఖ్యాత ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ దర్గాకు ప్రధాని మోదీ ఛాదర్ సమర్పించారు. మోదీ తరఫున కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్వయంగా శనివారం దర్గాలో ఛాదర్‌ను అందజేశారు.

శిక్షాకాలం లేకుండా తీర్పిస్తా

నీలిచిత్రాల తారకు అనైతిక చెల్లింపుల కేసులో ట్రంప్‌కు శిక్షపై జడ్జి




జడ్జి మర్చన్

న్యూయార్క్: అమెరికా రాజకీయ చరిత్రలో గతంలో ఎన్నడూ కనివినీ ఎరుగని వింత ఘట్టానికి న్యాయమూర్తి జువాన్ ఎం.మర్చన్ తెరలేపారు. క్రిమినల్ కేసులో దోషిగా తేలిన వ్యక్తిని శిక్షిస్తానంటూనే శిక్షాకాలం విధించబోనని చెప్పి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణంచేయడానికి సరిగ్గా పది రోజుల ముందు జనవరి పదో తేదీ ఉదయం 9.30 గంటలకు సంబంధిత తీర్పు చెప్తానని జడ్జి ప్రకటించారు. నీలిచిత్రాల తార స్టార్మీ డేనియల్‌కు అనైతిక నగదు చెల్లింపుల కేసులో దోషిగా తేలిన ట్రంప్‌కు పదో తేదీన శిక్ష ఖరారుచేస్తానని శుక్రవారం న్యూయార్క్‌లోని మాన్‌హట్టన్ కోర్టు జడ్జి వెల్లడించారు. ''కారాగారంలో జైలుశిక్ష అనుభవించాల్సిన అవసరంలేకుండా ట్రంప్‌ను బేషరతుగా వదిలేస్తూ, కేసుకు ముగింపు పలుకుతూ తీర్పు రాస్తా. అన్‌కండీషనల్ డిశ్చార్జ్ తీర్పు వినేందుకు ట్రంప్ కుదిరితే ప్రత్యక్షంగా లేదంటే వర్చువల్‌గా కోర్టు ఎదుట హాజరవ్వాల్సి ఉంటుంది. ట్రంప్‌కు ఎలాంటి ప్రొబేషన్ పిరియడ్, జరిమానా విధించబోను''అని జడ్జి చెప్పారు. గతంలో తనతో శృంగారం జరిపిన విషయం ఎవరికీ చెప్పకుండా దాచేందుకు స్టార్మీ డేనియల్‌కు ట్రంప్ తన లాయర్ ద్వారా 2016 ఏడాదిలో 1,30,000 డాలర్లు ఇచ్చారు. ఈ నగదును లెక్కల్లో తప్పుగా చూపారు. ఈమెకు నగదు ఇచ్చిన విషయాన్ని దాచి ఆ నగదును ఎన్నికల జమా ఖర్చు కింద మార్చిరాశారు. ఈ అనైతిక చెల్లింపును 'హష్ మనీ'గా పేర్కొంటారు. ఎన్నికల విరాళాలను ఇలా అక్రమంగా దుర్వినియోగం చేశారని ట్రంప్‌పై కేసు నమోదైంది. ఈ కేసులో 34 అంశాల్లో ట్రంప్ దోషిగా తేలిన విషయం విదితమే. జూలై 11వ తేదీనే ట్రంప్ కేసు ముగింపుకొచ్చినా అధ్యక్షునిగా గెలిచిన వ్యక్తికి క్రిమినల్ కేసు విచారణ నుంచి మినహాయింపు ఉంటుందంటూ ట్రంప్ న్యాయవాదులు ఇన్నాళ్లు వాదిస్తూ వచ్చారు. ఎట్టకేలకు ఇవన్నీ చెల్లవంటూ న్యాయమూర్తి తన తీర్పున వెలువరించేందుకు సిద్ధమయ్యారు. క్రిమినల్ కేసులో దోషిగా తేలి శిక్షను ఎదుర్కోబోతున్న మొట్టమొదటి అమెరికా మాజీ, కాబోయే అధ్యక్షుడిగా ట్రంప్ చరిత్రలో నిలవబోతున్నారు. తీర్పు వచ్చాక న్యూయార్క్ చట్టాల ప్రకారం ట్రంప్ తన డీఎన్ఏ శాంపిల్‌ను రాష్ట్ర నేర డేటాబ్యాంక్‌కు అందించాల్సి ఉంటుంది. ఒకవేళ ట్రంప్‌కు జడ్జి శిక్ష విధిస్తే పదిరోజుల తర్వాత అధ్యక్షుడి హోదాలో తనకు తాను క్షమాభిక్ష ప్రసాదించుకునే అవకాశం ట్రంప్ లేదని అమెరికా రాజ్యాంగం చెబుతోంది. దేశ స్థాయిలో శిక్షలకు మాత్రమే అధ్యక్షుడు క్షమాభిక్ష ప్రసాదించగలడు. న్యూయార్క్ రాష్ట్ర కోర్టు ఇచ్చే తీర్పులకు ఇది వర్తించదు.

దిగ్గజ శాస్త్రవేత్త చిదంబరం కన్నుమూత

భారత అణు కార్యక్రమంలో కీలక పాత్ర



న్యూఢిల్లీ: ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, భారత అణ్వస్త్ర పరీక్షల్లో కీలక భూమిక పోషించిన శాస్త్రజ్ఞుడు డాక్టర్ రాజగోపాల చిదంబరం తుదిశ్వాస విడిచారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం తెల్లవారుజామున 3.20 గంటలకు ముంబైలోని జస్‌లోక్ ఆస్పత్రిలో కన్నుమూశారని అణు శక్తి మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 88 ఏళ్ల చిదంబరం 1974లో, 1998లో భారత్ చేపట్టిన అణు పరీక్షల్లో ప్రధాన పాత్ర పోషించారు. చిదంబరం మృతి వార్త తెల్సి ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ''భారత అణు కార్యక్రమ పితామహుల్లో ఒకరైన చిదంబరం దేశ శాస్త్రసాంకేతికత, వ్యూహాత్మక శక్తిసామర్థ్యాల మెరుగు కోసం అవిశ్రాంతంగా కృషిచేశారు. ఆయన చేసిన సేవలను యావత్ భారతావని, భవిష్యత్ తరాలు చిరకాలం గుర్తుంచుకుంటాయి''అని మోదీ అన్నారు. భారత ప్రభుత్వానికి ప్రధాన శాస్త్రీయ సలహదారుగా 17 సంవత్సరాలపాటు కీలక సేవలు అందించారని శాస్త్రసాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ స్మరించుకున్నారు. ఆయన అసాధారణ శాస్త్రీయ మేధస్సు భారతదేశానికి ఎంతో సాయపడిందని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే అన్నారు.

అణు భౌతిక శాస్త్రంలో కృషి

1936 నవంబర్ 12నలో తమిళనాడులోని చెన్నైలో జన్మించిన చిదంబరం మీరట్‌లోని సనాతన్ ధర్మ్ పాఠశాలలో, చెన్నైలోని మైలాపూర్ స్కూల్‌లో చదువుకున్నారు. తర్వాత చెన్నైలోని ప్రెసిడెన్సీ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. బెంగళూరులో ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పీజీ చదివారు. అణుకార్యక్రమాల్లో పాల్గొంటూనే దాదాపు 60 సంవత్సరాలపాటు ప్రభుత్వంలో వేర్వేరు హోదాల్లో పనిచేసే అరుదైన వ్యక్తి చిదంబరం. 1962లో బాబా అణు పరిశోధనా కేంద్రం(బార్క్)లో చేరి అంచెలంచెలుగా ఎదిగి ఆ తర్వాత 1990లో బార్క్‌కు చైర్మన్ అయ్యారు. 1990-1993వరకు చైర్మన్‌గా ఉన్నారు. 1993-2000 కాలంలో కేంద్ర అణుఇంధన మంత్రిత్వశాఖకు కార్యదర్శిగా కొనసాగారు. 2001-2018 కాలంలో భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారుగా ఉన్నారు. అంతర్జాతీయ అణుఇంధన సంస్థ(ఐఏఈఏ) గవర్నర్ల బోర్డ్‌కు 1994-95కాలంలో చైర్మన్‌గా సేవలందించారు.

సొంతంగా ప్లుటోనియం తీసుకొచ్చి..

1967 నుంచి భారత అణుపరీక్షలకు సంబంధించి ప్రాజెక్టుల్లో పనిచేయడం మొదలెట్టారు. 1974లో భారత్ తొలిసారిగా ఆపరేషన్ స్మైలింగ్ బుద్ధ పేరిట అణుపరీక్షలు చేపట్టింది. ఆ మిషన్‌లో అణుశాస్త్రవేత్తగా కీలక భూమిక పోషించారు. ముంబై నుంచి ప్లుటోనియంను ఈయనే స్వయంగా రాజస్తాన్‌లోని పోఖ్రాన్‌కు తీసుకొచ్చారు. 1998లో ఆపరేషన్ శక్తిపేరిట పోఖ్రాన్-2 అణుపరీక్షల సమయంలోనూ చిదంబరం న్యూక్లియర్ ఎనర్జీ బృందానికి సారథ్యం వహించారు. నాటి రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) చైర్మన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్‌తో కలిసి పోఖ్రాన్ అణుపరీక్షను స్వయంగా పర్యవేక్షించారు. ఆనాడు 1998 మే 11 నుంచి మే 13వ తేదీ వరకు ఐదుసార్లు అణుపరీక్షలు జరిగాయి. దేశం కోసం అవిశ్రాంతంగా కృషిచేసినందుకు గుర్తింపుగా ఆయనకు భారత ప్రభుత్వం 1975లో పద్మ శ్రీతో, 1999లో పద్మవిభూషణ్‌తో సత్కరించింది. దేశవ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్‌లనూ పొందారు. జాతీయ, అంతర్జాతీయ సైన్స్ అకాడమీల్లో సభ్యునిగా ఉన్నారు. ఎందరో యువ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ఈయన స్ఫూర్తిదాతగా నిలిచారు. చిదంబరంకు భార్య చెల్లా, కుమార్తెలు నిర్మల, నిత్య ఉన్నారు.


116 ఏళ్ల మహిళ ఇక లేరు



టోక్యో: ప్రపంచంలోనే అత్యధిక కాలం జీవించిన వ్యక్తిగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కిన జపాన్ బామ్మ టొమికో ఇటూకా 116 ఏళ్ల వయస్సులో కన్నుమూశారు. హ్యోగో ప్రిఫెక్చర్‌లోని ఆషియా నగరంలోని వృద్ధాశ్రయంలో డిసెంబర్ 29వ తేదీన ఆమె తుదిశ్వాస విడిచారని జపాన్ ప్రభుత్వ వృద్ధుల వ్యవహారాల పర్యవేక్షణ విభాగం అధికారి యోషిట్సుగు నగటా చెప్పారు. అరటి పండ్లు, జపాన్ పానీయం కల్పిస్‌ను అమితంగా ఇష్టపడే ఇటూకా 1908 మే 23వ తేదీన ఒసాకాలో జన్మించారు.హైస్కూల్లో చదువుకునేటప్పుడు వాలీబాల్ ప్లేయర్. సుమారు 3,067 మీటర్ల ఎత్తున్న ఒంటాకె పర్వతాన్ని రెండుసార్లు అధిరోహించారు. ఆమెకు 20 ఏళ్లప్పుడు పెళ్లయింది. ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు కలిగారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో భర్త సారథ్యంలోని దుస్తుల ఫ్యాక్టరీని నడిపారు. భర్త 1979లో చనిపోయినప్పటి నుంచి ఒంటరిగానే ఉంటున్నారు. ప్రస్తుతం ఇటూకాకు ఒక కుమార్తె, ఒక కుమారుడు, ఐదుగురు మనవలు ఉన్నారు. కాగా, గతేడాది ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలు 117 ఏళ్ల మరియా బ్రన్యాస్ మరణించడంతో ఆమె స్థానంలో ఇటూకాను అత్యంత ఎక్కువ కాలం జీవించిన వ్యక్తిగా గెరంటాలజీ రీసెర్చ్ గ్రూప్ ప్రకటించారు. తాజాగా ఇటూకా కన్నుమూయడంతో ఆమె కంటే 16 రోజులు మాత్రమే చిన్నదైన బ్రెజిల్‌కు చెందిన సన్యాసిని ఇనాహ్ కనబర్రోను ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా పరిగణిస్తామని గెరంటాలజీ రీసెర్చ్ గ్రూప్ తెలిపింది.

వాడుకుని వదిలేస్తున్నారు

- అధికార పార్టీలోకి దూకేస్తున్నారు
- ప్రస్తుత రాజకీయాలపై గడ్కరీ అసహనం



పుణె: క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతూనే కేంద్ర రోడ్డురవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ పాలిటిక్స్‌పై పదునైన విమర్శలు చేశారు. చాలా మంది నేతలు సొంత పార్టీని వాడుకుని వదిలేస్తున్నారని, అధికార పార్టీలోకి వలసపోతున్నారని ఆయన అసహనం వ్యక్తంచేశారు. శనివారం పుణెలో మరాఠా సే వా సంఘం నిర్వహించిన ఓ కార్యక్రమంలో గడ్కరీ పాల్గొని ప్రసంగించారు. ''అ ధికార పగ్గాలు చేపట్టిన పార్టీలోకి చాలా మంది నేతలు చేరిపోతున్నారు. వీళ్లకు సొంత పార్టీ మీద విధేయత ఏమైనట్లు?. మన దేశంలో నేతలకు ఆదర్శాలు బాగానే ఉన్నాయి. కానీ వాటి ఆచరణలో పెట్టడమే కరువైంది''అని అన్నారు.

కుటుంబం పట్టదుగానీ దేశసేవ చేస్తాడట

గతంలో తన దగ్గరికి వచ్చిన ఒక వ్యక్తి గురించి గడ్కరీ వెల్లడించారు. ''ఒకాయన నా దగ్గరికి వచ్చి పార్టీలో చేరతా, దేశసేవ చేస్తా అన్నాడు. ఆయన వ్యాపారంలో నష్టపోయి దివాలా తీసే స్థాయికొచ్చాడు. ఇంట్లో భార్యాపిల్లలున్నారు. నేనొక్కటే చెప్పా. ముందు కుటుంబ బాగోగులు చూసుకో. ఆ తర్వాతే దేశసేవ అని చెప్పి పంపేశా''అని గడ్కరీ చెప్పుకొచ్చారు.

వాహనం లోయలో పడి నలుగురు జవాన్లు మృతి

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని బందిపార జిల్లాలో ఆర్మీ ట్రక్కు లోయలో పడిన ఘటనలో నలుగురు జవాన్లు అసువులు బాయగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం మధ్యాహ్నం కొండప్రాంత సదర్‌కూట్ పయెన్ సమీపంలోని మలుపు వద్ద సైనిక వాహనం రోడ్డుపై నుంచి జారి దొర్లుకుంటూ లోయలో పడిందని ఆర్మీ అధికారులు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. అనుకూల వాతావరణం, మంచు కారణంగా దృగ్గోచరత సరిగా లేకపోవడమే ప్రమాదానికి కారణమని వెల్లడించారు. గతేడాది డిసెంబర్ 24న పూంచ్ జిల్లాలో ఆర్మీ వాహనం లోయలో పడి ఐదుగురు జవాన్లు మరణించడం తెలిసిందే.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 5 । జనవరి । 2025



పరిచయం పెంచుకొని..
సామాజిక మాధ్యమంలో పరిచయం పెంచుకొని అందిన కాడికి దండుకుంటున్న ముగ్గురు సైబర్ ఎక్స్‌టార్షన్ నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

-8లో



నేతి పూరీ.. నోరు ఊరి..
పాతబస్తీలో స్వచ్ఛమైన వెజిటేరియన్ వంటలు అందుబాటులో ఉన్నాయి. ఆహార ప్రియుల నోరూరించే నేతిపూరీలకు ఇవి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి.

- సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30.0/13.0
నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 30.. కనిష్టంగా 13 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

కేబీఆర్ పార్కు వార్షిక ఎంట్రీ ఫీజు పెంపు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కాసు బ్రహ్మానందరెడ్డి జాతీయ వనం (కేబీఆర్ పార్కు) వార్షిక ఎంట్రీ పాస్ ఫీజును పెంచుతూ అటవీ శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నోటీసులు అంటించారు. కేబీఆర్ పార్కు వార్షిక ఎంట్రీ పాస్ జనరల్ కేటగిరీ రూ.3,500 (గత ఏడాది రూ.3,100), సీనియర్ సిటిజన్స్‌కు రూ.2,500 (గత ఏడాది రూ.2,100) పెంచారు. పాతశాల వార్షిక ఎంట్రీ పాస్‌లను ఆన్‌లైన్‌లో రెన్యువల్ చేసుకోవాలి. ఈ నెల 31వ తేదీ వరకు పాస్‌లు ఉన్న వాకర్లంతా తమ పాస్‌లను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రెన్యువల్ కోసం వెబ్‌సైట్ www.kbrnp.in లో రెన్యువల్ చేసుకోవాలి. ఆన్‌లైన్ రెన్యువల్ చేసుకున్న తర్వాత 30 పని దినాల అనంతరం తమ పాస్‌లను పార్కు గేటు వద్ద కలెక్ట్ చేసుకోవచ్చు. పేమెంట్ చేసేటప్పుడు ఫెయిలైతే తిరిగి చేయవద్దు. ఆఫీసులో చెక్ చేసుకోవాలి. ఈఏడాది జనవరి 1 నుంచి పార్కుకు వచ్చే సందర్శకులు, వాకర్లకు రోజువారీ ఫీజులు కూడా భారీగా పెంచారు. పెద్దలకు రూ.50, పిల్లల కు రూ.30, నెలవారీ పాస్‌లు రూ.1000కి పెంచారు.

సోమవారాల్లో హైడ్రా ప్రజావాణి

సాక్షి, సిటీబ్యూరో: చెరువులు. నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, పునరుద్ధరణతో పాటు ప్రకృతీ వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు అండగా నిలబడి సహాయ సహకారాలు అందించేందుకు ఉద్దేశించిన హైడ్రా ఇప్పుడు ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించడానికి సిద్ధమైంది. ఇక నుంచి ప్రతీ సోమవారం (ప్రభుత్వ సెలవులు మినహాయించి) ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులతో పాటు సలహాలను కూడా స్వీకరించడానికి ఈ కార్యక్రమాన్ని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు రాణిగంజ్‌లోని బుద్ధభవన్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఫిర్యాదుకు సంబంధించిన అన్ని ఆధార పత్రాలతో పాటు పూర్తి వివరాలు తీసుకుని కార్యాయానికి రావాలని హైడ్రా కమిషనర్ సూచించారు. మరిన్ని వివరాలకు 040-29565758, 29560596 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

సేవా సంస్థలకు ప్రభుత్వ సహకారం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



మైలార్‌దేవ్‌పల్లి: కుల మతాలకతీతంగా సేవలు అందిస్తున్న సామాజిక సంస్థలకు ప్రభుత్వ సహకారం ఉంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం గగన్‌పహాడ్‌లోని సిటాడెల్ కన్వెన్షన్‌లో 30వ అంతర్జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. సామాజిక పరివర్తన కోసం ఎటువంటి లాభాపేక్ష లేకుండా మహావీర్ జైన్ సంస్థ పని చేయడం అభినందనీయమన్నారు. చిన్నారులు, మహిళల సాధికారత కోసం, వైద్య సహకారం.. అవసరమైన వారికి మహావీర్ సంస్థ ఉచిత సేవలు ఎంతో శ్లాఘనీయమన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా మొదటి సంవత్సరం 19 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇప్పటికే స్వయం సహాయక సంఘాలకు అందించినట్లు మంత్రి తెలిపారు. ఉచితంగా నాణ్యమైన విద్యను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి రూ. 5 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. నిరుపేదలు రూపాయి కూడా చెల్లించకుండా ఉచితంగా వైద్య సహాయం అందిస్తున్నట్లు వివరించారు. దేశరాజధాని ఢిల్లీలో విపరీతమైన కాలుష్యం మూలంగా నివాసానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆ పరిస్థితులు హైదరాబాద్‌లో తలెత్తకుండా క్లీన్‌అండ్ గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. నగర అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కార్యక్రమంలో మహావీర్ జైన్ సంస్థ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ సతీమణి ఇందిర మృతి తీరని లోటు: సీఎం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన ప్రముఖ ఉద్యమకారుడు, దివంగత ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ సతీమణి ఇందిర మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్వరాష్ట్ర సాధన పోరులో, హక్కుల ఉద్యమాల్లో ప్రొఫెసర్ జాదవ్‌కు అన్ని విధాలా ఆమె అండగా నిలిచారని, ఆయనతో కలిసి నడిచారని చెప్పారు. ఆమె త్యాగాలు ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయని పేర్కొన్నారు. 2018లో జాదవ్ కన్నుమూశారని, ప్రస్తుతం ఆయన సతీమణి ఇందిరను కూడా కోల్పోవడం తెలంగాణ సమాజానికి తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు.



ముగ్గూ మురిపెం!

తీరొక్క రంగవల్లులతో ధరిత్రికి కొత్తందాలు తీసుకొచ్చారు. సంక్రాంతి పండగ సమీపిస్తున్న వేళ ముత్యాల ముగ్గులు మురిపించాయి. కుత్బుల్లాపూర్ గాజుల రామారం డివిజన్ చిత్తారమ్మదేవి నగర్‌లోని ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్ సౌజన్యంతో 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు కన్నుల పండువగా జరిగాయి. రంగవల్లులతో మహిళలు అలరించారు.





ఆపరేషన్ @ సీవరేజీ పైపులైన్

స్పెషల్ డ్రైవ్‌లో కాలం చెల్లిన పైపులైన్ల గుర్తింపు
- పాతవాటి స్థానంలో కొత్తవి
- 15 కిలో మీటర్ల మేర ప్రతిపాదనలు
- ఈ నెలాఖరులోగా పనుల మంజూరు



సీవరేజీ కొత్త పైప్‌లైన్ ప్రతిపాదనలు ఇలా	
డివిజన్	కి.మీ
డివిజన్- 17	5.7
డివిజన్- 2	3.1
డివిజన్ -5	1.4
డివిజన్-9	1.1

జలమండలి పరిధిలో మొత్తం సీవరేజీ నెట్‌వర్క్ ఇలా..	
ఏరియా	కి.మీ
కోర్‌సిటీలో పైపులైన్	5,570
జీహెచ్‌ఎంసీ పరిధిలో పైపులైన్	4,199
ట్రంక్ లైన్	612

సాక్షి, సిటీబ్యూరో: మురుగు రహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిదేందుకు చేపట్టిన తొలి 90 రోజులు సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించిన కాలం చెల్లిన పైపులైన్ల స్థానంలో కొత్తవి వేసేందుకు జలమండలి యుద్ధ ప్రాతిపదికన చర్యలకు ఉపక్రమించింది. స్పెషల్ డ్రైవ్‌లో మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ డీసిల్టింగ్ చేయడంతో పైసా ఖర్చు లేకుండా.. పైపులైన్ల రీ మోడలింగ్ జరగకుండానే దీర్ఘకాలిక సీవరేజీ సమస్యలకు ఫుల్‌స్టాప్ పడింది. మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం పైపులైన్ల రీ మోడలింగ్, కొత్త వాటి అవసరాలను గుర్తించింది. మొత్తమ్మీద స్పెషల్ డ్రైవ్‌లో క్షేత్రస్థాయి నుంచి సుమారు 15 కిలోమీటర్ల మేర కొత్త పైపులైన్ల ప్రతిపాదనలు అందాయి. మొత్తమ్మీద మియాపూర్, పాతబస్తీ, నారాయణగూడ, కూకట్‌పల్లి డివిజన్లలో కిలో మీటర్ నుంచి ఆరు కిలో మీటర్ల వరకు ప్రతిపాదనలు రాగా.. మిగతా డివిజన్ల నుంచి కిలోమీటర్ల లోపు ప్రతిపాదనలు వచ్చినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

2,200 కిలో మీటర్ల పైపులైన్ క్లీనింగ్..
తొలి 90 రోజుల్లో సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో సుమారు 2,200 కిలో మీటర్ల పైపులైన్ మార్గంలో డీసిల్టింగ్ నిర్వహించారు. దీంతో దాదాపు 1.75 లక్షల మ్యాన్‌హోళ్ల ద్వారా పూడికతీత పనులు జరిగాయి వాటి నుంచి టన్నులకొద్దీ సిల్ట్ బయటపడింది. సీవరేజీ ఫిర్యాదులు కూడా 30 శాతానికి తగ్గాయి. స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలు ఇవ్వడంతో మరో 90 రోజులు పొడిగించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో కూడా మ్యాన్‌హోల్ టు డీ సిల్టింగ్ నిర్వహిస్తూ పైపులైన్ల పరిస్థితిపై దృష్టి సారించనున్నారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు



తొలి 90 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో కొన్ని ప్రాంతాల్లో పాత పైపులైన్ స్థానంలో కొత్తవి, మరికొన్ని ప్రాంతాల్లో కొత్తవాటి అవసరాన్ని గుర్తించాం. త్వరలో వాటికి మంజూరు ఇచ్చి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతాం. వంద శాతం మురుగు రహిత నగరంగా మార్చేందుకు అడుగులు వేస్తున్నాం.

– అశోక్ రెడ్డి, జలమండలి ఎండీ

డోకొచ్చేలా.. కేకులు

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఎక్కడ తనిఖీలు చేసినా కల్తీ, అపరిశుభ్రత, బొద్దింకలు, ఎలుకల సంచారం, ఇతరత్రా పలు అవాంఛనీయ పరిస్థితులే కనిపిస్తున్నాయి. హోటళ్లు, స్వీట్ షాపులు, చికెన్ మార్కెట్లతో పాటు ఆఖరికి కేకుల దుకాణాల్లోనూ డోకొచ్చే పరిస్థితులే కనిపించాయి. సికింద్రాబాద్ జోన్‌లోని అల్వాల్, కార్ఖానా ప్రాంతాల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో లోపాలు బయల్పడ్డాయి. అల్వాల్‌లోని మచ్చబొల్లారం మాంగినీస్ కేక్ షాప్‌లో కేకుల తయారీ ప్రాంతాల్లో గుంపుగా సంచరిస్తున్న బొద్దింకలు, స్టోరేజీ ప్రాంతాల్లో ఎలుకల పెంటికలు దర్శనమిచ్చాయి. కేకుల తయారీకి వినియోగించే పాత్రలు అపరిశుభ్రంగా ఉన్నాయి. కోల్డ్ రూమ్‌లోని ఏసీ లీకేజీతో గదిలోని ట్రేలలో ఉన్న ఆహార పదార్థాలు కలుషితమయ్యే పరిస్థితులు కనిపించాయి. కేసర్ సిరప్, పైనాపిల్, వెనీలా ఫ్లేవర్లు, ఇతరత్రా పదార్థాలు గడువు ముగిసిపోవడం గుర్తించారు. పలు ఆహార పదార్థాలు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో అపరిశుభ్రంగా కనిపించాయి. రవాణాకు వినియోగించే ఏడు చిల్లర్ వాహనాలకు లైసెన్సుల్లేవు. ఇక సిబ్బంది ఆరోగ్య పరీక్షల వివరాలు, శిక్షణ పొందిన సర్టిఫికెట్లు లేవు. కార్ఖానాలోని వాక్స్ పేస్ట్రీస్ (బేకరీ)లోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. సిబ్బంది వైద్య పరీక్షల రిపోర్టుల్లేవు.

కేకుల తయారీలో ఆల్కహాల్..
ఎక్సైజ్ అనుమతి లేకుండా ప్లమ్ కేక్ తయారీలో ఆల్కహాల్ (రమ్) వినియోగిస్తుండటం కనిపించింది. కేకుల డబ్బాలపైనా ఆల్కహాల్ వినియోగించినట్లు వివరాల్లేవు. వంట పాత్రలు అధ్వానంగా ఉన్నాయి. కేకుల తయారీలో వినియోగించేందుకు భారీ మొత్తంలో తయారు చేసిన డ్రైఫ్రూట్స్, జామ్ మిక్స్‌ల పల్ప్‌ను ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేశారు. దీన్ని ఆర్నెల్ల వరకు వినియోగించవచ్చని నిర్వాహకులు చెప్పినప్పటికీ ఎప్పుడు తయారు చేసింది, ఎప్పటిలోగా వినియోగించవచ్చో వివరాల్లేవు. బేకరీలో తయారు చేసిన ప్లమ్‌కేక్స్, బిస్కెట్లు, బ్రెడ్, తదితర ఆహార పదార్థాల ప్యాకెట్ల లేబుల్స్‌పై ప్రదర్శించాల్సిన సమాచారం లేదు. ఎఫ్‌ఎస్ఎస్ఏఐ లైసెన్సు, తయారీ కేంద్రం చిరునామా, వెజ్/నాన్ వెజ్ లోగో వంటివి లేవు. తయారీలో వినియోగించిన పదార్థాలు, వాటి పోషక విలువలు, బ్యాచ్‌నెంబర్ వంటి వివరాల్లేవు. ఆహార పదార్థాలు, కెమికల్స్ వంటి పదార్థాలు, సగం వండిన వెజ్, నాన్ వెజ్ పదార్థాలు కలగలిపి నిల్వ చేశారు. ఫ్రిజ్‌లలోని కొన్ని పదార్థాలకు మూతలు లేవు, లేబుల్స్ లేవు. తగిన టెంపరేచర్‌తో నిర్వహించడం లేదు. ఇలా పలు లొసుగులు బయటపడ్డాయి. శుక్రవారం తనిఖీలు నిర్వహించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఈ వివరాల్ని శనివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.





అపరిశుభ్రంగా కేక్.. షాపులో కనిపించిన ఆల్కహాల్




కలుషితమయంగా ట్రేలు

తల్లి మృతి.. తట్టుకోలేక కుమారుడి ఆత్మహత్య

రెండు రోజులుగా గదిలోనే మృతదేహాలు
- దుర్వాసన రావడంతో వెలుగులోకి ఘటన



లక్ష్మి మృతదేహం



అభినయ్ (ఫైల్)

అడ్డగుట్ట: కన్నతల్లి మృతిని తట్టుకోలేక ఓ కుమారుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన లాలాగూడలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రఘు బాబు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేటలోని వినోభానగర్‌కు చెందిన లక్ష్మి (52), అభినయ్ (20) తల్లీకొడుకులు. వీరిద్దరు ఎనిమిదేళ్లుగా అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. లక్ష్మి కేన్సర్ పేషెంట్ కావడంతో ఇంట్లోనే ఉంటోంది. అభినయ్ డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. తల్లి మందుల ఖర్చు, కాలేజీ ఫీజు కోసం అభినయ్ ఏదో ఒక పని చేస్తుండేవాడు. శనివారం మధ్యాహ్నం వీరు నివాసముంటున్న ఇంట్లోంచి దుర్వాసన వస్తుండడంతో ఇంటి యజమాని బ్రహ్మాజీ సదరు తలుపులు ఎంత కొట్టినా తెరవకపోవడంతో లాలాగూడ పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటి తలుపులు బద్దలుగొట్టి చూడగా హాల్‌లో అభినయ్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. లోపలికి వెళ్లి చూడగా బెడ్రూంలో తల్లి లక్ష్మి సైతం మృతి చెంది ఉంది. లక్ష్మికి సంబంధించిన మెడికల్ రిపోర్ట్‌తో పాటు అభినయ్ రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు కనిపించింది. అందులో 'నాకు మా అమ్మకు ఆరోగ్య సమస్యలున్నాయి. నాకు తండ్రి కూడా లేడు. మా బంధువుల కోసం వెతక్కండి. ఐ యామ్ సారీ' అని ఇంగ్లిష్‌లో రాసి ఉంది. తల్లి లక్ష్మి అనారోగ్యంతో చనిపోవడంతో తట్టుకోలేక కుమారుడు అభినయ్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వీరు మృతి చెంది రెండ్రోజులు అవుతోందని చెబుతున్నారు. తల్లీకొడుకుల మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్



సాక్షి, సిటీబ్యూరో: శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజీలోని అయ్యప్ప సొసైటీలో 684 గజాలలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని హైడ్రా శనివారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ నోటీసులు, హైకోర్టు ఉత్వర్వులను పట్టించుకోకుండా.. సెల్లార్, గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు 5 అంతస్తుల భవనాన్ని నిర్మించడంపై స్థానికుల నుంచి హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఈమేరకు హైడ్రా, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి అయ్యప్ప సొసైటీ వంద ఫీట్ల రోడ్డుకు ఆనుకుని ఉన్న కట్టడాన్ని కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అక్కడికక్కడే జీహెచ్‌ఎంసీ చందానగర్ సర్కిల్ అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులతో పాటు హైకోర్టు ఉత్తర్వులను కమిషనర్ పరిశీలించారు. అక్రమ కట్టడమని హైకోర్టు నిర్ధారించాక కూడా కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా భవనాన్ని నిర్మించడంపై కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. హైకోర్టు ఆర్డర్‌ను ఆధారంగా తీసుకుని గతేడాది జూన్‌లో ఈ భవన నిర్మాణం అక్రమమని జీహెచ్‌ఎంసీ కొంత భాగాన్ని కూల్చివేసింది. అయినా పట్టించుకోకుండా నిర్మాణాన్ని కొనసాగించారంటూ స్థానిక అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి: కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు బ్లాక్ స్పాట్‌లను గుర్తించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. శనివారం రవాణా, డీఈఓ, జీహెచ్‌ఎంసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ శాఖల అధికారులతో రోడ్డు భద్రత మాసోత్సవాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు భద్రతపై భారీ ర్యాలీని చేపట్టాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు పాఠశాలలు, కళాశాలల వద్ద సైన్ బోర్డులు, దంబుల్ స్టిక్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ రోడ్డు భద్రత మాసోత్సవాల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ రవాణా శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ రమేష్, డీఈఓ రోహిణి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం క్రీడలను ప్రోత్సహించాలి

గచ్చిబౌలి: ఆరోగ్యకర సమాజం కోసం క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ సూచించారు. శనివారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చదువులు, కెరీర్ అంటూ పిల్లలను ఆటల వైపు వెళ్లనివ్వకపోవడం మంచిది కాదన్నారు. ప్రస్తుత ఆధునిక జీవితంలో క్రీడలను ప్రోత్సహించాలని, అప్పుడే పిల్లల్లో మానసిక స్థైర్యం, శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. వ్యాయామం చేయకపోవడంతో జబ్బుల బారిన పడుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అన్ని రకాల సౌకర్యాలతో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించేందుకు వీలుంటుందన్నారు. అనంతరం విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనా రెడ్డి, జాతీయ మాస్టర్స్ అథ్లెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి లక్ష్మారెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కొండా విజయ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి దామోదర్ రాజ నరసింహ

సనాతన ధర్మం ఎంతో ఉన్నతమైంది

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

పంజగుట్ట: సనాతన ధర్మం అంటే ఎప్పటికప్పుడు తమలోని విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ కాలంతో పాటు ధర్మాన్ని ఆచరించడమేనని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. భాగ్యనగర్ భారతీయ సాంస్కృతిక సమ్మేళనం శనివారం రాజ్‌భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ.. చాలా మంది ధర్మం అంటే మతం మాత్రమేనని అపోహలో ఉన్నారని.. ధర్మం అంటే అన్ని మతాలను, కులాలను, వర్గాలను సమ దృష్టితో చూస్తూ వారందరినీ ప్రగతిలో భాగస్వాములను చేయడమేనన్నారు. భారతీయ సంస్కృతి ఎంత ఉన్నతమైందో సనాతన ధర్మం కూడా అంతకంటే ఉన్నతమైందన్నారు. ప్రస్తుత తరుణంలో చంద్రుడిపైకి ఎలా వెళ్లాలనేది నేర్చుకున్నాం కానీ ఐకమత్యంతో అందరూ కలిసి ఎలా జీవించాలి అనే విషయంలో ఇంకా పూర్తి స్థాయిలో నేర్చుకోలేదని అనిపిస్తోందన్నారు. సర్వేజన సుఖినో భవంతు అనే భావనను ప్రతి ఒక్కరూ పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరిలో భగవంతుడున్నాడని, అదే విధంగా అన్ని చోట్లా భగవంతుడు ఉన్నాడనే భావన భారతీయ సంస్కృతిలోనే మిళితమై ఉందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పీయూఎస్.వర్మ, అమరవాణి ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ మదన్ మహారాజ్ గోసావి, పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వామి చిత్తా మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.



అమరావాణి ఫౌండేషన్ టేబుల్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

హాస్టల్‌లో క్యాబ్ డ్రైవర్ దారుణ హత్య

వివాహేతర సంబంధమే కారణం



సంఘటనా స్థలంలో మహేందర్ రెడ్డి మృత దేహం

మేడిపల్లి: మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ క్యాబ్ డ్రైవర్ దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. పీర్జాదిగూడలోని మల్లికార్జున నగర్‌లో పద్మ(40) అనే మహిళ అనురాగ్ రెడ్డి బాయిస్ హాస్టల్ నిర్వహిస్తోంది. ఈ హాస్టల్‌లో జనగామ జిల్లా బండ్లగూడెం గ్రామానికి చెందిన క్యాబ్ డ్రైవర్ మహేందర్ రెడ్డి (38) ఉండేవాడు. ఈ క్రమంలో ఇద్దరి పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. కొద్ది రోజులుగా ఇద్దరి మధ్యా గొడవలు జరుగుతుండటంతో మహేందర్ రెడ్డి హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. అయితే అప్పుడప్పుడు హాస్టల్‌కు వచ్చేవాడు. ఈ క్రమంలో శుక్రవారం హాస్టల్‌కు రావాలని పద్మ పిలువగా శనివారం రాత్రి వెళ్లాడు. ఆ సమయంలో హాస్టల్ గదిలో సూర్యాపేటకు చెందిన కిరణ్ రెడ్డి(35),పద్మ కలిసి ఉన్నారు. దీంతో ముగ్గురికీ మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. ఈ గొడవలో కిరణ్ రెడ్డి, పద్మలు వంటకు ఉపయోగించే గంటె, కూరగాయలు కోసే కత్తితో మహేందర్ రెడ్డి పై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడ్డ మహేందర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మూగజీవాలకు ఆధునిక వైద్యం

● రూ. 20 కోట్లతో వెటర్నరీ అసుపత్రి ● అన్ని రకాల జీవాలకు ఉచిత వైద్యం



శునకానికి కాలు విరగటంతో శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు



నూతన క్లినికల్ వెటర్నరీ ఆసుపత్రి

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌లో ఆధునిక హంగులతో ఏర్పాటు చేసిన అసుపత్రిలో మూగ జీవాలకు ప్రభుత్వం కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తోంది. పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లులు, మేకలు, ఆవులు తదితరాలకు ఇక్కడ నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. ఈ ఆస్పత్రిలో రోజుకు 200 నుంచి 250 జీవాలకు వైద్యం అందిస్తున్నారు. వైద్యంతో పాటు ఆపరేషన్లు, వైద్య పరీక్షలు కూడా చేస్తున్నారు.

రూ.20 కోట్లతో ఏర్పాటు

రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయానికి అనుబందంగా ఈ పశువైద్య క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఇంతకుముందు పాత భవనంలో ఉండేది స్థలం సరిపోకపోవడంతో దాని పక్కన రూ.12 కోట్లతో అధునాతన భవనం నిర్మించారు. సుమారు రూ. 8 కోట్లతో పరికరాలు, ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేశారు. అన్ని జబ్బులకు చికిత్స అందించడంతో పాటు డయాలసిస్ సేవలు, రక్త పరీక్షలు, ఆపరేషన్లు ఇక్కడ చేస్తున్నారు.



శునకానికి గ్లుకోజ్ ఇస్తూ...



ఆధునిక పరికరాలతో ఆపరేషన్

అన్ని వ్యాధులకూ చికిత్స



“ పెంపుడు జంతువులకు ఎలాంటి జబ్బు వచ్చినా పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తున్నాం. అవసరం ఉన్నవాటికి ఆపరేషన్లు చేస్తున్నాం. రోజుకు 5 వరకు ఆపరేషన్లు చేస్తున్నారు. ఎముకలు విరిగిన వాటికి ఆధునిక పరికరాలతో కట్లు కట్టి చికిత్స అందిస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇది ఖర్చుతో కూడుకున్నది. అయితే ఇక్కడ ఉచితంగా అందిస్తున్నాం . వీటితోపాటు ఎక్స్‌రే, ఈసీజీ, స్కానింగ్ సౌకర్యాలు కూడా ఉన్నాయి.

- డాక్టర్ రామ్ సింగ్ లకావత్, అసోసియేట్ ప్రొఫెసర్

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషిచేద్దాం

ఖైరతాబాద్: యువతరాన్ని నిర్వీర్యం చేస్తున్న మాదక ద్రవ్యాల ముప్పును అరికట్టడంలో మత గురువులు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని పలువురు మత గురువులు పిలుపునిచ్చారు. శనివారం లక్డీకాపూల్‌లోని హోటల్ అశోకలో ధార్మిక జనమోర్చా ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల ముప్పును అరికట్టడంలో మత గురువుల పాత్ర అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న మతగురువులు తామంతా ఏకమై నైతిక విలువలను కాపాడేందుకు మాదక ద్రవ్యాలను నిర్మూలించడానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. నేటి యువతరానికి డ్రగ్స్ తీవ్ర సవాలుగా మారిందన్నారు. చిలుకూరి బాలాజీ ఆలయ పండితులు లక్ష్మీ నరసింహులు, జమాతే ఇస్లామీహింద్ నాయకురాలు డాక్టర్ అస్రా మొహసినా తదితరులు మాట్లాడారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ మత గురువులు

పరిచయం పెంచుకొని.. అప్పు తీసుకొని ఆపై బెదిరింపులు

సైబర్ ఎక్స్‌టార్షన్ కేసులో ముగ్గురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక మాధ్యమంలో పరిచయం పెంచుకొని అందిన కాడికి దండుకుంటున్న ముగ్గురు సైబర్ ఎక్స్‌టార్షన్ నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కొన్ని రోజులకు డబ్బు అప్పుగా తీసుకొని, ఆపైన సూడో పోలీసుగా రంగంలోకి దిగి అక్రమ కార్యకలాపాలు సాగిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితురాలికి స్నాప్‌చాట్ ద్వారా అమన్ జోషి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తీయని మాటలతో స్నేహం చేసుకొని, నమ్మకం కుదిరాక.. బాధితురాలి నుంచి రూ.15 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. కానీ తిరిగి చెల్లించలేదు. కొన్ని రోజులకు రోహిత్ శర్మ, ప్రశాంత్ బిరాదార్‌లు బాధితురాలికి ఫోన్ చేసి పోలీసు అధికారిగా పరిచయం చేసుకున్నారు. అమన్‌తో కలిసి అక్రమ బంగారం వ్యాపారం నిర్వహిస్తున్నారని ఆమెను భయభ్రాంతులకు గురి చేశాడు. ఈమేరకు కేసు నమోదయిందని, బెయిల్ కోసం రూ.1.60 లక్షలు ఇవ్వాలని లేకపోతే అరెస్టు చేస్తామని బెదిరించారు. దీంతో సమాజంలో పలుకుబడి ఉండటంతో బాధితురాలు నిందితులు సూచించిన సొమ్మును వారి ఖాతాలకు బదిలీ చేసింది. దీన్ని ఆసరా చేసుకున్న నిందితులు పలు దఫాలుగా బాధితురాలి నుంచి రూ.48.38 లక్షలు కాజేశారు. మానసికంగా, ఆర్థికంగా క్షోభతో బాధితురాలు ఆత్మహత్యాయత్నం కూడా చేసింది. ఈమేరకు బాధితురాలు గతేడాది ఆగస్టు 22న బాధితురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు, బ్యాంక్ చెక్‌బుక్‌లు, డెబిట్, క్రెడిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారునిందితులు బాధితుల నుంచి కొట్టేసిన సొమ్మును బహుళ బ్యాంక్ ఖాతాలకు మళ్లించడంతో పాటు బంగారం కొని పెట్టుకుంటారు. భవిష్యత్తులో నగదు అవసరాల కోసం బంగారాన్ని తాకట్టు పెడతారు.



రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

మహేశ్వరం: కారును ఓవర్‌టేక్ చేయబోయిన లారీ ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టడంతో నలుగురు నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం తుమ్మలూరు గేటు సమీపం శ్రీశైలం జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు.. మణికొండ, కొండాపూర్‌కు చెందిన నలుగురు స్నేహితులు శ్రీశైలం నుంచి వస్తున్నారు. హైదరాబాద్ నుంచి కందుకూరు వైపు ప్రయాణిస్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ.. ముందుగా వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేయబోగా ఎదురుగా వస్తున్న కియా కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కియా కారులో ప్రయాణిస్తున్న వంశీ, నగేశ్‌కు తీవ్ర గాయాలు కాగా శ్రీకాంత్, శ్రీధర్ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులు శంషాబాద్‌లోని లిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన లారీగా పోలీసులు గుర్తించారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

అడ్డగుట్ట: అనారోగ్యం కారణంగా ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తుకారాం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. అడ్డగుట్టలోని అజాద్ చంద్రశేఖర్ నగర్‌కు చెందిన రాజ్‌కుమార్ (22) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. తీవ్ర మనోవేదనకు గురైన అతను శుక్రవారం రాత్రి భోజనం చేసి పెంటౌస్‌లో నిద్రించేందుకు వెళ్లాడు. మరుసటిరోజు ఉదయం కిందికి రాకపోవడంతో అతడి తండ్రి పెంటౌస్‌కు వెళ్లి చూడగా రాజ్‌కుమార్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ అసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

20 లక్షల ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఏడేళ్లలో 20 లక్షల ఉద్యోగాలను కల్పించడానికి సన్నాహాలు చేస్తోందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. అవంతి డిగ్రీ, అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం కాచిగూడలోని మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. డిజిటల్ టెక్నాలజీకి 21వ శతాబ్దం కేంద్ర బిందువుగా మారనున్నదని అన్నారు. ఒక్కొక్క శతాబ్దం ఒక్కొక్క రంగానికి మూలబిందువుగా కొనసాగిందని, ఈ శతాబ్దిలో డిజిటల్ టెక్నాలజీ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. స్కిల్ యూనివర్సిటీ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ మంత్రి అవంతి విద్యాసంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

కేపీహెచ్‌బీకాలనీ: మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి కూకట్‌పల్లి న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. ఎస్‌ఐ శ్రీలత తెలిపిన మేరకు.. 2016లో గుంటూరుకు చెందిన కొరపాటి వెంకట క్రాంతి రాజు (32) కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు నిందితుడిపై నేరం రుజువు కావడంతో శుక్రవారం కూకట్‌పల్లి కోర్టు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ జడ్జి విక్రమ్ తీర్పు వెలువరించారు. పోక్సో కేసులో నిందితుడికి శిక్షపడేలా కేసును దర్యాప్తు చేసిన పోలీస్ అధికారులను, ప్రభుత్వ న్యాయవాదులను ఈ సందర్భంగా ఉన్నతాధికారులు అభినందించారు.

విశ్రాంత అదనపు ఐజీ కన్నుమూత



పట్లోళ్ల నర్సింహారెడ్డి

బంజారాహిల్స్: రిటైర్డ్ అడిషినల్ ఐజీ పట్లోళ్ల నర్సింహారెడ్డి(72) శనివారం ఉదయం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని ఆయన నివాసంలో కన్నుమూశారు. జైళ్ళ శాఖలో అడిషనల్ ఐజీగా పని చేస్తూ పదవీ విరమణ చేశారు. ఆయనకు భార్య మధుమతి, కొడుకు నిఖిల్‌రెడ్డి, కూతురు డాక్టర్ కీర్తిరెడ్డి ఉన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన అంత్యక్రియలు సోమవారం ఉదయం ఫిలింనగర్ సమీపంలోని వైకుంఠ మహాప్రస్థానంలో జరుగుతాయని వారు తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న మహిళ గుర్తింపు



మాధవి (ఫైల్)

మాదాపూర్: దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న మహిళను పోలీసులు గుర్తించారు. దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై నుంచి దూకి ఓ మహిళ చనిపోయిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఎస్సై రమణ తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన మాధవి(55) నగరంలోని ఎల్లారెడ్డి గూడలో నివాసముంటున్నారు. ఆమె భర్త సుమన్ టీవీలో పనిచేస్తున్నాడు. మాధవికి మతిస్థిమితం లేకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

యువ వైద్యులు ఉత్తమ వైద్యం అందించాలి

సుల్తాన్‌బజార్: యువ వైద్యులు మంచి ఉత్తమ వైద్యాన్ని అందించి ప్రజలకు ఆర్థిక భారం పడకుండా చూడాలని లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ అన్నారు. జాతీయ యువజన ఉత్సవాల ముగింపు వేడుకలు శనివారం సాయంత్రం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ముగిశాయి. నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ జయప్రకాష్ నారాయణ హాజరయ్యారు. ఆధునిక సాంకేతికమైన విధానం వల్ల దేశంలో నూతన సంస్కరణలు తీసుకురావచ్చన్నారు. మానవ మస్తిష్కం ఉపయోగించి వైద్య వృత్తిలో సాధ్యం కాని చికిత్సలు ప్రస్తుతం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి గోదామయనంద, కళాశాల ప్రిన్సిపల్ నరేంద్రకుమార్ డాక్టర్ ఉజ్వల్, డాక్టర్ అనుపమ పాల్గొన్నారు.



యువ వైద్యులతో డాక్టర్ జయప్రకాష్ నారాయణ

శాతవాహన వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఓయూ ప్రొఫెసర్

ఉస్మానియా యూనివర్సిటీ: కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా ఓయూ అధ్యాపకులు ప్రొఫెసర్ రవికుమార్ నియమితులయ్యారు. ఓయూ క్యాంపస్ కామర్స్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆయన సికింద్రాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపల్‌గా, ఎగ్జామినేషన్ బ్రాంచ్ అడిషనల్ కంట్రోలర్‌గా, సెంటినరీ సెలబ్రేషన్స్ కోఆర్డినేటర్‌గా, కేరళ సెంట్రల్ వర్సిటీ కామర్స్ ప్రొఫెసర్‌గా గతంలో పని చేశారు. పాలన అనుభవం గల ప్రొ.రవికుమార్‌ను రిజిస్ట్రార్‌గా శాతవాహన వర్సిటీ వీసీ ప్రొ.ఉమేష్‌కుమార్ నియమించంగా శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.



వీసీ ప్రొ.ఉమేష్‌కుమార్‌కు (కుడివైపు) పుష్పగుచ్ఛం అందచేస్తున్న ప్రొ.రవికుమార్

మహిళలు రాజకీయాల్లోకి రావాలి

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ


సాక్షి, సిటీబ్యూరో: మహిళలు రాజకీయాల్లోకి రావాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీ నోవెటల్ హోటల్‌లో ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు రాబోతున్నాయని తెలిపారు. రాజకీయాల్లోకి రావాలనుకునే వారు ఇప్పటి నుంచే క్షేత్ర స్థాయిలో పనిచేసుకోవాలని సూచించారు.

డాక్టర్లు లేని దవాఖానాలు..!

- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షౌకత్‌నగర్ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత
- వైద్యులు లేకపోవడంతో రోగుల అవస్థలు
- అద్దె భవనంలో నడుస్తున్న జూబ్లీహిల్స్ ఆరోగ్య కేంద్రం


అద్దె భవనంలో కొనసాగుతున్న జూబ్లీహిల్స్ ఆరోగ్య కేంద్రం


వెంకటేశ్వరనగర్ బస్తీలోని బస్తీ దవాఖానా



బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బంజారాహిల్స్: ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాల్లో వైద్యులు, సరైన సిబ్బంది లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. మెజార్టీ బస్తీ దవాఖానాల్లో చాలావరకు కాంట్రాక్ట్ వైద్యులు సేవలందిస్తుండగా మరికొన్ని ఆస్పత్రులు, బస్తీ దవాఖానాల్లో వైద్యులు లేకపోవడంతో ఆసుపత్రులకు వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందటం లేదు. బంజారాహిల్స్ రోడ్ నెం.7 లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగ కార్తీక్ 15 రోజుల క్రితం రాజీనామా చేసి వెళ్లడంతో రోగులు ఇబ్బందిపడుతున్నారు. బంజారాహిల్స్‌లోని పలు బస్తీలకు కీలకంగా ఉన్న ఈ ఆస్పత్రికి నిత్యం పెద్ద సంఖ్యలో గర్భిణులతోపాటు వారంలో రెండు రోజులపాటు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. కీలకంగా ఉన్న ఈ ఆస్పత్రిలో వైద్యుడు లేడని స్థానికులు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూడా ఇప్పటి వరకు కనీసం ఇన్‌చార్జి డాక్టర్‌ను సైతం ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఇక్కడ ఉండాల్సిన ఫార్మసిస్ట్ బదిలీ అయ్యారు. ఇద్దరు ఏఎన్ఎంలు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. దీంతో ఉన్న సిబ్బందితోనే ఆస్పత్రిలో సేవలు కొనసాగుతున్నాయి. మరో వైపు దీనికి కొద్ది దూరంలోనే ఉన్న షౌకత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సైతం డాక్టర్ లేకపోవడం గమనార్హం. షౌకత్‌నగర్ ఆరోగ్య కేంద్రానికి జూబ్లీహిల్స్ పీహెచ్‌సీలో పని చేస్తున్న వైద్యుడికి వారంలో మూడు రోజులు సేవలు అందించాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఆరు నెలలుగా జూబ్లీహిల్స్ వైద్యులు షౌకత్‌నగర్ ఆస్పత్రిలో సేవలు అందిస్తున్నాడు. తాజాగా జూబ్లీహిల్స్ ఆరోగ్య కేంద్రంలోని వైద్యుడు కూడా బదిలీ అయినట్లు సమాచారం. ముఖ్యంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షౌకత్‌నగర్ ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ల కొరత వేధిస్తున్నది. మరోవైపు బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని బస్తీ దవాఖానాలో సైతం వైద్యురాలు మెటర్నిటీ లీవ్‌లో వెళ్లినట్లు తెలుస్తున్నది. దీంతో ఇక్కడ కూడా సేవలకు ఆటంకం కలుగుతున్నది. ఎంతో మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలు సైతం సరైన సిబ్బంది లేకపోవడంతో నాణ్యమైన వైద్య సేవలు అందటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

అద్దె భవనంతో అవస్థలు..

జూబ్లీహిల్స్ ఆరోగ్య కేంద్రం గత కొన్ని సంవత్సరాలుగా అన్నపూర్ణ స్టూడియో ఎదురుగా ఉన్న జవహర్‌కాలనీలోని ఓ అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. కాగా ఆ భవన యజమానికి సరైన సమయంలో అద్దె చెల్లించకపోవడంతో నిత్యం సమస్యలు ఎదురవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. గడిచిన ఏడాది కాలంగా ఆ యజమానికి ప్రభుత్వం నుంచి అద్దె రాకపోవడంతో రోజూ గొడవలు తప్పడం లేదని సిబ్బంది వాపోతున్నారు. కొన్నిసార్లు ఆ భవన యజమాని బాత్‌రూమ్‌లకు తాళాలు వేసుకోవడంతో పాటు కొన్ని గదులకు తాళాలు వేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ భవనంలో సైతం సరైన నీటి వసతి లేక డ్రమ్ముల్లో నీటిని పట్టుకోవాల్సి వస్తున్నది. ఏడాది క్రితం జూబ్లీహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించేందుకు సాగర్ సొసైటీని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలం వద్ద రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించినా కూడా ఇప్పటి వరకు అక్కడ భవనం నిర్మాణ పనులు మొదలు కాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

సన్మానం


దానంను సన్మానిస్తున్న నేతలు

వెంగళరావునగర్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను వెంగళరావునగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దానంకు పూలబొకేలను అందించి, శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. దానంను సన్మానించిన వారిలో జూబ్లీహిల్స్ సీనియర్ కాంగ్రెస్ నేతలు, కాలనీనేతలు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, చిలకల వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాస్, రవికుమార్, అప్పలనాయుడు, నటరాజ్ తదితరులు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


ఉపేందర్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నేతలు

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేయాలని, పలు బస్తీల్లో మౌలిక వసతుల కల్పించాలని నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు సిటీ గ్రంథాలయ చైర్మన్ ఉపేందర్‌రెడ్డిని కోరారు. శనివారం ఈ మేరకు వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు సిటీ జనరల్ సెక్రటరీ రవిగౌడ్, శంకర్‌లాల్‌నగర్ టెంపుల్ చైర్మన్ శంకర్‌నాయక్, టీపీసీసీ ఎస్టీసెల్ కోఆర్డినేటర్ రమేష్ నాయక్, లక్ష్మణ్, చిరంజీవి, శివ, రఘునాయక్ పాల్గొన్నారు.

సూచిక బోర్డుల ఏర్పాటు



బంజారాహిల్స్: జంక్షన్ల సుందరీకరణలో భాగంగా జీహెచ్ఎంసీ యూబీడీ అధికారులను కూడళ్లను విభిన్న రకాల బొమ్మలతో పాటు మొక్కలు ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా జంక్షన్ల వద్దకు రాగానే ఏదారి ఎటు వైపునకు వెళ్తుందో తెలిపే సూచిక బోర్డులను సైతం అధికారులు ఏర్పాటు చేశారు. తాజాగా పంజగుట్ట నాగార్జున సర్కిల్‌లో అధికారులు వాహనదారులకు అర్థమయ్యే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో కొత్తగా వచ్చిన వారికి ఈ సూచిక బోర్డుల ద్వారా ఎటు వెళ్లాలో సులభంగా అర్థమవుతుంది.

రహమత్‌నగర్ గ్రంథాలయ సందర్శన

రహమత్‌నగర్: నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి శనివారం రహమత్‌నగర్ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లైబ్రరీయన్ శ్రీనివాస్‌ను అక్కడి సమస్యలను అయన అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో పాఠకులు సంఖ్య మరింత పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని లైబ్రరీయన్‌కు సూచించారు. అలాగే ఫర్నిచర్ కోసం నివేదికలు పంపిస్తే వాటి ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రహదారి విస్తరణలో గ్రంథాలయాన్ని తొలగిస్తే కొత్త భవన నిర్మాణం చేపడ్తామని చెప్పారు. అనంతరం ఉపేందర్ రెడ్డిని లైబ్రరీయన్ శ్రీనివాస్ సన్మానించారు.

యువతి అదృశ్యం


రజియాబేగం

బంజారాహిల్స్: అనుమానాస్పదస్థితిలో యువతి అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఆంధ్రప్రదేశ్ విజయవాడ రూరల్ నున్నా కృష్ణ ప్రాంతానికి చెందిన రజియాబేగం (22) గత నెల 23వ తేదీన యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో నివసించే తన సోదరి షేక్ మున్నీ ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీన తెల్లవారుజాము నుంచి రజియాబేగం కనిపించలేదు. ఆమె సెల్‌ఫోన్ కూడా ఇంట్లోనే వదిలేసింది. రజియాబేగం కోసం చుట్టూ పక్కల తెలిసిన వారి ఇంట్లో గాలించినా ఫలితం లేకపోవడంతో ఆమె సోదరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87125 69090 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థినికి బంగారు పతకం



పంజగుట్ట: రాష్ట్రస్థాయి సీఎంకప్ పోటీల్లో ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థిని బంగారు పతకం సాధించింది.ఈ నెల 2వ తేదీన వరంగల్ జిల్లాలో నిర్వహించిన సీఎంకప్ రెజ్లింగ్ పోటీల్లో ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న డి.ఎస్.సాయి రోషిణి పాల్గొని బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. రోషిణి గత నెల 27, 28వ తేదీల్లో తమిళనాడులోని సేలంలో సౌత్ ఇండియా రెజ్లింగ్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొంది. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ రాజేంద్ర కుమార్, ఫిజికల్ డైరెక్టర్ కడారి మల్లేష్, ఇతర అధ్యాపకులు రోషిణిని అభినందించారు.

మంచినీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి


వినతి పత్రం అందజేస్తున్న మానవ హక్కుల సంఘం నాయకులు

రహమత్‌నగర్: జవహర్‌నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ సమితి సౌత్ ఇండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మామిళ్ల నాగేష్ బస్తీవాసులతో కలిసి శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడుతూ బస్తీలో తాము ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యలపై పలుమార్లు జలమండలి అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన నేపథ్యంలో పనులకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇందుకు సంబంధించిన పైపులు కూడా వచ్చాయని చెప్పారు. స్థానిక రాజకీయ కారణాల వల్ల పనులు ప్రారంభోత్సవంలో జాప్యం జరుగుతున్నదని ఆయన ఆరోపించారు. దీనిపై మంత్రి స్పందించి వెంటనే పనులు ప్రారంభించి ప్రజల మంచినీటి అవసరాన్ని తీర్చాలని ఆయన వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ సమతి జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఆర్గనైజింగ్ సెక్రటరీ యూసుఫ్, బస్తీనాయకులు మహబూబ్, మహ్మద్ షరీఫ్, అబ్దుల్ కలీం, వాహీద్, యూనీస్, ఎక్బాల్, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

గృహిణి ఆత్మహత్య


దుర్గామాధవి

పంజగుట్ట: రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో పెట్టి అదృశ్యమైన గృహిణి దుర్గంచెరువులో శవమై తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లారెడ్డిగూడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఎ.ప్రభు ఓ ప్రైవేట్ చానల్‌లో పనిచేస్తున్నాడు. ఆయన భార్య ఆడెపు దుర్గామాధవి ఈ నెల 2వ తేదీన మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. అయితే ఆమె ఫోన్ మాత్రం ఇంట్లోనే వదిలేసి వెళ్లగా, ఆ ఫోన్ తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో పెట్టింది. వెంటనే ఆమె భర్త పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కాగా శనివారం సాయంత్రం దుర్గామాధవి మృతదేహాన్ని దుర్గం చెరువులో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చీరకట్టులోనే మగువల అసలైన అందం



శ్రీనగర్‌కాలనీ: చేనేత వస్త్రాలను ధరించాలని, చీరకట్టులోని మగువల అసలైన అందం దాగి ఉందని వర్ధమాన నటి సుప్రియా పిళ్లై అన్నారు. శనివారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జగదీశ్వర్ హస్తకళ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2024ను ఆమె ప్రారంభించారు. ఈ ప్రదర్శనలోని సిల్క్, కాటన్ వస్త్రాలు మగువల మనసు దోచుకుంటున్నాయి. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు జయేష్ గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శన ఈనెల 7 వరకూ కొనసాగుతుంది.

ప్రోత్సాహంతోనే విద్యార్థుల రాణింపు

వెంగళరావునగర్: ప్రోత్సహిస్తే ఎవరైనా రాణిస్తారని ముఖ్యంగా విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని రైల్వేస్ ఎస్పీ చందనా దీప్తి అన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (సికింద్రాబాద్) క్రీడోత్సవ వేడుకలు శనివారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. సత్‌రంగ్ పేరుతో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో చిన్నారులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు సభికులను ఆకర్షించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చందనా దీప్తి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలంటే ఉపాధ్యాయులతో పాటుగా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. డాక్టర్ రామిరెడ్డి మాట్లాడుతూ చిన్నారులు ప్రదర్శించిన విన్యాసాలు నింగిలోని హరివిల్లు మన చెంతకు వచ్చిందా అని పించిందని కొనియాడారు. ప్రిన్సిపాల్ శైలజా గోపీనాథ్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని, చదువుతో పాటుగా చిన్నారులు క్రీడాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ గణేష్, టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.


డీపీఎస్ చిన్నారుల విన్యాసాలు..

లక్ష్య సాధనకు ప్రణాళిక ప్రకారం చదవాలి



ఫిలింనగర్: విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునేందుకు ఒక ప్రణాళికా ప్రకారం చదవాలని జేహెచ్‌పీఎస్ డైరెక్టర్ వరలక్ష్మి అన్నారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ (జేహెచ్‌పీఎస్) 10, 12 తరగతుల విద్యార్థుల వీడ్కోలు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వారికి వీడ్కోలు పలికే కార్యక్రమంలో భాగంగా 9, 11 తరగతుల విద్యార్థులు వివిధ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. స్టైలిష్, సొగసైన దుస్తులు ధరించి మిరుమిట్లు గొల్పే ర్యాంప్ వాక్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. మిస్టర్ జేహెచ్‌పీఎస్, మిసెస్ జెడీపీహెచ్ఎస్ బిరుదులను మోక్షిత్ (గ్రేడ్–10), జి.ధృపథ్ (గ్రేడ్ 10), తేజు నందన (గ్రేడ్–12), ధ్వని సోని (గ్రేడ్–10) సొంతం చేసుకున్నారు. నాయకత్వ పటిమతో పాటు వివిధ అంశాల్లో ప్రతిభ చాటినందుకు వారు ఈ బిరుదులను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకొని తల్లిదండ్రులు, పాఠశాల పేరును నిలబెట్టాలన్నారు. ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తు ప్రణాళికలో ముందున్న అవకాశాలు, సవాళ్లను స్వీకరిస్తూ ముందుకుసాగాలన్నారు. అనంతరం పాఠశాల అధ్యక్షులు మురళీముకుంద్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

గురుబ్రహ్మనగర్‌లో ప్రహరీ నిర్మాణం చేపట్టిన హైడ్రా


హైడ్రా కమిషనర్‌తో సమావేశమైన గురుబ్రహ్మనగర్ బస్తీవాసులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లోని గురుబ్రహ్మనగర్ బస్తీలో 1500 గజాల స్థలం చుట్టూ హైడ్రా ప్రహరీగోడ నిర్మాణం చేపట్టింది. అయితే ఈ నిర్మాణం వల్ల నందగిరిహిల్స్ వాసులకు ప్రయోజనం చేకూరి తమ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందంటూ బస్తీవాసులు ఆందోళనకు దిగడమే కాకుండా శనివారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం మధ్యాహ్నం బుద్ధభవన్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఇక్కడి పరిస్థితిని, లే అవుట్‌ను వివరించారు. బస్తీ నేతలు గోపాల్‌నాయక్, రాంచందర్, రవినాయక్, మోహన్‌నాయక్‌తో పాటు నందగిరి హిల్స్ సొసైటీ సభ్యులు బస్వరాజ్, ఎంఎం రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. గురుబ్రహ్మనగర్ బస్తీలో 272 మంది పేదలకు ఇళ్లు కట్టించేందుకు రెండెకరాల స్థలం కేటాయించారని, ఆ స్థలం కబ్జా కాకుండా చూడాలని, దానిని రక్షించాలని బస్తీవాసులు కోరారు. ఇళ్ల నిర్మాణం కోసం చేపట్టిన స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు పాల్గొన్నారు.

గవర్నర్‌కు సన్మానం

వెంగళరావునగర్: వెంగళరావునగర్‌కాలనీ ప్రధాన రహదారిలో ఉన్న నలందా విద్యా సంస్థల చైర్మన్ మంతెన శ్రీనివాసరాజు శనివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఢిల్లీ సీబీఐ జడ్జి గోస్వామిలను మర్యాద పూర్వకంగా కలిశారు. రాజ్‌భవన్ ప్రాంగణంలోని సంస్కృతి కమ్యూనిటీహాల్‌లో శనివారం నుంచి ప్రారంభమైన భాగ్యనగర్ భారతీయ సాంస్కృతిక సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సెల్ టవర్ సీజ్

రహమత్‌నగర్: హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్–1లోని సెల్ టవర్‌ను జీహెచ్ఎంసీ అధికారులు శనివారం సీజ్ చేశారు. ప్రమాదకరంగా మారిన ఈ సెల్ టవర్‌కు తొలగించాలని ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జాతీయ నాయకుడు నాగేష్ అన్ని శాఖల అధికారులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శనివారం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల సెల్ టవర్‌ను సీజ్ చేశారు.

ఆడుకుంటూనే అనంతలోకాలకు...

మెడకు చున్నీ చుట్టుకుని బాలుడి మృతి


మృతుడు మదాసీర్

రహమత్‌నగర్: తన సోదరుడితో సరదాగా ఆడుకుంటున్న బాలుడిని చున్నే యమపాశమై ప్రాణాలు హరించింది. ఊహించని ఈ సంఘటనతో బాలుని తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బంజారానగర్‌లో నివసించే తౌఫిక్ పాషకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు మదాసీర్ (13) తాండూర్‌లోని ఓ మదర్సాలో చదువుకుంటున్నాడు. కొద్ది రోజుల క్రితమే బంజారానగర్‌లోని తన ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలోనే శనివారం మధ్యాహ్నం సమయంలో తన ఇంట్లో సోదరుడితో చున్నీతో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు చున్నీ ఫ్యాన్‌కు తగిలి మదాసీర్ మెడకు బిగుతుగా చుట్టుకుంది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాలుడిని చూసిన తల్లిదండ్రులు హుటాహుటిన ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. మృతుని తల్లి రేహానాబేగం ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలో శనివారం రూ.3.54 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డీఎంసీ ప్రశాంతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాజ్‌కృష్ణా హోటల్ జంక్షన్ అభివృద్ధికి రూ.11.5 లక్షలు, జీవీకే–1 మాల్ జంక్షన్ అభివృద్ధికి రూ.12.75 లక్షలు, జలగం వెంగళరావుపార్కులో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ఓపెన్ ఎయిర్ థియేటర్ ప్రారంభోత్సవం చేశారు. అలాగే కేబీఆర్ పార్కు జంక్షన్ వద్ద రూ.1.96 లక్షల వ్యయంతో జంక్షన్ సుందీరకరణ పనులు పూర్తి కాగా దానికి కూడా ప్రారంభోత్సవం చేశారు. నందినగర్ బ్రహ్మకుమారీస్ రోడ్డులో రూ.1.5 కోట్ల వ్యయంతో, హనుమాన్ టెంపుల్ వద్ద రూ.1.5 కోట్ల వ్యయంతో చేపట్టిన వీడీసీసీ రోడ్డు పనులకు కూడా శంకుస్థాపన చేశారు.

అనుమానాస్పదస్థితిలో సెక్యూరిటీ గార్డు అదృశ్యం



బంజారాహిల్స్: అనుమానాస్పదస్థితిలో సెక్యూరిటీగార్డు అదృశ్యమైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని ఎమ్మెల్యే ఎంపీ కాలనీలో హరిత ప్లాట్‌లో నివసించే తేలూరు వెంకటేశ్వరరావు (39) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గత నెల 13వ తేదీన వెంకటేశ్వరరావు తన వాహన సర్వీసింగ్ కోసం శ్రీనగర్‌కాలనీకి వెళ్తున్నానని భార్య వెంకటరమణకు చెప్పాడు. సాయంత్రం ఎంతకీ రాకపోయేసరికి ఆమె ఫోన్ చేయగా 10 నిమిషాల్లో వస్తున్నానని, ఇంటి దగ్గరలోనే ఉన్నానని చెప్పాడు. అయితే నాలుగైదు గంటలు గడిచినా రాకపోయేసరికి మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఆ మరుసటి రోజు కూడా ఇంటికి రాకపోవడంతో తన భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 99519 03100 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

చింతలబస్తీలో నిత్యన్నదానం

ఖైరతాబాద్: చింతలబస్తీలోని శివాలయంలో అయ్యప్పస్వాములకు నిత్య అన్నదానం చేస్తున్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా పప్పి గురుస్వామి ఆధ్వర్యంలో ప్రతిరోజూ 250 మంది అయ్యప్ప స్వాములకు మధ్యాహ్నం అన్నదానం చేస్తూ వస్తున్నారు. శనివారం కూడా అయ్యప్పసాములు ప్రత్యేక పూజ చేసి అన్నదానంలో పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరుగుతున్న ఉద్యాన్ ఉత్సవ్ కార్యక్రమాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయి.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తారు.
- మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అవకాశం ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్‌ను సందర్శించే అవకాశం ఉంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళామేళా ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నాగర్‌కర్నూల్ జిల్లా మైలారంగుట్ట పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రౌండ్ టేబుల్ సమావేశం కొనసాగుతుంది.
- రచయిత యనమల ప్రకాష్ రచించిన రాంగోపాలాయణం (రామాయణం కాదు) పుస్తకావిష్కరణ మధ్యాహ్నం 4 గంటలకు షేక్‌పేటలోని అపర్ణ వన్‌లో నిర్వహిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

స్టాల్స్‌లో ప్రదర్శనకు ఉంచిన డ్రోన్ గన్స్





సైనికుల దుస్తులు



మిలటరీ వాహనం





అత్యాధునిక యుద్ధట్యాంక్

ఇండియన్ ఆర్మీ ఆయుధాలను చూడాలని ఉందా?

ఆకట్టుకుంటున్న నో యువర్ ఆర్మీ మేళా | ఆయుధాలను చూసి వావ్ అంటున్న ప్రజలు | పెద్దసంఖ్యలో హాజరవుతున్న విద్యార్థులు

గోల్కొండ కోటలో ఆర్మీ అధికారులు నిర్వహిస్తున్న నో యువర్ ఆర్మీ మేళాకు భారీ ఎత్తున సందర్శకులు తరలివస్తున్నారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ మేళా రేపటితో ముగియనుంది. నగరం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున సందర్శకులు తరలివస్తున్నారు. విద్యార్థులు సైతం పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఆటోమెటిక్ గన్స్, మెషిన్ గన్స్, వివిధ రకాల ఆయుధాలతో పాటు యుద్ధ ట్యాంకులను ప్రదర్శనలో ఉంచారు. వీటి పనితీరును మిలటరీ జవాన్లు ఎంతో ఓపిగ్గా సందర్శకులకు వివరిస్తున్నారు. పాదలమాటున ఉంటూ మంచు నిండిన ప్రాంతాల్లో తమను తాము రక్షించుకుంటూ శత్రువులపై ఏ విధంగా దాడి చేస్తామో.. ఏ ఆయుధాలను వినియోగిస్తామో వివరిస్తున్నారు. దాంతోపాటు ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడానికి కూడా వారు అనుమతి ఇస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - గోల్కొండ

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో: నూతనంగా నియామకమైన ఉద్యోగులు నిబద్ధతతో బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్–4 పరీక్షల ద్వారా జూనియర్ అసిస్టెంట్లుగా నియామకమైన ఉద్యోగులకు శనివారం నిర్వహించిన ఒరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సేవ హోదాకు చిహ్నమని అన్నారు. నూతనంగా నియామకమైన ఉద్యోగులు అంకితభావం, నిబద్ధత, జవాబుదారితనంతో పనిచేయాలన్నారు. ప్రతి సమస్యను ఛాలెంజ్‌గా తీసుకొని పరిష్కరించాలన్నారు. ఆధునిక టెక్నాలజీ, నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటచారి, కలెక్టరేట్ ఏఓ సదానందం తదితరులు పాల్గొన్నారు.

2 నెలల చిన్నారి గుండెకి అరుదైన శస్త్ర చికిత్స

ఘనత సాధించిన రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్



సాక్షి, సిటీబ్యూరో: రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌లో రెండు నెలల చిన్నారి గుండెకు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలను ఆస్పత్రి వైద్యులు కోనేటి నాగేశ్వరరావు వివరించారు. హిందూపురానికి చెందిన సోనూ కుటుంబంలో రెండు నెలల చిన్నారికి గుండెలో ఎడమ జఠరిక వాల్వ్ మూసుకుపోయింది. దీంతో నగరంలోని రెయిన్‌బో ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఫీటల్ బెలూన్ అయోటిక్ వాల్వాటమీ(శస్త్ర చికిత్స) చేయాలని వైద్యులు నిర్ణయించారు. అత్యంత ఖచ్చితత్వంతో ఆల్ట్రాసౌండ్ గైడెన్స్‌తో చిన్నారి గుండెకు రంధ్రం చేసి బెలూన్ పంపించి వాల్వ్‌ను తెరిపించారు. అనంతరం గుండెకు చెందిన రంధ్రాన్ని డివైజ్(బటన్) పెట్టి మూసివేశారు. ప్రపంచంలో ఇటువంటి చికిత్సలు సుమారుగా 400 నుంచి 500 వరకు జరిగాయని, అందులో రెయిన్‌బోలో 20 నుంచి 25 వరకు ఉంటాయన్నారు. వైద్య చరిత్రలో ఇది మరో అరుదైన ఘట్టమని వివరించారు. వైద్యులు కోనేటి నాగేశ్వరరావు, శ్వేతా బబ్రు, ఫణి భార్గవి ధూళిపూడి బృందం పాల్గొన్నారు. సమావేశంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా.రమేష్ కంచర్ల పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు పాటే ప్రాణం



కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో పాటను ఆవిష్కరిస్తున్న సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి

చందానగర్: ప్రజా ఉద్యమాలకు పాటే ప్రాణమని సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి స్పష్టం చేశారు. కొండాపూర్లోని సీఆర్ ఫౌండేషన్‌లో సీపీఐ వంద సంవత్సరాల సందర్భంగా గాయని శ్యామల స్వీయరచన, గానంతో రూపొందించిన వందేళ్ల ఎర్రజెండా పాట ఆడియో, వీడియోలను కళాక్షేత్రంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్యామల పాటలు సమాజ చైతన్య ఊటసెలయేళ్లుగా అభివర్ణించారు. ఆమె పాటకు సామాజిక, రాజకీయ అంశాలను జోడిస్తూ మార్క్సిజం నూరిపోస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తుందన్నారు. పాట ప్రజా ఉద్యమాలకు ఊపిరిగా నిలుస్తున్నామని, నాటి బ్రిటీష్ ముష్కరపాలన నుంచి నేటి తెలంగాణ ఉద్యమం వరకు పాటే ఉద్యమాలకు ప్రాణం పోసిందన్నారు. పాట ఎల్లప్పుడూ జనం పక్షాన ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ కొత్త ఒరవడిలో పరుగులు పెట్టించాలన్నారు. పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు, ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్‌రావు, ఏఐటీసీ జాతీయ నేత సురవరం విజయలక్ష్మీ, సీఆర్ ఫౌండేసన్ కోశాధికారి చెన్నకేశవరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.రజని, నీలం రాజశేఖర్‌రెడ్డి, రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ టి.సురేష్‌బాబు, కన్వీనర్ కె.అజయ్, పల్లె నర్సింహ, విజయరాములు, బాలకిషన్, శంకర్, రామకృష్ణ, చందుయాదవ్, నర్సింహరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టుల పక్షపాతి

- గతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే..
- ప్రభుత్వానికి జర్నలిస్టులకు మధ్య వారధిగా ఉంటా: వేం నరేందర్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ది జర్నలిస్ట్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మాండభేరి గోవరాజు నేతృత్వంలోని కార్యవర్గం శనివారం కలిసింది. ఇటీవల జరిగిన ఎన్నికల తీరు, ఫలితాలపై వేం.నరేందర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల పక్షపాతి అని, జర్నలిస్టుల కుటుంబాలు సంతోషంగా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జర్నలిస్టుల సంక్షేమం కోసం రేవంత్‌రెడ్డి సర్కార్ దృఢ సంకల్పంతో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి ఆయన అభినందనలు తెలిపారు. సొసైటీ కార్యదర్శి ఎం.రవీంద్రబాబు, కోశాధికారి భీమగాని మహేశ్వర్‌గౌడ్, కార్యవర్గ సభ్యుడు డి.కమలాకరాచార్య, సీనియర్ జర్నలిస్టు ఏ.రాజాబాబు ఉన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పతకమూరి శ్రీనివాసరావు

బండ్లగూడ: విద్యార్థులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని శ్రీసరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీశారద ధామంలోని విద్యారణ్య ఆవాస విద్యాలయంలో అత్యంత ఆధునిక సాంకేతిక రోబోటిక్ ప్రయోగశాలను అపెక్స్ ఆన్ ఇండియా ఇగ్నైట్ సౌజన్యంతో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నేడు సాంకేతికత దినదినాభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతోందన్నారు. రోబోటిక్స్ రంగం దాదాపు అన్ని విషయాల్లో ప్రవేశించిందన్నారు. వైద్య రంగంలో కీలకమైన శస్త్ర చికిత్సలు కూడా రోబోట్స్ ద్వారానే జరుగుతున్నాయన్నారు. వీటి గురించి అటు ఆచార్యులకు, ఇటు విద్యార్థులకు కూడా శిక్షణ అవసరమన్నారు. అపెక్స్ ఆన్ ఇండియా ఇగ్నైట్ ఆచార్యులకు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి కంప్యూటర్లు సమకూరుస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆవాస విద్యాలయం కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో అందరూ గ్రామీణ ప్రాంత విద్యార్థులేనని, అంతేగాకుండా చుట్టూ ఉన్న వెనుకబడిన బస్తీల్లో విద్యా వికాసం కోసం కృషి చేస్తుందన్నారు. అపెక్స్ ఆన్ ఇండియా లీడ్ వెంకటస్వామి, ఎడ్యుకేట్ ప్రతినిధులు ఇమ్రాన్, స్వప్నిక తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ స్పృహ పెంచేలా ఆర్ట్ ఎగ్జిబిషన్



సాక్షి, సిటీబ్యూరో: మేరు ఇంటర్నేషనల్ పాఠశాల తన వార్షిక ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను మేరు అంతరాగ్ని–25 పేరుతో నిర్వహించింది. ఈ ఏడాది కళాత్మక ప్రతిభ, పర్యావరణ స్పృహ పెంచేలా ప్రదర్శించారు. రీసైకిల్, అప్ సైకిల్ ముడివస్తువులతో తయారు చేసిన కళాఖండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశం యొక్క సాంస్కృతిక గొప్పతనాన్ని ప్రతిబింబించే చెరియాల్, మధుబని, పట్టచిత్ర, పిచ్వాయి, కలంకరితో సహా భారతదేశ సంప్రదాయ కళారూపాలను కళ్లకు కట్టినట్లు తీర్చిదిద్దారు. వ్యర్థ పదార్థాలతో తయారు చేసిన ఒక ఎత్తయిన గడియారం గ్లోబల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సమస్యలను పరిగణనలోకి తీసుకునేలా ప్రదర్శించారు.

దోపిడీ ఉన్న చోటే ఉద్యమాలు

హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

పంజగుట్ట: ఎక్కడైతే అసమానత్వం, అన్యాయం, దోపిడీ జరుగుతుందో అక్కడే అసంతృప్తి, ఉద్యమం మొదలవుతుందని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. మాల, మాదిగల విద్య, ఉద్యోగాలు, రాజకీయం అన్ని లెక్కలు బయటకుతీస్తే 100 శాతం మాదిగలకు అన్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా బీసీ, ప్రజాస్వామిక మేధావుల సంఘీభావ రౌండ్‌టేబుల్ సమావేశం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించారు. డాక్టర్ పృథ్వీరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌తో పాటు విమలక్క, ప్రొఫెసర్ మురళీ మనోహర్, ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, ప్రొఫెసర్ తిరుమలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఎక్కడైతే అన్యాయం, దోపిడీ జరుగుతుందో అక్కడే ఉద్యమం మొదలవుతుందని అన్నారు. మాదిగల పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని, అన్ని ఉద్యమాల్లో వెంట ఉంటామన్నారు. మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. కేవలం మాలలే వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని, ఇప్పటి వరకు తమ అవకాశాలు దోచుకున్న వారు ఇకపై కూడా అవకాశాలు పొందేందుకే వ్యతిరేకిస్తున్నారని ఆయన ఆరోపించారు. దళితుల్లో బలహీనులను దోచుకుంటాం, ఎవరూ మాట్లాడవద్దు అంటూ ఏకపక్షంగా దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 సంవత్సరాల నుంచి ఎక్కువ లబ్ది పొందుతున్న కులం అడుగడుగునా అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతోందని తెలిపారు. వారి కుట్రలను తిప్పికొడతామన్నారు. భవిష్యత్‌లో కూడా అణగారిన వర్గాల కష్టాల్లో ముందుంటానని, నేను ఏ పార్టీలో చేరేదిలేదు. నా నల్ల కండువా మారేదిలేదన్నారు. సమావేశంలో నైనాల గోవర్ధన్, తెలంగాణ విఠల్, సోగరా బేగం, కప్పర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో డ్రోన్ యూనివర్సిటీ ఏర్పాటుకు సిద్ధం



వినయ్ వెనివెల

సాక్షి, సిటీబ్యూరో: ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ యూనివర్సిటీ, నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని ఫిక్స్‌టీ గ్రూప్ వ్యవస్థాపక ఛైర్మన్ వినయ్ తెలిపారు. ఆప్టా గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్‌లో శనివారం ప్రకటించారు. వచ్చే రెండేళ్లలో రూ.100 కోట్ల పెట్టుబడులతో విస్తరణకు సిద్ధంగా ఉందన్నారు. సిబ్బందిని రెట్టింపు చేస్తామన్నారు. ఐటీ, విద్య, హాస్పిటాలిటీ, ఆరోగ్య సంరక్షణ, నైపుణ్య రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రస్తుతం యూఎస్‌ఏ, భారత్, మెక్సికోలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌లో విస్తరిస్తామన్నారు. ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ రీసైక్లింగ్ వ్యాపారాల్లోకి అడుగుపెడుతున్నామని అన్నారు. డ్రోన్ యూనివర్సిటీ భారత దేశంలోనే మొదటి విశ్వవిద్యాలయం అవుతుందన్నారు. డ్రోన్లు ప్రస్తుతం వివిధ రకాల అప్లికేషన్లలో ఉపయోగిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడంతో, ఇది అత్యాధునిక డ్రోన్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అవుతుందని వినయ్ వివరించారు.

అంధుల పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక కృషి



డాక్టర్ లూయిస్ బ్రెయిలీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నర్సింహారెడ్డి, రోహిణి తదితరులు

యాకుత్‌పురా: ప్రభుత్వ ప్రత్యేక అంధుల పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. అంధుల లిపి పితామహుడు డాక్టర్ లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా దారుషిఫా ప్రభుత్వ ప్రత్యేక అంధుల పాఠశాల, వసతి గృహంలో శనివారం నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై లూయిస్ బ్రెయిలీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం ప్రశంసనీయం అన్నారు. పాఠశాలలోని సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి, బహదూర్‌పురా మండల డిప్యూటీ ఈఓ పోమ్యనాయక్, డిప్యూటీ ఐఓఎస్–1 కే.హరినారాయణ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలివేలు మంగ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఖుద్సియా సుల్తానా, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రన్ అండ్ ఫన్



ఆరోగ్యానికి రన్‌తో పాటు ఫన్ కూడా ప్రధానమైందేనన్న అంశంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నిర్వహించిన 10కే, 5కే రన్ అండ్ ఫన్ కార్యక్రమంలో సుమారు 5000 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని శంషాబాద్ నోవాటెల్ జీఎంఆర్ ఎరీనా వద్ద ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్, నిలోఫర్ సంస్థ ఛైర్మన్ బాబురావు జెండా ఊపి ప్రారంభించారు. మంచి ఆరోగ్యానికి నడకతో పాటు నవ్వులు కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు సంగీత విభావరి, ఇతర వినోద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. – శంషాబాద్



ఎస్‌టీయూ డైరీ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) హైదరాబాద్ విభాగం రూపొందించిన డైరీ, టేబుల్ కేలండర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇఫ్తేకరుద్దీన్, ప్రధాన కార్యదర్శి పి.రామసుబ్బారావు, సయ్యద్ హబీబ్, కమల్ అహ్మద్, మీర్ మహ్మద్ అలీ, గయాజుద్దీన్, శ్యామల్‌రావు, నజీరుద్దీన్, శ్రీనివాస్, ఆనంద్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కవిత రాకతో ధర్నాచౌక్ అపవిత్రం



ఇందిరాపార్కులో కవిత ధర్నా చేసిన స్థలాన్ని పాలతో శుద్ధి చేస్తున్న పిడమర్తి రవి

కవాడిగూడ: ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీ మహాసభ నిర్వహించడంతో ఇందిరాపార్కు ధర్నాచౌక్, బీసీ వాదం అపవిత్రమైందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. పిడమర్తి రవి ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో కల్వకుంట్ల కవిత బీసీ మహాసభ నిర్వహించిన స్థలాన్ని శనివారం పాలతో శుద్ధిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిని దళితుడిని చేస్తానని మాట ఇచ్చి దళితులను తీవ్రంగా అణిచివేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దళితుడిని సీఎం చేయకపోగా మంత్రి వర్గంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఒక్కరికి కూడా చోటు కల్పించకుండా తీవ్రంగా అణిచివేసిన నియంత కేసీఆర్ అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాని సావిత్రిబాయిపూలే, బీసీవాదం అధికారం కోల్పోయాక గుర్తుకు వచ్చిందా? అని ఎద్దేవా చేశారు. కల్వకుంట్ల కుటుంబ నాటకాలను నమ్మే పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్ర బీసీలు, ఎస్సీలు లేరన్నారు. ధర్నాచౌక్ వద్దని ఆర్డర్ జారీ చేసి కేసీఆర్ కుటుంబం ఏమొఖంతో ఇందిరాపార్కులో ధర్నాలు చేస్తున్నారని ప్రశ్నించారు. బీసీల మీద ప్రేమ ఉంటే బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులను నియమించాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు వి.చంద్రశేఖర్, ఎండీ రహీం, నండ్రు నరసింహ, బోరెల్లి సురేష్, కరణ్, దర్శనం జాన్, శ్రీనాథ్, నరేష్, మీసాల మహేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'గుండె'ని అదుపు చేసిన నిమ్స్

- గుండె దడను చక్కదిద్దిన వైద్యులు
- గతేడాది వెయ్యి కేసుల వరకు పరిష్కారం

లక్డీకాపూల్: సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలకు కేరాఫ్ అడ్రస్‌గా ఖ్యాతిగాంచిన నిమ్స్ తాజాగా 'గుండె'ని అదుపులో పెట్టి తన నైపుణ్యాన్ని చాటుకుంది. రేడియో ఫ్రీక్వెన్సీ కాథెటర్ అబ్లేషన్ చికిత్సతో గుండె దడకు శాశ్వత పరిష్కారం చూపించినట్లు నిమ్స్ కార్డియాలజీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఒరుగంటి సాయిసతీష్ తెలిపారు. నిమ్స్ బోర్డు రూమ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జోగులాంబ జిల్లా గద్వాల్‌కు చెందిన కె.రామలక్ష్మీ కొంతకాలంగా గుండె దడ సమస్యతో బాధపడుతోంది. ఇటీవల రెండుసార్లు గుండె దడ వచ్చినప్పుడు సమీపంలోని ఓ ఆస్పత్రిలోని వైద్యులు ఇంజక్షన్లతో ఉపశమనం కలిగించారు. అయితే రెండోసారి వచ్చినప్పుడు గుండె దడ 5 నిమిషాల వరకు తగ్గకపోవడంతో ఆపరేషన్ చేయాల్సి వస్తుందని చెప్పారు. దాంతో ఏడాది డిసెంబర్ 28న నిమ్స్‌కు వచ్చారన్నారు. సమస్యను గుర్తించిన తమ వైద్య బృందం డిసెంబర్ 30న 2డి, 3డి సాయంతో రేడియో ఫ్రీక్వెన్సీ కాథెటర్ అబ్లేషన్ చికిత్సతో గుండె దడ సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. వాస్తవానికి ఈ చికిత్స కత్తిమీద సాములాంటిదన్నారు. అలాంటి సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను తమ వైద్య బృందం విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు.

శస్త్ర చికిత్స అనంతరం రెండు రోజుల పాటు రోగిని అబ్జర్వేషన్‌లో ఉంచి ఆ తర్వాత డిశ్చార్జి చేశామని చెప్పారు. ఈ తరహా చికిత్సలు నిమ్స్‌లో మాత్రమే జరుగుతాయని పేర్కొంటూ గత ఏడాది వెయ్యి కేసుల వరకు పరిష్కరించామని తెలిపారు. ఈ చికిత్సలను ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్‌లలోనూ అందిస్తున్నామని చెప్పారు. ఈ చికిత్స బృందంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హేమంత్, సీనియర్ రెసిడెంట్స్ డాక్టర్ సూరజ్, అమర్‌నాథ్, త్యాగు, సమాద్, పురుషోత్తం అజేయ కశ్యప్ ఉన్నట్లు డాక్టర్ సాయిసతీష్ తెలిపారు.

అబ్బురపరిచిన మ్యాజిక్ షో



సనత్‌నగర్: ఇంద్రజాలికుడు మాస్టర్ పీసీ సర్కార్ పొరుష్ మ్యాజిక్ షో అబ్బురపరిచింది. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో శనివారం నిర్వహించిన ఈ మ్యాజిక్ షోలో అద్భుతాలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ఇంద్రజాల ప్రేమికులు తరలివచ్చారు. ఈ నెల 19 వరకు ప్రతి శని, ఆదివారాల్లో సాయంత్రం 4 గంటలకు, తిరిగి రాత్రి 7 గంటలకు రెండు షోల చొప్పున ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.





ఫిట్‌నెస్ తీర్మానాలకు ఫిబ్రవరి ఓ శరాఘాతపు నెలగా మారుతోంది. ఆ నెలలో ట్రైనర్లు, జిమ్ యాజమాన్యాల సభ్యులకు పదుల సంఖ్యలో రిమైండర్లు పంపుతుంటారు.. మరోవైపు వ్యాయామ ప్రియుల డైట్‌లో ప్రొటీన్ బార్‌ల స్థానంలో తిరిగి చాక్లెట్ బార్‌లు ప్రవేశించడం మొదలవుతుంది. న్యూ ఇయర్ తీర్మానాల్లో ఎప్పుడూ టాప్ ప్లేస్‌లో ఉండే ఫిట్‌నెస్ రిజల్యూషన్ కేవలం నెలరోజుల్లోనే దాదాపు 80% మంది అటకెక్కించడం ప్రారంభిస్తారని తేలింది. - సాక్షి,సిటీబ్యూరో

- కొత్త సంవత్సర తీర్మానాల్లో ఫిట్‌నెస్‌కే ప్రాధాన్యం
- 48 శాతం మంది తీర్మానం అదేనని అధ్యయనాల వెల్లడి
- 10శాతం మంది మాత్రమే కట్టుబడి ఉంటామంటున్న వైనం
- ఆరంభ శూరత్వంతో ఆరోగ్యానికి చేటు అంటున్న వైద్యులు
- తక్కువ లక్ష్యాలతో సాధనే మంచిదంటున్న నిపుణులు
- పదుల సంఖ్యలో రిమైండర్లు పంపుతున్న యాజమాన్యాలు

జిమ్‌జాటం..!

ఫిట్‌నెస్ తీర్మానాలకు ఫిబ్రవరి ఓ శరాఘాతం

జాతీయస్థాయిలో నిర్వహించిన ఫోర్బ్స్ సస్ట్రైడ్ తాజా సర్వే ఫలితాల ప్రకారం.. ఈ ఏడాది తమ ఫిట్‌నెస్‌ని మెరుగుపరచడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా 48 శాతం మంది గుర్తించారు. కొత్త సంవత్సర తీర్మానాల్లో దానికే పెద్ద పీట వేశారు. ఫిట్‌నెస్ యాప్స్ ద్వారా తమ రిజల్యూషన్‌లకు కట్టుబడి ఉండేందుకు వీరు ప్రణాళికను సైతం రూపొందించారు. విచిత్రం ఏమిటంటే.. ఒక నెల తర్వాత తమ ఫిట్‌నెస్ లక్ష్యాలను విడిచిపెట్టే అవకాశం ఉందని వీరిలో 43 శాతం మంది అంగీకరించడం.. కేవలం 10 శాతం మంది మాత్రమే తమ తీర్మానాలకు ఏడాది పొడవునా అమలు చేస్తామని నమ్మకం వ్యక్తం చేయడం..

వెనుకబాటుకు కారణాలెన్నో..

గత కొంత కాలంగా న్యూ ఇయర్ తీర్మానాల జాబితాలో టాప్ 10లో ఉంటున్నప్పటికీ.. శరవేగంగా వదిలేస్తున్న పరిస్థితి కూడా కనిపిస్తోంది. దీనిని పరిశీలిస్తే పలు కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు..

అలవాటు లేని దినచర్య, శ్రమ..

దినచర్యలో ఆకస్మికంగా మార్పు చేర్పులు రావడం మానసిక, శారీరక ఒత్తిడికి కారణమవుతోంది. మెదడు శరీరాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ శారీరక శ్రమను నివారించమని సూచిస్తుంటుంది. కొత్తగా వ్యాయామం చేసేటప్పుడు మితిమీరి శ్రమపడే అవకాశం వ్యాయామం పట్ల ఆసక్తి క్షీణించేలా చేస్తుంది. అదే శారీరక శ్రమను తగ్గించడం వల్ల దీర్ఘకాలం పాటు మన వ్యాయామ తీర్మానాలకు కట్టుబడి ఉండవచ్చు. మన ఫిట్‌నెస్ లక్ష్యాలను సాధించడానికి తక్కువ శ్రమ సరిపోతుందని మనం నమ్మితే, వాటిని సాధించే అవకాశం పెరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఉదాహరణకు పదిహేను నిమిషాల జాగింగ్‌కు బదులు ఐదు నిమిషాలు రన్నింగ్, లేదా దీనికి బదులుగా జుంబాను ఆస్వాదించడం .. ఇలా మార్పు చేసుకోవచ్చు.. రెగ్యులర్‌గా చేసే వ్యాయామం అలసట కాక ఆహ్లాదకరంగా ఉంటే అదే మనల్ని మోటివేట్ చేస్తుందని నిపుణులు అంటున్నారు.

అలవాటుగా మార్చుకోవాలి..

ఉదయం ఒక గంట ముందుగా మంచం నుండి లేవడంతో మార్పు ప్రారంభం కావాలి. వ్యాయామ తరగతికి నడవాలా లేదా డ్రైవ్ చేయాలా వంటి ఆలోచనలతో సమయాన్ని వృథా చేయకుండా.. ఉదయమే జిమ్/యోగా సెంటర్‌లకు చేరుకోడాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలి. వ్యాయామం సంగతి అక్కడికి వెళ్లాక నిర్ణయించుకోవచ్చనే నిర్ణయంతో మొదలు కావాలి. ఇవి చిన్న చిన్న నిర్ణయాలలా అనిపించినా, మనం వాటిని చేయాల్సి వచ్చినప్పుడు వ్యాయామం చేయడానికి ప్రేరణ కలిగించే శక్తిని కలిగి ఉంటాయి.





నచ్చాలి.. నప్పాలి..

ఫిట్‌నెస్ లక్ష్యాలతో చేసే వర్కవుట్ మనసుకు నచ్చేది అయి ఉండాలి. అప్పుడే మనం ఎంజాయ్ చేయగలం.. అలా ఎంజాయ్ చేస్తేనే కంటిన్యూ చేయగలం. అంతేకాకుండా వయసు, ఆరోగ్య పరిస్థితులు, శారీరక సామర్థ్యం వీటన్నింటినీ బేరీజు వేసుకుని ఫ్యామిలీ వైద్యులతో చర్చించి ఫిజికల్ యాక్టివిటీ స్టార్ట్ చేయాలి. అలాగే ఏర్పరుచుకునే లక్ష్యాలు కూడా సాధారణంగా, ప్రాక్టికల్‌గా ఉండాలి. వీలైనంత వరకూ ప్రతి రోజూ ఎంతో కొంత సేపు వ్యాయామం చేయడం అలవాటుగా మారాలి. గంట పాటు చేస్తేనే చేసినట్టు అనుకోనక్కర్లేదు. కేవలం 10నిమిషాల పాటు చేసినా ప్రయోజనకరమే అని గుర్తించాలి. రోజువారీ దినచర్యలో దీన్నొక భాగం చేసుకోవాలే తప్ప భారం అనుకోకూడదు.

– డా.కిషోర్‌రెడ్డి, అమోర్ హాస్పిటల్స్



సగానికి తక్కువ మందే..

పెద్ద పెద్ద లక్ష్యాలతో వ్యాయామం ప్రారంభించడం, తర్వాత వాటిని కొనసాగించలేకపోవడం సర్వసాధారణం. ముఖ్యంగా జనవరి నెలలో జిమ్స్‌లో సభ్యత్వాలు చెప్పుకోదగ్గ సంఖ్యలో పెరగడానికి న్యూ ఇయర్ తీర్మానాలే కారణం. అయితే అలా ప్రారంభించిన వారిలో సగానికన్నా తక్కువ మంది మాత్రమే కొనసాగిస్తారు. మేం మాత్రం తీర్మానాల పట్ల ఆసక్తి తగ్గకుండా ప్రతి సభ్యుడినీ వ్యక్తిగతంగా ఫోన్స్, యాప్స్ ద్వారా ప్రోత్సహిస్తుంటాం. సభ్యుల లక్ష్యాలను సాధించానికి కావాల్సిన సంపూర్ణ సహకారాలు అందిస్తుంటాం. – వంశీరెడ్డి, ఐ జిమ్



స్వల్పకాలిక లక్ష్యాలు..

చాలా మంది ప్రారంభంలో చేసే మరో తప్పు భవిష్యత్తు లక్ష్యాలను సుదూరంగా సెట్ చేయడం. ఓ 15 కిలోల బరువు తగ్గాలి అని ముందే లక్ష్యం నిర్దేశించుకోవడం కన్నా.. 15 రోజుల పాటు రోజూ జిమ్‌కి వెళ్లాలి.. అనే సాదా సీదా లక్ష్యం మేలు చేస్తుంది. ఫలితం చాలా దూరంలో ఉన్నప్పుడు, మన మెదళ్లు ప్రేరణను పొందవు కాబట్టి వ్యాయామం చేయడానికి తక్కువ మొగ్గు చూపుతాం. వీలైనంత స్వల్పకాలిక లక్ష్యాన్ని ఎంచుకోవడం ద్వారా ఖచ్చితంగా చేయగలమనే నమ్మకంతో మన ఆలోచనలు సానుకూలంగా మారతాయి.



క్యాంపస్ అందాలతో..
కేలండర్



ప్రకృతి అందాలు, పచ్చదనం, వృక్ష సంపద, నీటి వనరులు, జంతుజాలానికి నెలవుగా శివారులోని హెచ్‌సీయూ క్యాంపస్ ప్రసిద్ధి చెందిందని తెలిసిందే.. నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో కొనసాగే క్యాంపస్‌లలో హెచ్‌సీయూ మొదటి స్థానంలో నిలుస్తుందని చెప్పక తప్పదు. ఈ క్యాంపస్‌లోని అందాలను తమ సెల్‌ఫోన్లు, కెమెరాల్లో బంధించిన విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు వీటిని హెచ్‌సీయూ అధికారులకు అందించగా వారు 2025 కేలండర్ రూపకల్పనలో వీటిని వినియోగించారు. ప్రతి సంవత్సరం విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులచే సేకరించిన ఫొటోలను మాత్రమే కేలండర్ రూపకల్పనకు వినియోగించడం కొంత కాలంగా వస్తోంది. ఇలా రూపొందించిన కేలండర్‌ను ఇటీవల వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ వేర్వేరుగా ఆవిష్కరించారు. – రాయదుర్గం







ముగిసిన ఆక్రుతి ఎగ్జిబిషన్



మూడు రోజులుగా హోటల్ తాజ్ కృష్ణలో ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ శనివారంతో ముగిసింది. చివరి రోజు ఆ సంస్థ డైరెక్టర్ శశి నహత, మోడల్స్‌తో కలసి వివిధ రకాల ఆభరణాలను ప్రదర్శించారు. ఎగ్జిబిషన్‌లోని ఆభరణాలు ఔత్సాహికులు, అలంకరణ ప్రియులను అలరించాయి. - సాక్షి, సిటీబ్యూరో

ఫరెవర్ మిసెస్ యూనివర్స్ తెలంగాణ విజేతగా
సంగీతా కపట



సాక్షి, సిటీబ్యూరో: ఫరెవర్ మిసెస్ యూనివర్స్ తెలంగాణ టైటిల్‌ను సంగీతా కపట సొంతం చేసుకున్నారు. జైపూర్‌లోని జీ స్టూడియోస్‌లో గత నెల 26న జరిగిన వేడుకల్లో ఈ టైటిల్ అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'నా కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది.. దీనిని సాకారం చేసుకునేందుకు ఎంతో కృషి, పట్టుదలతో ప్రయత్నం చేశాను. తెలంగాణకు ప్రాతినిధ్యం వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఈ విజయంతో మహిళలు వృత్తిపరంగా, వ్యక్తిగతంగా తమ ప్రత్యేకతను వివిధ వేదికలపై ప్రదర్శించగలరని నిరూపితమవుతుంది' అన్నారు. కాగా ఈ టైటిల్ కోసం అనేక మంది పోటీపడ్డారు. ఈమె ప్రస్తుతం ఎంఎస్ఎన్ లాబొరేటరీస్‌లో డొమెస్టిక్ మార్కెటింగ్‌లో గ్రూప్ ప్రొడక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. అగ్రశ్రేణి ఫ్యాషన్ డిజైనర్ల అద్భుతమైన క్రియేషన్స్‌లో రన్‌వేపై నడిచి అందరి మన్ననలూ పొందారు.



నేతి పూరీ..
నోరు ఊరి..

పాతబస్తీలో హరియాణా పూరీవాలాకు ఆదరణ..



- స్వచ్ఛమైన నెయ్యితో తయారీతో ఆదరణ
- నిజాం కాలం నుంచి ఇప్పటికీ విక్రయాలు
- ప్రస్తుతం 7వ జనరేషన్ ఆధ్వర్యంలో వ్యాపారం
- షాపు ముందు క్యూకడుతున్న ఆహార ప్రియులు

చార్మినార్–చార్‌కమాన్ వద్ద ఏళ్ల తరబడి ఉత్తర భారతీయులైన బ్రాహ్మణ కుటుంబం స్వచ్ఛమైన నెయ్యితో పూరీలను తయారు చేసి వేడివేడిగా ఆహార ప్రియులకు సర్వ్ చేస్తున్నారు. హరియాణా పూరీ వాలాగా ప్రాచుర్యం పొందిన ఈ దుకాణంలో ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ నేతి పూరీలు లభిస్తాయి. చార్మినార్ శివ మందిర్ పక్క సందులోంచి ముందుకు వెళితే ఈ దుకాణం కనిపిస్తుంది. బహిరంగ మార్కెట్లో పూరీలకు ఎలాంటి మంచినూనె వినియోగిస్తున్నారో అనే అనుమానం ఉంటుంది. అలాంటి వారు పాతబస్తీకి వచ్చి మరీ ఈ పూరీలను తింటున్నారు.

ఒకే సారి వినియోగం..

ఇక్కడి నిర్వాహకులు పూరీలకు ఒకసారి వాడిన నూనెలను మళ్లీ వినియోగించరనే ప్రచారం ఉంది. దీంతో ఆరోగ్యంపై శ్రద్ధ చూపించేవారు ఇక్కడికి క్యూ కడుతున్నారు. మరీ ముఖ్యంగా పూరీ ప్రియులు ఇక్కడి పూరీలు ఒక్కసారైనా రుచి చూడాల్సిందే అన్నట్లు నిర్వహణ ఉంటుందని చెబుతున్నారు స్థానికులు. రూ.70లకు నాలుగు నేతి పూరీలను కర్రీతో సహా సర్వ్ చేస్తున్నారు.

నిజాం కాలం నుంచి..

నిజాం కాలంలో గుజరాత్, హరియాణా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి పాతబస్తీలో బంగారం, వెండి వ్యాపారాలతో పాటు ఇతర వ్యాపారాలను నిర్వహించడానికి వచ్చిన వారి కోసం ఈ కుటుంబం చార్మినార్‌కు వచ్చిందని చెబుతారు. అప్పట్లో ఎడ్ల బండిపై నెల రోజులు ప్రయాణం చేసి చార్మినార్ ప్రాంతానికి వచ్చినట్లు సునీల్ కుమార్ శర్మ తెలిపారు.

ప్రస్తుతం 7వ తరం..

అప్పట్లో హర్యానలో వ్యవసాయం చేసుకుని కన్నయ్యలాల్ అనే బ్రాహ్మణుడు తన కుటుంబంతో కలిసి పాతబస్తీ వచ్చి స్థిరపడ్డాడు. అప్పటి నుంచి జయగోపాల్, మహేషీలాల్‌జీ, బల్‌వీర్ మహరాజ్, షాగస్ శర్మ..ఇలా ఉత్తర భారతీయులకు హోటల్ ద్వారా బోజన సదుపాయాలను కల్పిస్తూ వచ్చారు. ప్రస్తుతం 7వ తరమైన సునీల్ కుమార్ శర్మ, ఆయన కుమారుడు ఆకాష్ శర్మ ఈ నేతి పూరీల వ్యాపారం కొనసాగిస్తున్నారు.

పాతబస్తీ అనగానే మాంసాహార వంటకాలే ఎక్కువగా వినిపిస్తాయి.. ఇక్కడికి వచ్చే వారికి కనిపించేది కూడా అవే.. మటన్, దమ్ కా బిర్యానీ, పత్తర్ కా ఘోష్, తందూరి చికెన్, చికెన్ బిర్యానీ, కబాబ్, షవర్మా.. ఇలా పాతబస్తీలో అడుగు పెట్టే వారిని పలుకరిస్తాయి. దీంతో పాటు స్వచ్ఛమైన వెజిటేరియన్ వంటలు సైతం అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు ఇదే ప్రాంతంలో ఆహార ప్రియుల నోరూరించే స్వచ్ఛమైన నేతి పూరీలు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాయి.. - చార్మినార్

నేతి మిఠాయిలు సైతం..



హరియాణా పూరీ వాలా అని మాకు పేరుంది. నా కుమారుడు ఆకాష్ శర్మతో కలిసి ఇక్కడ నేతి పూరీలతో పాటు మిఠాయిలు సైతం తయారు చేసి విక్రయిస్తున్నాం. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నందున దశాబ్దాలుగా మాకు వినియోగదారుల్లో ఆదరణ ఉంది. – సునీల్ కుమార్ శర్మ, యజమాని

ఆరోగ్యం ముఖ్యం..



గుల్జార్‌హౌజ్‌లో బంగారం వ్యాపారం నిర్వహిస్తాను. నా షో రూం వెనకాలే ఈ హరియాణా పూరీవాలా దుకాణం ఉంది. ప్రస్తుతం మార్కెట్లో లభించే వంట నూనేల నాణ్యతపై అనుమానాలు ఉన్నాయి. దీంతో స్వచ్ఛమైన నేతితో తయారు చేసే ఈ పూరీలను ఇష్టపడతాను. – నాగ్‌నాథ్ మాశెట్టి, గుల్జార్‌హౌజ్

ఎప్పుడైనా అందుబాటులో..



సాధారణంగా కొన్ని చోట్ల టిఫిన్స్ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకే లభిస్తాయి. కానీ మా వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ దొరుకుతాయి. అప్పటికప్పుడు వేడి వేడిగా అందిస్తాం. – ఆకాష్ శర్మ, తయారీదారులు



న్యాయానికి
ప్రతి రూపం..

బంజారాహిల్స్: న్యాయస్థానాల్లో న్యాయ దేవత కళ్లకు ఉన్న గంతలను ఇటీవలే తొలగించారు. అందుకు గుర్తుగా, ప్రతిరోజూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాకపోకలు సాగించే రహదారి అయిన బంజారాహిల్స్ రోడ్డునెంబర్–7లోని జీవీకే వన్ చౌరస్తాలో న్యాయవ్యవస్థకు అద్దంపట్టే రీతిలో అత్యంత సుందరంగా త్రాసు ప్రతిమను ఏర్పాటు చేశారు. 70 ఏళ్లుగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బంజారాహిల్స్ రోడ్డునెంబర్–7లోని అధికారిక బంగ్లా అశోక్ విహార్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన ఇదే రోడ్డులో హైకోర్టుకు వెళ్లే మార్గం కావడంతో దీనిని ప్రతిబింబించే రీతిలో ఇక్కడ కోర్టులో ఉండే త్రాసు ఏర్పాటుచేశారు. ఇటువైపు రాకపోకలు సాగించే వాహనదారులకు, పాదచారులకు ఇదొక అద్భుతమైన కట్టడంగా నిలిచిపోయింది. అందరూ ఈ రూపాన్ని చూసి హర్షిస్తున్నారు.

బెట్టింగ్‌లో డబ్బు కోల్పోయి బలవన్మరణం

• ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

మేడిపల్లి: బెట్టింగ్ వ్యసనం వల్ల ఆర్థిక ఇబ్బందులతో ఒక కానిస్టేబుల్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఐఎస్ కాలనీలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. బోడుప్పల్ ఎస్ఐఎస్ కాలనీలో నివాసముంటున్న జి.శ్రీనివాస్ (34) మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. భార్య పోలీస్ శాఖలో ఆర్ఎస్ఐగా పనిచేస్తోంది. వీరిది ప్రేమ వివాహం.. కాగా, వీరికి ఏడాదిన్నర వయసున్న కూతురు ఉంది. కొన్నాళ్లుగా శ్రీనివాస్ బెట్టింగ్‌ల్లో సుమారు రూ.20 లక్షలు పోగొట్టుకోవడంతో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇక్కడ తొలగించి.. అక్కడ పెంచి..!

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం ఎఫెక్ట్

56 వేల వృక్షాల తొలగింపు

ప్రత్యామ్నాయంగా మహబూబాబాద్‌లో 3.30 లక్షల మొక్కల పెంపకం

సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగం నిర్మాణంతో 56 వేల వృక్షాలు నేలకూలబోతున్నాయి. ఈ భాగం రోడ్డు అలైన్‌మెంటు పరిధిలో ఉన్నందున వీటిని తొలగించేందుకు అటవీ శాఖ అనుమతించింది. భారీ సంఖ్యలో వృక్షాలను తొలగించాల్సిరావటంతో పర్యావరణంపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో భవిష్యత్తులో వాటి లోటును భర్తీ చేయాలన్న ఉద్దేశంతో కోల్పోయిన చెట్లకు ప్రతిగా 3.30 లక్షల మొక్కలను పెంచాలని నిర్ణయించారు. ఇందుకోసం ఇప్పటికే మహబూబాబాద్‌లో భూమిని ఎంపిక చేశారు.

మూడు ప్రాంతాల్లో ఎక్కువ అటవీ భూములు

ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగాన్ని నిర్మించే 162 కి.మీ. నిడివిలో మూడు ప్రాంతాల్లో అటవీ భూములు అడ్డు వస్తున్నాయి. అడవి గుండా రోడ్డు నిర్మిస్తే వన్యప్రాణుల సంచారానికి ఇబ్బందిగా మారుతుంది. దీంతో ఆయా అటవీ భూముల్లో ఏదో ఒక చివరి నుంచి అలైన్‌మెంటు సాగేలా కన్సల్టెన్సీ సంస్థ దృష్టి పెట్టింది. రోడ్డుకు ఓవైపు 95 శాతం అటవీ భాగం ఉంటే, మరోవైపు 5 శాతం వరకు మాత్రమే ఇతర భూమి ఉండేలా అలైన్‌మెంటును రూపొందించింది. గజ్వేల్, నర్సాపూర్, యాదాద్రి ప్రాంతాల్లో ఈ అటవీ భూములున్నాయి. మెదక్ జిల్లా పరిధిలో 35.5882 హెక్టార్లు, సిద్దిపేట జిల్లా పరిధిలో 28.2544 హెక్టార్లు, యాదాద్రి జిల్లా పరిధిలో 8.511 హెక్టార్లు.. వెరసి 72.3536 హెక్టార్ల మేర అటవీ భాగం అలైన్‌మెంటు పరిధిలోకి వచ్చింది. అంటే 200 ఎకరాలకు లోపు మాత్రమే ఉత్తర రింగు ప్రభావానికి గురికానున్నాయి. ఈ ప్రాంతాల్లో 44 వేల వృక్షాలను తొలగించాల్సి ఉంటుందని లెక్క తేల్చారు. దీంతో వాటిని తొలగించేందుకు ఇటీవల అటవీ శాఖ అనుమతించింది. ఇక అటవీ భూముల వెలుపల ఉండే సాధారణ భూముల్లోని మరో 12 వేల వృక్షాలను కూడా తొలగించాల్సి ఉంటుందని లెక్కతేల్చారు. వెరసి ఉత్తర భాగం పరిధిలో 56 వేల వృక్షాలను తొలగించబోతున్నారన్న మాట.

పరిహారం స్థానంలో మొక్కల పెంపకం

ప్రాజెక్టుల్లో కోల్పోయే అటవీ భూములకు కూడా పరిహారం ఇచ్చే విధానం గతంలో అమల్లో ఉండేది. అయితే మోదీ ప్రభుత్వం.. పరిహారానికి బదులు ప్రత్యామ్నాయ భూములు ఇచ్చి వాటిల్లో మొక్కలను పెంచాలని నిర్ణయించింది. ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి ఇప్పుడదే వర్తింపజేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో ప్రత్యామ్నాయ భూమి కేటాయించారు. కొత్తగూడ మండలం పరిధిలోని పొగుళ్లపల్లి, నీలంపల్లి, గంగారం మండలం పరిధిలోని చింతల్‌గూడ గ్రామంలో ఈ భూమిని గుర్తించారు. ఈ మూడు గ్రామాల పరిధిలో కలిపి 3,29,452 చెట్లు పెరిగేలా త్వరలో మొక్కలు నాటనున్నారు.

జంతువులకు ఇబ్బంది కలుగకుండా ఎకో బ్రిడ్జీలు

3 అటవీ ప్రాంతాల్లో జింకలు, దుప్పులు, నక్కలు, కోతులు, కొండముచ్చులు, నెమళ్లు, ఎలుగుబంట్లు కొన్ని ఇతర జంతువులు ఉన్నాయని గుర్తించారు. రోడ్డు నిర్మాణంతో వీటికి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోనున్నారు. జంతువులు ఒకవైపు నుంచి రోడ్డు దాటి మరోవైపు వెళ్లేలా ఎకో బ్రిడ్జీలు (పర్యావరణ హిత వంతెనలు) నిర్మించనున్నారు. వీటివల్ల పైనుంచి వాహనాలు వెళ్తున్నా, జంతువులు దిగువ నుంచి మరోవైపు వెళ్లేందుకు, వచ్చేందుకు వీలవుతుంది. ఇక జంతు సంచారం మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వాహనాల శబ్దాలు వాటిని ఇబ్బంది పెట్టకుండా రోడ్డుకు రెండు వైపులా నాయిస్ బారియర్స్ ఏర్పాటు అంశం పరిశీలనలో ఉంది.



బాబే సుప్రీం.. రెడ్‌బుక్కే రాజ్యాంగం!

ఏపీలో బరితెగించి వ్యవహరిస్తున్న సీఐడీ

న్యాయస్థానమంటే ఖాతరు లేదు.. సీఆర్‌పీసీ 164 అంటే లెక్కే లేదు

సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా కుతంత్రం

ఐఏఎస్ అధికారులతో తప్పుడు వాంగ్మూలాల నమోదుకు పన్నాగం

సాక్షి, అమరావతి: భారత రాజ్యాంగమే ప్రామాణికం.. సుప్రీంకోర్టు తీర్పులే మార్గ నిర్దేశం.. అన్నది దేశంలో పరిపాలన వ్యవస్థకు దిక్సూచి. పాలకులు, అఖిల భారత సర్వీసు అధికారులతోపాటు అందరూ పాటించాల్సిన విధివిధానాలవి. కానీ రాష్ట్ర సీఐడీ విభాగం అందుకు పూర్తి విరుద్ధంగా బరితెగిస్తోంది. 'చంద్రబాబే మాకు సుప్రీం.. టీడీపీ రెడ్‌బుక్కే మాకు రాజ్యాంగం.. చంద్రబాబు అవినీతి కేసులు నీరుగార్చడమే ఏకైక లక్ష్యం' అని చెలరేగిపోతోంది. అందుకోసం ఏకంగా న్యాయస్థానాల్లో సీఆర్‌పీసీ 164 కింద నమోదు చేసిన వాంగ్మూలం పవిత్రత, ప్రామాణికతనే దెబ్బ తీసేలా కుట్రలకు పదును పెడుతోంది. ఓసారి సీఆర్‌పీసీ 164 కింద ఇచ్చిన వాంగ్మూలాన్ని మార్చేందుకు వీల్లేదన్న సుప్రీం కోర్టు మార్గదర్శకాలను బరితెగించి మరీ ఉల్లంఘిస్తోంది. చంద్రబాబు సూత్రధారి, పాత్రధారిగా సాగిన కుంభకోణాల గురించి గతంలో పలువురు ఐఏఎస్ అధికారులు న్యాయస్థానంలో ఇచ్చిన వాంగ్మూలాలకు భిన్నంగా తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేయించేందుకు సీఐడీ సన్నాహాలు వేగవంతం చేస్తోంది. డీజీపీ పోస్టు ఇస్తానని ముఖ్యనేత ఎర వేయగానే సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కూడా తోసిరాజంటూ సీఐడీ ఉన్నతాధికారి చెలరేగిపోతుండటం విస్మయ పరుస్తోంది. ఈ వ్యవహారం యావత్ దేశాన్ని విస్మయానికి గురి చేస్తోంది.

కుంభకోణాల కుట్రదారు చంద్రబాబే

2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు. రాజధాని అమరావతిలో అసైన్డ్ భూముల కుంభకోణం, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో అక్రమాల కుంభకోణం, ఫైబర్‌నెట్ కుంభకోణం, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కుంభకోణం, మద్యం కుంభకోణం, ఇసుక కుంభకోణం.. ఇలా వివిధ కుంభకోణాలతో వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. వాటిపై సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) కేసు నమోదు చేసి పూర్తి ఆధారాలతోసహా ఆ భారీ దోపిడీని బట్టబయలు చేసింది. ఆ వ్యవహారాల్లో కీలక పాత్రధారులుగా ఉన్న ఐఏఎస్ అధికారులను విచారించింది. నిబంధనలకు విరుద్ధమని తాము అభ్యంతరం తెలిపినప్పటికీ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోలేదని వారు చెప్పారు. చంద్రబాబు ఒత్తిడితోనే నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూముల బదలాయింపు, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు, కాంట్రాక్టుల కేటాయింపు, నిధుల విడుదల.. ఇలా అన్ని వ్యవహారాలు సాగాయని వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వంలో సీఆర్‌డీఏ కమిషనర్‌గా వ్యవహరించిన చెరుకూరి శ్రీధర్, ఫైబర్‌నెట్ ఎండీగా వ్యవహరించిన అజయ్ జైన్, గుంటూరు కలెక్టర్‌గా చేసిన కాంతిలాల్ దండే తదితరులు ఆ వాస్తవాలను 'సిట్'కు తెలిపారు. అంతే కాకుండా ఆ విషయాలను న్యాయస్థానంలోనూ వెల్లడించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఆర్‌పీసీ 164 కింద వారు ఇచ్చిన వాంగ్మూలాలను న్యాయస్థానం నమోదు చేసింది. అందుకే ఆ కేసుల్లో చంద్రబాబును ప్రధాన నిందితుడు(ఏ1)గా పేర్కొంటూ సిట్ కేసులు నమోదు చేసింది. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్ట్ చేయగా, ఆయన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో 52 రోజులు రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే.

మొదటి వాంగ్మూలానికి విరుద్ధంగా ఉండకూడదు

సీఆర్‌పీసీ 164 కింద ఓసారి న్యాయస్థానంలో నమోదు చేసిన వాంగ్మూలం అత్యంత విశ్వసనీయమైనదిగా పరిగణిస్తాం. ఎందుకంటే న్యాయమూర్తి ఎదుట ప్రమాణ పూర్వకంగా నమోదు చేసిన వాంగ్మూలమది. ఆ వాంగ్మూలాన్ని మార్చేందుకు వీల్లేదు. గతంలో ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా వాంగ్మూలం ఇచ్చేందుకు సాక్షులు ప్రయత్నిస్తే వారిని సంబంధిత న్యాయస్థానం ప్రశ్నించాలి. మొదట ఇచ్చిన వాంగ్మూలాన్నే సాక్ష్యంగా పరిగణలోకి తీసుకోవాలి.

– 2024 నవంబరు 25న ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు. ఈ మేరకు ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన ఓ కేసులో జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం విస్పష్టమైన తీర్పునిచ్చింది.

విరుద్ధంగా ఇస్తే కఠిన చర్యలు

ఓసారి సీఆర్‌పీసీ 164 కింద ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరోసారి వాంగ్మూలం ఇస్తే అది నేరంగా పరిగణిస్తాం. ఎందుకంటే ప్రమాణ పూర్వకంగా ఇచ్చిన వాంగ్మూలాన్ని న్యాయమూర్తి చదవి వినిపించిన తర్వాత సమ్మతించి, మరీ సంతకం చేసి ఇచ్చిన వాంగ్మూలమది. మొదటిసారి ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరో వాంగ్మూలం ఇవ్వడమంటే.. మొదట ఇచ్చింది తప్పుడు వాంగ్మూలమని అంగీకరించినట్టే. అత్యంత విశ్వసనీయమైన న్యాయస్థానంలో న్యాయమూర్తి ఎదుట ప్రమాణం చేసి మరీ తప్పుడు వాంగ్మూలం ఇచ్చినట్టు అవుతుంది. అంటే అబద్ధపు వాంగ్మూలం ఇచ్చినందుకు నేరంగా పరిగణిస్తాం. ఆ విధంగా అబద్ధపు వాంగ్మూలం ఇచ్చిన వారిపై ఐపీసీ 193, సీఆర్‌పీసీ 340 కింద కఠిన చర్యలు తీసుకుంటాం.

– వినోద కుమారి వర్సస్ మధ్యప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు

ఎదుర్కోవాల్సిన పరిణామాలను న్యాయమూర్తి వివరించాలి

సీఆర్‌పీసీ 164 కింద ఓసారి ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మరో వాంగ్మూలం ఇచ్చేందుకు సాక్షి ప్రయత్నిస్తే.. దాని వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులు, ఎదుర్కోవాల్సి వచ్చే పరిణామాల గురించి న్యాయమూర్తి ఆ సాక్షికి వివరించాలి.

– అలహాబాద్ హైకోర్టు తీర్పు



తప్పుడు వాంగ్మూలాల నమోదుకు ప్రభుత్వ కుట్ర

గత ఏడాది రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం చంద్రబాబు అవినీతి కేసులను నీరుగార్చేందుకు కుట్రకు తెరతీసింది. అందుకోసం డీజీపీ, సీఐడీ అధికారులు ఆ కేసుల దర్యాప్తు వివరాలను చంద్రబాబుకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అంటే ప్రధాన నిందితుడే ఆ కేసులను సమీక్షించారు. ఆ కేసులను ఎలా నీరుగార్చాలనే కుట్రకు అప్పుడే బీజం పడింది. అనంతరం చంద్రబాబు తరపున గతంలో వాదించిన ఢిల్లీ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా రంగ ప్రవేశం చేశారు. డీజీపీ, సీఐడీ అధికారులతో సమావేశమై చంద్రబాబుపై కేసులను నీరుగార్చే కుట్రకు కార్యాచరణ రూపొందించారు. గతంలో చంద్రబాబే కుట్రదారు.. కుంభకోణాలకు ఆయనే సూత్రధారి.. అని న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన వారితో తాజాగా తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించాలని పన్నాగం పన్నారు. ఆ బాధ్యతను సీఐడీకి అప్పగించారు. గతంలో సిట్‌లో సభ్యులుగా ఉన్న కింది స్థాయి అధికారులను డీజీపీ, సీఐడీ చీఫ్ పిలిపించుకుని మరీ తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేసే ప్రక్రియను వివరించారు. బాధిత రైతులు, సాధారణ సాక్షులను కింది స్థాయి అధికారులు బెదిరిస్తుండగా, ఐఏఎస్ అధికారులతో తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించే బాధ్యతను సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ భుజానికెత్తుకున్నారు.

బెదిరించి.. భయపెట్టి..

కుట్రలో భాగంగా ఐఏఎస్ అధికారులు చెరుకూరి శ్రీధర్, అజయ్ జైన్‌లతో తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించేందుకు సీఐడీ బరితెగించింది. గతంలో న్యాయస్థానంలో 164 సీఆర్‌పీసీ కింద తాము ఇచ్చిన వాంగ్మూలానికి విరద్ధంగా వాంగ్మూలం ఇవ్వాలని వారిపై సీఐడి తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చింది. బెదిరింపులకు పాల్పడింది. తప్పుడు వాంగ్మూలం ఇవ్వకపోతే సంగతి తేలుస్తామని హెచ్చరించింది. గతంలో ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా తప్పుడు వాంగ్మూలం ఇవ్వడం సాధ్యం కాదని, అది నేరమని కూడా ఆ అధికారులు, న్యాయ నిపుణులు చెప్పినా సరే సీఐడీ చీఫ్ రవి శంకర్ అయ్యన్నార్ ఏమాత్రం వినిపించుకోలేదని సమాచారం. ఇలా సీఐడీ సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించి చెరుకూరి శ్రీధర్, అజయ్ జైన్‌లను బెంబేలెత్తించారు. దాంతో వారు తప్పుడు వాంగ్మూలాలు ఇచ్చేందుకు సమ్మతించినట్టుగా సీఐడీ వర్గాలు చెబుతున్నాయి. వారిద్దరితో గుంటూరులోని న్యాయస్థానంలో శుక్రవారం తప్పుడు వాంగ్మూలం నమోదు చేయించేందుకు సీఐడీ అధికారులు తీసుకువచ్చేందుకు సిద్ధపడ్డారు. అయితే న్యాయాధికారి సెలవులో ఉండటంతో ఆ ప్రయత్నాన్ని శనివారానికి వాయిదా వేశారు. తీరా శనివారం చెరుకూరి శ్రీధర్ ఒక్కరినే తీసుకెళ్లారు. కోర్టు బయట కొద్ది సేపు హైడ్రామా నడిచింది. ఆ తర్వాత కోర్టు హాలు లోపలికి వెళ్లకుండానే శ్రీధర్ వెనుదిరిగారు. మళ్లీ ఈ నెల 8వ తేదీన ఆయన్ను న్యాయస్థానానికి తీసుకొచ్చి వాంగ్మూలం నమోదు చేయించాలని సీఐడీ నిర్ణయించినట్లు తెలిసింది.

నాడు గూండాల బెదిరింపులు.. నేడు సర్కారు వేధింపులు

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రాజధానిలో అసైన్డ్ భూములు, ఇన్నర్ రింగ్ రోడ్డు కుంభకోణాల గురించి న్యాయస్థానంలో వాంగ్మూలం ఇచ్చిన ఐఏఎస్ అధికారి చెరుకూరి శ్రీధర్.. తనను ఆ కేసుల్లో సాక్షిగా పరిగణించాలని కోరారు. దాంతో ఆయన అంతు చూస్తామని టీడీపీ గూండాలు బెదిరించారు. తీవ్ర ఆందోళన చెందిన ఆయన అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. టీడీపీ గూండాల నుంచి తనకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా పోలీసు శాఖను కోరారు. దాంతో ఆయనకు పోలీసు శాఖ ప్రత్యేకంగా గన్‌మెన్‌ను కేటాయించింది. అప్పటి నుంచి ఆయనకు గన్‌మెన్ భద్రత కొనసాగుతోంది. అప్పట్లో టీడీపీ గూండాలు బెదిరింపులకు పాల్పడగా, ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వమే అధికారికంగా ఆయన్ను బెదిరిస్తోంది. తప్పుడు వాంగ్మూలం ఇవ్వకపోతే అంతు తేలుస్తామని సీఐడీ ద్వారా వేధిస్తోంది. కాగా, రాష్ట్ర ప్రభుత్వం, సీఐడీ తీరుపై న్యాయ నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సీఆర్‌పీసీ 164 వాంగ్మూలాల గురించి సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతోపాటు గతంలో ఇచ్చిన తీర్పులను ఉటంకిస్తున్నారు.

ఏడేళ్ల వరకూ జైలు శిక్ష

న్యాయస్థానాల్లో కేసుల విచారణ ప్రక్రియలో ఏ సందర్భంలో అయినా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వడం తీవ్రమైన నేరం అని సెక్షన్ 229 (1) స్పష్టం చేస్తోంది. అటువంటి అబద్ధపు వాంగ్మూలం ఇచ్చిన వ్యక్తికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించేందుకు అవకాశం కల్పిస్తోంది. అంటే సీఆర్‌పీసీ 164 కింద న్యాయమూర్తి ఎదుట ప్రమాణ పూర్వకంగా రెండు విరుద్ధ వాంగ్మూలాలు ఇస్తే అందులో ఒకటి అబద్ధపు వాంగ్మూలమే అవుతుంది. మొదటి వాంగ్మూలం గానీ రెండో వాంగ్మూలం గానీ ఏది అబద్ధపు వాంగ్మూలం అయినా శిక్షార్హమే. దాన్ని నేరంగా పరిగణించి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు.

మరీ ఇంత ద్రోహమా? ఇంత బరితెగింపా?

• కూటమి సర్కార్ తీరుపై వైఎస్ జగన్ మండిపాటు
• తల్లికి వందనం, రైతు భరోసా ఎక్కడ చంద్రబాబూ?
• ప్రజలను నమ్మించి.. అధికారంలోకి వచ్చాక వంచనా?
• పిల్లలు, తల్లులు, రైతులు, యువత, వలంటీర్లు.. అందరినీ మోసం చేశారు



సాక్షి, అమరావతి: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో అలసత్వం, నిర్లక్ష్యం, ఎగవేత ధోరణి ప్రదర్శిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తాజాగా తల్లికి వందనం ఎగవేతపై కూటమి సర్కార్‌ను నిలదీశారు. లక్షలాది మంది తల్లులు, పిల్లలు.. అన్నదాతలంటే మీకు అలుసా.. అని ప్రశ్నించారు. మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేయడం, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కడం మీకు అలవాటుగా మారిపోయిందని నిప్పులు చెరిగారు. ఈ మేరకు శనివారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విటర్) ఖాతాలో పోస్ట్ చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

- ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలపై ఇంతటి బరితెగింపా? మేనిఫెస్టోపై ఇంతటి తేలిక తనమా? ప్రజలకు ఇచ్చిన మాటను అమలు చేయకుండా టేక్ ఇట్ గ్రాంటెడ్‌గా తీసుకుంటారా? లక్షల మంది తల్లులకు, పిల్లలకు, రైతులకు ఇంతటి ద్రోహం తలపెడతారా?
- అధికారంలోకి వస్తే తల్లికి వందనం అని, ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. అధికారంలోకి రాగానే అంతకు ముందు మేం ఇస్తున్న అమ్మ ఒడి పథకాన్ని సైతం ఆపేశారు. వరుసగా కేబినెట్ సమావేశాలు జరుగుతున్నాయి కానీ, తల్లికి వందనం పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారో నిర్దిష్టంగా చెప్పలేదు. తీరా ఈ ఏడాదికి ఇవ్వం అని కేబినెట్లో తేల్చి చెప్పేశారు. ఇంతకన్నా మోసం ఏమైనా ఉంటుందా? ఇంతకన్నా పచ్చి దగా ఏమైనా ఉంటుందా?
- ఇక రైతు భరోసా తీరు కూడా అలానే ఉంది. ఈ ఏడాది ఖరీఫ్, రబీ రెండు సీజన్లు అయిపోతున్నా ఇవ్వకుండా గడిపేశారు. మేము అధికారంలోకి వచ్చిన ఆ ఏడాదే.. అంటే 2019 అక్టోబర్‌లో ప్రారంభించి నప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం రూ.13,500 చొప్పున 53.58 లక్షల మంది రైతుల చేతిలో, రూ.34,378 కోట్లు పెట్టాం. కేంద్రం ఇచ్చేది కాకుండా మీరు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. ఇప్పుడు ఖరీఫ్ అయిపోయిందీ, రబీ కూడా అయిపోయింది. ఒక్క పైసా ఇవ్వలేదు. ఇది రైతులను నిలువెల్లా మోసం చేయడం కాదా? 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ రూ.18 వేలు ఇస్తామన్నదీ మోసమే. నిరుద్యోగ భృతి కింద యువతీ యువకులకు రూ.36 వేలు చొప్పున ఇస్తామన్నది కూడా మోసమే. 50 సంవత్సరాలు నిండిన ప్రతి అక్కకూ రూ.48 వేలు అయినా మోసమే. ఇంటింటికీ సేవలు అందిస్తూ మంచికి అర్థం చెప్పిన వలంటీర్లకూ మీరు చేసింది మోసమే. ఈ మోసాలు అన్నింటికీ తోడు, మీ పాలనలో ప్రజలపై ఛార్జీలతో బాదుడే బాదుడు కనిపిస్తోంది. ప్రతి అడుగులోనూ స్కామ్‌లే. ఇసుకను వదలడం లేదు, మద్యాన్నీ వదలడం లేదు.
- చంద్రబాబూ గారూ.. రోజులు గడుస్తున్న కొద్దీ, మీరు చేస్తున్న మోసాలు ఒక్కొక్కటీ బయటకు వస్తూనే ఉన్నాయి. ఇవి ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తున్నాయి. ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి, వారి గొంతుకై నిలుస్తోంది. ప్రజలకు మీరు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం వారి తరఫున నిలబడుతుంది.

ఐదేళ్లలో 5 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్

• ఆ దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.. టన్ను పామాయిల్ గెలలకు రూ.20 వేలు
• వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి
• రాష్ట్రాల వ్యవసాయశాఖ మంత్రులతో.. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ వీడియో కాన్ఫరెన్స్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న ఐదేళ్లలో ఆయిల్‌పామ్ సాగు ఐదులక్షల హెక్టార్లకు చేరుతుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. వివిధ రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులతో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, వాటి పురోగతి, భవిష్యత్ ప్రణాళికలను మంత్రి తుమ్మల వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరతో ఈసారి రాష్ట్రంలో 53,617 మెట్రిక్ టన్నుల సోయాబీన్స్ సేకరించామని చెప్పారు. ఆయిల్‌పామ్ విస్తరణలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే లక్ష హెక్టార్లలో ఆయిల్‌పామ్ పంట సాగులోకి వచ్చిందని, రానున్న ఐదేళ్లలో అదనంగా మరో 4 లక్షల హెక్టార్లలో పంటసాగు పెంచేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు కనీస మద్దతు ధర రూ.20 వేలుగా నిర్ణయించినట్లు వెల్లడించారు.

పసుపు, మిర్చికి ఎంఎస్‌పీ ఇవ్వండి

రాష్ట్రంలో పండించే పసుపు, మిర్చి పంటలకు కూడా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించే విషయాన్ని పరిశీలించాలని మంత్రి తుమ్మల కేంద్రాన్ని కోరారు. పీఎండీసీ మార్గదర్శకాల ప్రకారం డ్రిప్, ఇతర సాగునీటి పరికరాల సూచనాత్మక ధర చాలా తక్కువగా ఉందని, డ్రిప్ పరికరాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, రైతుల ప్రయోజనార్థం సూచనాత్మక ధరలను పునఃపరిశీలించాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాసినట్లు గుర్తుచేశారు. ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ ప్రభుత్వం డ్రిప్ పరికరాల ఖర్చులు రూ.53,465లుగా నిర్ణయించగా, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సూచనాత్మక ధర కేవలం రూ.27,304 ఉందని గుర్తుచేశారు. నాసిరకం విత్తనాలతో పంట నష్టపోతే సదరు విత్తన కంపెనీలు రైతులకు నష్టపరిహారం చెల్లించేవిధంగా విత్తన చట్టంలో సవరణలు చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు కొన్నేళ్లుగా రాష్ట్రంలో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను సబ్సిడీ ధరకు అందిస్తున్నామని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులను మరింతగా ప్రోత్సహించేందుకు కేంద్రం ఆర్థిక సహాయం అందించాలని కేంద్రాన్ని అభ్యర్థించారు.

హోరాహోరీగా సచివాలయం ఉద్యోగుల ఎన్నికలు

సాక్షి,హైదరాబాద్: రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. శనివారం రాత్రి 12 గంటలు దాటే వరకు అధ్యక్ష, కార్యదర్శితో సహ మరో 8 పోస్టుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఎన్నికల్లో జాయింట్ సెక్రటరీ (పబ్లిసిటీ)గా పి.రాజేశ్వర్ (ఎస్వో హెచ్ఎం అండ్ ఎఫ్‌డబ్ల్యూ) గెలుపొందారు. సంఘం కోశాధికారిగా సెక్షన్ ఆఫీసర్ కైలాసం తన సమీప ప్రత్యర్థి అభ్యర్థి వినోద్‌కుమార్‌పై 87 ఓట్ల ఆధిక్యంతో కైలాసం గెలుపొందారు. ఉదయం నుంచి ఉత్కంఠభరితంగా సాగిన ఓటింగ్ ప్రక్రియలో సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వివిధ శాఖలవారీ ప్రతినిధులుగా మణికుమార్ (హోం), గౌతమి (ఇరిగేషన్), పార్థసారథి (లెజిస్లేచర్) ఎన్నికైనట్లు సమాచారం. మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ సాగింది. సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలై.. అర్ధరాత్రి దాటాక కూడా కొనసాగింది. మొత్తం 1,059 ఓట్లకుగాను 1,101 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ 96.18 శాతం నమోదైంది.

గగుర్పొడిచే సాహసాలకు గిన్నిస్ గుర్తింపు

• పనికెర క్రాంతికుమార్ మరో రికార్డు
• ఒకేసారి నాలుగు గిన్నిస్ సర్టిఫికెట్లు సాధన



గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులతో క్రాంతికుమార్

సూర్యాపేట: ఒళ్లు గగుర్పొడిచే సాహసాలకు కేరాఫ్ అడ్రస్ అయిన పనికెర క్రాంతికుమార్ మరో రికార్డు నెలకొల్పాడు. అంతర్జాతీయ వేదికపై అరుదైన సాహసాలు ప్రదర్శించి ఒకేసారి 4 గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లు అందుకొన్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన క్రాంతికుమార్ 2024 ఫిబ్రవరిలో ఇటలీలోని మిలాన్ నగరంలో జరిగిన కార్యక్రమంలో అద్భుత ప్రదర్శన ఇచ్చాడు. ఆయన చేసిన సాహసాలు ఇప్పటివరకు ప్రపంచంలో ఎవరూ చేయకపోవడంతో గిన్నిస్ వరల్డ్ రికార్డు సంస్థ ఆయనకు తన బుక్‌లో చోటిచ్చింది. ఇటీవల ఆ సంస్థ నిర్వాహకులు క్రాంతికుమార్‌కు అవార్డులు ప్రదానం చేశారు. ఈ విషయాన్ని క్రాంతికుమార్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు.

రికార్డులు సాధించింది ఈ విభాగాల్లోనే..

- 60 సెకన్లలో 72 టేబుల్ ఫ్యాన్లను నాలుకతో ఆపగా, అందులో 57 ఫ్యాన్లు ఆగినట్లు రికార్డు నమోదైంది.
- గొంతులో రెండు అడుగుల పొడవైన 37 కత్తులు దింపుకుని 16 సెకన్లలో 1,944 కిలోల బరువు (కారు, దానిపై ఎనిమిది మంది)ని లాగాడు.
- 60 సెకన్లలో నాలుగు ఇంచుల పొడవైన 22 మేకులను ముక్కులో దించుకుని రక్తపు చుక్క రాకుండా కొత్త రికార్డు నమోదు చేశాడు.
- 60 సెకన్లలో మరుగుతున్న నూనె నుంచి 17 చికెన్ ముక్కలను బయటకు తీశాడు.

ఏంటో నా జీవితం... పిచ్చిలేస్తోంది..

• సూసైడ్ నోట్ రాసి విద్యార్థిని ఆత్మహత్య



తేజస్విని

శామీర్‌పేట్: 'నాకు ఏమీ రావు.. ఏంటో నా జీవితం.. పిచ్చిలేస్తుంది.. అసలు లైఫ్ మొత్తం ఇలానే ఉంటుందా.. నాకు చనిపోవాలనిపిస్తుంది' అంటూ స్కూల్ నోట్ బుక్‌లో సూసైడ్ నోట్ రాసి ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధి తుర్కపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లాకు చెందిన నాగ వెంకటరమణ–లక్ష్మి దంపతులు 15 ఏళ్ల క్రితం తుర్కపల్లికి వలస వచ్చి ఉమాశంకర్ రైస్‌మిల్‌లో కార్మికులుగా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. వీరి కూతురు తేజస్విని సాయి దుర్గాలక్ష్మి (16) గ్రామంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో 10వ తరగతి చదువుతోంది. ఈ నెల 3న తలనొప్పిగా ఉందని తేజస్విని స్కూల్‌కు వెళ్లలేదు. రాత్రి కుటుంబమంతా కలిసి భోజనం చేసి నిద్రించారు. శనివారం ఉదయం 6.30 గంటల సమయంలో తల్లి లక్ష్మి బాత్ రూంకు వెళ్లగా తేజస్విని బాత్‌రూంలో చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న జీనోమ్ వ్యాలీ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. దర్యాప్తులో స్కూల్ నోట్ బుక్‌లో సూసైడ్ నోట్ గుర్తించారు. కాగా తేజస్విని అతిగా నిద్రించేదని, తల్లిదండ్రులు మందలించడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

చెంగిచర్ల ఎలక్ట్రిక్ బైక్ గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం

• రూ.8 కోట్ల ఆస్తి నష్టం



గోడౌన్‌లో ఎగిసి పడుతున్న మంటలు

మేడిపల్లి: ఎలక్ట్రిక్ బైక్‌ల గోడౌన్‌లో అగ్ని ప్రమాదం జరిగి రూ.8 కోట్ల విలువ చేసే ఆస్తినష్టం జరిగింది. ఈ ఘటన శనివారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చెంగిచర్లలో ఫ్రాంక్లిన్ ఎలక్ట్రిక్ వెహికల్ మాన్యుఫాక్చరింగ్ గోడౌన్ ఉంది. 15 రోజుల కిందట బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని రామకృష్ణనగర్‌లో 2 వేల గజాల స్థలంలో షెడ్ వేశారు. చెంగిచర్లలో ఉన్న గోడౌన్ నుంచి బైక్‌లను రామకృష్ణనగర్‌కు తరలించారు. శనివారం మధ్యాహ్నం తర్వాత గోడౌన్‌లో పార్టిషన్ పనుల కోసం వెల్డింగ్ చేస్తున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్ముకుంది. ఇది గమనించిన నిర్వాహకులు, స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశాయి. మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి, బోడుప్పల్ కమిషనర్ రామలింగం తదితరులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ ఘటనలో రూ. 8 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

ముగ్గు ముచ్చట





యమునా రాణి
మల్కాజ్‌గిరి, హైదరాబాద్.

15 చుక్కలు, 15 వరుసలు.





సి. హంసవేణి, 7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
చిట్వేలి, అన్నమయ్య జిల్లా.

21 చుక్కలు, 11 వరకు, సందు చుక్క

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com







నేడు జాతీయ పక్షుల దినోత్సవం



బర్డ్ ఉమన్

పిట్టలు వాలిన చెట్టు

పురుషుల చరిత్రలో స్త్రీలు తెర వెనుక ఉంటారు. ప్రఖ్యాత పక్షి శాస్త్రజ్ఞుడైన సలీం అలీని 'బర్డ్ మేన్ ఆఫ్ ఇండియా' అంటారు. కాని 'బర్డ్ ఉమన్ ఆఫ్ ఇండియా' కూడా ఉంది. ఆమె పేరు జమాల్ ఆరా. బిహార్‌కు చెందిన జమాల్ ఆరా ఎన్నో అరుదైన పక్షులను, వాటి జీవనాన్ని గుర్తించి, రికార్డు చేసింది. జనవరి 5 జాతీయ పక్షుల దినోత్సవం. పక్షుల ఆవరణాలను కాపాడుకోవడంతోపాటు వాటికై స్త్రీలు చేసిన సేవను కూడా గుర్తు చేసుకోవాలి.

మనిషికి పక్షిని చూశాకే ఎగరాలనే కోరిక పుట్టింది. పక్షి మనిషికి అలారం. రైతుకు పురుగుల మందుగా మారి పురుగు పుట్రను తిని పంటను కాపాడింది. పక్షి పాట పాడింది. పురి విప్పింది. గంతులేసింది. పలుకులు పలికింది. ఎడతెగని ఉల్లాసాన్ని ఇచ్చింది. జనవరి 5 'జాతీయ పక్షుల దినోత్సవం' ఎందుకు జరుపుతామంటే పక్షి గురించి చైతన్యం కలిగించుకోవడానికి. ప్రపంచంలో దాని వాటా దానికి ఇవ్వడానికి. దానినీ బతకనివ్వమని కోరడానికి.

అడవులు, ఆవాసాలు

మన దేశంలో నలభై యాభై ఏళ్ల క్రితం వరకూ కూడా పక్షులు, మనుషులు కలిసి బతికేవారు. అడవిలో ఉండే పక్షులు, జలాశయాల పక్షులు, వలస పక్షులు... ఇవి కాక మనిషి ఆవాసాల దగ్గర ఉండే పిచుకలు, కాకులు, కోయిలలు, గోరవంకలు... వంటివి మనగలిగేవి. మనిషి ఆవాసాల్లో పెరళ్లు, బావులు, చెట్లు మాయమయ్యాక ఇక అవి వాటికి కాకుండా పోయాయి. సెల్‌ఫోన్ టవర్లు, కాంక్రీట్‌తనం, రేడియేషన్... పిచుకలకు దెబ్బ కొడుతోంది. అడవులను కొట్టేయడం వల్ల అడవి పిట్టలు... జలాశయాల ఆక్రమణల వల్ల తడి, తేమల్లోని పురుగుల్ని చేపల్ని తినే కొంగలు, పిట్టలు ఆర్తనాదాలు చేసే స్థితికి వచ్చాయి. పక్షులు లేని ఈ ప్రపంచం క్షణమైనా బాగుంటుందా? అందుకే పక్షికి గుక్కెడు నీళ్లు, గుప్పెడు గింజలు, మాంజా దారాలు లేని ఆకాశం ఇవ్వగలగాలి. పిల్లలకు నేర్పగలగాలి. 'బర్డ్‌వాచింగ్'ను హాబీగా మార్చగలగాలి.



పక్షిని చూపే వేలు

పక్షి శాస్త్రజ్ఞులను 'ఆర్నిథాలజిస్ట్' అంటారు. మన దేశంలో పక్షుల గురించి విశేష పరిశోధన చేసిన పక్షి శాస్త్రజ్ఞుడిగా సలీం అలికి పేరు. కాని ఆయన వలే పక్షుల గురించి కృషి చేసిన తొలి మహిళ జమాల్ ఆరా. బిహార్‌లోని రాంచీకి చెందిన జమాల్ ఆరా అనుకోకుండా పక్షుల గురించి ఆసక్తి కనబరిచింది. పదో తరగతి వరకూ చదువుకున్న ఆమె వివాహమై, కుమార్తె జన్మించాక భర్త నుంచి వేరుబడాల్సి వచ్చింది. దాదాపుగా రోడ్డు మీదకు వచ్చిన ఆమెకు సోదరుడి వరుసైన ఒక బంధువు ఆశ్రయమిచ్చాడు. అతడు బిహార్‌లో ఫారెస్ట్ ఆఫీసర్. అడవుల్లో అతని ఉద్యోగం వల్ల జమాల్‌కు అడవి మీద ఆసక్తి, ఆ తర్వాత పక్షుల పట్ల కుతూహలం ఏర్పడింది. 1949 నుంచి 1988 వరకూ ఆమె బిహార్‌లోని ఎన్నో అడవుల్లో విస్తృతంగా బర్డ్ వాచింగ్ చేసింది. ఎన్నో రకాల పక్షులను గుర్తించి, వాటి జీవన చక్రాన్ని నమోదు చేసింది. ఆ కృషిని గమనించిన సలీమ్ అలి ఆమెకు 'బర్డ్ ఉమన్' అని బిరుదు ఇచ్చాడు.

అడవుల కోసం

బిహార్‌లో అడవుల నరికివేత మీద జమాల్ ఆరా పోరాటం చేసింది. అడవులు పోతే ఎడారులొస్తాయని పక్షులు బతకవని ప్రభుత్వానికి లేఖలు రాసింది. రాచరిక కుటుంబాలు సరదా కోసం బిహార్‌లో ఖడ్గమృగాలను వేటాడటాన్ని నిషేధించాలని కోరింది. 'అడవిలోకి ఎవరు వచ్చినా ఫారెస్ట్ ఆఫీసర్లు గానీ మామూలు మనుషులుగాని.. వారి దగ్గర తుపాకులు ఉండకూడదు' అని ఆమె 1950ల లోనే సూచించింది. 1970లో ఈ నియమం అమలయ్యింది. ఎందుకంటే తుపాకీ చేతిలో ఉంటే అడవిలో పేల్చబుద్ధవుతుంది. ఒక మూగజీవో పక్షో మరణిస్తుంది. పిల్లల కోసం పక్షుల గురించి పుస్తకాలు రాసి, ఆల్ ఇండియా రేడియోలో ఎన్నో ప్రసంగాలు చేసిన జమాల్ ఆరా ప్రపంచవ్యాప్త జర్నల్స్‌లో తన పరిశోధనలు ప్రచురించుకోవడం తెలియక తెర వెనుక ఉండిపోయింది. ఇటీవలే ఆమె కృషి బయటకు తెలిసి మహిళా జాతి గర్వపడుతోంది.

1995లో మరణించిన జమాల్ ఆరాను– 'ఫస్ట్ ఇండియన్ బర్డ్ ఉమన్'గా చరిత్ర గుర్తు పెట్టుకుంటుంది.

మేనికి మేకప్

చలికాలం చర్మం పొడిబారే సమస్య అధికంగా ఉంటుంది. పొడిచర్మం గలవారికి ఇది మరింత సమస్య. నూనె శాతం ఎక్కువ ఉండే క్రీములు, లోషన్లు ఉపయోగిస్తే చర్మం మృదువుగా ఉంటుంది. అందుకు... ఇంట్లో చేసుకోదగిన సౌందర్యసాధనాలు..



ఆలివ్ ఆయిల్‌తో...

కోకోబటర్‌లో చర్మాన్ని మృదువుగా మార్చే మాయిశ్చరైజర్ లక్షణాలు అధికంగా ఉన్నాయి. టేబుల్ స్పూన్ కోకోబటర్– ఆలివ్ ఆయిల్ కలిపి మిశ్రమం తయారు చేసుకోవాలి. ఇది ముఖానికి, మెడకు రాసి 15–20 నిమిషాలు ఉంచి, గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.

పాల మీగడ

మీగడలో ఉండే నూనె చర్మాన్ని పొడిబారనీయదు. తేనెలో చర్మసంరక్షణకు సహాయపడే ఔషధాలు ఉన్నాయి. మీగడ–తేనె కలిపి ముఖానికి, చేతులకు రాసుకొని పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. రోజూ పాల మీగడ–తేనె కలిపిన మిశ్రమాన్ని ఉపయోగిస్తే చర్మకాంతి పెరుగుతుంది.



బొప్పాయి

విటమిన్–ఇ అందితే చర్మం త్వరగా మృదుత్వాన్ని కోల్పోదు. బాగా పండిన బొప్పాయి ముక్కను గుజ్జు చేసి, దాంట్లో పచ్చిపాలు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు, చేతులకు రాసి ఆరనివ్వాలి. తర్వాత కడిగేయాలి.



బాదం నూనె

కోకో బటర్, బాదం నూనె సమపాళ్లలో తీసుకొని కలిపి, మిశ్రమం తయారు చేసుకోవాలి. రాత్రి పడుకునే ముందు ఈ మిశ్రమాన్ని చర్మానికి అప్లై చేయాలి. చర్మం పొడిబారే సమస్య దరిచేరదు.

ఇంటిప్స్



- మైక్రోవేవ్ గ్రిల్‌కు పట్టిన జిడ్డు వదలాలంటే... మైక్రోవేవ్‌లో ఉపయోగించే ఒక పాత్రలో కప్పు బేకింగ్ సోడా, కప్పు నీటిని పోసి ఒవెన్‌లో పెట్టి ఐదు నిమిషాల పాటు ఆన్ చేయాలి. ఆఫ్ చేసిన తర్వాత బేకింగ్ సోడా పాత్రను బయటకు తీసేసి మెత్తటి వస్త్రంతో ఒవెన్ లోపలి భాగాలన్నింటినీ తుడవాలి. బేకింగ్ సోడాలో నిమ్మరసం కూడా కలుపుకోవచ్చు.
- గ్లాస్ టాప్ స్టవ్ జిడ్డు పడితే బేకింగ్ సోడా చల్లి, నిమ్మకాయ చెక్కతో రుద్దాలి. చివరగా శుభ్రమైన క్లాత్ లేదా టిష్యూతో తుడిస్తే చాలు. నీటితో కడగాల్సిన అవసరం ఉండదు.



- వంటగదిలో సింకు, ట్యాప్‌లకు పట్టిన గార వదలాలంటే... బేకింగ్ సోడాను చల్లి స్క్రబర్‌తో రుద్ది కడగాలి. స్క్రబర్‌కు అందని మూలల్లో పాత టూత్ బ్రష్‌తో రుద్ది కడగాలి.

హెల్త్

● యుటెరైన్ ఆర్టరీ సూడో అన్యురిజమ్

ధమనిలో సునామీ

అసలు 'యుటెరైన్ ఆర్టరీ సూడో అన్యురిజమ్' అంటే ఏమిటో తెలుసుకునే ముందర అన్యురిజమ్ అంటే ఏమిటో చూద్దాం. కొన్నిసార్లు రక్తనాళాల (ధమనుల) గోడలు కొన్ని చోట్ల పలుచబడి బెలూన్‌లా ఉబ్బే ప్రమాదం ఉంది. ఇలా ఉబ్బినట్లు కావడాన్ని 'అన్యురిజమ్స్' అంటారు. అ పలచబడిన రక్తనాళాలు చిట్లి రక్తస్రావం అయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. ఇక యుటెరైన్ ఆర్టరీ సూడో అన్యురిజమ్ (యూఏపీఏ) అంటే... గర్భసంచికి (యుటెరస్‌కు) సప్లై అయ్యే రక్తనాళం ఉబ్బడం. అయితే 'సూడో' అంటే వాస్తవమైనది కాదనీ, ఉబ్బులా కనిపిస్తూ, చిట్లినప్పటికీ రక్తస్రావం చాలా కొద్ది ప్రాంతానికి పరిమితమవుతుందని అర్థం. అందుకే దీన్ని 'యుటెరైన్ ఆర్టరీ సూడో అన్యురిజమ్' అని చెప్పవచ్చు. ఇది కాస్తంత అరుదుగా కనిపించే సమస్యే అయినప్పటికీ ప్రాణాంతకం అయ్యే అవకాశమున్నందున దీనిపై అవగాహన కోసం...

నిజానికి సూడో అన్యురిజమ్ గురించి మరింత విపులంగా చెప్పుకోవాలంటే... అన్యురిజమ్స్ అనేవి దేహంలోని రక్తనాళాల్లో ఎక్కడైనా రావచ్చు. మెదడులో, గుండెకు రక్తాన్ని చేసే థొరాసిక్ ప్రాంతాల్లో వచ్చినప్పుడు ప్రమాదకరంగా మారతాయి. అయితే ఇప్పుడు యుటెరస్‌కు రక్తసరఫరా చేసే రక్తనాళం బాగా పలుచబారి ఒక చిన్న బెలూన్‌లా లేదా సంచిలా ఉబ్బి చిట్లితే అది రక్తస్రావం చాలా కొద్ది ప్రాంతానికి మాత్రమే పరిమితమవుతుంది. చుట్టుపక్కల ఉండే కణజాలం ఆ రక్తస్రావాన్ని చాలాదూరం ప్రవహించనివ్వదు. అయితే ఈ కండిషన్ తీవ్రమైన బాధ కలిగిస్తుంది. యుటెరస్‌లోని ఫైబ్రాయిడ్స్ వంటి తిత్తులు చిట్లడం వల్ల గానీ లేదా కొన్నిసార్లు గర్భస్రావాలు అయినప్పుడుగానీ ఇలాంటి కండిషన్ ఏర్పడటానికి అవకాశాలెక్కువ. అయితే ఇది తక్షణం శస్త్రచికిత్సకు దారితీయవచ్చు. ఒక్కోసారి తుంటి ఎముక విరగడానికి కూడా అవకాశాలుంటాయి.

లక్షణాలు... ● యోని నుంచి భారీగా రక్తస్రావం ● ఈ రక్తస్రావంలో మధ్య మధ్య అంతరాయాలు (అంటే... అదేపనిగా కాకుండా కాసేపు కనిపిస్తూ, మరికాసేపు ఆగుతూ అప్పుడప్పుడూ జరుగుతుండవచ్చు) ● పొత్తికడుపు నుంచి కింది భాగమంతా తీవ్రమైన నొప్పి ● కొన్నిసార్లు పై లక్షణాలేమీ కనిపించకపోవచ్చు కూడా (అసింప్టమేటిక్‌గా వచ్చే ఈ సమస్య... ఇతర కారణాలను అన్వేషిస్తూ ఇమేజింగ్ పరీక్షలు చేస్తున్నప్పుడు బయటపడవచ్చు).

నిర్ధారణ... ***ఈ కింద పేర్కొన్న పరీక్షల వల్ల సూడో అన్యురిజమ్ కారణంగా జరుగుతున్న రక్తస్రావాలు తెలుస్తాయి.***

● డాప్లర్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ ● కాంట్రాస్ట్ ఎన్‌హ్యాన్స్‌డ్ అల్ట్రాసౌండ్ ● కంప్యూటెడ్ టోమోగ్రఫీ (సీటీ స్కాన్) ● మేగ్నెటిక్ రెసోనెన్స్ ఇమేజింగ్ (ఎమ్మారై) ● యాంజియోగ్రఫీ

చికిత్సలు... ● **మేనేజ్‌మెంటే తొలి చికిత్స...**

అన్యురిజమ్‌కు చికిత్స అన్నది రక్తనాళాల ఉబ్బు సైజు, బాధితురాలిలో కనిపిస్తున్న లక్షణాలను బట్టి ఉంటుంది. ఒకవేళ ఉబ్బు చిన్నగా ఉన్నట్లయితే 'యుటెరైన్ ఆర్టరీ ఎంబోలైజేషన్' అనే ప్రక్రియను అనుసరిస్తారు. (ఇందులో చాలా చిన్న గాటుతో అక్కడికి రక్తం చేరకుండా ఆపుతారు). కొన్ని సందర్భాల్లో పూర్తిస్థాయి శస్త్రచికిత్స చేయాల్సి రావచ్చు. అయితే చిన్నగాటుతో చేసే ఎంబోలైజేషన్‌కే డాక్టర్లు ప్రాధాన్యమిస్తుంటారు. చిన్న గాటుతోనే చికిత్స పూర్తి చేయడానికి అవకాశముండటంతో బాధితురాలికి ప్రాణాపాయం ముప్పు చాలా తక్కువగా ఉండటమే దీనికి కారణం.



డా. సవితా రాథోడ్,
కన్సల్టెంట్ గైనకాలజిస్ట్



యుటెరైన్ ఆర్టరీ సూడో అన్యురిజమ్‌కు అత్యాధునిక చికిత్సలు...

సమస్య ఉన్న ప్రాంతం వంటి అంశాలను బట్టి మరికొన్ని ఆధునిక చికిత్సలను డాక్టర్లు అనుసరిస్తుంటారు. ఉదా:

- **యుటెరైన్ ఆర్టరీ ఎంబోలైజేషన్ (యూఏఈ)** : ఇది ప్రామాణికంగా చేసే చాలా మంచి చికిత్స (గోల్డ్ స్టాండర్డ్ ట్రీట్‌మెంట్). ఇందులో చాలా చిన్న గాటుతో రక్తనాళంలోకి మరో చిన్న పైపును (క్యాథెటర్)ను పంపుతారు. ఆ తర్వాత ఉబ్బు వచ్చిన రక్తనాళాన్ని అనేక చుట్లు చుట్టడం (కాయిలింగ్ చేయడం) ద్వారా ప్రభావితమైన ప్రాంతానికి రక్తసరఫరాను నిలిపివేస్తారు. దాంతో ఉబ్బిన చోటికి రక్తం ఆగడంతో అది చిట్లే ప్రమాదం తప్పిపోతుంది. ఇది చాలా మంచి చికిత్స ప్రక్రియగా అనేకసార్లు నిరూపితమైంది.
- **శస్త్రచికిత (సర్జికల్ ఇంటర్వెన్షన్)** : ఒకవేళ యుటెరైన్ ఆర్టరీ ఎంబోలైజేషన్ (యూఏఈ)కి అవకాశం లేకపోయినా లేదా యూఏఈ ప్రక్రియ విఫలమైన సందర్భాల్లో శస్త్రచికిత్సకు పూనుకుంటారు. ఇందులో పలుచబడ్డ ప్రాంతాన్ని తొలగించి, మళ్లీ రక్తనాళాలను కలపడమో లేదా మరీ ప్రాణాపాయ పరిస్థితి ఉన్నప్పుడు హిస్టరెక్టమీ ప్రక్రియ ద్వారా గర్భసంచిని తొలగించడమో చేస్తారు.

హైబ్రీడ్ టెక్నిక్స్... కొన్ని సందర్భాల్లో ఇటు ఎంబోలైజేషన్‌తో పాటు అటు సర్జరీ... ఈ రెండూ కలగలసిన ప్రక్రియలను అనుసరిస్తారు. మరీ ముఖ్యంగా ఆ ప్రాంతాల్లో ఏదైనా కారణాలతో గాయాలైనా లేదా క్యాథెటర్‌తో ఆ ప్రాంతాన్ని చేరడానికి కష్టమవుతున్న సందర్భాల్లో ఇలాంటి ఇరు ప్రక్రియల కలయికతో కూడిన హైబ్రీడ్ టెక్నిక్స్‌ను అవలంబిస్తారు.



● 'వింటర్' ది డ్రాగన్

చలిపులి చర్మం వలుస్తోందా?

కొత్త ఏడాది తర్వాత క్రమక్రమంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయేమోగానీ... అందరూ బయటే ఎక్కువసేపు గడిపే సాయంత్రాలూ, పనులకు వెళ్లే ఉదయం వేళల్లో చలి కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఈ సీజన్‌లో వీచే కరకుగాలులు వాతావరణం నుంచి తేమను లాగేస్తాయి. అవి చర్మం నుంచి కూడా తేమను లాగేస్తుండం వల్ల మేను పొడిబారుతుంది. పొట్టుగా రాలుతుంది. ఇలాంటి సమస్యలన్నీ ఈ సీజన్‌లో అనివార్యంగా కనిపిస్తుంటాయి. ఒక్కొక్కరి చర్మ స్వభావం ఒక్కోలా ఉండటం వల్ల కొందరిలో చలికాలపు సమస్యలు ఎక్కువగానూ, మరికొందరిలో తక్కువగానూ కనిపిస్తుంటాయి. ఈ చలి సమస్యల తీవ్రత చర్మంపై చాలా ఎక్కువగా ఉన్నవారిలో... వారి మేనిపై పగుళ్లు, చర్మం పొట్టుగా రాలడం వంటి లక్షణాలతో ఎక్జిమా తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. అలా ఈ సీజన్‌లో కనిపించే సమస్యల నుంచి రక్షణ పొందడమెలాగో తెలుసుకుందాం.

కేవలం కొన్ని చిన్న చిన్న మార్పులతో చలికాలపు తీవ్రత నుంచి మిమ్మల్ని కాపాడుకోవచ్చు. అవి తెలుసుకునే ముందర ఈ కాలంలో వచ్చే కొన్ని సాధారణ చర్మ సమస్యలేమిటో చూద్దాం...

ఇవీ సాధారణంగా కనిపించే చర్మ సమస్యలు...

- **ఎక్జిమా ఫ్లేర్స్** : తక్కువ ఉష్ణోగ్రతల వల్ల చర్మం ప్రభావితమై ఎగ్జిమాలాంటి పగుళ్లు.
- **చర్మం పొడిబారడం, పొట్టుగా రాలడం** : బయటి చల్లగాలి కారణంగా దేహంలోని వేడిమి చర్మం నుంచి బయటకు వెళ్లడంతో తేమ కూడా బయటకు వెళ్తుంది. దాంతో చర్మం బాగా పొడిబారిపోవడమే కాకుండా, పొట్టుగా రాలుతుంది.
- **పగిలే పెదవులు** : సున్నితమైన పెదవుల చర్మమూ పగుళ్లువారుతుంది.
- **చిల్ బ్లెయిన్స్** : చేతులూ, పాదాల మీద చర్మం కొన్నిచోట్ల (పగుళ్లు రాబోయే చోట) ఉబ్బెత్తుగా మారుతుంది. ఇలాంటి ఉబ్బెత్తు ప్రదేశాల్లో నొప్పి ఉంటుంది. వీటిని చిల్ బ్లెయిన్స్ అంటారు.
- **వింటర్ యాక్నె** : జిడ్డు చర్మం వల్లనే మొటిమలు ఎక్కువగా వస్తాయన్న భావన చాలామందిలో ఉంటుంది. దీనికి భిన్నంగా వాతావరణంలో చలి ఎక్కువగా ఉన్నప్పుడూ మొటిమలు వస్తాయి. వీటిని 'వింటర్ యాక్నే'గా చెప్పవచ్చు.

చర్మం ప్రభావితమైందని తెలిపే సూచనలివి... చలికాలపు చల్లగాలులకు చర్మం ప్రభావితమైనదనీ, దానికి ఇప్పుడు మరింత రక్షణాత్మక చర్యలు అవసరమని తెలియజేసే లక్షణాలివి...

● చర్మం ఎర్రబారడం, ఇలా ఎర్రబారిన చోట దురద రావడం ● ఏవైనా ఉపశమన చర్యలకోసం లేపనాల వంటివి రాసినప్పుడు ప్రభావితమైన చర్మభాగాలు మంటగా అనిపించడం ● చర్మం తీవ్రంగా పొడిబారినప్పుడు అక్కడ పొట్టులా రాలడం ● చర్మం నుంచి తేమ తొలగిపోవడంతో చర్మం బాగా బిగుతుగా ఉన్న ఫీలింగ్ ● ఏవైనా చర్మ సంరక్షణ లేపనాలు రాసినప్పుడు చర్మం ముట్టుకోనివ్వక పోవడం.

చర్మంపై చలికాలపు దుష్ప్రభావాల నివారణ, రక్షణ చర్యలివి...

1. **తేమ పెరిగేలా చూసుకోవడం** : చర్మం ఎప్పుడూ తేమ కోల్పోకుండా చూసుకునేందుకు క్రమం తప్పకుండా... హైలూరానిక్ యాసిడ్, షియా బటర్ లేదా సెరమైడ్స్ ఉండే మంచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి.
2. **మరవకూడని సన్ స్క్రీన్** : చలికాలపు ఎండ వేడిమిలోనూ అల్ట్రా వయొలెట్ కిరణాలు చర్మంపై ప్రభావం చూపుతాయి. అందుకే ఎండలోకి వెళ్లే ముందర 30 ప్లస్ ఎస్‌పీఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్‌ను చర్మంపై రాసుకోవడం మంచిది.
3. **హ్యూమిడిఫైయర్ వాడటం** : గదిలో పల ఉండే పొడిదనాన్ని ఎదుర్కోవడం కోసం (మరీ ముఖ్యంగా బెడ్‌రూమ్ వంటి చోట్ల) క్రమం తప్పకుండా హ్యూమిడిఫైయర్ వాడాలి.
4. **గోరువెచ్చటి నీటితో స్నానం** : వెచ్చటి నీళ్లతో స్నానం చేయడమన్నది స్నానం వేళ బాగున్నప్పటికీ ఆ తర్వాత చర్మం తీవ్రంగా పొడిబారి పగుళ్లుబారినట్లుంటుంది. దీనికి బదులు గోరువెచ్చటి నీళ్లతో స్నానం చేస్తే... స్నానం తర్వాత చర్మం బాగుంటుంది.
5. **గాఢమైన సౌందర్యసాధనాలు వద్దు** : చర్మంపై రాసుకునే ఉత్పాదనల్లో ఆల్కహాల్, రెటినాల్, మెంథాల్ వంటివి ఎక్కువ మోతాదుల్లో ఉన్నవి గానీ లేదా ఇతరత్రా గాఢమైన వాసనలు వచ్చే సౌందర్యసాధనాలకు బదులు తేలికపాటి సువాసన వెదజల్లే మైల్డ్ సౌందర్య సాధనాలు వాడుకోవడమే మంచిది.
6. **నీళ్లు తాగుతుండటం** : చర్మం కోల్పోయే నీటి మోతాదులను మళ్లీ మళ్లీ భర్తీ చేసుకునేందుకు వీలుగా ఎక్కువగా నీళ్లు తాగుతూ ఉండటం మంచిది.
7. **మేని నిగారింపును పెంచే ఆహారాలు తీసుకోవడం** : మేని నిగారింపును మరింతగా పెంచే తాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలతో కూడిన... అన్ని రకాల పోషకాలూ పుష్కలంగా ఉండే సమతులాహారం తీసుకోవడం మేలు.
8. **వైద్యనిపుణులను సంప్రదించడం** : పైన పేర్కొన్న అన్ని రకాల జాగ్రత్తలను తీసుకున్న తర్వాత కూడా చర్మంపై చలికాలపు దుష్ప్రభావాలు కనిపిస్తుంటే... తక్షణం చర్మవ్యాధి నిపుణులను సంప్రదించడం మంచిది.



డా. బాల నాగ సింధూర కంభంపాటి,
కన్సల్టెంట్ డర్మటాలజిస్ట్

అతిగా యాంటాసిడ్స్ వద్దు!

కడుపులోని యాసిడ్ గొంతులోకి వచ్చి గొంతు మండుతున్నట్లు అనిపించడం, ఆహారం ఛాతీలో ఇరుక్కున్న భావన, ఛాతీపై బరువుగా ఉన్నట్లు అనిపించడం, అజీర్తిగా అనిపించడం... లాంటి లక్షణాలు కనిపించగానే యాంటాసిడ్ మాత్రలు తీసుకోవడం, అజీర్తిని తగ్గించే ద్రావణాలు నీళ్లలో కలుపుకుని తాగడం వంటివి దాదాపుగా అందరూ చేసే పనులే. అయితే కొందరు ఈ యాంటాసిడ్ మందుల్ని వాడటం, అజీర్తిని తగ్గించే పౌడర్లు, జెల్‌లు కలుపుకొని తాగడం నిత్యం చేస్తుంటారు. తరచూ ఇలాంటి యాంటాసిడ్స్ వాడటం అంత మంచిది కాదంటూ అమెరికన్ పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఈ అజీర్తి మందులూ, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్లు, హెచ్2 బ్లాకర్స్ వాడే దాదాపు 26,000 మందిపై నిర్వహించిన పరిశోధనల్లో... అవి అతిగా వాడే వారిలో విటమిన్ బి12 లోపం వస్తుందని వారు హెచ్చరిస్తూ... ఇలాంటివారు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ అధ్యయన ఫలితాలు 'జర్నల్ ఆఫ్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్'లో ప్రచురితమయ్యాయి.

‘షూటౌట్’ చేరిన సమరం!

తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 181 ఆలౌట్
- టీమిండియాకు 4 పరుగుల స్వల్ప ఆధిక్యం
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 141/6
- రిషభ్ పంత్ మెరుపు అర్ధసెంచరీ



స్మిత్‌ను అవుట్ చేసిన ప్రసిధ్ కృష్ణ

హోరాహోరీగా సాగుతున్న బోర్డర్–గావస్కర్ ట్రోఫీ కథ ఆసక్తికర క్లైమాక్స్‌కు చేరింది... సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరి టెస్టులో తొలి రోజు బ్యాటింగ్ వైఫల్యంతో తక్కువ స్కోరుకే పరిమితమైన భారత్ రెండో రోజు పేస్ బౌలింగ్‌తో ప్రత్యర్థిని దెబ్బ కొట్టింది. ఫలితంగా నామమాత్రపు నాలుగు పరుగుల ఆధిక్యం దక్కింది... దాంతో రెండో ఇన్నింగ్స్‌లో సాధించే స్కోరే విజయ లక్ష్యాన్ని నిర్దేశించే పరిస్థితి వచ్చింది...తొలి ఇన్నింగ్స్‌లో తన దూకుడుకు కళ్లెం వేస్తూ శైలికి భిన్నంగా ఆడిన రిషభ్ పంత్‌ను ఈ సారి ఎవరూ ఆపలేదు. అతని మెరుపు హాఫ్ సెంచరీతో భారత్ మెరుగైన స్థితికి చేరింది... మూడో రోజు మిగిలిన బ్యాటర్లు పట్టుదలగా ఆడితే ఆసీస్‌కు సవాల్ విసిరే స్కోరును భారత్ సాధించవచ్చు. అయితే వెన్ను నొప్పితో శనివారం ఎనిమిది ఓవర్లే వేసిన బుమ్రా కోలుకోవడంపైనే టీమిండియా విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

సిడ్నీ: జస్‌ప్రీత్ బుమ్రా ఒంటిచేత్తో ఈ సిరీస్ భారాన్ని మోస్తున్నాడు...అతను ఆడకపోతే భారత బౌలింగ్‌లో పదును లేదు అనే విమర్శలకు ఐదో టెస్టులో రెండో రోజు సమాధానం లభించింది! వెన్నునొప్పితో బుమ్రా ఆటకు దూరమైన స్థితిలో సిరాజ్, ప్రసిధ్ పదునైన బౌలింగ్‌తో ఆసీస్‌ను కుప్పకూల్చి ఆశలు రేపారు. వీరికి నితీశ్ కూడా అండగా నిలిచాడు. ఫలితంగా ఆతిథ్య జట్టు భారత్ స్కోరును కూడా అందుకోలేకపోయింది. ఓవర్‌నైట్ స్కోరు 9/1తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో 51 ఓవర్లలో 181 పరుగులకే కుప్పకూలింది. తొలి టెస్టు ఆడుతున్న బ్యూ వెబ్‌స్టర్ (105 బంతుల్లో 57; 5 ఫోర్లు) అర్ధ సెంచరీతో జట్టును ఆదుకోగా...స్టీవ్ స్మిత్ (57 బంతుల్లో 33; 4 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. సిరాజ్, ప్రసిధ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... బుమ్రా, నితీశ్ చెరో 2 వికెట్లు తీశారు. 4 పరుగుల ఆధిక్యంలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ ఆట ముగిసే సమయానికి 32 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 141 పరుగులు సాధించింది. రిషభ్ పంత్ (33 బంతుల్లో 61; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) భారత్ తరఫున టెస్టుల్లో రెండో వేగవంతమైన (29 బంతుల్లో) అర్ధ సెంచరీ నమోదు చేశాడు. ప్రస్తుతం జడేజా (8 బ్యాటింగ్), సుందర్ (6 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు.

టపటపా...

రెండో రోజు ఆటలో తన రెండో ఓవర్లోనే లబుషేన్ (2)ను అవుట్ చేసి బుమ్రా దెబ్బ కొట్టాడు. బుమ్రా బౌలింగ్‌లోనే రెండు ఫోర్లు కొట్టి దూకుడు ప్రదర్శించిన కొన్‌స్టాస్ (23) ఆట ఎక్కువ సేపు సాగకుండా సిరాజ్ ముగించాడు. అదే ఓవర్లో మరో మూడు బంతులకు ట్రవిస్ హెడ్ (4) కూడా వెనుదిరగడంతో ఆసీస్ కష్టాలు పెరిగాయి. ఈ దశలో స్మిత్, వెబ్‌స్టర్ కలిసి కొన్ని చక్కటి షాట్లతో జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 57 పరుగులు జోడించారు. ఈ దశలో స్మిత్‌ను వెనక్కి పంపి భారత్ శిబిరంలో ఆనందం నింపిన ప్రసిధ్... లంచ్ తర్వాత అలెక్స్ కేరీని (21)ని పెవిలియన్ పంపించాడు. అనంతరం 92 బంతుల్లో వెబ్‌స్టర్ హాఫ్ సెంచరీని అందుకున్నాడు. మరో వైపు నితీశ్ రెడ్డి తన వరుస బంతుల్లో కమిన్స్ (10), స్టార్క్ (1) పని పట్టాడు. వెబ్‌స్టర్ పోరాటాన్ని ప్రసిధ్ అడ్డుకోగా, బోలండ్ (9)ను బౌల్డ్ చేసిన సిరాజ్ ఆసీస్‌కు ఆధిక్యం అందకుండా ముగించాడు.

దూకుడైన బ్యాటింగ్...

అనూహ్య బౌన్స్ ఉన్న ఈ పిచ్‌పై పదేపదే డిఫెన్స్ ఆడటం సాధ్యం కాదని గుర్తించిన భారత్ ఆరంభం నుంచి దూకుడు చూపించింది. స్టార్క్ వేసిన తొలి ఓవర్లో 4 ఫోర్లు కొట్టి యశస్వి జైస్వాల్ (22) జోరుగా రెండో ఇన్నింగ్స్‌ను మొదలు పెట్టాడు. అయితే బోలండ్ అద్భుత బౌలింగ్‌తో టీమిండియాను నిలువరించాడు. 17 పరుగుల వ్యవధిలో భారత్ తొలి మూడు వికెట్లు బోలండ్‌కే సమర్పించుకుంది. రాహుల్ (13), జైస్వాల్‌లను వరుస ఓవర్లలో అవుట్ చేసిన అతను కోహ్లి (6)ని కూడా అవుట్ చేశాడు. కోహ్లి మరోసారి స్లిప్‌లోనే క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత పంత్ ఆట మొదలైంది. తొలి బంతికే సిక్స్ బాది మొదలు పెట్టిన అతను ఎక్కడా తగ్గలేదు. మరో వైపు గిల్ (13) వెనుదిరగ్గా...వెబ్‌స్టర్ ఓవర్లో పంత్ వరుసగా మూడు ఫోర్లు బాదాడు. అతని తర్వాతి ఓవర్లో సిక్స్, ఫోర్ కొట్టిన పంత్...స్టార్క్ ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లతో చెలరేగి హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అయితే ఐదు పరుగుల వ్యవధిలో పంత్, నితీశ్ రెడ్డి (4)లను అవుట్ చేసిన ఆసీస్‌కు కాస్త ఊరట దక్కగా...ఆ తర్వాత స్లిప్‌లో సునాయాస క్యాచ్‌ను స్మిత్ వదిలేయడంతో జడేజా బతికిపోయాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 185; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: కొన్‌స్టాస్ (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 23; ఖ్వాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 2; స్మిత్ (సి) రాహుల్ (బి) ప్రసిధ్ 33; హెడ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 4; వెబ్‌స్టర్ (సి) జైస్వాల్ (బి) ప్రసిధ్ 57; కేరీ (బి) ప్రసిధ్ 21; కమిన్స్ (సి) కోహ్లి (బి) నితీశ్ 10; స్టార్క్ (సి) రాహుల్ (బి) నితీశ్ 4; లయన్ (నాటౌట్) 7; బోలండ్ (బి) సిరాజ్ 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (51 ఓవర్లలో ఆలౌట్) 181. వికెట్ల పతనం:** 1–9, 2–15, 3–35, 4–39, 5–96, 6–137, 7–162, 8–164, 9–166, 10–181. **బౌలింగ్:** బుమ్రా 10–1–33–2, సిరాజ్ 16–2–51–3, ప్రసిధ్ కృష్ణ 15–3–42–3, నితీశ్ రెడ్డి 7–0–32–2, జడేజా 3–0–12–0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) బోలండ్ 22; రాహుల్ (బి) బోలండ్ 13; గిల్ (సి) కేరీ (బి) వెబ్‌స్టర్ 13; కోహ్లి (సి) స్మిత్ (బి) బోలండ్ 6; పంత్ (సి) కేరీ (బి) కమిన్స్ 61; జడేజా (బ్యాటింగ్) 8; నితీశ్ రెడ్డి (సి) కమిన్స్ (బి) బోలండ్ 4; సుందర్ (బ్యాటింగ్) 6; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (32 ఓవర్లలో 6 వికెట్లకు) 141. వికెట్ల పతనం:** 1–42, 2–47, 3–59, 4–78, 5–124, 6–129. **బౌలింగ్:** స్టార్క్ 4–0–36–0, కమిన్స్ 11–4–31–1, బోలండ్ 13–3–42–4, వెబ్‌స్టర్ 4–1–24–1.

బుమ్రా గాయం తీవ్రత ఎంత?

సిడ్నీ టెస్టులో భారత శిబిరంలో కొంత ఆందోళన పెంచే అంశం రెండో రోజు చోటు చేసుకుంది. లంచ్ తర్వాత భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా మైదానం వీడాడు. టీమ్ డాక్టర్, సెక్యూరిటీ అధికారితో కలిసి అతను కారులో బయటకు వెళ్లిపోయాడు. బుమ్రా వెన్నునొప్పితో బాధపడుతున్నట్లు తేలింది. ముందు జాగ్రత్తగా స్కానింగ్ కోసం అతడిని ఆస్పత్రికి పంపించారు. ఆట ముగిసే సమయంలో అతను డ్రెస్సింగ్‌రూమ్‌కు తిరిగొచ్చాడు. బుమ్రా గాయం తీవ్రతపై స్పష్టత లేకపోగా, డాక్టర్లు పర్యవేక్షిస్తున్నారని మీడియాతో ప్రసిధ్ చెప్పాడు. అతను రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేసేది లేనిది ఆదివారమే తేలుతుంది. ఈ సిరీస్‌లో ఇప్పటికే 32 వికెట్లు తీసిన బుమ్రాపైనే భారత్ ఆశలు ఉన్నాయనేది వాస్తవం.

‘నేను రిటైర్ కావడం లేదు’



రోహిత్

సిడ్నీ టెస్టునుంచి తప్పుకోవడంపై రోహిత్ శర్మ స్పష్టమైన వివరణ ఇచ్చాడు. జట్టు ప్రయోజనాల కోసం తాను ఈ టెస్టుకు మాత్రమే దూరమయ్యానని, రిటైర్మెంట్ ప్రకటించడం లేదని అతను ఖరాఖండీగా చెప్పాడు. ‘నేను ఫామ్‌లో లేను, పరుగులు చేయలేకపోతున్నాను. ఇప్పటికే మన బ్యాటర్లు సిరీస్‌లో ఇబ్బంది పడుతున్నారు. కీలకమైన ఈ టెస్టులో మెరుగైన బ్యాటర్ ఉండటం జట్టుకు అవసరం. ఇది 11 మంది సభ్యుల జట్టు. వ్యక్తిగత ప్రదర్శనల గురించి కాకుండా జట్టు కోసం ఆలోచించాలి. ఇదే విషయాన్ని నేను కోచ్, సెలక్టర్‌కు చెప్పి మరీ తప్పుకున్నాను. ఇది కఠిన నిర్ణయమే అయినా జట్టు కోసం తప్పలేదు. నేను ఇక్కడకు ఆడటానికే వచ్చాను తప్ప బయట కూర్చునేందుకు కాదు. నేను ఎక్కడికీ పోవడం లేదు. రిటైర్ కావడం లేదు. మున్ముందు నా బ్యాటింగ్ మెరుగవుతుందని నమ్ముతున్నా. ఇన్నేళ్లుగా క్రికెట్ ఆడుతున్నా. చేతిలో పెన్ను, ల్యాప్‌టాప్, మైక్ ఉన్నవారంతా ఏదో ఒకటి రాస్తారు. వాటిని పట్టించుకోను’ అని రోహిత్ వ్యాఖ్యానించాడు.



పంత్

సినిమా

మూలాలు మరచిపోకూడదు

\- పవన్ కల్యాణ్



● హన్షిత, ఎస్‌జే సూర్య, అంజలి, శ్రీకాంత్, రామ్‌చరణ్, పవన్ కల్యాణ్, శంకర్, ‘దిల్’ రాజు, శిరీష్

‘‘తెలుగు జాతికి పేరు తెచ్చిన ఎన్.టి. రామారావుగారిని స్మరించుకుంటున్నాను. తెలుగు చిత్ర పరిశ్రమ ఇక్కడికి వచ్చిందంటే దానికి స్ఫూర్తి అక్కినేని నాగేశ్వర రావు, ఎన్.టి. రామారావు, ఘట్టమనేని కృష్ణ, శోభన్ బాబుగార్లు.. ఇలా ఎంతో మంది పెద్దలే. తెలుగు చిత్ర పరిశ్రమ కోసం ఎంతో మంది పెద్దలు శక్తి యుక్తులు ధారపోశారు... వారందరికీ ధన్యవాదాలు. మన మూలాలను మరచిపోకూడదు. పవన్ కల్యాణ్ ఉన్నా, రామ్‌చరణ్ ఉన్నా దానికి మూలం చిరంజీవిగారు. నేనెప్పుడూ మూలాలు మరచిపోను’’ అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, నటుడు పవన్ కల్యాణ్ అన్నారు. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘గేమ్ చేంజర్’. అనిత సమర్పణలో ‘దిల్’ రాజు, శిరీష్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలో నిర్వహించిన ‘గేమ్ చేంజర్’ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన పవన్ కల్యాణ్ మాట్లాడుతూ– ‘‘ఆర్ఆర్ఆర్’ మూవీతో రాజమౌళి, రామ్‌చరణ్, ఎన్టీఆర్‌గార్లు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారు. భారతదేశం మొత్తం తెలుగు చిత్ర పరిశ్రమవైపు చూస్తోందంటే దానికి కారణం శంకర్‌గారు. ‘రంగస్థలం’ చూసి చరణ్‌కి బెస్ట్ యాక్టర్ అవార్డు రావాలని కోరుకున్నా. తండ్రి మెగాస్టార్ అయితే కొడుకు గ్లోబల్ స్టార్ కాకుండా ఏమవుతాడు. ‘గేమ్ చేంజర్’ ట్రైలర్ చూస్తే... మంచి సామాజిక సందేశం ఉన్న సినిమా అనిపించింది. సినిమాని సినిమాగానే చూడండి. కిందపడిపోయి, మీద పడిపోయి, తొక్కిసలాటలో హీరోని చూడటం కంటే కూడా... దూరంగా నిలబడి మీరు క్షేమంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. డిమాండ్ అండ్ సప్లయ్ వల్లే టికెట్ల ధరలు పెంచుతున్నాం. ప్రభుత్వానికి 18 శాతం జీఎస్‌టీని పన్ను రూపంలో కడుతున్నాం... చిత్ర పరిశ్రమకి రాజకీయ రంగు పులమడం మాకు ఇష్టం లేదు. సినిమాలు తీసేవాళ్లే సినిమాల గురించి మాట్లాడాలి... తీయని వాళ్లు మాట్లాడకూడదు. సినిమాలు తీయకుండా రాజకీయాలు చేసేవాళ్లు మాకు నచ్చరు. ఎన్‌డీయే కూటమి (బీజేపీ, టీడీపీ, జనసేన) తరఫున నేను చెబుతున్నా. సినిమాలు తీసేవాళ్లతోనే మేము మాట్లాడతాం... వారినే గుర్తిస్తాం. సినిమా టికెట్ల ధరల పెంపుకోసం హీరోలు ఎందుకు రావాలి? అది మాకు ఇష్టం లేదు. మహా అయితే నిర్మాతలు రండి... లేదా మీ యూనియన్‌తో రండి. మేము ఇచ్చేస్తాం’’ అన్నారు. **రామ్‌చరణ్ మాట్లాడుతూ–** ‘‘గేమ్ చేంజర్’ అనే టైటిల్‌ని శంకర్‌గారు ఎందుకు పెట్టారో తెలియదు. తెర మీద బహుశా మేము చేసే పాత్ర ఒక గేమ్ చేంజింగ్ అని పెట్టారేమో అనిపిస్తోంది’’ అని చెప్పారు. **శంకర్ మాట్లాడుతూ–** ‘‘మా అమ్మాయి పెళ్లికి ఆహ్వానించేందుకు పవన్ కల్యాణ్‌గారిని కలిశాను. ఆయనలాంటి మంచి వ్యక్తి మా ‘గేమ్ చేంజర్’ వేడుకకి వచ్చినందుకు థ్యాంక్స్’’ అని చెప్పారు.

జై జై శంకర



● నాగచైతన్య, సాయి పల్లవి

‘‘నమో నమః... నమో నమః... నమో నమః శివాయ...’’ అంటూ మొదలవుతుంది ‘తండేల్’ లోని ‘నమో నమః శివాయ’ పాట. నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన ‘తండేల్’ చిత్రంలోనిది ఈ పాట. చందు మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. ఈ సినిమాలోని ‘నమో నమః శివాయ’ పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. ‘హో... డమ... డమ... డమ... డమ్... అదరగొట్టు... డమరు కాన్ని దంచికొట్టు... అష్ట దిక్కుల అదిరేటట్టు... తాండవేశ్వర... నమో నమః... నమో నమః... నమో నమః శివాయ’, ‘జై శంకర... జై జై శంకర...’ అంటూ సాగుతుందీ పాట. చిత్రసంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు జొన్నవిత్తుల సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి–హరిప్రియ పాడారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ‘‘కళాత్మక, ఆధ్యాత్మికల కలయికతో లార్డ్ శివ గ్లోరీని సెలబ్రేట్ చేసేలా... ‘నమో నమః శివాయ’ పాట ఉంటుంది’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకు కెమేరా: షామ్‌దత్.

నా జీవితంలో ఈ సినిమా ఓ అద్భుతం

సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో



వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘సంక్రాంతికి వస్తున్నాం’. ‘దిల్’ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో మాట్లాడుతూ– ‘‘సంక్రాంతికి వస్తున్నాం’ మంచి ఫ్యామిలీ మూవీ. చిన్న క్రైమ్ డ్రామా కూడా ఉంది. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ‘గోదారి గట్టు, మీనూ, బ్లాక్‌బస్టర్ పొంగల్...’ పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ రావడం ఆనందంగా ఉంది. మణిశర్మ, రమణ గోగులగార్లకు నేను అభిమానిని. ‘గోదారి గట్టు’ పాటను రమణ గోగులగారితో పాడించడం సంతోషాన్నిచ్చింది. అలాగే కొంత గ్యాప్ తర్వాత మధు ప్రియగారు ఈ పాట పాడారు. అనంత శ్రీరామ్ ‘మీనూ..’ పాటకు మంచి లిరిక్స్ ఇచ్చారు. ‘మీనూ..’ పాటను అనిల్‌గారు నన్నే పాడమన్నారు. నాతో పాటు ఈ పాటను ప్రణవి ఆచార్య పాడారు. ‘బ్లాక్‌బస్టర్ పొంగల్...’ పాటకు రామజోగయ్య శాస్త్రిగారు సాహిత్యం అందించారు. ఈ పాటను అర్ధరాత్రి వెంకటేశ్‌గారు విని, మార్నింగ్ వచ్చి తానే పాడతానని అన్నారు. ఆయనే పాడారు. నేను, రోహిణి గొంతు కలిపాము. పాట పాడిన తర్వాత నేను పాడిన పాట నచ్చకపోతే తీసేయమని వెంకటేశ్‌గారు అన్నారు. వాస్తవానికి ఆయన స్థాయి, ఇమేజ్‌కు ఆ మాట అనాల్సిన అవసరం లేదు. ఇక మా సినిమాలోని పాటలకు మంచి స్పందన లభిస్తోందంటే కారణం... సాహిత్యం పట్ల అనిల్‌గారికి ఉన్న అభిరుచి. ‘దిల్’ రాజుగారి డీపీఆర్ బేనర్‌లో ‘బలగం’ మూవీ చేశాను. ఇప్పుడు ఇంత పెద్ద సినిమా చేసే చాన్స్ కల్పించినందుకు ఆయనకు రుణపడి ఉంటాను. ఇలా అన్ని విధాలా ‘సంక్రాంతికి వస్తున్నాం’ సినిమా నా జీవితంలో జరిగిన ఓ అద్భుతం’’ అన్నారు.

కలవరం ఆరంభం



● రాజ్ తిరందాసు, విజయ్ కనిష్క

విజయ్ కనిష్క (‘హిట్ లిస్ట్’ మూవీ ఫేమ్) హీరోగా నటిస్తున్న చిత్రం ‘కలవరం’. హనుమాన్ వాసంశెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో గరీమా చౌహాన్ హీరోయిన్‌గా, కీలక పాత్రలో రాజ్ తిరందాసు నటిస్తున్నారు. శోభారాణి నిర్మిస్తున్న ‘కలవరం’ మూవీ హైదరాబాద్‌లో ఆరంభమైంది. అతిథులుగా నిర్మాతలు చదలవాడ శ్రీనివాసరావు, సి. కల్యాణ్ పాల్గొన్నారు. చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ– ‘‘బాలచందర్, భాగ్యరాజా వంటి క్రియేటివ్ డైరెక్టర్స్ తీయగలిగే మంచి కథ ‘కలవరం’. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఇప్పుడున్న ప్రభుత్వాలైనా చిన్న సినిమాలకు తోడ్పాటు కల్పించాలి’’ అన్నారు. ‘‘లవ్ స్టోరీతో పాటు ఒక డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వస్తున్న థ్రిల్లర్ మూవీ ఇది’’ అని హనుమాన్ వాసంశెట్టి చెప్పారు. విజయ్ కనిష్క మాట్లాడుతూ– ‘‘కలవరం’ కథ విన్నాక ‘హిట్ లిస్ట్’ కంటే ఎక్కువ ఎగ్జయిట్ అయ్యాను’’ అన్నారు. ‘‘మా చిత్రంలో 70 మంది నటీనటులున్నారు’’ అని శోభారాణి చెప్పారు. చిత్ర కథారచయిత శశాంక్ .పి మాట్లాడారు. ఈ చిత్రానికి కెమేరా: వెంకటేశ్, సంగీతం: వికాస్ బాడిస.

Gold Memories

మనిషి జీవితానికి ప్రతిబింబం సినిమా. ఎన్నో అద్భుతమైన చిత్రాలు మన మదిలో జ్ఞాపకాలుగా ఉన్నాయి. అవి బంగారు జ్ఞాపకాలు. అందుకే ‘సాక్షి యూట్యూబ్’ ఇక ప్రతివారం ఓ సినిమాతో మీ మనస్సును తట్టే ప్రయత్నం చేస్తుంది ‘గోల్డెన్ మెమొరీస్’ రూపంలో. ఈ వారం ‘గోల్డెన్ మెమొరీస్’లో ఓ ఆణిముత్యం అయిన ‘శంకరాభరణం’ గురించి తెలుసుకోవాలంటే ఈ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే చాలు.

యాక్షన్ కోర




● సునామీ కిట్టి, చరిష్మా

సునామీ కిట్టి హీరోగా నటించిన కన్నడ చిత్రం ‘కోర’. ఒరాటశ్రీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో చరిష్మా, పి. మూర్తి ప్రధాన పాత్రలు పోషించారు. ఏబీ నందిని, ఏఎన్ బాలాజీ, పి. మూర్తి నిర్మించిన ఈ చిత్రం తెలుగులోనూ విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని తమిళ హీరో విజయ్ సేతుపతి సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. ‘‘యాక్షన్, పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తున్న చిత్రాలకు ఇప్పుడు పాన్ ఇండియా వైడ్‌గా ఫుల్ డిమాండ్ ఏర్పడింది. మా ‘కోర’ సినిమా కూడా ఆ నేపథ్యంలో రూపొందింది. హై ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌లతో అసలు సిసలైన పాన్ ఇండియన్ మూవీలా మా ‘కోర’ ఉంటుంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం’’ అని చిత్రబృందం పేర్కొంది.

ఓటీటీ ఇది చూడొచ్చు

వయస్సు 93... మనస్సు మాత్రం 23

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం థెల్మా ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



మనకు వయస్సు మీద పడే కొద్దీ మనస్సు కూడా నీరసించిపోతుందనుకుంటాం. వయస్సు ఎంతైనా సంకల్ప బలం బాగా ఉంటే మనమేదైనా సాధించవచ్చు అని నిరూపించిన సినిమా ‘థెల్మా’. అలా అని ఇదేదో ఫ్యాంటసీ మ్యాజిక్ సినిమా అనుకుంటే పొరబడినట్లే. ఓ సాధారణ ముసలావిడ తన నుండి దోచుకున్న డబ్బు కోసం ఎటువంటి సాహసం చేసింది అనేదే ఈ సినిమా. జోష్ మార్గోలిన్ ఈ సినిమా దర్శకుడు. జూన్ స్క్విబ్ ‘థెల్మా’ సినిమాలోని ప్రధాన పాత్రలో నటించారు. ఇక్కడ ఇంకో విషయం ఏంటంటే ఆమె నటించిన పాత్ర వయస్సు 93... కానీ మనస్సు 23. ఇక జూన్ స్క్విబ్ నిజమైన వయస్సు 95... ఆమె ఈ సినిమాలో ఎంతో హుందాగా, సరదాగా నటించారు. ఈ సినిమా చూసిన తరువాత మన పెద్దవారు చాలా వరకు స్ఫూర్తి పొందే అవకాశం ఉంది. అంతలా ఏముందీ సినిమాలో... ఓ సారి లుక్కేద్దాం. కథా పరంగా 93 ఏళ్ల థెల్మా పోస్ట్ లాస్ ఏంజెల్స్ నగరంలో ఒంటరిగా నివసిస్తుంటుంది. అప్పుడప్పుడూ తన మనవడైన డెన్నీ చూడడానికి వస్తుంటాడు. ఓ రోజు థెల్మాకు ఓ అనామకుడు డెన్నీ గొంతుతో ఫోన్ చేస్తాడు. తాను ఓ యాక్సిడెంట్ చేశానని, తనను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళుతున్నారని, తాను దీని నుండి బయటపడాలి అంటే అర్జెంటుగా పదివేల డాలర్లు పంపాలని చెప్తాడు. పాపం థెల్మా ఇది మోసమని తెలియక ఆ అగంతకుడు చెప్పినట్టే డబ్బు పంపుతుంది. తరువాత తన తప్పు తెలుసుకుని చాలా బాధ పడుతుంది. కుటుంబ సభ్యులందరూ విషయం తెలుసుకుని ఇక చేసేదేమీ లేక థెల్మాని ఓదారుస్తారు. కానీ థెల్మా మాత్రం తన స్నేహితుడు బెన్‌తో కలిసి ఆ పోయిన డబ్బు కోసం పెద్ద సాహసమే చేస్తుంది. మరి... ఆ సాహసం ఏమిటి? ఆ సందర్భంలో థెల్మా ఎదుర్కొన్న పరిస్థితులేంటి? అన్నది మాత్రం జియో సినిమాలో స్ట్రీమ్ అవుతున్న ‘థెల్మా’ సినిమాలో చూడాల్సిందే. ఈ సినిమా చాలా వినూత్నంగా ఉంటుంది. మరీ ముఖ్యంగా ఈ సినిమాను మీ పిల్లలతో పాటు పెద్దవాళ్లకు చూపించడం మరచిపోకండి. ఎందుకంటే సినిమా చూసిన తరువాత ‘థెల్మా’ స్ఫూర్తితో మీ పెద్దవాళ్లందరూ మరింత ఉత్సాహంగా ఉంటారు.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

10న ఉత్తర ద్వార దర్శనం

- వైకుంఠ ఏకాదశికి యాదగిరి క్షేత్రంలో ఏర్పాట్లు



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 10న వైకుంఠ ఏకాదశి విశేష పర్వదినాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయాధికారులు, అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వీవీఐపీలు, వీఐపీలు, దాతలతో పాటు భక్తులు కూర్చునే విధంగా ఉత్తర మాడవీధిలో ప్రత్యేక గ్రిల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఉత్సవాల ప్రచార పోస్టర్లను ఆదివారం ఈవో భాస్కర్‌రావు ఆవిష్కరించనున్నారు. యాదగిరి క్షేత్రంతో పాటు అనుబంధ పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కూడా ఈ వేడుకను వైభవంగా జరిపించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

అదే రోజు నుంచి అధ్యయనోత్సవాలు

వైకుంఠ ఏకాదశి నుంచే శ్రీస్వామి వారి వార్షిక అధ్యయనోత్సవాలను నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం శ్రీస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి తిరు, మాడవీధుల్లో భక్తుల నడుమ ఊరేగిస్తారు. ఏటా నిర్వహించే ఈ అధ్యయనోత్సవాల్లో శ్రీస్వామి వారి అలంకార సేవలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. వైకుంఠ ద్వార దర్శనం అనంతరం ఆలయంలో అర్చకులు పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా అధ్యయనోత్సవాలకు శ్రీకారం చుడతారు. మొదటి రోజు 10వ తేదీన ఉదయం దివ్య ప్రబంధ సేవ కాలంతో ప్రారంభించి, పూర్వాంగ స్నపనం చేసిన తర్వాత సేవలను జరిపిస్తారు. 14న రాత్రి పరమపదోత్సవం, 15న ఉదయం రామానుజ నూతందాది ఉత్సవంతో అధ్యయనోత్సవాలు పూర్తవుతాయి.

31 వరకు ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎక్స్‌పో

సాక్షి, హైదరాబాద్: ట్రావెల్ రంగంలో 25 ఏళ్లుగా తెలుగు, కన్నడ ప్రజలకు అపార సేవలందిస్తున్న ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ట్రావెల్ ఎక్స్‌పో–2025 మెగా మేళాను నిర్వహిస్తోంది. డిసెంబర్ 16, 2024 నుంచి 31 జనవరి, 2025 వరకు హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కరీంనగర్, పొద్దుటూరులో దాదాపు 45 రోజులపాటు నిర్వహించనున్నారు. టూర్ బుక్ చేసుకున్నవారికి లక్కీడిప్ ద్వారా 10 మంది విజేతలను ప్రకటించి ఉచిత టూర్లను అందించనున్నట్లు సంస్థ అధినేత ఆర్‌వీ రమణ వెల్లడించారు. సరికొత్తగా డిజైన్ చేసిన దేశీయ టూర్ ప్యాకేజీలపై 10 శాతం తగ్గింపు, అంతర్జాతీయ టూర్ ప్యాకేజీలపై 5 శాతం భారీ డిస్కౌంట్స్ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంక్రాంతికి సొంతూరు వెళ్లేదెలా?

- రెగ్యులర్ రైళ్లలో భారీగా డిమాండ్. అరకొరగా ప్రత్యేక రైళ్లు
- ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో అదనపు దోపిడీ
- హడలెత్తిస్తున్న విమాన చార్జీలు

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న నగరవాసులకు ఇప్పటినుంచే బస్సులు, రైళ్లు చుక్కలు చూపిస్తున్నాయి. ఈసారి అనూహ్యంగా ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా వేడుకలు రావడంతో హైదరాబాద్‌తో పాటు, వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడిపేందుకు దక్షిణమధ్య రైల్వే చర్యలు చేపట్టింది. ప్రస్తుతం శబరిమలకు నడుస్తున్న రైళ్లను క్రమంగా ప్రయాగ్‌రాజ్‌కు మళ్లిస్తున్నారు. దీంతో సంక్రాంతికి ప్రత్యేక రైళ్ల సంఖ్య గణనీయంగా తగ్గనుంది. ఇప్పటికే అన్ని రెగ్యులర్ రైళ్లలో బుకింగ్‌లు భర్తీ అయ్యాయి. ఏసీ, నాన్ ఏసీల్లో ఫిబ్రవరి వరకు కూడా బెర్తులు అందుబాటులో లేవు. కొన్ని రైళ్లలో స్లీపర్ కోచ్‌లలో వెయిటింగ్ లిస్ట్ 250పైనే కనిపిస్తోంది. దీంతో హైదరాబాద్ నుంచి కాకినాడ, తిరుపతి, విశాఖ, భువనేశ్వర్, బెంగళూరు వంటి నగరాలకు ప్రయాణికుల డిమాండ్ మేరకు ప్రత్యేక రైళ్లు నడిపితే తప్ప సొంత ఊళ్లకు బయలుదేరడం సాధ్యం కాదు.



ఆర్టీసీ యథావిధిగా అ'ధనం'

సంక్రాంతి సందర్భంగా ఈసారి సుమారు 6 వేల బస్సులు అదనంగా నడిపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 10వ తేదీ నుంచి 15 వరకు ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సులను నడపనున్నారు. సాధారణంగా హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు నడిచే సుమారు 3,500 రెగ్యులర్ బస్సులకు ఇవి అదనంగా అందుబాటులో ఉంటాయి. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఏపీలోని అన్ని ప్రధాన ప్రాంతాలకు బస్సులను నడిపేందుకు చర్యలు చేపట్టారు. ఈసారి కూడా యథావిధిగా అదనపు చార్జీలు విధించే అవకాశం ఉంది. ప్రత్యేక చార్జీల ప్రస్తావన లేకుండానే గతంలో తెలంగాణ జిల్లాలకు 25 శాతం, ఏపీకి వెళ్లే బస్సుల్లో 50 శాతం చార్జీలు అదనంగా వసూలు చేశారు. ఈసారి కూడా గుట్టుచప్పుడు కాకుండా సంక్రాంతి రద్దీని సొమ్ము చేసుకొనేందుకు ఆర్టీసీ రంగంలోకి దిగింది.

ప్రైవేట్ బస్సుల దారిదోపిడీ...


సంక్రాంతి రద్దీ కంటే ముందే ప్రైవేట్ బస్సులు దారిదోపిడీకి దిగాయి. డిమాండ్ మేరకు రైళ్లు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇప్పటినుంచే సంక్రాంతి బుకింగ్‌లపై చార్జీలు పెంచాయి. కాంట్రాక్ట్ క్యారేజీలుగా నమోదైన వందలాది బస్సులు స్టేజీక్యారేజీలుగా రోడ్డెక్కి ప్రయాణికుల జేబులు లూటీ చేసేందుకు సిద్ధమయ్యాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు సాధారణ రోజుల్లో రూ.350 వరకు చార్జీ ఉంటే ప్రస్తుతం రూ.550 వరకు పెంచారు. ఈనెల 12వ తేదీ నాటికి ఇంకా పెరగవచ్చునని ట్రావెల్ ఏజెంట్‌లు స్పష్టం చేస్తున్నారు.

విమాన చార్జీలూ భారమే..

మరోవైపు హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే డొమెస్టిక్ ఫ్లైట్‌లలో కూడా చార్జీలు భారీగా పెరిగాయి. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని పలు ఎయిర్‌లైన్స్ ఇప్పటి నుంచే చార్జీలు పెంచేశాయి. ప్రస్తుతం సంక్రాంతి రద్దీతో పాటు, శబరిమల, మహాకుంభమేళాకు వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని చార్జీలు పెంచాయి. హైదరాబాద్ నుంచి విశాఖకు సాధారణంగా అయితే రూ.5,200 వరకు ఉంటుంది. కానీ ప్రస్తుతం రూ.8,000 దాటింది.సంక్రాంతి నాటికి ఇది రూ.12 వేల వరకు చేరే అవకాశం ఉన్నట్లు ట్రావెల్స్ సంస్థలు చెబుతున్నాయి. అన్ని రూట్లలోనూ ఇదే డిమాండ్ కనిపిస్తోంది.

సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన కేంద్ర జల్‌శక్తి సభ్యులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టును శనివారం కేంద్ర జల్‌శక్తి కమిషన్ సభ్యులు సందర్శించారు. ప్రధాన డ్యాం, గ్యాలరీలను, వాక్‌వే, స్పిల్‌వే, ప్రధాన జల విద్యుత్ ఉత్పాదన కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్ర జల్‌శక్తి సీనియర్ జాయింట్ కమిషనర్ సంజయ్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ.. డ్యాం రీహాబిలిటేషన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రాంలో (డీఆర్‌ఐపీ) భాగంగా శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించామని, శనివారం నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని పలు విభాగాలను పరిశీలించడానికి వచ్చామన్నారు. ప్రాజెక్టుల ఆధునీకరణకు చేయాల్సిన పనుల గురించి పరిశీలించిన అనంతరం నిధులు మంజూరు చేయాల్సి ఉంటుందని తెలిపారు. కృష్ణానది జలాల వినియోగంలో ఆంధ్ర, తెలంగాణ మధ్య విభేదాలను కూడా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. నాగార్జునసాగర్ డ్యాం ఆధునీకరణకు ఇరిగేషన్ అధికారులు గతంలోనే రూ.160 కోట్లతో ప్రతిపాదనలు చేశారని, తమ పరిశీలన అనంతరం నివేదికను కేంద్ర జల్‌శక్తి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. సాగర్ డ్యాంను పరిశీలించిన వారిలో కేంద్ర జల్‌శక్తి జాయింట్ కమిషనర్ మనోజ్ కుమార్, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) డీఈ అజయ్‌యాదవ్, జేఈ రాజేశ్, సాగర్ ఎస్ఈ శ్రీధర్‌రావు, ఈఈ మల్లికార్జునరావు తదితరులున్నారు.



నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న జల్‌శక్తి కమిషన్ అధికారులు

ఎప్పటికప్పుడు ఉద్యోగ ఖాళీల భర్తీ

అగ్నిమాపక శాఖ డ్రైవర్ ఆపరేటర్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్/ మణికొండ: ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలోని 'టీజీ ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్'లో శనివారం జరిగిన 196 మంది డ్రైవర్ ఆపరేటర్ల పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పదేళ్లుగా నిలిచిపోయిన ఉద్యోగాల భర్తీని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం తిరిగి పట్టాలెక్కించిందన్నారు. 'భర్తీ ప్రక్రియలో ఏర్పడిన న్యాయపరమైన ఇబ్బందులను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ నియామక పత్రాలను అందజేస్తున్నాం. ఈ విషయంలో మా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుంది. హోంశాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు' అని పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది సేవలను ఆయన కొనియాడారు. ఎక్కడ విపత్తు తలెత్తినా రంగంలోకి దిగి ప్రజల ప్రాణాలను కాపాడుతారన్నారు. కాగా, ఏడాది వ్యవధిలోనే అగ్నిమాపక శాఖకు సంబంధించిన విభాగాల్లో 878 మందిని భర్తీ చేసినట్టు తెలిపారు. భవిష్యత్తులో అగ్నిమాపక శాఖను మరింత బలోపేతం చేస్తామన్నారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న 196 మంది డ్రైవర్ ఆపరేటర్లకు మంత్రి అభినందనలు తెలిపారు. ఉద్యోగాల్లో చేరిన తర్వాత నీతి, నిజాయితీతో వ్యవహరించాలని, ఆపదలో ఉన్న వారిని కాపాడటం గురుతర బాధ్యతగా భావించాలని సూచించారు. అనంతరం అగ్నిమాపక శాఖ కార్యక్రమాలను ఫైర్ డీజీ నాగిరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేశ్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, అగ్నిమాపక శాఖకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఫైర్‌మెన్‌లకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఏజెన్సీ గిరిజనులకు సామాజిక అటవీ హక్కులు

- 3 వేల ఆవాసాల్లో అమలుకు గిరిజన సంక్షేమ శాఖ కార్యాచరణ
- ఆవాసం పరిధిలోని గిరిజన కుటుంబానికి ఏదో ఒకరకంగా లబ్ధి
- ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో విజయవంతంగా సీఎఫ్ఆర్ అమలు

సాక్షి, హైదరాబాద్: అటవీ ప్రాంతాల్లోని గిరిజనులకు కమ్యూనిటీ ఫారెస్ట్ రైట్స్(సీఎఫ్ఆర్) కల్పించేందుకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. దీని ద్వారా గిరిజనులు నివసిస్తున్న అటవీ ప్రాంతంలో వారి జీవనోపాధిని మెరుగుపరిచే దిశగా గిరిజన సంక్షేమ శాఖ కసరత్తు చేస్తోంది. గతంలో అటవీ భూముల్లో వ్యక్తిగత హక్కుల కల్పనలో భాగంగా పోడు సాగు రైతులకు పట్టాలు ఇవ్వగా.. ఈసారి సామాజిక అటవీ హక్కుల కల్పనలో భాగంగా ఆవాసం పరిధిలోని గిరిజనులందరికీ లబ్ధి కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లున్నాయి. ఇందులో ఉట్నూరు, ఏటూరు నాగారం, భద్రాచలం, మన్ననూరు ఐటీడీఏల పరిధిలో 3 వేల ఆవాసాలున్నాయి. ఈ ఆవాసాల్లో సీఎఫ్ఆర్ అమలుకు సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ ఇప్పటికే ప్రాథమిక కార్యాచరణను రూపొందించింది. ప్రతి ఆవాసానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలోని వనరుల ద్వారా గిరిజనులు ఏవిధంగా లబ్ధి పొందవచ్చనే అంశంపై అధికారులు పరిశీలన చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఆవాసానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో ఎలాంటి వనరులున్నాయి.. వాటి ద్వారా ఏ విధంగా లబ్ధి పొందవచ్చు, అటవీ సంపద పెంచే కార్యక్రమాలు, పరిరక్షణ చర్యలు.. తదితర కోణాల్లో సీఎఫ్ఆర్‌ను అమలు చేసే విధంగా అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల్లో విజయవంతం..

దేశంలోని పలు రాష్ట్రాల్లో సీఎఫ్ఆర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తుండగా, చాలాచోట్ల గిరిజనులు సంతృప్తికరంగా జీవనాన్ని సాగిస్తున్నారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా తదితర రాష్ట్రాలు సీఎఫ్ఆర్ అమలులో ఆదర్శంగా నిలిచాయి. ఈ నేపథ్యంలో అటవీ ప్రాంతం అధికంగా ఉన్న తెలంగాణలోనూ సీఎఫ్ఆర్ అమలు కోసం గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పొరుగు రాష్ట్రాల కార్యాచరణ తీరును అధ్యయనం చేస్తున్నారు. ఒకవైపు అధ్యయన ప్రక్రియను కొనసాగిస్తూనే.. మరోవైపు రాష్ట్రంలో ఐటీడీఏల్లో అటవీ ప్రాంతాలు, ఆవాసాలకున్న అవకాశాలను పరిశీలిస్తున్నారు. అటవీ శాఖతో సమన్వయం చేసుకోవడంతో పాటు రెవెన్యూ శాఖ రికార్డులకు అనుగుణంగా మ్యాపింగ్ చేసేవిధంగా చర్యలు వేగవంతం చేశారు. ఒకట్రెండు నెలల్లో ప్రాథమికంగా ప్రతిపాదనలు రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించే విధంగా గిరిజన సంక్షేమ శాఖ కసరత్తు చేస్తోంది. సీఎఫ్ఆర్ అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పరిధిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దీనిపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం ఇవ్వగా, కేంద్రం కూడా సానుకూలంగా స్పందించడంతో తదుపరి చర్యలు వేగవంతం చేసినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

క్లుప్తంగా...

వ్యవసాయ ఉద్యాన, వెటర్నరీ కోర్సుల్లో స్పాట్ కౌన్సెలింగ్ రేపు

ఏజీ వర్సిటీ: వ్యవసాయ ఉద్యాన, వెటర్నరీ (ఫిషరీస్) డిగ్రీ కోర్సుల్లో జనరల్, ప్రత్యేక కోటాలో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 6న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డి.శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కోటాలోని సీట్ల భర్తీ కోసం జనవరి 6వ తేదీ ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో ఈ కౌన్సెలింగ్ జరగనున్నట్లు తెలిపారు. ప్రత్యేక కోటా సీట్ల భర్తీ కోసం అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. ఎంసెట్ 2024లో ర్యాంకులు పొంది ఇది వరకే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని తెలిపారు. వివిధ కోర్సుల్లో ఖాళీలు, ఫీజులు తదితర పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను చూడాలని రిజిస్ట్రార్ శివాజీ సూచించారు.

సాంకేతిక సమస్యతో విశాఖ విమానం హైదరాబాద్ మళ్లింపు

శంషాబాద్ (హైదరాబాద్): సాంకేతిక సమస్య కారణంగా ముంబై నుంచి విశాఖపట్నం వెళ్లాల్సిన విమానాన్ని హైదరాబాద్‌కు మళ్లించారు. శుక్రవారం రాత్రి ఇండిగో 6ఈ5248 విమానం ముంబై విమానాశ్రయం నుంచి 154 మంది ప్రయాణికులతో విశాఖపట్నం బయలుదేరింది. విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అనుమతితో శంషాబాద్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

కోహీర్ @ 6.0

న్యాల్‌కల్‌లో 6.3 గా నమోదు

జహీరాబాద్: రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన కోహీర్‌లో శనివారం 6.0 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జహీరాబాద్ మండలం మల్‌చల్మలో 7.5, అల్గోల్‌లో 7.9, సత్వార్‌లో 8.1గా నమోదైంది. సంగారెడ్డి జిల్లాలోని 22 ప్రాంతాల్లో 10 లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏటా రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు కోహీర్‌లో నమోదవుతూ వస్తున్నాయి. ఇప్పుడు కూడా కోహీర్‌లో అదే పరిస్థితి నెలకొంది.

3 రోజుల్లోగా 'పెట్టుబడుల' సాయానికి ప్రతిపాదనలు పంపండి

పురపాలక విభాగాలకు ఎంఏయూడీ ఉప కార్యదర్శి ప్రియాంక ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయాన్ని అందించే ఎస్‌ఏఎస్‌సీఐ పథకం (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) కింద పురపాలక శాఖ పరిధిలోని సంస్థలు మూడు రోజుల్లోగా ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి సీహెచ్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, టీయూఎఫ్ఐడీసీ, సీడీఎంఏ, టౌన్‌ప్లానింగ్, వాటర్‌బోర్డు, కుడా, ప్రజారోగ్య ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన అధికారులతో ఆమె సమావేశమయ్యారు. 2024–25 ఆర్థిక సంవత్సరం మూలధన పెట్టుబడుల కోసం వెంటనే ప్రతిపాదనలు రూపొందించి అందజేయాలన్నారు. ఎస్‌ఏఎస్‌సీఐ పథకం పార్ట్–9 కింద తెలంగాణతో సహా దేశంలో ఇతర రాష్ట్రాల్లో చేపట్టే పనులకు రూ.5 వేల కోట్లు మూలధన పెట్టుబడి కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని, అందులో రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రియాంక తెలిపారు. ఈ నేపథ్యంలో పురపాలక శాఖ పరిధిలోని విభాగాల అధిపతులు పథకం కింద నిర్దేశించిన అర్హత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి వచ్చే మంగళవారం లోగా తమ ప్రతిపాదనలను పంపాలని ఆమె సూచించారు.

విధుల్లోకి సీఆర్టీలు

సాక్షి, హైదరాబాద్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్టీ) శనివారం విధుల్లో చేరారు. 19 రోజులుగా సమ్మె చేసిన సీఆర్టీలు.. కొన్నిరకాల సమస్యలకు ప్రభుత్వం నుంచి పరిష్కారం లభించడంతో శుక్రవారం సాయంత్రం సమ్మె విరమించడం తెలిసిందే. ఈక్రమంలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా 2102 మంది సీఆర్టీలు విధులకు హాజరయ్యారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను సీఎం చర్చలకు పిలవాలి

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి

సాక్షి, హైదరాబాద్: సమగ్ర శిక్ష ఉద్యోగులను సీఎం రేవంత్‌రెడ్డి చర్చలకు పిలవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. 26 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను ఉద్దేశిస్తూ సీఎం పలు వ్యాఖ్యలు చేసినట్లు మీడియాలో కథనాలొచ్చాయని.. డిమాండ్లపై మాట్లాడకుండా దాటవేత ధోరణి ప్రదర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

విమానంలోనూ వైఫై

దేశీయ ప్రయాణం కోసం విమానం ఎక్కుతున్నామంటే మన మొబైల్ ఫోన్లో ఫ్లైట్ మోడ్ ఆన్ చేయాల్సిందే. నో సిగ్నల్స్.. నో ఇంటర్‌నెట్... సెల్‌ఫోన్‌ని మడిచి లోపల పెట్టుకోవాల్సిందే. ఇది ఒకప్పటి మాట.

కానీ ఇకమీదట... విమానంలో ప్రయాణిస్తూ ఇంటర్‌నెట్ ద్వారా సినిమాలు చూడొచ్చు, మీ బంధువులు, స్నేహితులతో వీడియో కాల్స్ మాట్లాడొచ్చు. ఆఫీస్ పని చేసుకోవచ్చు. ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టింది ఎయిర్ ఇండియా.



- దేశీయ ప్రయాణికులకు ఇంటర్‌నెట్
- 2025 జనవరి 1 నుంచి అందుబాటులోకి తెచ్చిన ఎయిర్ ఇండియా
- దేశంలో మొట్టమొదటిసారి

దేశీయ విమాన ప్రయాణికులకు కొత్త ఏడాదిలో సరికొత్త కానుక అందిస్తోంది ఎయిర్ ఇండియా. దేశంలోనే మొట్టమొదటిసారిగా.. తమ విమానాల్లో ప్రయాణించే దేశీయ ప్రయాణికులకు వైఫై ద్వారా జనవరి 1 నుంచి ఈ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ప్రారంభ ఆఫర్‌లా ఈ సదుపాయాన్ని కొంతకాలం ఉచితంగా అందిస్తోంది. ప్రస్తుతానికి కొన్ని సర్వీసులకే పరిమితమైన ఈ సౌకర్యం త్వరలో ఎయిర్ ఇండియాలోని అన్ని విమానాల్లోనూ అందుబాటులోకి తీసుకొస్తారట. ఒకరు ఒకే సమయంలో ఒకటికంటే ఎక్కువ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల వంటివాటితోనూ కనెక్ట్ కావొచ్చు. ఇప్పటికే ఎయిర్‌ఇండియా న్యూయార్క్, లండన్, పారిస్, సింగపూర్ వెళ్లే విదేశీ విమానాల్లో పైలట్ ప్రోగ్రామ్‌గా ఈ సదుపాయం అందిస్తోంది.

విమానంలో నెట్ ఎలా?

భూమ్మీద నెట్ వాడాలంటే మన చేతిలో ఒక ఫోనో ల్యాప్‌టాపో ఉండి.. సమీపంలో సెల్ టవర్ ఉంటే సరిపోతుంది. కానీ విమానం అలా కాదు కదా. విమానాల్లో వైఫై ద్వారా ఇంటర్‌నెట్ రావాలంటే 2 రకాల పద్ధతులు ఉన్నాయి. మొదటిది.. భూమిపై ఉండే సెల్ టవర్లు. దీన్నే ఎయిర్ టు గ్రౌండ్ (ఏటీజీ) టెక్నాలజీ అంటారు. ఇక రెండోది శాటిలైట్ ఆధారిత కనెక్షన్. ఈ రెండూ పనిచేయాలంటే విమానం లోపలా, బయటా ప్రత్యేక యాంటెనాల వంటి కొన్ని పరికరాలు అమర్చాలి. వైఫై లేనప్పుడు మన సమీపంలో ఎవరికైనా నెట్ కావాలంటే ఏం చేస్తాం? మన దగ్గర ఉన్న స్మార్ట్ ఫోన్లో హాట్‌స్పాట్ ఆప్షన్ ఆన్ చేసి నెట్ ఇస్తాం. మన ఫోన్ మరొకరికి హాట్ స్పాట్‌లా ఎలా మారుతుందో.. యాంటెనాలూ, సర్వర్లు, రౌటర్ల వంటి వాటితో ఉన్న విమానం వందలాది మంది ప్రయాణికులకు ఒక హాట్ స్పాట్‌లా మారిపోతుంది.

సెల్ టవర్ సిగ్నల్స్

ఈ సిగ్నళ్లు అందుకోడానికి విమానం కింది లేదా అడుగు భాగంలో యాంటెనాలు ఏర్పాటు చేస్తారు. విమానం భూమి మీద బయలుదేరగానే ఆ యాంటెనాలు.. సమీపంలోని సెల్ టవర్ల నుంచి సిగ్నళ్లు అందుకుంటాయి. ఆ సిగ్నళ్లు క్యాబిన్ సర్వర్‌కు, అక్కడి నుంచి రౌటర్‌కు వెళ్తాయి. అక్కడి నుంచి ప్రయాణికులకు వెళ్లి ఇంటర్‌నెట్ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తాయి.

శాటిలైట్ సిగ్నల్స్

సెల్ టవర్ల ద్వారా సిగ్నల్ అందు తున్నంతసేపూ ఎలాంటి ఇబ్బందీ ఉండదు. సముద్రాలు, ఎడారి ప్రాంతాల వంటి వాటి పైనుంచి వెళ్లేటప్పుడు సెల్ టవర్ సిగ్నళ్లు అందవు. శాటిలైట్ సిగ్నళ్ల సాయం కావాల్సిందే. ఇందుకోసం విమానం పై భాగంలో యాంటెనా లు ఏర్పాటుచేస్తారు. అవి తమకు అత్యంత సమీపంలోని శాటిలైట్‌తో అనుసంధానమవుతాయి. ప్రయాణికుల ఫోన్లు, ల్యాప్‌టాపుల వంటివి విమాన క్యాబిన్‌లో ఉండే వైఫై యాంటెనాకు కనెక్ట్ అవుతాయి. ఆ పరికరాల నుంచి ఈ యాంటెనాలకు వచ్చే సిగ్నళ్లు విమానంలోని సర్వర్‌కు వెళ్తాయి. విమానం పైన ఉండే యాంటెనా ద్వారా ఆ సిగ్నళ్లు శాటిలైట్‌కు వెళతాయి. శాటిలైట్ వాటిని భూమిపై ఉండే స్టేషన్ లేదా టెలిపోర్టుకు పంపితే అక్కడి నుంచి తిరిగి సిగ్నళ్లు శాటిలైట్‌కు అందుతాయి. వాటిని విమానానికి పంపుతుంది శాటిలైట్. శాటిలైట్ సిగ్నళ్లు విమానంలోకి క్యాబిన్ సర్వర్‌కు, అక్కడి నుంచి రౌటర్‌కు వెళ్తాయి. అలా ప్రయాణికులు నెట్ వాడుకోవచ్చు.

ఎయిర్ ఇండియా వైఫై ఇలా..

ఈ సౌకర్యం వినియోగించుకోవాలంటే ప్రయాణికులు వైఫై ఆన్ చేసి, సెటింగ్స్‌లో 'ఎయిర్ ఇండియా వైఫై నెట్‌వర్క్' ఎంపిక చేసుకోవాలి. ఎయిర్ ఇండియా పోర్టల్‌కు వెళ్లాక పీఎన్ఆర్ వంటి వివరాలు ఇవ్వాలి. ఆ తరవాత ఇంటర్‌నెట్ సేవలు వాడుకోవచ్చు.

ఏయే విమానాల్లో..?

అంతర్జాతీయ ప్రయాణికుల కోసం ఎయిర్‌బస్ ఎ350, బోయింగ్ 787–9, ఎంపికచేసిన ఎ321 నియో నియో విమానాలు

ఏటీజీ – శాటిలైట్


ఏటీజీ ద్వారా ఇంటర్‌నెట్ అంటే చాలా పరిమితులు ఉంటాయి. అంతరాయాలు ఎక్కువ, స్పీడు కూడా తక్కువ ఉండొచ్చు. కానీ, శాటిలైట్ కనెక్షన్ ద్వారా ఇంటర్‌నెట్‌లో అంతరాయాలు తక్కువని, స్పీడు కూడా ఎక్కువని అంతర్జాతీయ విదేశీ ప్రయాణికుల అనుభవాలు చెప్తున్నాయి.

2003లో మొదటిసారిగా...

- 2003 జనవరి 15న జర్మనీకి చెందిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ మొట్టమొదటగా తమ అంతర్జాతీయ విమానంలో ప్రయాణికులకు ఇంటర్‌నెట్ అందించింది.
- దేశీయ విమాన ప్రయాణికులకు (2013లో) ఇంటర్‌నెట్ అందించిన మొదటి సంస్థ అమెరికాకు చెందిన జెట్ బ్లూ.
- ప్రపంచంలో ప్రస్తుతంవైఫై ద్వారా ఇంటర్‌నెట్ అందిస్తున్న కొన్ని విమానయాన సంస్థలు నార్వేజియన్ ఎయిర్‌లైన్స్, ఫిలిప్పీన్స్ ఎయిర్‌లైన్స్, ఫిజి ఎయిర్‌వేస్, జెట్ బ్లూ, ఎమిరేట్స్, సింగపూర్ ఎయిర్‌లైన్స్, ఖతార్ ఎయిర్‌వేస్, డెల్టా ఎయిర్‌వేస్, మొదలైనవి.

'ప్రయాణాల్లో ఇప్పుడు 'కనెక్టివిటీ' తప్పనిసరి అవసరమైపోయింది. కొంతమంది సరదాకోసం, షేరింగ్ కోసం ఇంటర్‌నెట్ వాడితే, మరికొందరు తమ వృత్తి, వ్యాపార అవసరాల కోసం వాడుతుంటారు. ఎయిర్ ఇండియా ఈ సదుపాయం తీసుకొచ్చి విమానాల్లో సరికొత్త ప్రయాణ అనుభూతి అందిస్తోంది.

– ఎయిర్ ఇండియా చీఫ్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ అధికారి రాజేష్ డోగ్రా



పరిగిలో బెట్టింగ్ పావురాల కలకలం

- ఏపీ నుంచి 20 బాక్స్‌లలో 400 రేసింగ్ కపోతాలు
- ప్రతి పావురం కాలికి కోడ్ నంబర్, చిప్
- పట్టుకున్న స్థానికులు.. పోలీసులకు అప్పగింత



పావురాల కాళ్లకు ట్యాగ్‌లు, కోడ్‌లు

పరిగి: బెట్టింగ్ కోసం తీసుకువచ్చిన రేసింగ్ పావురాలు వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో హాట్ టాపిక్‌గా మారాయి. వీటిని గాల్లోకి వదులుతుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం ఉదయం 7.30 గంటలకు పట్టణ కేంద్రంలోని లక్ష్మీనగర్‌కు ఇద్దరు వ్యక్తులు గూడ్స్ వాహనంలో వచ్చి రెండు బాక్స్‌లలో తెచ్చిన పావురాలను బయటకు వదిలారు. ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లిన స్థానికులు వారిని ప్రశ్నించగా.. తాము ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చామని, ఇక్కడ వదిలిన పావురాలు తమతమ యజమానుల వద్దకు వెళ్తాయని చెప్పారు. పావురాల కాళ్లకు కోడ్ నంబర్లు ఉండటంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అయితే పోలీసులు ఘటన స్థలానికి రావడానికి ఆలస్యం కావడంతో స్థానికులే పావురాలు ఉన్న వాహనాన్ని పీఎస్‌కు తరలించి, పోలీసులకు అప్పగించారు. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని పోలీసులు విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్యసాయి జిల్లా గోరంట్ల గ్రామానికి చెందిన మునావర్, బాబుజానీలుగా తెలిపారు. పది మంది యజమానులు తమ పావురాలను ఈ పోటీలో పెట్టారని, ఇక్కడ వదిలిన పావురాల్లో ముందుగా చేరుకున్న దాన్ని చిప్ సాయంతో విజేతగా గుర్తిస్తారని చెప్పారు. గోరంట్లకు చెందిన ప్రేంకుమార్ తమను పంపించారని, ఉదయం పావురాలను వదిలితే సాయంత్రం వరకు అక్కడికి వెళ్తాయని వివరించారు. మొత్తం 20 బాక్స్‌లలో 400 పావురాలను తీసుకువచ్చామని, ఇందులో రెండు బాక్స్‌లలోని పావురాలను వదిలామని చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ. వేలల్లో ధర.. ప్రత్యేక శిక్షణ

- సాధారణంగా పావురాలు గంటకు 90 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. వీటికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి పోటీల్లో వినియోగిస్తారు. ట్రైనింగ్ పొందిన కపోతాలు గంటకు వంద కిలోమీటర్ల వేగంతో వెళ్తాయి. ఎక్కడ వదిలినా గమ్యస్థానానికి చేరుకునేలా తర్ఫీదునిస్తారు. ఉదయం వదిలితే సాయంత్రం వరకు గమ్యాన్ని చేరుకుంటాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో పావురాల బెట్టింగ్‌లను అధికంగా నిర్వహిస్తారు. పోటీల్లో పాల్గొనే ఒక్కో పావురాన్ని కొనుగోలు చేసేందుకు వేలాది రూపాయలు వెచ్చిస్తారు. అనంతరం వీటికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, బెట్టింగ్‌లలో పాల్గొంటారు. బెట్టింగ్ కాసిన ప్రదేశం నుంచి దాదాపుగా 500 కిలోమీటర్ల దూరానికి తీసుకెళ్లి వదులుతారు. వీటిలో ఎవరి పావురం ముందుగా అక్కడకు చేరుకుంటే వారే గెలిచినట్లు ప్రకటించి బహుమతులు అందజేస్తారు.



సదస్సులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఆప్టా సదస్సు గౌరవ చైర్మన్ డాక్టర్ సుబ్బు కోట, ఆప్టా అధ్యక్షుడు మధు ఉల్లి, వీహెచ్ తదితరులు

పెట్టుబడులతో రాష్ట్రానికి రండి

ఆప్టా గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌లో సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: పెట్టుబడులతో తెలంగాణకు వచ్చి ఇక్కడే స్థిరపడేవారికి కాంగ్రెస్ పార్టీ తరఫున రాజకీయల్లో అవకాశాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఆప్టా గ్లోబల్ బిజినెస్ సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. హైదరాబాద్‌లో ఐటీ, ఫార్మా, మౌలిక వసతులు, ఏఐ, ఫ్యూచర్ సిటీ, మూసీ రివర్ ఫ్రంట్ ఇతర ఎన్నో రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తమ ప్రభుత్వం పెట్టుబడులకు సంపూర్ణ భరోసా ఇస్తుందని ప్రకటించారు. హైదరాబాద్ శాంతిభద్రతలకు పెట్టింది పేరని తెలిపారు. ఆప్టా సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావాలని కోరారు. పెట్టుబడులకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారు. 'న్యూయార్క్, లండన్, టోక్యోతో పోటీపడేలా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఏ రంగంలోనైనా ఇక్కడ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వాటిలో మీరు భాగస్వాములు కావాలని కోరుతున్నా'అని సీఎం పిలుపునిచ్చారు.

స్టార్టప్‌ల సమ్మిట్: ఆప్టా కాటలిస్ట్ బిజినెస్ పిచ్ కాంటెస్ట్‌తోపాటు 16–ప్యానెల్స్‌లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్చలు జరిగాయి. పునరుత్పాదక ఇంధనం సహా వివిధ అంశాలపై లోతైన చర్చలు నిర్వహించారు.

నీటి గలగలలు.. విహంగ కిలకిలలు

- అరుదైన పక్షులకు విడిదిగా మారిన తెలంగాణ
- గోదావరి, కృష్ణా నది తీరాల్లో నీటి వసతి పెరగటంతో తరలి వస్తున్న విదేశీ విహంగాలు
- కవ్వాల్, అమ్రాబాద్, ఏటూరు నాగారం సాంక్చ్యురీల్లో జీవ వైవిధ్యం
- 432 రకాల పక్షుల గుర్తింపు.. వాటిని చూసేందుకు అడవులకు క్యూ కడుతున్న పక్షి ప్రేమికులు

నేడు జాతీయ పక్షుల దినోత్సవం



సాక్షి ప్రతినిధి, వరంగల్/నెట్‌వర్క్: తెలంగాణలో నీటి గలగలతోపాటు అరుదైన పక్షుల కిలకిలలు కూడా పెరుగుతున్నాయి. రక్షిత అడవులు, నదుల తీరాలు అరుదైన పక్షి జాతులకు ఆవాసంగా మారాయి. గోదావరి, కృష్ణా, పెన్‌గంగా తీరప్రాంతాల్లో విదేశీ వలస పక్షుల సందడి పెరిగింది. ఇప్పటివరకు 432 పైగా పక్షి జాతులను గుర్తించారు. రష్యా, మంగోలియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, వియత్నాం తదితర సుదూర ప్రాంతాల నుంచి పక్షులు తెలంగాణకు వలస వస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఆదివారం జాతీయ పక్షుల దినోత్సవం సందర్భంగా తెలంగాణలోని పక్షి జాతులపై ప్రత్యేక కథనం.

అరుదైన జాతులు

దేశంలో 566 అభయారణ్యాలు ఉంటే తెలంగాణలో 5,672 చ.కి.మీ.ల విస్తీర్ణంలో 9 ఉన్నాయి. పాకాల, ఏటూరునాగారం, ప్రాణహిత, కవ్వాల్, శివ్వారం, మంజీరా, పోచారం, కిన్నెరసాని, అమ్రాబాద్ అభయారణ్యాలు జీవవైవిధ్యానికి ఆలవాలంగా మారాయి. ఫారెస్ట్ వాగ్‌టెయిల్, బ్లాక్ బజా, లగర్ ఫాల్కన్, డస్కీ ఈగల్ ఔల్, స్పాట్ బెల్లీడ్ ఈగల్ ఔల్, స్మాల్ ప్రాటిన్‌కోల్, రెడ్ క్రస్టెడ్ పోచార్డ్స్, కామన్ కింగ్‌ఫిషర్, బ్లాక్ షోల్డర్డ్ కైట్, లీసర్ ఫ్లాంబాకక్ ఉడ్‌పెకర్, ఓరియంటల్ హనీ బజర్డ్, ఇండియన్ కార్మోరన్ట్, స్పాటెడ్ ఔల్ట్, కామన్ హూప్, బ్రౌన్‌వుడ్ శ్రైక్, ఆశిక్రౌన్డ్ స్పారో లార్క్, ఎల్లో ఫ్రూటెడ్ గ్రీన్ పిజియన్, కామన్ హాక్ కుకూ, శిక్రా, చాంగెబ్ల్ హాక్ ఈగల్, పైడ్ కింగ్‌ఫిషర్, వైట్ ఐ బజర్డ్, సినిరియస్ టిట్, వైట్ త్రోటెడ్ కింగ్‌ఫిషర్, అలెగ్జాండ్రిన్ ప్యారకిట్, ఓరియంటల్ డార్టర్, బ్లాక్ హెడెడ్ హైబీస్, రివర్ టర్న్ తదితర జాతుల పక్షులు ఇక్కడ ఆవాసాలు ఏర్పరుచుకున్నట్లు గుర్తించారు.

అమ్రాబాద్ రిజర్వ్‌లోనే 310 రకాల పక్షులు

ప్రపంచంలో మొత్తం 10,906 పక్షి జాతులను ఇప్పటివరకు గుర్తించారు. వాటిలో 1,353 పక్షి జాతులు భారత్‌లో నివసిస్తున్నాయని జువాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికలో వెల్లడించింది. మొత్తం పక్షి జాతుల్లో ఇది 12.4 శాతం. తెలంగాణలో గతంలో 380 రకాల పక్షలను గుర్తించినట్లు నివేదికలు ఉన్నాయి. తాజాగా మరికొన్ని కొత్త జాతులను గుర్తించటంతో వాటి సంఖ్య 432కు పెరిగింది. నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌నే ఇప్పటివరకు 310 పక్షి జాతులను గుర్తించారు. రెండేళ్లుగా నల్లమలలో ఫారెస్ట్ వాగ్‌టెయిల్, బ్లాక్ బజా, లగర్ ఫాల్కన్, డస్కీ ఈగల్ ఔల్, స్పాట్ బెల్లీడ్ ఈగల్ ఔల్ వంటి అరుదైన పక్షులు సందడి చేస్తున్నాయి. తాడ్వాయి, ములుగు, వెంకటాపురం, గణపురం, రామప్ప, పాకాల, లక్నవరం ప్రాంతాల్లో అలెగ్జాండ్రిన్ ప్యారకిట్, ఓరియంటల్ డార్టర్, బ్లాక్ హెడెడ్ హైబీస్, రివర్ టర్క్ తదితర 122 రకాల పక్షులను గుర్తించినట్లు ఫారెస్టు కాలేజ్, రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో రిసెర్చ్ స్కాలర్స్ సాహిత్ చెప్యాల, నిఖిల్ బుసాయి 'సాక్షి'కి తెలిపారు. కవ్వాల్, శివ్వారం, మంజీరా, ప్రాణహిత అభయారణ్యాల్లో కూడా ఇవి కనిపించినట్లు చెప్పారు. అయితే ఇసుక తవ్వకాలు, సింగరేణి బొగ్గు కార్యకలాపాలు, కాలుష్యం వంటి చర్యలు పక్షుల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పంటపొలాల్లో వాడుతున్న క్రిమి సంహారకాలు పక్షులకు ప్రాణాంతకంగా మారుతున్నాయి.

వలస పక్షులకు విడిదిగా నల్లమల



నల్లమల అటవీప్రాంతం అరుదైన వలస పక్షులకు విడిదిగా మారింది. అంతరించిపోతున్న పక్షులు సైతం ఇక్కడ కనిపించాయి. పక్షుల సంరక్షణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

– మదన్‌రెడ్డి, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్, హైదరాబాద్.

పక్షులకు ఆలవాలం మన అడవులు



భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగారం ప్రాంతాల్లో 122 రకాల పక్షులు కనిపించాయి. ఇందులో మూడు రకాల పక్షులపై పర్యావరణ మార్పుల ప్రభావం పడుతోంది. జీవవైవిధ్య పరిరక్షణపై ప్రభుత్వాలు ఇంకా శ్రద్ధ వహించాల్సి ఉంది.

– సాహిత్ చెప్యాల, రిసెర్చ్ స్కాలర్, ఎఫ్‌సీఆర్ఐ, ములుగు.

310 రకాల పక్షులను గుర్తించాం



నల్లమలలో ఇప్పటివరకు మొత్తం 310 రకాల పక్షులను గుర్తించాం. వీటిలో కొన్ని వలస పక్షులు, మరికొన్ని అత్యంత అరుదైన పక్షులు ఉన్నాయి. ఇక్కడ జీవవైవిధ్యం పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీంతో క్రమంగా పక్షులు, వన్య ప్రాణుల సంఖ్య పెరుగుతోంది.

– రోహిత్ గోపిడి, ఐఎఫ్ఎస్ అధికారి, డీఎఫ్ఓ, నాగర్‌కర్నూల్ జిల్లా.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

మనోళ్లకు బీపీ, షుగర్ ఎక్కువే!

- 33 జిల్లాల్లో 30 ఏళ్లకు పైబడిన వారికి 'నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే'లో భాగంగా వివిధ రకాల పరీక్షలు
- తెలంగాణలో సెకండ్ రౌండ్ స్క్రీనింగ్‌లో వెల్లడైన అనేక అంశాలు
- డయాగ్నైజ్ చేసిన వారిలో 46 శాతం మందికి షుగర్, 44 శాతం మందికి హైపర్ టెన్షన్





సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజల్లో హైపర్ టెన్షన్ (రక్తపోటు), డయాబెటీస్ మెల్లిటస్ (మధుమేహం) కేసులు ఎక్కువే అని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాది జనవరి–ఆగస్టు మధ్య చేపట్టిన ఇంటింటి సర్వేలో తెలంగాణలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బీపీ, షుగర్ కేసులు పెరుగుతున్నట్టుగా స్పష్టమైంది. గతంలో చేసిన అధ్యయనంలో వెల్లడైన వివిధ అంశాలను బలపరిచేలా తాజాగా విడుదల చేసిన 'సెకండ్ రౌండ్ స్క్రీనింగ్, డయాగ్నసిస్ అండ్ ట్రీట్‌మెంట్ ఆఫ్ హైపర్ టెన్షన్/డయాబెటీస్ మెల్లిటస్, తెలంగాణ స్టేట్'లో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. వివిధ జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లోనూ వ్యవసాయ ఆధారిత ప్రదేశాల్లోనూ బీపీ, షుగర్ కేసులు వెలుగులోకి రావడం.. సర్వే నిర్వహించిన వారిని ఆశ్చర్యచకితులను చేసింది. తమకు హైపర్ టెన్షన్, డయాబెటీస్ ఉందని తెలియకుండానే తమ రోజువారీ జీవితాలను గడుపుతున్న వారిలో అవగాహన కల్పించి, ఆయా అనారోగ్యాలకు తగిన చికిత్స అందించేందుకు ఉద్దేశించి ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా జీవనశైలి అలవాట్ల కారణంగా ఎదురవుతున్న సమస్యలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న అంతరాలు, తేడాలు గుర్తించేందుకు దీనిని ఎంచుకున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తమ అనారోగ్య సమస్యలు పెరిగి హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వచ్చి పరీక్షలు నిర్వహించినప్పుడు రక్తపోటు, మధుమేహం బయటపడుతుండడంతో, అన్ని ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు.

సర్వే చేసింది ఇలా....

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 30 ఏళ్లు, ఆపైబడిన టార్గెట్ జనాభాకు సంబంధించి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్)–5 మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా అంశాల్లో నిర్దేశిత జనాభా శాతానికి అనుగుణంగా రాష్ట్రంలో అధ్యయనం చేశారు.

➤ మొత్తంగా చూస్తే...30 ఏళ్లకు పైబడిన టార్గెట్ పాపులేషన్‌కు సంబంధించి 33 జిల్లాల్లోని 1,68,86,372 మందిని పరీక్షల కోసం గుర్తించారు. ఈ టార్గెట్ జనాభాలోని 1,50,28,690 మందిని (89 శాతం) స్క్రీనింగ్ చేశారు. వీరిలో ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5 ప్రకారం 26 శాతం మందిని అంటే 43,90,457 మందిని పరీక్షించగా 19,31,994 మందికి (అంచనా వేసిన వారిలో 44 శాతం) హైపర్‌టెన్షన్ కలిగి ఉన్నట్టుగా తేలింది. అదేవిధంగా ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5 ప్రకారం 13శాతం మందిని అంటే 21,95,228 మందిని పరీక్షించగా 10,17,253 మందికి (అంచనా వేసిన వారిలో 46 శాతం) డయాబెటీస్ మెల్లిటస్ కలిగి ఉన్నట్టుగా వెల్లడైంది. ఈ అధ్యయన వివరాలను పరిశీలించినప్పుడు... రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో నిర్వహించిన పరీక్షలకు అనుగుణంగా... వారిలో 46 శాతం మంది షుగర్‌తో, 44 శాతం మంది బీపీతో బాధపడుతున్నట్టుగా స్పష్టమైంది. ఈ సమాచారానికి అనుగుణంగా చూస్తే...రాష్ట్రంలో మొత్తంగా 10,17, 253 మంది మధుమేహంతో, 19,31,994 అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్టుగా డయాగ్నైజ్ అయ్యింది. హైపర్ టెన్షన్, షుగర్‌లకు సంబంధించి వివిధ జిల్లాల వారీగా గణాంకాలను పరిశీలించినపుడు...రెండింటిలోనూ టాప్–5గా నిలిచిన జిల్లాల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

హైపర్‌టెన్షన్ (రక్తపోటు).. టాప్-5 జిల్లాలివే...

	టార్గెట్ జనాభా (30 ఏళ్లు, పైబడి)	టార్గెట్ జనాభా స్క్రీనింగ్	టార్గెట్ జనాభా స్క్రీనింగ్ %	అంచనావేసిన బీపీ (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 శాతం ప్రకారం టార్గెట్ జనాభాలో 26%)	బీపీ డయాగ్నైజ్	అంచనాల్లో బీపీ డయాగ్నైజ్ శాతం
నల్లగొండ	8,36,296	7,69,715	92	2,17,437	1,39,768	64
హన్మకొండ	4,87,702	4,59,315	94	1,26,803	95,523	75
కామారెడ్డి	4,86,463	4,63,735	95	1,26,480	90,317	71
మెదక్	3,81,900	3,58,043	94	99,294	85,469	86
నిజామాబాద్	8,13,613	7,96,764	98	2,11,539	80,580	38

డయాబెటీస్ మెల్లిటస్ (మధుమేహం).. టాప్-5 జిల్లాలివే...

	టార్గెట్ జనాభా (30 ఏళ్లు, పైబడి)	టార్గెట్ జనాభా స్క్రీనింగ్	టార్గెట్ జనాభా స్క్రీనింగ్ %	అంచనావేసిన షుగర్ (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 శాతం ప్రకారం టార్గెట్ జనాభాలో 13%)	షుగర్ డయాగ్నైజ్	అంచనాల్లో షుగర్ డయాగ్నైజ్ శాతం
నల్లగొండ	8,36,296	7,69,715	92	1,08,718	72,824	67
కామారెడ్డి	4,86,463	4,63,735	95	63,240	60,444	96
మెదక్	3,81,900	3,58,043	94	49,647	51,819	104
హన్మకొండ	4,87,702	4,59,315	94	63,401	49,253	78
మహబూబ్‌నగర్	4,54,004	4,22,961	93	59,021	44,870	76

ఏ జిల్లా ఎంత... జిల్లాల వారీగా ఇలా....

జిల్లా పేరు	30 సం.పైబడిన వారికి పరీక్షల లక్ష్యం	లక్ష్యంలో పరీక్షలు చేసిన సంఖ్య	శాతం	రక్తపోటు పరీక్షలు లక్ష్యం	చేసిన పరీక్షలు	శాతం	షుగర్ పరీక్షల లక్ష్యం	చేసిన పరీక్షలు	శాతం
ఆదిలాబాద్	3,56,736	3,33,441	93	92,751	33,099	36	46,376	13,827	30
భద్రాద్రి	5,61,912	5,22,792	93	1,46,097	64,230	44	73,049	33,760	46
హన్మకొండ	4,87,702	4,59,315	94	1,26,803	95,523	75	63,401	49,253	78
హైదరాబాద్	1,67,2944	1,17,5517	70	4,34,965	73,669	17	2,17,483	43,003	20
జగిత్యాల	5,31,879	5,11,843	96	1,38,289	80,919	59	69,144	38,360	55
జనగాం	2,88,341	2,56,632	89	74,969	36,354	48	37,484	16,358	44
జయశంకర్	2,0,8748	1,95,948	94	54,274	17,926	33	27,137	8,685	32
జోగులాంబ గద్వాల	3,07,700	3,00,602	98	80,002	48,345	60	40,001	22,924	57
కామారెడ్డి	4,86,463	4,63,735	95	1,26,480	90,317	71	63,240	60,444	96
కరీంనగర్	5,20,823	4,39,329	84	1,35,414	50,450	37	67,707	24,165	36
ఖమ్మం	7,53,776	6,79,086	90	1,95,982	71,791	37	97,991	44,215	45
కొమురంభీం	2,61,904	2,42,918	93	68,095	16,280	24	34,048	5,683	17
మహబూబాబాద్	4,17,044	3,85,888	93	1,08,431	51,229	47	54,216	27,410	51
మహబూబ్‌నగర్	4,54,004	4,22,961	93	1,18,041	74,447	63	59,021	44,870	76
మంచిర్యాల	4,12,912	3,62,364	88	1,07,357	56,729	53	53,679	24,200	45
మెదక్	3,81,900	3,58,043	94	99,294	85,469	86	49,647	51,819	104
మేడ్చల్- మల్కాజిగిరి	7,51,473	5,24,879	70	1,95,383	37,788	19	97,691	22,939	23
ములుగు	1,56,368	1,40,264	90	40,656	13,587	33	20,328	5,581	27
నాగర్‌కర్నూలు	4,48,664	4,27,226	95	1,16,653	77,245	66	58,326	38,614	66
నల్లగొండ	8,36,296	7,69,715	92	2,17,437	1,39,768	64	1,08,718	72,824	67
నారాయణపేట	2,92,165	2,80,948	96	75,963	42,975	57	37,981	23,147	61
నిర్మల్	3,70,887	3,38,312	91	96,431	72,974	76	48,215	38,453	80
నిజామాబాద్	8,13,613	7,96,764	98	2,11,539	80,580	38	1,05,770	37,320	35
పెద్దపల్లి	3,90,635	3,64,948	93	1,01,565	42,198	42	50,783	17,862	35
రాజన్న సిరిసిల్ల	2,98,009	2,59,377	87	77,482	28,791	37	38,741	13,347	34
రంగారెడ్డి	10,33,599	8,40,373	81	2,68,736	53,360	20	1,34,368	29,401	22
సంగారెడ్డి	6,79,175	6,21,680	92	1,76,586	55,673	32	88,293	27,950	32
సిద్దిపేట	5,34,252	5,06,935	95	1,38,906	51,021	37	69,453	24,076	35
సూర్యాపేట	5,77,347	5,45,710	95	1,50,110	68,093	45	75,055	44,498	59
వికారాబాద్	4,14,945	4,05,409	98	1,07,886	65,027	60	53,943	30,690	57
వనపర్తి	2,90,411	2,79,744	96	75,507	36,464	48	37,753	19,320	51
వరంగల్	4,77,056	4,32,551	91	1,24,035	74,562	60	62,017	38,293	62
యాదాద్రి భువనగిరి	4,16,689	38,3441	92	1,08,339	45,111	42	54,170	23,962	44



మంత్రి సీతక్కతో సినీనటుడు అలీ భేటీ

సాక్షి, హైదరాబాద్: సినీ నటుడు అలీ, దర్శకుడు రమణారెడ్డి శనివారం సచివాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్కతో సమావేశమయ్యారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా చిత్రీకరించిన 'నిన్ను నన్ను కన్నది ఆడది రా'అనే పాటకు సంబంధించిన వివరాలను మంత్రికి వివరించారు. ఈనెల 8న సాయంత్రం ప్రసాద్ ల్యాబ్స్‌లో పాటను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని సీతక్కను కోరారు.

దేశానికి తెలంగాణను దిక్సూచిగా నిలపాలి

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: 2047 నాటికి భారత్ స్వాతంత్య్రం సాధించి శతాబ్ది కాలంలోకి అడుగుపెట్టే అమృత తరుణంలో దేశానికి తెలంగాణను దిక్సూచిగా నిలపాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. విజన్–2047 లక్ష్యంతో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిపేందుకు అధికారులు అంకితభావంతో, శాఖల మధ్య సమన్వయంతో సాగాలని సూచించారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో సెంటర్ ఫర్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఎన్విజన్ తెలంగాణ–2047'సింపోజియంలో చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అపారమైన సహజ సంపద తెలంగాణ సొంతమని, వీటిని గరిష్టస్థాయిలో వినియోగించుకొని ముందుకు సాగితే దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రానున్న తరాలకు స్వచ్ఛమైన తెలంగాణ చరిత్రను అందించడానికి కృషి జరగాలని చిన్నారెడ్డి ఆకాంక్షించారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, వైద్య శాఖ నిపుణుడు గంగాధర్, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్ హెడ్ కెప్టెన్ లింగాల పాండురంగారెడ్డి, ఆర్థిక నిపుణుడు జీఆర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి డాక్టర్ పెద్దబోయిన శ్రీనివాస్ సమన్వయ కర్తగా వ్యవహరించారు.


ఏడాది మారినా జాబ్ కేలండర్ ఏది?

బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కొత్త ఏడాది వచ్చి పాత కేలండర్ మారినా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన జాబ్ కేలండర్ మాత్రం విడుదలకు నోచు కోవడం లేదని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. పాత ఏడాదిలో పండుగలు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రం రాలేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో రాకేశ్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ విడుదల చేసే జాబ్ కేలండర్‌లో జాబ్స్ ఉండటం లేదన్నారు. ఏడాది కాలంలో కేవలం 12 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు గొప్పలు చెప్పుకుంటూ ప్రభుత్వ సొమ్ముతో పత్రికల్లో భారీ ప్రకటనలు ఇస్తోందన్నారు. చాయ్ తాగినంత వ్యవధిలో సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్య పరిష్కరిస్తానని టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో హామీ ఇచ్చిన రేవంత్.. ప్రస్తుతం ఈ అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందంటూ చేతులెత్తేశాడని రాకేశ్‌రెడ్డి విమర్శించారు. జీఓ 49, జీఓ 29పై న్యాయస్థానాల్లో వాదన కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నిరుద్యోగులకు అన్యాయం చేస్తోందన్నారు. భూ సర్వే బాధ్యతలు వీఆర్ఓలకు అప్పగిస్తామంటూ సీఎం చేసిన ప్రకటన హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. 12 వేల వీఆర్వో పోస్టులను ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. యూపీఎస్సీ తరహాలో 2025 ఏడాదికి నిర్దిష్ట తేదీలతో జాబ్ కేలండర్ ప్రకటించి ఈ ఏడాదిలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు.

ముతవలి కమిటీ చెల్లదు: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని దారుల్‌షిఫాలో ఉన్న ఇబాదత్ ఖానాకు చెందిన ముతవలి కమిటీకి ఏడుగురు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు 2023లో జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. గతంలో జరిగిన విషయాలను గోప్యంగా ఉంచి, కొత్తగా కమిటీ ఏర్పాటు ప్రొసీడింగ్స్ జారీ చేయడాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక తప్పుపట్టారు. ఈ మేరకు ఇటీవల తీర్పు వెలువరించారు. ఇబాదత్ ఖానా ఆస్తిని 1953లో ఇద్దరు వాకిఫ్‌లు విరాళంగా ఇచ్చారు. ఆ దాతలు ఇద్దరితోపాటు ఎనిమిది మందితో కమిటీ ఏర్పాటైంది. వీరంతా తమ వారసుల పేర్లను ప్రకటించకుండానే కన్నుమూశారు. ఈ నేపథ్యంలో 1994లో వక్ఫ్‌బోర్డు 10 మంది సభ్యులతో ఒక ముతవలి కమిటీని ఏర్పాటు చేసింది. వీళ్లు కూడా తమ వారసులను ప్రకటించకుండానే చనిపోయారు. దీంతో 2007లో వక్ఫ్‌బోర్డు ఒకరిని ఈ కమిటీకి అధ్యక్షుడిగా నామినేట్ చేసింది. 2023లో తిరిగి ఏడుగురు సభ్యులను వక్ఫ్ బోర్డు కమిటీకి నామినేట్ చేసింది. కాగా, గతంలో జరిగిన విషయాలను గోప్యంగా ఉంచి కమిటీ ఏర్పాటు చేయడాన్ని పిటిషనర్ మీర్ లుక్మాన్ అలీ తరఫు సీనియర్ న్యాయవాది పి.వేణుగోపాల్ వ్యతిరేకించారు. గతంలో కమిటీకి 10 మంది సభ్యులను నామినేట్ చేసిన విషయాన్ని బోర్డు దాచిపెట్టిందని చెప్పారు. దీనిపై వక్ఫ్‌బోర్డు న్యాయవాది వాదిస్తూ, పిటిషనర్ వక్ఫ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించకుండా హైకోర్టులో పిటిషన్ వేయడం చెల్లదన్నారు. ఈ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. 1994, 2007లో జారీ చేసిన ప్రొసీడింగ్‌లను గోప్యంగా ఎందుకు ఉంచాల్సివచ్చిందని ప్రశ్నించింది. ఇలా చేయడం వల్ల ముతవలి కమిటీ ఏర్పాటు చెల్లదని తేల్చింది. కనుక 2023లో జారీ చేసిన ప్రొసీడింగ్స్ చెల్లవని, ఇబాదత్‌ఖాన్ నిర్వహణ బాధ్యతలను వక్ఫ్‌బోర్డే స్వయంగా పర్యవేక్షణ చేయాలని తీర్పు చెప్పింది. చట్ట నిబంధనలకు అనుగుణంగా మేనేజింగ్ కమిటీని ఏర్పాటు చేయాలంది.

హైదరాబాద్‌లో శనివారం జరిగిన మహావీర్ అంతర్జాతీయ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు





క్యాలెండర్ ఆవిష్కరణ

నాంపల్లి టీజీపీఎస్సీ కార్యాలయంలో శనివారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం. చిత్రంలో అసోసియేషన్ ప్రతినిధులు

క్లుప్తంగా...

ఆలయ అతిథి గృహంలో తాగుబోతుల వీరంగం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి దేవస్థానానికి సంబంధించిన అతిథి గృహంలో శనివారం కొందరు మద్యం సేవించి వీరంగం సృష్టించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలో దేవస్థానానికి చెందిన వరదరాజస్వామి ఆలయ అతిథి గృహంలో కొందరు యువకులు శనివారం మద్యం సేవించి వీరంగం సృష్టించారు. దీంతో అక్కడి సిబ్బంది వారిని ప్రశ్నిస్తే తాను అతిథి గృహం ఉద్యోగి కొడుకు అని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ సమాధానం చెప్పాడు. దీంతో సిబ్బంది ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో అతిథి గృహంలో విధుల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మాధవరెడ్డి, ఒప్పంద ఉద్యోగి లక్ష్మణరెడ్డిని విధులు నుంచి నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు.

చిన్ననాటి స్కూల్‌ను సందర్శించిన డీజీపీ



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని కృష్ణనగర్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను శనివారం డీజీపీ, పాఠశాల పూర్వ విద్యార్థి సీహెచ్ ద్వారకా తిరుమలరావు సందర్శించారు. 1974లో ఇదే పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తి చేసిన ద్వారకా తిరుమలరావును ఆయనతో పాటు చదువుకున్న సహచర పూర్వ విద్యార్థులు మర్యాద పూర్వకంగా సన్మానించారు. సహచర పూర్వ విద్యార్థులు, పాఠశాల పాలకవర్గ ఆహ్వానంపై పాఠశాలకు యూనిఫాంతో వచ్చిన డీజీపీ ద్వారకా తిరుమలరావు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు తాను ఈ విధంగా వచ్చినట్లు చెప్పారు. పాఠశాలలో చదివిన సమయంలో ఉన్న అడ్మిషన్ రిజిస్టర్‌లో పేరు, వివరాలను ఆయన చూసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డాక్టర్ ఓవీ రమణ, పాఠశాల కరస్పాండెంట్ తూములూరి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాలో సరస్వతి, సింధు జలాల సంగమం



తిరుపతి కల్చరల్: కశ్మీర్‌లోని అత్యంత పవిత్రమైన సరస్వతి, సింధు నదిజలాలను ఉత్తర ప్రదేశ్‌లో జరగనున్న కుంభమేళాలలో నదుల్లో సంగమం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు లక్ష్మీ నరసింహ ట్రస్ట్ ప్రతినిధి, కశ్మీర్ పండిట్ మంజునాథ్ శర్మ తెలిపారు. కశ్మీర్ నుంచి యాత్రగా తీసుకొచ్చిన పవిత్ర నదీ జలాలను శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్‌లోని శారదా సర్వజ్ఞ పీఠంలో మన సనాతన ధర్మం పునరుద్ధరణ జరిగిందన్నారు. అలాంటి పుణ్యస్థలంలోని నదీ జలాలను కాశ్మీర్ పండిట్ సేవక్‌సమాజ్ ఆధ్వర్యంలో యాత్రగా దక్షిణాదికి తీసుకువచ్చినట్లు చెప్పారు. దక్షిణాదిలోని శృంగేరి శారదా పీఠం వారి ఆశీస్సులు అందుకుని తిరుపతికి చేరుకున్నట్లు తెలిపారు. ఇక్కడి నుంచి పవిత్ర నదీ జలాలతో యాత్ర సాగిస్తూ జగద్గురువు ఆదిశంకరాచార్యులు వారు స్థాపించిన నాలుగు పీఠాల్లో ప్రత్యేక పూజలు అందుకుని ఉత్తరప్రదేశ్‌లోని అకాడ్ పరిషత్‌కు చేర్చి అక్కడి నుంచి కాశ్మీర్ పండితులు, అఘోరాలు, సాధువులతో కుంభమేళాకు ఊరేగింపు చేపట్ట అక్కడ గంగా, యమునా నదుల పవిత్ర జలాల్లో సంగమం చేయనున్నట్లు తెలిపారు.

ఎల్లలు దాటిన ప్రేమ
కర్నూలు అబ్బాయి జపాన్ అమ్మాయికి పెళ్లి



కర్నూలు (టౌన్): కర్నూలులో అబ్బాయికి జపాన్ అమ్మాయికి ప్రేమ చిగురించింది. ఇరువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కావడంతో పరిచయం కాస్తా ప్రేమగా మారి పెళ్లితో సుఖాంతమైంది. కర్నూలు నగర శివారులోని లక్ష్మీపురంలో ఎతిక్స్ హోమ్స్‌లో కోరకోల కిషోర్‌కుమార్, కడపటింటి ప్రేమమ్మ దంపతులు నివసిస్తున్నారు. వీరి కుమారుడు కొరకోల కీర్తి కుమార్ ముంబై ఐఐటీలో చదువుకున్నాడు. మూడేళ్ల క్రితం జపాన్‌లో అమెజాన్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఇతనికి అదే కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న టోక్యో పట్టణానికి చెందిన మట్ సుమోటో రియోకో, మట్ సుమోటో తథాక దంపతుల కూతురు మట్ సుమోటో రింకతో పరిచయం ఏర్పడింది. మూడున్నరేళ్ల వీరి పరిచయం ప్రేమగా మారి పెళ్లి వరకు వచ్చింది. రింక అబ్బాయిని తన తండ్రికి పరిచయం చేసింది.ఇరు కుటుంబాలు అంగీకరించడంతో శనివారం కర్నూలులోని సీఎస్ఐ క్రైస్ట్ చర్చిలో పెళ్లి తంతు నిర్వహించారు.

మిర్చికి నష్టాల ఘాటు

విదేశాలకు తగ్గిన ఎగుమతులు

భారీగా పేరుకుపోతున్న నిల్వలు

- మార్కెట్‌లోకి కొత్తగా వస్తున్న మిర్చి
- గతేడాదితో పోలిస్తే 40-50 శాతం తగ్గిన ధరలు
- కోల్డ్ స్టోరేజీలో నిల్వచేసి నష్టపోయిన రైతులు
- ధరల తగ్గుముఖంతో సాగు చేసిన రైతుల్లో ఆందోళన

మిర్చి ధరలు పతనమవుతున్నాయి. గతేడాదితో పోల్చితే అన్ని రకాల మిర్చి ధరలు 40–50% మేర తగ్గాయి. విదేశాలకు ఎగుమతులు తగ్గడం, నిల్వలు పెరగడం, కొత్త మిర్చి మార్కెట్‌లోకి వస్తుండటంతో ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గతేడాది రాష్ట్రంలో మిరప పంట 5.93 లక్షల ఎకరాల్లో సాగైంది. గతేడాది తెగుళ్లు తదితర ప్రభావంతో కొంత మేర దిగుబడులు తగ్గాయి. ఈ ఏడాది 3.64 లక్షల ఎకరాల్లో మిరప పంట సాగైంది. వాతావరణ పరిస్థితులు, కొంత మేర వైరస్, నల్లదోమ ప్రభావం ఉన్నప్పటికీ ఈ ఏడాది పంట దిగుబడులు కొంత ఆశాజనకంగా ఉంటాయనే భావన మార్కెట్ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. తగ్గుతున్న ధరల దృష్ట్యా తాజాగా మిర్చి పంట సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చికి ఎకరాకు పెట్టుబడి రూ1.5 లక్షల వరకు అవుతుంది. క్వింటా మిర్చి కోసేందుకే తేజ వంటి రకాలకైతే రూ.4,000కు పైగా ఖర్చు అవుతుంది. మూడేళ్లుగా మిర్చి ధరలు స్థిరంగా ఉండటంతో మిర్చి పంటకు మంచి ధర వస్తుందని ఆశతో గతేడాది రైతులు కోల్డ్ స్టోరేజిల్లో నిల్వ చేశారు. ధరలు పతనం కావడంతో వీరంతా భారీగా నష్టపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోల్డ్ స్టోరేజీల్లో 50–60 లక్షల మిర్చి బస్తాలు నిల్వలున్నట్లు సమాచారం. గుంటూరు పరిసర ప్రాంతాల్లో 30 లక్షల బస్తాల మిర్చి నిల్వలు ఉన్నాయి. – సాక్షి ప్రతినిధి, విజయవాడ



గుంటూరులోని కోల్డ్ స్టోరేజిల్లో ఉన్న మిర్చి నిల్వలు

మిర్చి ధరలు ఇలా...



రకం	గత ఏడాది ఇదే సమయంలో ధర	ప్రస్తుత ధర (కిలో)
తేజ	200-220	120-160
341	240-250	140-150
334	210-225	100-140
5531(బాడిగ)	260-320	100-130
355(బాడిగ)	260-320	100-130
ఆర్మూరు	170-180	100-120
తాలు	70-140	40-80

మందకొడిగా ఎగుమతులు..

ప్రపంచవ్యాప్తంగా చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక, బర్మా, థాయిలాండ్, మలేసియా, ఇండోనేషియా దేశాలకు మిర్చిని ఎగుమతి చేస్తారు. ఏపీ నుంచి కోటికిపైగా బస్తాలను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారు. దేశవ్యాప్తంగా తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, అసోం రాష్ట్రాలకు మిర్చి వెళుతుంది. భారత్‌లో మిరప పంట ప్రధానంగా ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో పండుతోంది. అయితే ఈ ఏడాది ఈ సీజన్‌లో లోకల్‌గా చైనా, బంగ్లాదేశ్ మిరప ఉత్పత్తులు మార్కెట్‌లో రావడంతో ఎగుమతులపైనా ప్రభావం పడుతోంది. దీంతో మిర్చి ధరలు పతనమవుతున్నాయి. దేశవ్యాప్తంగా తగ్గిన ధరల ప్రభావంతో రూ.10 వేల కోట్లకు పైగా రైతులు, వ్యాపారులు నష్టపోతున్నట్లు మార్కెట్ వర్గాల అంచనా. గుంటూరు మార్కెట్‌లోనే రూ.3,000 కోట్లకు పైగా నష్టపోయే అవకాశం ఉంది. సరాసరిన కోల్డ్ స్టోరేజిలో నిల్వ చేసిన రైతుకు ఖర్చు క్వింటాకు రూ.3,000–4,000 వస్తుంది. ఈ లెక్కన ఓ క్వింటాకే రూ.13,000–14,000 నష్టపోతున్నారు. జనవరి, ఫిబ్రవరిలో మార్కెట్‌లో మిర్చి భారీగా వస్తుంది. అప్పటికిగానీ ధరలపైన పూర్తి స్పష్టత రాదని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

గత ప్రభుత్వం మంచి ధర ఇచ్చింది



గతేడాది 8 ఎకరాల్లో మిర్చి పంట సాగుచేశా. కొంత మిర్చి అమ్మగా మంచి ధర వచ్చింది. కానీ ఇంకా ఎక్కువ ధర వస్తుందని 50 క్వింటాళ్ల వరకు స్టోరేజ్‌లో నిల్వ ఉంచాను. అయినా గిట్టుబాటు ధర లేకపోవటంతో రూ.8,500కు తక్కువ ధరకు విక్రయించా. కోల్డ్ స్టోరేజ్‌లో అద్దె ఎక్కువ చెల్లించాల్సి వచ్చింది. దీంతో భారీగా నష్టపోయాను. గత ప్రభుత్వం మిర్చికి మంచి ధర ఇచ్చింది. ఈ ఏడాది మిర్చి సాగుకు ఎక్కువ ఖర్చు అయింది. ఇప్పుడైనా ప్రభుత్వం మిర్చి పంటకు మంచి గిట్టుబాటు ధర కల్పిస్తుందని ఆశపడుతున్నా. లేకపోతే అప్పుల్లో కూరుకుపోతాను.

– మార్కపూడి అశోక్, రైతు, కంచికచర్ల మండలం గండేపల్లి

నిల్వ చేసి నష్టపోయా...




గతేడాది 4 ఎకరాల్లో మిర్చిని సాగుచేశా. దళారులు వచ్చి కళ్లాల్లో క్వింటా మిర్చిని రూ.14,000కు కొనుగోలు చేశారు. అయితే కొంతమేరకు మిర్చిని శీతల గిడ్డంగిలో ధర వస్తుందని నిల్వ చేశా. డబ్బులు అవసరమై మిర్చిని రూ.9,000కు అమ్మాను. చేసిన అప్పులు తీరలేదు. ఏం చేయాలో తోచటం లేదు.

– బెల్లంకొండ వెంకట సుబ్బారావు, గండేపల్లి, కంచికచర్ల మండలం

ఇంధన రంగం ఎదురుచూపులు!

- ఇంధన రంగంలో ఉన్నత పదవులపై తేలని కూటమి కసరత్తు
- రెండు నెలలుగా ఖాళీగానే 'ఏపీఈఆర్సీ' చైర్మన్ స్థానం
- పూర్తవ్వని 'నెడ్ క్యాప్' కొత్త వీసీఎండీ.. డైరెక్టర్ల నియామకం
- ట్రాన్స్‌కో విజిలెన్స్ జేఎండీ లేకుండానే నెట్టుకొస్తున్న ప్రభుత్వం
- తాజాగా సీఎస్‌గా వెళ్లిన ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
- ఆ స్థానంలో ఎవరిని నియమించాలనే దానిపై కరువైన స్పష్టత



సాక్షి, అమరావతి: నలభై ఏళ్ల రాజకీయ అనుభవం అని డబ్బా కొట్టుకునే వ్యక్తి పాలనలో పట్టు సాధించలేకపోతున్నారా?..సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేక చేతులెత్తేసినట్టుగానే ప్రభుత్వ యంత్రాంగాన్ని పటిష్ట పరచడంలోనూ విఫలమవుతున్నారా? ఏ విభాగానికి ఏ అధికారిని నియమించాలో తెలియక సతమతమవుతున్నారా? అంటే.. జరుగుతున్న పరిణామాలను బట్టి అదే నిజమనే సమాధానం ఉన్నతాధికారులు, ప్రజల నుంచి వస్తోంది. ఇందుకు ఇంధన శాఖ ఉదాహరణగా కనిపిస్తోంది. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ఏదో అద్భుతం చేసేస్తారని భావించిన రాష్ట్ర ప్రజానీకంపై ఆరు నెలలు తిరగకుండానే విద్యుత్ చార్జీల పిడుగు పడింది. తనకు ఓట్లేసి గెలిపిస్తే..విద్యుత్ చార్జీలు పెంచకపోగా, తగ్గిస్తానని ఎన్నికల ముందు నమ్మించిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఏకంగా రూ.15,485.36 కోట్ల భారం వేసి విద్యుత్ వినియోగదారులను మోసం చేశారు.

ఖాళీ చేసేశారు.. భర్తీ చేయలేకపోతున్నారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ సంస్థల్లో కీలక పోస్టుల్లో ఉన్న కొందరు ఉన్నతాధికారులను బలవంతంగా బయటకు పంపించింది. వారిలో ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ), విశ్రాంత ఐపీఎస్ అధికారి మల్లారెడ్డి, ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్‌లో ముఖ్య ఆర్థిక సలహాదారులు హనుమంతరావు, సింహాచలం, జెన్‌కో ఓఎస్‌డీ ఆంటోనిరాజు ఉన్నారు. వీరి స్థానంలో ఆరు నెలలు గడుస్తున్నా ఎవరినీ నియమించలేకపోయింది. మరో వైపు ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లతో పాటు ఏపీజెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కోలో 10 మంది డైరెక్టర్ల చేత గతేడాది జూలై 3న బలవంతంగా రాజీనామా చేయించింది. వీరితో పాటు గతేడాది నవంబర్‌లో పదవీ కాలం పూర్తయిన ఐదుగురితో కలిపి మొత్తం 15 మంది డైరెక్టర్ల పోస్టుల నియామకం ప్రక్రియ ఐదు నెలలుగా సాగుతూనే ఉంది. నేటికీ కొత్త వారిని నియమించలేదు. గతేడాది అక్టోబర్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) చైర్మన్ పదవీ విరమణ చేశారు. విద్యుత్ రంగం సజావుగా నడిచేందుకు ఏపీఈఆర్సీ చాలా ముఖ్యం. అందుకే జస్టిస్ స్థాయి వ్యక్తిని చైర్మన్‌గా నియమిస్తుంటారు. కానీ ఈ స్థానం రెండు నెలలుగా ఖాళీగానే ఉంది. ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఆర్ఈడీసీఏపీ-నెడ్ క్యాప్) కొత్త వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పోస్టు కూడా ఆరు నెలలుగా భర్తీకి నోచుకోలేదు.

తేల్చుకోలేక సతమతం..

కూటమి ప్రభుత్వంలో ఇంధన రంగంలో ఇద్దరే ఇద్దరు అధికారులను నియమించింది. అందులో ఒకరు ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, మరొకరు ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) సీఎండీ పటాన్‌శెట్టి రవి. వీరిద్దరిలో కీలక పోస్టు రవిదే. ఓ డిస్కం మొత్తానికి ఆయన బాధ్యుడు. కానీ ఎందుకో ఆయనకు ఆ పోస్టుపై అంతగా ఆసక్తి లేదని ప్రచారం జరుగుతోంది. ఇటీవలే మరో శాఖకు తనను మార్చాల్సిందిగా కూడా ప్రభుత్వాన్ని ఆయన కోరారని సమాచారం. అందుకే ఉద్యోగుల బదిలీల దగ్గర్నుంచి, కొత్త సంవత్సరం డైరీలు, క్యాలెండర్ల ముద్రణ, డిస్కం వార్షికోత్సవంపైనా ఆయన అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నారని చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా తాజాగా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న కె.విజయానంద్ ప్రభుత్వ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇప్పుడు ఇంధన శాఖకు మరో పెద్దదిక్కును తీసుకురావాల్సిన అవసరం ఏర్పడింది. సీనియర్ ఐఏఎస్‌లు అజయ్‌జైన్, సాయిప్రసాద్, ఎంటీ కృష్ణబాబుతో పాటు తెలంగాణ నుంచి ఇటీవల వచ్చిన ఐఏఎస్ అధికారి రోనాల్డ్ రోస్ ఈ రేసులో ఉన్నారు. ఐఏఎస్‌లు ముత్యాలరాజు, నాగలక్ష్మి, ఎంఎం నాయక్‌కు డిస్కంలలో పనిచేసిన అనుభవం ఉంది. వీరిలో ఎవరిని తీసుకోవాలి, లేదా కొత్తవారిలో ఎవరికి ఏ బాధ్యతలు అప్పగించాలి.. అనేది కూటమి ప్రభుత్వం తేల్చుకోలేకపోతోంది.

మైక్ విసిరేసి..పేపర్లు నలిపేసి..!

కౌన్సిల్‌ను బాయ్‌కట్ చేసిన గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్

- సభ్యులు అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం చెప్పకపోవడంపై నిలదీసిన డిప్యూటీ మేయర్
- దాన్ని సాకుగా చూపి కౌన్సిల్‌లో ఆవేశంతో ఊగిపోయి బయటకు వెళ్లిపోయిన కమిషనర్



డిప్యూటీ మేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కౌన్సిల్‌ను బాయ్‌కట్ చేసి వెళ్ళిపోతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : గుంటూరు మున్సిపల్ కమిషనర్ కొత్త సాంప్రదాయానికి తెరతీశారు. సభ్యులు మాట్లాడిన తీరును తప్పు పడుతూ కౌన్సిల్‌ను బాయ్‌కట్ చేయడమే కాకుండా అధికారులను కూడా హాజరుకాకుండా చేశారు. శనివారం జరిగిన గుంటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కౌన్సిల్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన కమిషనర్, అధికారులు ఆ పని చేయకపోవడంతో నిలదీసిన డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు(వనమా బాల వజ్రబాబు) అడిగిన ప్రశ్నకు ఎంతకూ సమాధానం చెప్పకుండా తమాషాలు పడుతున్నారా అన్న మాటను అడ్డం పెట్టుకుని మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు కౌన్సిల్‌లో మైక్ విసిరేసి, చేతిలోని పేపర్లు నలిపేసి సభ జరిపే తీరు ఇది కాదంటూ మేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోయారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు అధికారులు కూడా బాయ్‌కట్ చేయడమే కాకుండా ఉద్యోగులందరిని కార్యాలయానికి పిలిపించి వారితో నల్ల బ్యాడ్జీలు పెట్టించి నిరసన కార్యక్రమం చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది.

అసలేం జరిగిందంటే ...

గత ఏడాది డిసెంబర్ 20న జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశం పూర్తికాకుండా వాయిదా పడటంతో శనివారం కొనసాగింపు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పనులు పూర్తయిన తరువాత కాంట్రాక్టర్‌కి ఏ విధంగా బిల్లులు చెల్లిస్తారు. 2014 నుంచి నగరపాలక సంస్థ మొత్తం ఎంత ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. వాటిని ఏ విధంగా ఉపసంహరించుకున్నారు. వాటి వివరాలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ షేక్ రోషన్ ప్రశ్నకు అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోగా పరిపాలనా పరమైన అంశంగా తీసుకుని ఖర్చు చేయడం జరిగిందని చెప్పారు. ఈ సమాధానంపై రోషన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు స్పందిస్తూ 11 లక్షల మంది జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులకు ఆర్థిక అంశాలపై జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు పరిపాలన అంశంగా చూపి సరైన సమాధానం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అసలు ఈ సమాధానం ఎవరు రాశారో చెప్పాలని పలుమార్లు కౌన్సిల్ వేదికగా అధికారులను ప్రశ్నించారు. ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌ను కూడా అడిగారు మీరు సమాధానం రాశారా? అని ఆయన కూడా నేను రాయలేదని చెప్పడంతో...57 మంది ప్రజా ప్రతినిధులు ఉన్న కౌన్సిల్‌కు అధికారులు ఇచ్చే సమాధానం ఇదేనా...ఏం తమాషాగా ఉందా...కార్పొరేటర్లు అంటే లెక్కలేదా అని అధికారులను నిలదీశారు. దీన్ని సాకుగా చూపి కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ మీరు తమాషా అనే పదాలు వాడకూడదు అంటూ మైక్ విసిరేసి...చేతిలోని పేపర్లు నలిపేసి సభ్యులందరిపై చిర్రుబుర్రులాడుకుంటూ బయటకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ వివాదం జరగడంతో మేయర్ కావటి మనోహర్‌నాయుడు కౌన్సిల్‌ను అరగంట పాటు వాయిదా వేశారు. తిరిగి ఒంటి గంటకు కౌన్సిల్ జరుగుతుందని తెలియజేశారు. అయితే ఈ లోపు అధికారుల ప్రోద్బలంతో నగరపాలక సంస్థ ఉద్యోగులు, యూనియన్ నాయకులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది అంతా డిప్యూటీ మేయర్ డౌన్ డౌన్, కమిషనర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ కార్పొరేషన్ కార్యాలయంలో నినాదాలు చేసుకుంటూ వచ్చి కౌన్సిల్ హాల్ ముందు బైఠాయించారు. డిప్యూటీ మేయర్ క్షమాపణ చెప్పే వరకు కౌన్సిల్‌కు హాజరయ్యే ప్రసక్తే లేదని చెప్పారు. తిరిగి భోజన విరామ తరువాత 2.47 గంటలకు కౌన్సిల్‌ను ప్రారంభించారు. 3.02 గంటల వరకు అధికారులెవరు రాకపోవడంతో ఈ తీరుపై సభ్యులు తప్పుపట్టారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీమేయర్ డైమండ్‌బాబు, సభ్యుడు షేక్ రోషన్ అధికారుల తీరును నిలదీశారు. సభకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు సభకు రాకుండా ఉండటం సభా సాంప్రదాయం కాదన్నారు.అధికారులు లేకపోవడంతో మేయర్ కావటి మనోహర్‌నాయుడు కౌన్సిల్‌ను వాయిదా వేశారు.

పోలీసులు మీడియా స్వేచ్ఛను అణచివేస్తున్నారు
సీఎస్ విజయానంద్‌కు ఫిర్యాదు చేసిన ఏపీడబ్ల్యూజేఎఫ్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో పోలీసులు మీడియాస్వేచ్ఛ అణచి వేస్తున్నారని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోరంట్లప్ప, జిల్లా కన్వీనర్ కె.నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కర్నూలుకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానంద్‌కు వారు వినతిపత్రం ఇచ్చారు. ఇటీవల కర్నూలు సాక్షి రిపోర్టర్‌పై కేసు పెట్టడం, వార్త, ప్రజాశక్తి రిపోర్టర్లకు పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని వారు సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పోలీసుల చర్యలతో మీడియాప్రతినిధులు భయభ్రాంతులకు గురవుతున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ధోరణులు మంచి కావని చెప్పారు. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పోలీసుల చర్యలు ఉన్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మయ్య, ఎర్రమల పాల్గొన్నారు.

నరసాపూర్- ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం

ధర్మవరం: నరసాపూర్- ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలుకు శనివారం పెను ప్రమాదం తప్పింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం తిప్పేపల్లి సమీపంలో ఎల్‌సీ నెంబరు- 8 వద్ద రైలు పట్టా పాక్షికంగా విరిగిపోయింది. చలి కాలంలో సంకోచం చెందిన రైలు పట్టా కొంచెం విరిగింది. ఆ సమయంలో 120 కిలోమీటర్ల వేగంతో ఎక్స్‌ప్రెస్ రైలు వస్తోంది. విధి నిర్వహణలో ఉన్న కీమెన్ బండి ప్రసాద్ విరిగిన పట్టాను గమనించాడు. వేగంగా వస్తున్న రైలును ఆపాలని భావించి ఎర్రజెండాను చేతపట్టుకుని ఊపుతూ రైలుకు ఎదురుగా వెళ్లాడు. అతివేగంతో వస్తున్న రైలు అప్పటికే పాక్షికంగా దెబ్బతిన్న పట్టా ప్రాంతాన్ని దాటుకుని రెండు బోగీలు ముందుకెళ్లాయి. అదే రైల్లో ప్రయాణిస్తున్న ఇంజినీరింగ్ అధికారుల సూచనలతో రైలును నిదానంగా నడుపుకుంటూ ధర్మవరం స్టేషన్‌కు చేర్చారు. అదే వేగంతో మరిన్ని రైలు బోగీలు వెళ్లి ఉంటే భారీ ప్రమాదం సంభవించేదని ప్రయాణికులు తెలిపారు. శీతాకాలంలో రైలు పట్టాలు సంకోచించడం వల్ల పగుళ్లు వస్తాయని రైల్వే ఇంజినీర్లు తెలిపారు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ తక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 56,550 మంది స్వామివారిని దర్శించుకోగా 28,853 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.34 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.


శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలోని శ్రీవారి దివ్య క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ప్రతి వారం వేలాది మంది భక్తులు చిన వెంకన్నను దర్శిస్తారు. ఈ వారం భక్తుల రద్దీ బాగా తగ్గింది. వచ్చే శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం, మరుసటి రోజు శనివారం కావడంతో అధిక శాతం మంది భక్తులు ఈ వారం క్షేత్ర సందర్శనను వాయిదా వేసుకుని ఉంటారని ఆలయ అధికారులు భావిస్తున్నారు. దీంతో ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాల్లో భక్తులు నామమాత్రంగా కనిపించారు.

గొబ్బిదేవతకు పుర ఉత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గొబ్బిదేవతకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవత ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



అంతర్జాతీయ సదస్సులో ఏబీఆర్ఎస్ఎం అధ్యాపకులు

తిరుపతి సిటీ: కేరళలోని తిరువనంతపురం రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీలో భారతీయ శాస్త్రం, సంస్కృతి, సంప్రదాయ జ్ఞానం-ఆధునిక ఆవిష్కరణలు అనే అంశంపై రెండు రోజులు నిర్వహించిన సదస్సు శనివారం ముగిసింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వర్సిటీల నుంచి 20 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో నిరంతర వైద్య విద్య

తిరుపతి తుడా: స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం శనివారం పద్మావతి ఆడిటోరియంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. చెన్నైకి చెందిన రేవన్ హెల్త్ స్ట్రోక్ - ఆర్థో రిహాబిలేషన్ డాక్టర్ శ్యామ్ శస్త్రచికిత్స నుంచి నొప్పిని తగ్గించడం, కండరాలు, ఎముకలు, కీళ్ల నయం చేయడంలో సిద్ధహస్తుడని, ఆయన అనుభవాలు స్విమ్స్‌తో పంచుకోవడం విద్యార్థులకు ఎంతోగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి, విభాగాధిపతులు డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ పీవీజేకే శర్మ, వైద్యులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా తవిత తులసి

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ తవిత తులసికి సావిత్రీ బాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. భారతీయ చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ వేదికగా సావిత్రీ బాయి పూలే జయంతిని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరించారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాండేలే, సినీ నటి రేణు దేశాయ్, హాస్య నటుడు బ్రహ్మానందం ముఖ్య అతిథులుగా విచ్చేసి అవార్డులను అందజేశారు. మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజినీ ఆమెను అభినందించారు.

కర్ణాటకకు డ్రాగన్?


ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించనున్నారని తెలిసింది. కాగా ఈ సినిమా చిత్రీకరణను ఈ నెల మూడో వారంలో ప్రారంభించనున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. కర్ణాటక లొకేషన్స్‌లో తొలి షెడ్యూల్‌ను ప్రశాంత్ నీల్ ప్లాన్ చేశారని టాక్. ఇక విదేశాల్లో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను పూర్తి చేసుకుని, ఆల్రెడీ హైదరాబాద్ చేరుకున్నారు ఎన్టీఆర్. సో... ఈ నెలాఖర్లో 'డ్రాగన్' మూవీ కోసం ఎన్టీఆర్ కర్ణాటకకు వెళ్తారని ఊహించవచ్చు. మరోవైపు ఎన్టీఆర్ హిందీలో 'వార్ 2' అనే మూవీ చేస్తున్నారు. హృతిక్ రోషన్ మరో హీరోగా నటిస్తున్న ఈ మూవీకి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. స్పై యాక్షన్ డ్రామా 'వార్ 2' చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది.

జాక్‌కు జోడీగా..


వైష్ణవి

సిద్ధు జొన్నలగడ్డ, 'బేబీ' ఫేమ్ వైష్ణవీ చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' అనేది ఈ మూవీ ఉపశీర్షిక. 'బొమ్మరిల్లు' భాస్కర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. కాగా శనివారం (జనవరి 4) హీరోయిన్ వైష్ణవీ చైతన్య బర్త్ డే. ఈ సందర్భంగా 'జాక్: కొంచెం క్రాక్' చిత్రం నుంచి ఆమె కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసి, మేకర్స్ విషెస్ తెలిపింది. ఈ ఫన్ రైడర్ మూవీలో ప్రకాష్ రాజ్, నరేష్, బ్రహ్మాజీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు అచ్చు రాజమణి సంగీతం అందిస్తున్నారు.

Gold Memories

తెలుగు సినిమాలకు ఆభరణం...

శంకరాభరణం


జేవీ సోమయాజులు

కె. విశ్వనాథ్ చిత్రాలన్నీ విలక్షణమైనవే అయినా వాటిలో 'శంకరాభరణం' గురించి ముందుగా చెప్పుకోవాలి. తెలుగు సినిమా కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన కళాత్మక దృశ్య కావ్యమిది. ఇన్నేళ్ల తర్వాత కూడా ఆ సినిమాను చూస్తే మనవైన సంగీత, సాహిత్య, నృత్య కళలపై గౌరవం ఉప్పొంగి గర్వం పెల్లుబుకుతుంది. 1980లో విడుదలైన ఈ సినిమా అప్పట్లో పెను సంచలనం. ఇందులోని సంగీతం, సాహిత్యం ఇప్పటికీ వీనుల విందు చేస్తాయి. విశ్వనాథ్ దర్శకత్వ ప్రతిభను గొప్పగా ఆవిష్కరించిన సినిమా ఇది. ఇంకా చెప్పాలంటే ఆయన సినీ కెరీర్‌నే మార్చేసిన మూవీ. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎందరో మేధావులతో పాటు సామాన్యులను సైతం మెప్పించింది.

రూ. పదమూడున్నర లక్షలతో...

పూర్ణోదయా ఆర్ట్ క్రియేషన్స్ ఏడిద నాగేశ్వరరావు, ఆకాశం శ్రీరాములు ఈ సినిమాను నిర్మించారు. శంకర శాస్త్రి పాత్ర కోసం ముందుగా కృష్ణంరాజు, శివాజీ గణేశన్ వంటి వారిని అనుకున్నారు. చివరగా ఇమేజ్ ఉన్న నటుడు ఈ పాత్ర చేస్తే పండదని భావించి జేవీ సోమయాజులను తీసుకున్నారు విశ్వనాథ్. అప్పటికే ఆయన డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్నారు.



అప్పట్లో ఈ సినిమాను పదమూడున్నర లక్షల రూపాయలతో తెరకెక్కించారు. 55 నుంచి 60 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశారు. ఈ సినిమాను ఎక్కువగా రాజమండ్రి, రఘుదేవపురం, పోలవరం, రామచంద్రాపురం, అన్నవరం, సోమవరం, చెన్నైలోని తిరువాన్మయూరు, కర్ణాటకలోని బేలూరు, హలిబేడులో చిత్రీకరించారు.

తెలుగు సినిమాకు కొత్త దారి...

అప్పటివరకూ ఉన్న ట్రెండ్‌కి భిన్నంగా తెరకెక్కిన 'శంకరాభరణం' తెలుగు సినిమాకు సరికొత్త దారి చూపించింది. తెలుగు సినీ చరిత్రలోనే ఓ మైలురాయిగా నిలిచిపోయింది. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, కళలకు పట్టం కడుతూ తీసిన ఈ సినిమాలోని పాటలు కూడా చరిత్రలో నిలిచిపోయాయి. విశ్వనాథ్ సినిమాల కథాకథనాలు సున్నితంగానే ఉంటాయి. కానీ, బలమైన అంశాలను ఆయన తన సినిమాల్లో చర్చిస్తారు. సాంఘిక దురాచారాలను, పశుప్రవృత్తిని ఎండగడతారు. మన సంస్కృతీ సంప్రదాయాలను గుర్తు చేస్తారు. మనలోని సున్నిత భావాలను మేల్కొలిపే ప్రయత్నం చేస్తారు. ఆకాంక్షలు, ఆశయాలు, విలువలను ముందు తరాలకు అందించే ప్రయత్నం చేస్తారు. 'శంకరాభరణం' సినిమాలో శంకర శాస్త్రి క్యారెక్టర్ ఇలాగే ఉంటుంది. అందుకే కాలాన్ని, మారుతున్న అభిరుచుల్ని తట్టుకుని ఇప్పటికీ గొప్ప సినిమాగా నిలిచిపోయింది.

ఫక్తు క్లాస్ సినిమా అయినప్పటికీ...

శాస్త్రీయ సంగీతానికి ఆదరణ కరువైన ఆ రోజుల్లో ఎంతో మంది సంగీతం నేర్చుకోవటం మొదలు పెట్టారంటే 'శంకరాభరణం' ప్రభావం ఎంతలా పని చేసిందో అర్థమవుతుంది. స్వర్ణ కమలం అవార్డ్ అందుకున్న తొలి తెలుగు సినిమా ఇదే. ఈ సినిమాకు ఉత్తమ నేపథ్య గాయకుడుగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తొలి సారి జాతీయ అవార్డు అందుకున్నారు. అంతేకాదు వాణి జయరాంకు ఉత్తమ గాయకురాలిగా, కేవీ మహదేవన్‌కు ఉత్తమ సంగీత దర్శకుడిగా జాతీయ అవార్డులు దక్కాయి. ఫక్తు క్లాస్ సినిమా అయిన 'శంకరాభరణం'కు మాస్ ఆడియన్స్ కూడా ఫిదా అయిపోయారు. సినిమాలంటే ఇష్టం లేని వారు సైతం ఈ సినిమా కోసం థియేటర్‌కు వెళ్లిన సందర్భాలున్నాయి.

'శంకరాభరణం' విడుదలైన రోజునే...

విశ్వనాథ్ దర్శకత్వ ప్రతిభతో పాటు కేవీ మహదేవన్ సంగీతం ఈ సినిమాకు ప్రాణంగా నిలిస్తే.. జంధ్యాల మాటలు, జేవీ సోమయాజులు, మంజు భార్గవి, అల్లు రామలింగయ్యల నటన 'శంకరాభరణం'ను ఓ కళాఖండంగా మార్చాయి. అప్పట్లో ఎన్టీఆర్, ఏఎన్నార్, శివాజీ గణేశన్, యంజీఆర్, రాజ్‌కుమార్, హిందీలో శాంతారామ్, దిలీప్ కుమార్, రాజ్ కుమార్, జితేంద్ర, సంజీవ్ కుమార్ ఈ సినిమాను పని గట్టుకొని మరీ చూసి చిత్ర యూనిట్‌ను అభినందించారు. కాకతాళీయమో విధి విచిత్రమో గాని... 44 ఏళ్ల క్రితం 'శంకరాభరణం' రిలీజైన రోజునే విశ్వనాథ్ ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. 1980 ఫిబ్రవరి 2న 'శంకరాభరణం' విడుదలైతే 2023 ఫిబ్రవరి 2న ఆయన కన్నుమూశారు. విశ్వనాథ్ భౌతికంగా దూరమయ్యారు కానీ తాను తెరకెక్కించిన చిత్రాల ద్వారా ప్రేక్షకుల మనసుల్లో సజీవంగా ఉన్నారు.

– దాచేపల్లి సురేష్‌కుమార్

జూన్‌లో కుబేర?


ధనుష్, నాగార్జున

జూన్‌లో థియేటర్స్‌లోకి రానున్నారట 'కుబేర'. ధనుష్, నాగార్జున హీరోలుగా నటిస్తున్న పాన్-ఇండియన్ మూవీ 'కుబేర'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. తమిళ, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రూపొందుతున్న ఈ బహుభాషా చిత్రంలో బాలీవుడ్ నటుడు జిమ్ సర్భ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకాలపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది ఫిబ్రవరిలో రిలీజ్ కానుందనే ప్రచారం సాగింది. కానీ జూన్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. విడుదల తేదీపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ మూవీకి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

బెంగాల్‌లో తగ్గేదే లే!


అల్లు అర్జున్

'తగ్గేదే లే' అన్నది హీరో అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' సినిమా రెండు భాగాల్లోని డైలాగ్. సుకుమార్ దర్శకత్వంలో వై.రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించిన ఈ చిత్రం ఆ డైలాగ్‌కి తగ్గట్టే ఎక్కడా తగ్గడం లేదు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 'పుష్ప 2' దాదాపు రూ.1800 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. అలాగే హిందీలో ఏ స్ట్రయిట్ చిత్రం వసూలు చేయనంత అంటూ... దాదాపు రూ. 800 కోట్ల గ్రాస్‌ని వసూలు చేయడం విశేషం. ఇక బెంగాల్‌లో ఈ చిత్రం ఓ రికార్డ్ సాధించింది. మామూలుగా బెంగాలీ సినిమా మార్కెట్ చాలా చిన్నది. తక్కువ బడ్జెట్ చిత్రాలు రూపొందుతుంటాయి. ఈ నేపథ్యంలో 'పుష్ప 2' బెంగాల్‌లో రూ. 50 కోట్లు వసూలు చేసి, సంచలనం సృష్టించింది. కాగా 'అమేజాన్ ఓబిజాన్' (2017) అనే చిత్రం రూ. 48 కోట్ల వసూళ్లతో అప్పట్లో రికార్డ్ నెలకొల్పింది. ఇది స్ట్రయిట్ చిత్రం. ఆ రికార్డును తాజాగా 'పుష్ప 2' బ్రేక్ చేసింది. ఒక డబ్బింగ్ సినిమా ఇలా ఆల్ టైమ్ రికార్డ్ నెలకొల్పడం అంటే మామూలు విషయం కాదు... మరి... 'పుష్ప' అంటే వైల్డ్ ఫైర్.... లోకల్ కాదు... ఇంటర్నేషనల్.

డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్స్ చేశాను

- ఉన్ని ముకుందన్



''మా 'మార్కో' సినిమాను తెలుగులో కూడా విడుదల చేయాలని బలంగా అనుకున్నాను. ఎందుకంటే తెలుగు ప్రేక్షకులు కొత్తదనాన్ని ఆదరిస్తారు. 'బాహుబలి, ఈగ'... ఇలా రాజమౌళిగారు తీసిన హై టైమ్ ప్రయోగాత్మక సినిమాలను ప్రేక్షకులు అద్భుతంగా ఆదరించారు. 'మార్కో' తరహా సినిమా తీయడానికి ఇది కూడా ఓ స్ఫూర్తి. మా సినిమాను ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని ఉన్ని ముకుందన్ అన్నారు. 'జనతా గ్యారేజ్, భాగమతి, ఖిలాడి' వంటి సినిమాల్లో కీలక పాత్రల్లో నటించిన మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులే. ఉన్ని ముకుందన్ హీరోగా టైటిల్ రోల్‌లో నటించిన మలయాళ చిత్రం 'మార్కో'. హనీఫ్ అదేని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని షరీఫ్ ముహమ్మద్ నిర్మించారు. ఈ చిత్రం మలయాళంలో డిసెంబరు 20న విడుదలైంది. 'మార్కో' సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. ఈ నెల 1న 'మార్కో' సినిమా అదే టైటిల్‌తో తెలుగులో విడుదలైంది. ఎన్వీఆర్ సినిమా 'మార్కో' మూవీని తెలుగులో రిలీజ్ చేసింది. అయితే 'మార్కో' చిత్రానికి తెలుగు ప్రేక్షకుల ఆదరణ కూడా లభించిందని, తెలుగులో తొలి రోజు హయ్యెస్ట్ వసూళ్లు సాధించిన మలయాళ మూవీగా 'మార్కో' నిలిచిందని చిత్రయూనిట్ చెబుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం హీరో ఉన్ని ముకుందన్ మాట్లాడుతూ– ''మార్కో' సినిమాకు హిట్ అందించిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. నిజానికి 'మార్కో' విజయాన్ని నేను ఊహించాను. ఎందుకంటే కాలం మారుతోంది. ప్రేక్షకుల అభిరుచులు మారిపోయాయి. నిజానికి ఈ సినిమా కోసం మేము ఎంతగానో కష్టపడ్డాం. ఫైట్ సీక్వెన్స్‌లు ఎప్పుడూ రిస్క్‌తో కూడుకున్నవే. అయినా నేను ఎలాంటి డూప్స్ లేకుండా ఫైట్ సీక్వెన్స్‌లు చేశాను. యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేప్పుడు నాకు ఏమైనా గాయాలవుతాయా? అని టీమ్ అందరూ కంగారు పడ్డారు. ఎందుకంటే అలా జరిగితే షూటింగ్ ఆపేయాల్సి వస్తుంది. కానీ అదృష్టవశాత్తు అంతా మంచిగానే జరిగింది. ఇక ఈ మూవీలోని మార్కో క్యారెక్టర్ కోసం నేను చాలా జాగ్రత్తలు తీసుకున్నాను. క్యారెక్టర్‌కు తగ్గట్లుగా ఫిజికల్‌గా రెడీ కావడం సవాల్‌గా అనిపించింది. మా చిత్రానికి 'ఎ' సర్టిఫికెట్ వచ్చింది. కానీ ఆ 'ఎ' సర్టిఫికెట్ సినిమాతోనే మేం రూ. వందకోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించగలిగాం. యావత్ దేశం మా సినిమాను ఆదరిస్తుందనే నమ్మకం మాకు ఉంది. మలయాళం నుంచి తెలుగులో భారీ ఓపెనింగ్స్ సాధించిన సినిమాగా 'మార్కో' నిలిచింది. దర్శకుడు హనీఫ్‌తో గ్రేట్ వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్. మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్, కెమెరామేన్ చంద్రు, ఆర్ట్ డైరెక్టర్ సునీల్, ఫైట్‌మాస్టర్, కొరియోగ్రాఫర్స్... ఇలా టెక్నికల్ టీమ్ అంతా కూడా కష్టపడ్డారు. వీరందరికీ ధన్యవాదాలు. చాలా హ్యాపీ. నా తర్వాతి సినిమా గురించి త్వరలోనే వెల్లడిస్తాను'' అని అన్నారు.

ఈ ఏడాది ముచ్చటగా మూడు


రష్మిక

హీరోయిన్ రష్మికా మందన్నా కెరీర్‌లో రానున్న తొలి హారర్ మూవీ 'థామా'. ఈ చిత్రంలో ఆయుష్మాన్ ఖురానా హీరోగా నటిస్తున్నారు. హారర్ మూవీ 'వంజ్య'తో హిట్ కొట్టిన దర్శకుడు ఆదిత్యా సర్పోత్దా ఈ సినిమాకు దర్శకుడు. 'బాలీవుడ్ నిర్మాత దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ మూవీ చిత్రీకరణ గత ఏడాది విడుదలైంది. తొలి షెడ్యూల్‌ను ముంబైలో జరిపారు. సెకండ్ షెడ్యూల్‌ను గతేడాది డిసెంబరు చివరి వారంలో ఢిల్లీలో ప్రారంభించారు. న్యూ ఇయర్ బ్రేక్ తీసుకుని, మళ్లీ ఈ వారంలో 'థామా' చిత్రీకరణను ప్రారంభిస్తున్నారు. 'థామా' చిత్రీకరణ కోసం ఢిల్లీ బయలుదేరినట్లుగా తన ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు ఆయుష్మాన్ ఖురానా. అలాగే న్యూ ఇయర్ వేడుకలను పూర్తి చేసుకున్న రష్మికా మందన్నా కూడా ఢిల్లీలో జరిగే 'థామా' షెడ్యూల్‌లో ఆయుష్మాన్ ఖురానాతో కలిసి పాల్గొననున్నారని బాలీవుడ్ సమాచారం. జనవరి మూడో వారం వరకు 'థామా' షూటింగ్ షెడ్యూల్ జరుగుతుందట. ఈ ఢిల్లీ షెడ్యూల్ పూర్తయిన తర్వాత ఈ సినిమా చిత్రీకరణ నెక్స్ట్ షెడ్యూల్ ఊటీలో జరగనుందని బీ టౌన్ టాక్. ఇక 'థామా' ఈ ఏడాది దీపావళికి రిలీజ్ కానుంది. అలాగే హిందీలో సల్మాన్ ఖాన్‌తో 'సికందర్', విక్కీ కౌశల్‌తో 'ఛావా' చిత్రాలు చేస్తున్నారు రష్మికా మందన్నా. 'సికందర్' సినిమా ఈ ఏడాది ఈద్‌కి, 'ఛావా' చిత్రం ఫిబ్రవరిలో రిలీజ్ కానున్నాయి. ఇలా హిందీలో రష్మికా మందన్నా నటించిన చిత్రాలు ఈ ఏడాది మూడు రిలీజ్ కానున్నాయి.

బిజినెస్ రీల్

ఐపీవో బాటలో సన్‌షైన్ పిక్చర్స్

- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

SUNSHINE PICTURES

న్యూఢిల్లీ: సినీ, టీవీ నిర్మాత, దర్శకుడు విపుల్ షా కంపెనీ సన్‌షైన్ పిక్చర్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా 83.75 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. వీటిలో 50 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుండగా.. 33.75 లక్షల షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ. 94 కోట్లు భవిష్యత్ వృద్ధి కార్యకలాపాలకు వినియోగించనుంది. సినిమాలు, వెబ్‌సిరీస్‌ల సృష్టి, అభివృద్ధి, నిర్మాణం, మార్కెటింగ్, పంపిణీ తదితరాలను కంపెనీ ప్రధానంగా చేపడుతోంది. ఇప్పటికే 10 సినిమాలు నిర్మించింది. వీటిలో 6 మూవీలకు సహనిర్మాతగా వ్యవహరించింది. 2 వెబ్‌సిరీస్‌లు, 2 సీరియళ్లు సైతం కంపెనీ నుంచి వెలువడ్డాయి. కంపెనీ నుంచి త్వరలో గుడ్ మార్నింగ్ రియా, గవర్నర్, కేరళ స్టోరీ2, బుల్‌డోజర్, సముక్, భీమ్ తదితర సినిమాలు రానున్నాయి. ఈ బాటలో మాయా, నానావతి వెర్సస్ నానావతి, విజిల్ బ్లోయర్ వెబ్‌సిరీస్ ప్రాజెక్టులు సైతం చేపట్టింది. ఈ ఏడాది(2024-25) తొలి అర్ధభాగం(ఏప్రిల్-సెప్టెంబర్)లో రూ. 45 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది.

మార్కెట్‌ప్లేస్ మోడల్‌గా జెప్టో

zepto

న్యూఢిల్లీ: క్విక్ కామర్స్ కంపెనీ జెప్టో తాజాగా తమ బీ2బీ (బిజినెస్-టు-బిజినెస్) వ్యాపార మోడల్‌ను మార్కెట్‌ప్లేస్ మోడల్‌కు మార్చుకునే క్రమంలో జెప్టో మార్కెట్‌ప్లేస్ పేరిట సంస్థను ఏర్పాటు చేసింది. దీనితో ఉత్పత్తుల నాణ్యత, సర్వీసులపై జెప్టోకు మరింత పట్టు లభిస్తుంది. అటు కార్యకలాపాలను మరింత క్రమబద్ధీకరించుకునే దిశగా త్వరలో 'థోర్' పేరిట నిల్వల నిర్వహణ ప్లాట్‌ఫామ్‌ను కూడా కంపెనీ ఏర్పాటు చేయనుంది. జెప్టో సంస్థ స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ ప్రయత్నాల్లో ఉన్న నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం ఆపరేటర్లు, విక్రేతలు, డెలివరీ పార్ట్‌నర్లు వంటి వివిధ వర్గాలను అనుసంధానించే టెక్నాలజీ ప్లాట్‌ఫాంగా జెప్టో వ్యవహరిస్తోంది. పోటీ సంస్థలైన బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లు ఇప్పటికే పాటిస్తున్న మార్కెట్‌ప్లేస్ విధానంలోకి మారితే నేరుగా విక్రేతలు, కొనుగోలుదార్లను అనుసంధానించే ప్లాట్‌ఫాంగా ఉంటుంది.

వొడాఫోన్ ఐడియా వార్షిక ప్లాన్స్



న్యూఢిల్లీ: నష్టాల్లో ఉన్న ప్రైవేట్ టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా పోటీని తట్టుకునే ప్రయత్నంలో ఏడాది కాలపరిమితితో కొత్త రీఛార్జ్ ప్లాన్స్‌ను ప్రవేశపెట్టింది. కస్టమర్లు అర్ధరాత్రి 12 నుండి మధ్యాహ్నం 12 వరకు అపరిమిత డేటాను ఆస్వాదించవచ్చు. దీనికి తోడు మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 12 వరకు ప్రతిరోజు 2 జీబీ డేటా ఉచితం. ఈ ప్రీ-పెయిడ్ ప్లాన్స్ ధర రూ.3,599 నుంచి రూ.3,799 వరకు ఉంది. ప్రస్తుతానికి ఇవి మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్, హర్యానాకు పరిమితం. కంపెనీ ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో విక్రయిస్తున్న వార్షిక ప్లాన్స్‌లో భాగంగా రాత్రి 12 నుంచి ఉదయం 6 వరకు అపరిమిత డేటా అందుకోవచ్చు. అలాగే రోజుకు 2 జీబీ డేటా వాడుకోవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-1-2025	
విశాఖ	545-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	74.17 (రాత్రి 11.30కు)	$ 73.13 (క్రితం ముగింపు)
బ్రెంట్	76.60 (రాత్రి 11.30కు)	$ 75.93 (క్రితం ముగింపు)

ఆఫీస్ స్పేస్ లీజింగ్ భళా



హైదరాబాద్ మార్కెట్లో 37 శాతం వృద్ధి

- ఎనిమిది నగరాల్లో 885 లక్షల కోట్ల ఎస్ఎఫ్‌టీ
- 2024పై కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక

న్యూఢిల్లీ: కార్యాలయ స్థలాల (ఆఫీస్ స్పేస్) మార్కెట్లో సందడి నెలకొంది. 2024లో ఈ మార్కెట్లో లీజు లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. హైదరాబాద్‌లో 37 శాతం వృద్ధితో 123 లక్షల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) స్థూల లీజింగ్ లావాదేవీలు నమోదయ్యాయి. 2023లో 90 లక్షల ఎస్ఎఫ్‌టీ మేర లావాదేవీలు జరగడం గమనార్హం. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రధాన నగరాల్లో 885 లక్షల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) విస్తీర్ణం మేర స్థూల లీజింగ్ 2024లో నమోదైనట్టు కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. అంతకుముందు ఏడాది 746 లక్షల ఎస్ఎఫ్‌టీతో పోల్చి చూస్తే 19 శాతం వృద్ధి నమోదైనట్టు తెలిపింది. ''భారత ఆఫీస్ మార్కెట్‌కు 2024 నిర్ణయాత్మకమైనది. రికార్డు స్థాయిలో లీజింగ్ నమోదైంది. ఆఫీస్ స్పేస్‌కు అంతర్జాతీయంగా భారత్ బలమైన వృద్ధి మార్కెట్ అని మరోసారి నిరూపితమైంది''అని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఇండియా సీఈవో అన్షుల్ జైన్ పేర్కొన్నారు. గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీలు) పెరుగుతుండడం బహుళజాతి సంస్థలకు భారత్ వ్యూహాత్మక ప్రాధాన్యమైనదిగా తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆఫీస్ స్పేస్ డిమాండ్‌లో 30 శాతం డిమాండ్ జీసీసీల నుంచే వస్తోంది. ''2025లో గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ డిమాండ్ బలంగా ఉండనుంది. అంతర్జాతీయ ఆఫీస్ మార్కెట్లో భారత్ ఆధిపత్యం బలపడనుంది''అని జైన్ అంచనా వేశారు. తాజా లావాదేవీలు, రెన్యువల్ అన్నీ స్థూల లీజింగ్ కిందకే వస్తాయి.

పట్టణాల వారీగా లీజింగ్..

- బెంగళూరులో 259 లక్షల చదరపు అడుగుల స్థూల లీజింగ్ లావాదేవీలు 2024లో నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది లీజింగ్ పరిమాణం 158.3 లక్షల చదరపు అడుగులుగా ఉంది. అత్యధికంగా 64 శాతం వృద్ధి ఇక్కడ నమోదైంది.
- ముంబైలో స్థూల లీజింగ్ 27 శాతం పెరిగి 178.4 లక్షల చదరపు అడుగులకు చేరింది.
- అహ్మదాబాద్‌లో 11 శాతం అధికంగా 18.1 లక్షల ఎస్ఎఫ్‌టీ లీజు లావాదేవీలు జరిగాయి.
- ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో మాత్రం క్రితం ఏడాదితో పోల్చితే 3 శాతం తక్కువగా 131.4 లక్షల చదరపు అడుగుల లీజింగ్ లావాదేవీలు నమోదయ్యాయి.
- పుణెలో 84.7 లక్షల ఎస్ఎఫ్‌టీ లీజింగ్ రికార్డు అయింది. 2023లో లీజు పరిమాణం 97.4 లక్షల ఎస్ఎఫ్‌టీతో పోల్చితే 13 శాతం తగ్గింది.
- కోల్‌కతా ఆఫీస్ మార్కెట్లో 17 లక్షల చదరపు అడుగుల లీజు లావాదేవీలు నమోదయ్యాయి. అంతకుముందు ఏడాదితో పోల్చితే స్థిరంగా కొనసాగింది.
- ఐటీ-బీపీఎం, ఇంజనీరింగ్ అండ్ తయారీ, బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగాలు ఆఫీస్ స్పేస్ డిమాండ్‌లో ప్రముఖ పాత్ర పోషించాయి.
- మొత్తం స్థూల లీజింగ్‌లో కోవర్కింగ్ ఆపరేటర్లు 14 శాతం తీసుకున్నారు. ప్రాపర్టీ యజమానుల నుంచి ఆఫీస్ స్పేస్ లీజు తీసుకుని, కార్పొరేట్లు, ఇతరులకు వీరు లీజుకు ఇవ్వనున్నారు.

తగ్గిన ఖాళీ స్థలాలు..

2024లో వాణిజ్య రియల్ ఎస్టేట్‌లో రికార్డు స్థాయి లావాదేవీలు నమోదైనట్టు, ఖాళీ స్థలాలు గణనీయంగా తగ్గినట్టు ముంబైకి చెందిన రహేజా కార్ప్ ఎండీ, సీఈవో వినోద్ రోహిరా తెలిపారు. మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇచ్చే అన్ని పట్టణాల్లోనూ వాణిజ్య రియల్ ఎస్టేట్‌లో వృద్ధి నమోదైనట్టు చెప్పారు. గ్రేడ్ ఏ ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ ఇక ముందూ కొనసాగుతుందన్నారు.

స్టాండర్డ్ గ్లాస్ మరో ప్లాంట్

- మొత్తం రూ.300 కోట్ల పెట్టుబడి
- 15 నెలల్లో తొలి దశ పనులు పూర్తి
- సంస్థ ఎండీ నాగేశ్వర రావు వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా, కెమికల్ పరిశ్రమలకు ప్రత్యేక ఇంజనీరింగ్ పరికరాలను తయారు చేస్తున్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ 10వ ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్ సమీపంలోని బొంతపల్లి వద్ద 36 ఎకరాల్లో ఇది రానుంది. రూ.130 కోట్ల వ్యయంతో తొలి దశ 15 నెలల్లో పూర్తి అవుతుందని కంపెనీ ఎండీ నాగేశ్వర రావు కందుల వెల్లడించారు. 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వస్తుందని అన్నారు. జనవరి 6న ప్రారంభం అవుతున్న ఐపీవో వివరాలను వెల్లడించేందుకు శనివారమిక్కడ జరిగిన సమావేశంలో కంపెనీ ఈడీ కాట్రగడ్డ మోహన రావు, సీఎఫ్‌వో పాతూరి ఆంజనేయులుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అయిదేళ్లలో అన్ని దశలు పూర్తి చేసుకుని ప్లాంటు మొత్తం 9 లక్షల చదరపు అడుగుల స్థాయికి చేరుతుందని చెప్పారు. ఇందుకు మొత్తం రూ.300 కోట్ల పెట్టుబడి అవసరమని వెల్లడించారు. నూతన కేంద్రంలో చమురు, సహజ వాయువు, భారీ పరిశ్రమలు, వంట నూనెల రంగ సంస్థలకు అవసరమైన ఇంజనీరింగ్ పరికరాలను తయారు చేస్తామని నాగేశ్వర రావు వివరించారు.

అయిదేళ్లలో ఎగుమతులు సగం..

కంపెనీ ఆదాయంలో గత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతుల వాటా 0.5 శాతమే. 2024-25లో ఇది 15 శాతానికి చేరుతుందని నాగేశ్వర రావు వెల్లడించారు. 'అయిదేళ్లలో ఎగుమతుల వాటా 50 శాతానికి చేరుస్తాం. యూఎస్‌కు చెందిన ఐపీపీ కంపెనీతో చేతులు కలిపాం. ఆ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా 1.5 లక్షలకుపైగా కంపెనీలు క్లయింట్లుగా ఉన్నాయి. ఐపీపీ సహకారంతో ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకుంటాం. అలాగే జపాన్‌కు రెండు నెలల్లో ఎగుమతులు ప్రారంభిస్తున్నాం. కంపెనీ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా 100 బిలియన్ డాలర్ల వ్యాపార అవకాశాలు ఉన్నాయి. అలాగే ఒక్క భారత్ నుంచే రూ.15,000 కోట్లు ఉంటుంది' అని వివరించారు.

ఆర్డర్ బుక్ రూ.450 కోట్లు..

ప్రస్తుతం స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ 65 రకాల ఉత్పత్తులను తయారు చేస్తోంది. 15 కొత్త ఉత్పత్తులు అభివృద్ధి దశలో ఉన్నాయని నాగేశ్వర రావు వెల్లడించారు. 'నెలకు 300 యూనిట్లు తయారు చేసే సామర్థ్యం ఉంది. రెండు నెలల్లో రూ.40 కోట్ల మూలధన వ్యయం చేస్తాం. రెండేళ్లలో మరో రూ.60 కోట్లు వెచ్చిస్తాం. 2023-24లో రూ.549 కోట్ల టర్నోవర్ సాధించాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.700 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నాం. ఏటా టర్నోవర్‌లో 50 శాతం వృద్ధి నమోదు చేస్తున్నాం. ఆర్డర్ బుక్ రూ.450 కోట్లు ఉంది' అని పేర్కొన్నారు.

జనవరి 6న ఐపీవో..

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఐపీవో జనవరి 6న ప్రారంభమై 8న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ రూ.123 కోట్లు అందుకుంది. ఒక్కొక్కటి రూ.140 చొప్పున 87,86,809 ఈక్విటీ షేర్లను కేటాయించింది. అమన్సా హోల్డింగ్స్, క్లారస్ క్యాపిటల్-1, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్, కోటక్ మహీంద్రా ట్రస్టీ కో లిమిటెడ్ ఏ/సీ కోటక్ మాన్యుఫ్యాక్చర్ ఇన్ ఇండియా ఫండ్, టాటా ఎంఎఫ్, మోతిలాల్ ఓస్వాల్ ఎంఎఫ్, 3పీ ఇండియా ఈక్విటీ ఫండ్-1, కోటక్ ఇన్ఫినిటీ ఫండ్-క్లాస్ ఏసీ, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఐటీఐ లార్జ్ క్యాప్ ఫండ్ వీటిలో ఉన్నాయి. ఇక ఐపీవోలో భాగంగా రూ.210 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తారు. 1,42,89,367 షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద ప్రమోటర్లు విక్రయిస్తారు. షేర్లను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్ చేస్తారు. ప్రైస్ బ్యాండ్ రూ.133-140గా నిర్ణయించారు. ఇన్వెస్టర్లు కనీసం 107 షేర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

జనవరి 7న బీఆర్ గోయల్ ఇన్‌ఫ్రా ఐపీఓ

ధరల శ్రేణి రూ.128-135



న్యూఢిల్లీ: మౌలిక రంగ నిర్మాణ సంస్థ బీఆర్ గోయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఐపీఓ జనవరి 7న ప్రారంభమై 9న ముగియనుంది. షేరు ధరల శ్రేణి రూ.128-135గా కంపెనీ నిర్ణయించింది. గరిష్ఠ ధర వద్ద రూ.85.2 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇష్యూలో భాగంలో కంపెనీ రూ.10 ముఖ విలువ కలిగిన 63.12 లక్షల కొత్త షేర్లను జారీ చేయనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు జనవరి 6న బిడ్డింగ్ ప్రారంభమవుతుంది. పబ్లిక్ ఇష్యూ ముగిసిన తర్వాత బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌లో షేర్లు లిస్ట్ కానున్నాయి. ఐపీఓ ద్వారా వచ్చే మొత్తాన్ని మూల ధన వ్యయానికి, ఇతర కార్పొరేట్ అవసరాలకు, వృద్ధి ఆధారిత కార్యక్రమాలకు వినియోగిస్తామని కంపెనీ చైర్మన్ బ్రిజ్ కిషోర్ గోయల్ తెలిపారు. ఈ ఇష్యూకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా బీలైన్ క్యాపిటల్ అడ్వైజర్స్, రిజిస్ట్రార్‌గా లింక్ ఇన్‌టైం ఇండియా వ్యవహరిస్తున్నాయి.

వృద్ధిని నడిపించే పన్ను సంస్కరణలు కావాలి

వాతావరణ మార్పుల వ్యూహాలకు మద్దతు ● బడ్జెట్‌పై ఆర్థిక శాఖకు ఐసీఏఐ సూచనలు



న్యూఢిల్లీ: వాతావరణ మార్పులను అధిగమించే విధానాలకు పన్ను ప్రయోజనాల రూపంలో మద్దతు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి చార్టర్డ్ అకౌంటెంట్ల అత్యున్నత మండలి (ఐసీఏఐ) సూచించింది. షేర్లు, సెక్యూరిటీల నుంచి వచ్చిన ఆదాయం వెల్లడించేందుకు వీలుగా ఆదాయపన్ను రిటర్నుల్లో ప్రత్యేక సెక్షన్ ఏర్పాటు చేయాలని కోరింది. పన్ను రిటర్నుల పత్రాలను మరింత సులభంగా మార్చడంతోపాటు పార్టనర్‌షిప్ సంస్థలు, లిమిటెడ్ లయబిలిటీ పార్టనర్‌షిప్ (ఎల్ఎల్‌పీలు) సంస్థలకు ప్రత్యేక పన్ను విధానం ఉండాలని సూచించింది. ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసే, సుస్థిర పర్యావరణాన్ని ప్రోత్సహించే పన్ను సంస్కరణలు అవసరమని పేర్కొంది. ఇలా చేయడం వల్ల భారత క్లైమేట్ చేంజ్ లక్ష్యాలను సకాలంలో సాధించేందుకు అనుకూలిస్తుందని తెలిపింది. బడ్జెట్‌కు ముందు ఆర్థిక శాఖకు తాము చేసిన సూచనలను ఐసీఏఐ వెల్లడించింది. ఈ-ఫైలింగ్ విధానంలో ఆదాయం రిటర్న్‌ను దోషపూరితమైనది/చెల్లనిది అని ప్రకటించడానికి ముందు ఈ విషయంలో పన్ను చెల్లింపుదారు వివరణ వినేందుకు అవకాశం ఇవ్వాలని కోరింది. సెక్షన్ 54 నుంచి సెక్షన్ 54ఎఫ్ వరకు మూలధన లాభాల పన్ను నిబంధనలను సులభతరంగా మార్చాలని విజ్ఞప్తి చేసింది. ఇక ఆలస్యపు రిటర్నుల దాఖలు గడువును అసెస్‌మెంట్ సంవత్సరం మార్చి 31వరకు పొడిగించాలంటూ మరో కీలక సూచన సైతం చేసింది. ప్రస్తుతం ఇది డిసెంబర్ 31గా ఉంది.

'అగ్రశ్రేణి సంస్థగా ఎయిర్ ఇండియా'



చెన్నై: ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ సేవలు, పనితీరుతో ఎయిర్ ఇండియాను అగ్రశ్రేణి విమానయాన సంస్థగా మార్చేందుకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ శనివారం తెలిపారు. ఎన్ఐటీ తిరుచ్చిలో జరిగిన గ్లోబల్ అలుమ్నీ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఎయిర్ ఇండియా చేసిన ఆర్డర్ల ప్రకారం విమానాలను డెలివరీ చేయాలని తయారీ సంస్థలైన బోయింగ్, ఎయిర్‌బస్‌లను కోరాలని సమావేశానికి హాజరైన వారికి ఆయన సరదాగా విజ్ఞప్తి చేశారు. 2024 డిసెంబర్ నాటికి ఎయిర్ ఇండియా గ్రూప్ మొత్తం 660 విమానాలకు ఆర్డర్లు ఇచ్చింది. 'సెమికండక్టర్ ప్రెసిషన్ మాన్యుఫ్యాక్చరింగ్, అసెంబ్లీ, టెస్టింగ్ విభాగాల్లో టాటా సన్స్ నుంచి 18 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఉన్నాయి. కంపెనీ స్థాపిస్తున్న సెమికండక్టర్ ఫ్యాబ్ కేంద్రం 2026లో కార్యరూపంలోకి వస్తుంది. రాబోయే 18-24 నెలల్లో వేలాది కంపెనీలు సెమికండక్టర్ వ్యవస్థలోకి రానున్నాయి. ప్రభుత్వ విధానాల మద్దతుతో పాటు ఈ పరిశ్రమలో కేంద్రీకృత, స్థిర విధానం ఉండాలి. మరిన్ని పెట్టుబడులు రావాలి. పరిశోధనలు జరగాలి. విద్యాసంస్థలు సెమికండక్టర్ రంగంలో పాలుపంచుకోవాలి' అని అన్నారు.

స్మార్ట్‌ఫోన్ల మార్కెట్ @50 బిలియన్ డాలర్లు

- 2025లో అధిగమిస్తుందని అంచనా
- దన్నుగా ప్రీమియం ఫోన్ల అమ్మకాలు
- కౌంటర్‌పాయింట్ టెక్నాలజీ నివేదిక



న్యూఢిల్లీ: దిగ్గజ సంస్థలు యాపిల్, శాంసంగ్ విక్రయించే ప్రీమియం డివైజ్‌లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో దేశీయంగా స్మార్ట్‌ఫోన్ల మార్కెట్ ఈ ఏడాది (2025లో) 50 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 4,28,900 కోట్లు) చేరవచ్చని మార్కెట్ రీసెర్చ్ సంస్థ కౌంటర్‌పాయింట్ టెక్నాలజీ ఒక నివేదికలో తెలిపింది. దీని ప్రకారం 2021లో భారతీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ పరిమాణం 37.9 బిలియన్ డాలర్లుగా (రూ. 3.25 లక్షల కోట్లు) నమోదైంది. 'భారతీయ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్ ఈ ఏడాది 50 బిలియన్ డాలర్ల మార్కును అధిగమించి, రికార్డు స్థాయికి చేరే అవకాశం ఉంది. ప్రీమియం, అల్ట్రా-ప్రీమియం సెగ్మెంట్లలో ఆకర్షణీయమైన ఆప్షన్లను అందిస్తూ యాపిల్, శాంసంగ్‌లాంటి బ్రాండ్లు మార్కెట్ వృద్ధికి సారథ్యం వహిస్తున్నాయి' అని నివేదిక వివరించింది. 2025లో తొలిసారిగా దేశీ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో సగటు రిటైల్ విక్రయ ధర 300 డాలర్ల మార్కును (సుమారు రూ. 25,700) అధిగమించవచ్చని నివేదిక పేర్కొంది. 2024 ఆర్థిక సంవత్సరంలో మొబైల్ ఫోన్ల విభాగం ద్వారా యాపిల్ ఇండియా రూ. 67,122 కోట్లు, శాంసంగ్ రూ. 71,158 కోట్ల ఆదాయాన్ని నమోదు చేశాయి.

నివేదికలోని మరిన్ని విశేషాలు..

- స్థానికంగా తయారీ, వివిధ ఐఫోన్ల మోడల్స్ ధరల తగ్గింపు వల్ల యాపిల్ విక్రయించే ప్రో మోడల్స్‌కి డిమాండ్ పటిష్టంగా ఉండవచ్చు. అదే సమయంలో మరింత విలువైన ఫీచర్లు ఉండే డివైజ్‌లు, ముఖ్యంగా తమ ఫ్లాగ్‌షిప్ ఎస్ సిరీస్ ఫోన్లపై మరింతగా దృష్టి పెడుతుండటం శాంసంగ్ అమ్మకాల వృద్ధికి దోహదపడగలవు.
- అఫోర్డబుల్ ప్రీమియం కేటగిరీలో (రూ. 30,000 – 45,000 ధర శ్రేణి) అధునాతన కెమెరాలు మొదలైన ఫీచర్లను అందించడం ద్వారా వివో, ఒపో, వన్‌ప్లస్ లాంటి చైనా బ్రాండ్లు, కస్టమర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఫోన్ల పనితీరును దెబ్బతీసిన డిస్‌ప్లే, మదర్‌బోర్డ్ సమస్యలకు సంబంధించి రిటైలర్ల ఆందోళనలను పరిష్కరించడం ద్వారా మళ్లీ మార్కెట్‌పై పట్టు సాధించేందుకు వన్‌ప్లస్ కసరత్తు చేస్తోంది. వేగవంతమైన రికవరీ, వృద్ధి సాధన కోసం స్థానిక మార్కెట్‌లో విస్తరించేందుకు దాదాపు రూ. 6,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికల్లో ఉంది.
- ప్రీమియం సెగ్మెంట్ (రూ. 30,000 ధర పైన ప్రారంభమయ్యే ఫోన్లు) 20 శాతానికి మించి మార్కెట్ వాటా దక్కించుకోవచ్చు.
- కొనుగోలు చేయడానికి ముందు ప్రీమియం ఫోన్లను స్వయంగా చేతిలోకి తీసుకుని, పరిశీలించేందుకు వినియోగదారులు ఆఫ్‌లైన్ స్టోర్స్‌ను ఎంచుకుంటున్నారు. అలాగే కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత అంశాల మీద ఆసక్తితో వివిధ ఫీచర్ల గురించి అడిగి తెలుసుకుని, కొనుగోలు చేస్తున్నారు. ప్రీమియం సెగ్మెంట్లో అమ్మకాల వృద్ధికి ఇలాంటి ధోరణులు కూడా తోడ్పడుతున్నాయి.

ఈవీ సబ్సిడీల నిలిపివేతకు పరిశ్రమ ఓకే..



- ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థల అంగీకారం
- కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) ఆదరణ పెరుగుతుండటంతో ఇకపై రాయితీలు నిలిపివేసినా సమస్య ఉండదని తయారీ సంస్థలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సబ్సిడీ పథకం ముగిసిన తర్వాత రాయితీలను నిలిపివేయొచ్చని అభిప్రాయపడుతున్నాయి. ఈ ప్రతిపాదనకు కంపెనీలన్నీ ఏకగ్రీవంగా అంగీకరించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ వెల్లడించారు. బ్యాటరీ చార్జింగ్, స్వాపింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాలపై పరిశ్రమ వర్గాలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయం చెప్పారు. ఈవీల వినియోగంతో ఖర్చుల పరంగా ఒనగూరే ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందని ఆయన తెలిపారు. బ్యాటరీల మార్పిడికి ఉమ్మడిగా వనరులు వినియోగించుకోవడం కావచ్చు లేదా సొంత బ్యాటరీలతోనే వాహనాలను విక్రయించడం కావచ్చు ఎటువంటి వ్యాపార విధానాలనైనా పాటించేందుకు వాహనాల తయారీ సంస్థలకు స్వేచ్ఛ ఉంటుందని పేర్కొన్నారు. నీతి ఆయోగ్, భారతీయ ప్రమాణాల బ్యూరో, అంకుర సంస్థలు, టాటా..మెర్సిడెస్ బెంజ్ తదితర వాహనాల కంపెనీలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

ఫేమ్ ఇండియా, పీఎం ఈ-డ్రైవ్ తదితర స్కీముల ద్వారా విద్యుత్తు వాహనాల విక్రయాలను పెంచే దిశగా ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోంది. పరిశ్రమ వర్గాల ప్రకారం 2022లో భారత్‌లో మొత్తం ఈవీల విక్రయాలు 10 లక్షలుగా నమోదయ్యాయి. దేశీయంగా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో టాటా మోటర్స్ అగ్రస్థానంలో ఉంది. అంతర్జాతీయ ఈవీ దిగ్గజాలను ఆకర్షించేందుకు కేంద్రం గతేడాది మార్చిలో ఎలక్ట్రిక్ వాహనాల పాలసీని ప్రవేశపెట్టింది. దీని కింద కనీసం 500 మిలియన్ డాలర్లు పెట్టుబడితో తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసే సంస్థలకు సుంకాలపరంగా కొన్ని మినహాయింపులను ప్రతిపాదించింది. అలాగే ఫేమ్-2 స్కీమ్ కింద దేశవ్యాప్తంగా 10,763 పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లను కూడా ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం.

నాలుగో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ కష్టం

సిడ్నీ పిచ్‌పై ప్రసిధ్ కృష్ణ వ్యాఖ్య



సిడ్నీ: ఆస్ట్రేలియాతో చివరి టెస్టులో టీమిండియాకు భారీ ఆధిక్యం దక్కకపోయినా... ఈ పిచ్‌పై నాలుగో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం ఎవరికైనా కష్టమే అని భారత పేసర్ ప్రసిధ్ కృష్ణ అన్నాడు. సిడ్నీ వికెట్ అనూహ్యంగా స్పందిస్తోందని... భారీ స్కోరు చేయడం అంత సులువు కాదని అతడు పేర్కొన్నాడు. శనివారం ఆట ముగిసిన అనంతరం ప్రసిధ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ... 'బంతి అనూహ్యంగా స్పందిస్తోంది. ముఖ్యంగా కొన్ని భాగాల్లో పిచ్‌ను తాకిన తర్వాత తక్కువ ఎత్తులో వస్తోంది. మరికొన్ని చోట్ల బాగా బౌన్స్ అవుతోంది. ఇలాంటి చోట ఎంత లక్ష్యం సురక్షితం అని చెప్పలేం. వీలైనన్ని ఎక్కువ పరుగులు చేసేందుకు ప్రయత్నిస్తాం. ఈ మ్యాచ్‌కు ముందు భారత్ 'ఎ' తరఫున ఇక్కడ పర్యటించడం మంచి ఫలితాన్నిచ్చింది. దాని వల్లే సులువుగా బౌలింగ్ చేశా. మొదట్లో కాస్త ఒత్తిడికి గురైనా... ఆ వెంటనే పరిస్థితులను అర్థం చేసుకొని ముందుకు సాగా. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ సూచనలు ఫలితాన్నిచ్చాయి. ప్రాథమిక సూత్రానికి కట్టుబడే బంతులు విసిరా. దాంతోనే ఫలితం రాబట్టగలిగా. ఇక ముందు కూడా ఇదే కొనసాగిస్తా. రెండో ఇన్నింగ్స్‌లోనూ కంగారూలను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాం' అని వివరించాడు. 'బోర్డర్-గావస్కర్' ట్రోఫీ ఆఖరి టెస్టులో ప్రస్తుతం భారత జట్టు ఓవరాల్‌గా 145 పరుగుల ఆధిక్యంలో ఉంది.

ఆఫ్‌స్పిన్‌ను పక్కన పెట్టి... పేస్ ఆల్‌రౌండర్‌గా

అచ్చొచ్చిన సొంత మైదానంలో స్టీవ్ స్మిత్ పెద్దగా ఆకట్టుకోలేకపోగా... టీమిండియాపై దంచి కొట్టే హెడ్ 4 పరుగులకే పెవిలియన్ చేరాడు! టీనేజ్ కుర్రాడు కొన్‌స్టాస్ మెరుపులు 3 బౌండరీలకే పరిమితం కాగా... మరో ఓపెనర్ ఉస్మాన్ ఖ్వాజా వైఫల్యాన్ని కొనసాగించాడు! ఆదుకుంటాడనుకున్న లబుషేన్ ఆరంభంలోనే చేతులెత్తేయగా... అలెక్స్ కేరీ మరోసారి నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయాడు!

అయినా ఆస్ట్రేలియా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో చెప్పుకోదగ్గ స్కోరు చేయగలిగింది అంటే అదంతా అరంగేట్ర ఆటగాడు బ్యూ వెబ్‌స్టర్ చలవే. అటు బౌలింగ్‌లో ఇటు బ్యాటింగ్‌లో ఏమాత్రం ఆకట్టుకోలేకపోతున్న మిషెల్ మార్ష్‌ను తప్పించి... చివరి టెస్టులో వెబ్‌స్టర్‌కు అవకాశం ఇవ్వగా... అతడు భారత జట్టుకు ప్రధాన అడ్డంకిగా నిలిచి భారీ ఆధిక్యం దక్కకుండా అడ్డుకున్నాడు. ఆఫ్‌స్పిన్నర్‌గా కెరీర్ ఆరంభించి... ఆ తర్వాత పేస్ ఆల్‌రౌండర్‌గా మారిన ఆస్ట్రేలియా నయా తార వెబ్‌స్టర్‌పై ప్రత్యేక కథనం...

– సాక్షి, క్రీడావిభాగం

సుదీర్ఘ దేశవాళీ అనుభవం... వేలకొద్దీ ఫస్ట్ క్లాస్ పరుగులు... బౌలింగ్‌లోనూ తనకంటూ ప్రత్యేకమైన శైలి ఉన్నా... ఇప్పటి వరకు అంతర్జాతీయ అరంగేట్రం చేయలేకపోయిన వెబ్‌స్టర్... ఎట్టకేలకు జాతీయ జట్టు తరఫున ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఆకట్టుకున్నాడు. భారత బౌలర్ల ధాటికి ప్రధాన ఆటగాళ్లే నిలవలేకపోతున్న చోట... చక్కటి సంయమనంతో ఆడుతూ విలువైన పరుగులు చేశాడు. గత మ్యాచ్ ద్వారానే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన స్యామ్ కొన్‌స్టాస్ తన బ్యాటింగ్ విన్యాసాలతో పాటు నోటి దురుసుతో వార్తల్లోకెక్కగా... వెబ్‌స్టర్ మాత్రం నింపాదిగా ఆడి తనదైన ముద్ర వేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 13 ఓవర్లపాటు బౌలింగ్ చేసిన అతడు... 2.23 ఎకానమీతో 29 పరుగులు మాత్రమే ఇచ్చుకున్నాడు. బౌలింగ్‌లో వికెట్ తీయలేకపోయినా... స్టార్క్, కమిన్స్ వంటి స్టార్ బౌలర్ల కంటే తక్కువ పరుగులు ఇచ్చుకొని ఆత్మవిశ్వాసం పెంపొందించుకున్నాడు. ఇక తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ జట్టు 39 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డప్పుడు క్రీజులో అడుగుపెట్టిన వెబ్‌స్టర్... తనలో మంచి బ్యాటర్ ఉన్నాడని నిరూపించుకున్నాడు. మరో ఎండ్‌లో స్టీవ్ స్మిత్ ఉండటంతో ఆరంభంలో నెమ్మదిగా ఆడుతూ అతడికే ఎక్కువ స్ట్రయిక్ ఇచ్చేందుకు ప్రయత్నించాడు. ఐదో వికెట్‌కు 57 పరుగులు జోడించిన అనంతరం స్మిత్ అవుట్ కాగా... ఆ తర్వాత ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యత భుజానెత్తుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్నది తొలి మ్యాచే అయినా... దేశవాళీల్లో వందల మ్యాచ్‌ల అనుభవం ఉండటంతో లోయర్ ఆర్డర్‌తో కలిసి జట్టును నడిపించాడు. అతడు ఒక్కో పరుగు జోడిస్తుంటే... టీమిండియా ఆధిక్యం కరుగుతూ పోయింది. ఆరో వికెట్‌కు అలెక్స్ కెరీతో 41 పరుగులు, ఏడో వికెట్‌కు కెప్టెన్ కమిన్స్‌తో కలిసి 25 పరుగులు జోడించాడు. ఇక కింది వరుస బ్యాటర్ల అండతో పరుగులు చేయడం కష్టమని భావించి భారీ షాట్లకు యత్నించిన వెబ్‌స్టర్... చివరకు తొమ్మిదో వికెట్ రూపంలో పెవిలియన్‌కు చేరాడు. గత నాలుగు టెస్టుల్లో పేస్ ఆల్‌రౌండర్‌గా జట్టులో చోటు దక్కించుకున్న మిషెల్ మార్ష్ ఒక్క మ్యాచ్‌లోనూ అటు బ్యాట్‌తో కానీ, ఇటు బంతితో కానీ ఏమాత్రం ప్రభావం చూపలేకపోగా... తొలి మ్యాచ్‌లోనే వెబ్‌స్టర్ హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. అనూహ్య బౌన్స్, అస్థిర పేస్ కనిపించిన సిడ్నీ పిచ్‌పై వెబ్‌స్టర్ గొప్ప సంయమనం చూపాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత ఆటగాళ్లు ఒక్కరు కూడా 40 పరుగులు దాటి చేయలేకపోయిన చోట ఈ మ్యాచ్‌లో తొలి అర్ధ శతకం నమోదు చేసిన వెబ్‌స్టర్... ఆ తర్వాత బంతితోనూ ఆకట్టుకున్నాడు. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 4 ఓవర్లు వేసిన వెబ్‌స్టర్ అందులో కీలకమైన శుబ్‌మన్ గిల్ వికెట్ పడగొట్టి టీమిండియాను దెబ్బకొట్టాడు. కామెరూన్ గ్రీన్ వంటి ప్రధాన ఆల్‌రౌండర్ అందుబాటులో లేకపోవడంతో మిషెల్ మార్ష్ జట్టులోకి రాగా... ఇప్పుడు వెబ్‌స్టర్ ప్రదర్శన చూస్తుంటే ఇక మార్ష్ జట్టులో చోటుపై ఆశలు వదులుకోవడమే మేలనిపిస్తోంది.

సుదీర్ఘ నిరీక్షణ అనంతరం...

స్పిన్నర్‌గా కెరీర్ ఆరంభించిన 31 ఏళ్ల వెబ్‌స్టర్... ఆ తర్వాత పేస్ ఆల్‌రౌండర్‌గా ఎదిగాడు. 6 అడుగుల 7 అంగుళాలున్న వెబ్‌స్టర్‌కు బంతిని స్పిన్ చేయడం కంటే... వేగంగా విసరడం సులువు అని కోచ్‌లు సూచించడంతో తన దిశ మార్చుకున్నాడు. ఏజ్ గ్రూప్ క్రికెట్ నుంచే నిలకడ కొనసాగించిన వెబ్‌స్టర్... 2014లో తన 20 ఏళ్ల వయసులో ఫస్ట్‌క్లాస్ అరంగేట్రం చేశాడు. మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తూ భారీగా పరుగులు రాబట్టినా... జాతీయ జట్టులో పోటీ కారణంగా అతడికి ఆసీస్ తరఫున అరంగేట్రం చేసే అవకాశం దక్కలేదు. అయినా నిరాశ చెందకుండా దేశవాళీల్లో రాణించిన వెబ్‌స్టర్ 'బోర్డర్-గావస్కర్' ట్రోఫీ ప్రారంభానికి ముందు భారత్ 'ఎ'తో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా 'ఎ' తరఫున బరిలోకి దిగి అటు బంతితో ఇటు బ్యాట్‌తో రాణించాడు. 2023-24 షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో వెబ్‌స్టర్ విశ్వరూపం ప్రదర్శించాడు. సీజన్ ఆసాంతం ఒకే తీవ్రత కొనసాగించిన అతడు... 58.62 సగటుతో 938 పరుగులు చేయడంతో పాటు... 30.80 సగటుతో 30 వికెట్లు పడగొట్టాడు. ఈ టోర్నీ చరిత్రలో గ్యారీ సోబర్స్ తర్వాత ఒకే సీజన్‌లో రెండు విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన ఆటగాడిగా నిలిచాడు. దీంతో పాకిస్తాన్‌తో జరిగిన ప్రైమ్‌మినిస్టర్స్ ఎలెవన్ జట్టుకు ఎంపిక చేశారు. అక్కడ కూడా రాణించిన వెబ్‌స్టర్ తనను పక్కన పెట్టలేని పరిస్థితి కల్పించాడు. కెరీర్‌లో ఇప్పటి వరకు 93 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లాడిన వెబ్‌స్టర్ 5297 పరుగులు సాధించాడు. అందులో 12 సెంచరీలు, 24 హాఫ్‌సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో 148 వికెట్లు పడగొట్టాడు.



తొలి ఇన్నింగ్స్‌లో వెబ్‌స్టర్ బ్యాటింగ్

బీసీసీఐ కార్యదర్శిగా దేవజిత్ సైకియా!



ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి పదవికి దేవజిత్ సైకియా దరఖాస్తు చేసుకున్నారు. ఇన్నాళ్లుగా బోర్డు సెక్రటరీగా పని చేసిన జైషా... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ఆ స్థానం ఖాళీ అయింది. కాగా ఈ పదవికి శనివారం దేవజిత్ సైకియా దరఖాస్తు చేసుకున్నారు. గత నెల రోజులుగా బోర్డు తాత్కాలిక కార్యదర్శిగా వ్యవహరిస్తున్న సైకియా... ఇక పూర్తి స్థాయి అధికారాలు చేపట్టనున్నారు. అలాగే కోశాధికారి పదవికి ప్రభ్‌తేజ్ భాటియా దరఖాస్తు చేసుకున్నారు. ఈ రెండు పదవులకు వీరిద్దరు మాత్రమే దరఖాస్తు చేసుకోవడంతో ఎంపిక ఏకగ్రీవం కానుంది. గతంలో ట్రెజరర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆశిశ్ షెలార్... మహారాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకోవడంతో ఈ పదవి నుంచి తప్పుకున్నారు.

బెంగాల్ టైగర్స్ 'హ్యాట్రిక్'

రూర్కెలా: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) శ్రాచి బెంగాల్ టైగర్స్ 'హ్యాట్రిక్' విజయం నమోదు చేసుకుంది. శనివారం జరిగిన పోరులో బెంగాల్ టైగర్స్ 4-1 తేడాతో ఢిల్లీ ఎస్జీ పైపర్స్‌ను మట్టికరిపించింది. బెంగాల్ టైగర్స్ తరఫున జుగ్‌రాజ్ సింగ్ (17వ, 38వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో సత్తాచాటగా... సుఖ్‌జీత్ సింగ్ (1వ నిమిషంలో), అభిషేక్ (47వ ని.లో) చెరో గోల్ సాధించారు. ఢిల్లీ పైపర్స్ తరఫున ఫర్లాంగ్ గారెత్ (53వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. లీగ్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన బెంగాల్ టైగర్స్ 9 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక అగ్రస్థానంలో ఉంది. శనివారమే జరిగిన మరో మ్యాచ్‌లో గోనాసిక జట్టు 3-1 గోల్స్ తేడాతో హైదరాబాద్ తూఫాన్స్‌పై గెలుపొందింది. గోనాసిక జట్టు తరఫున సునీల్ విఠలాచార్య (2వ ని.లో), చార్లెట్ విక్టర్ (33వ ని.లో), నీలమ్ సంజీప్ (60వ ని.లో) తలా ఒక గోల్ సాధించగా... హైదరాబాద్ తూఫాన్స్ తరఫున డానియల్ టిమోతీ (12వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. మూడు మ్యాచ్‌ల్లో ఒక విజయం 2 పరాజయాలు మూటగట్టుకున్న గోనాసిక జట్టు 4 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో ఉండగా... హైదరాబాద్ తూఫాన్స్ 3 మ్యాచ్‌ల్లో ఒక విజయం రెండు పరాజయాలతో 2 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఆరో స్థానంలో ఉంది. ఆదివారం జరగనున్న మ్యాచ్‌ల్లో వేదాంత కళింగ లాన్సర్స్‌తో సూర్మా హాకీ క్లబ్, తమిళనాడు డ్రాగన్స్‌తో యూపీ రుద్రాస్ తలపడుతుంది.



గోవా ఘన విజయం

- 4-2 గోల్స్ తేడాతో ఒడిశాపై గెలుపు
- ఇండియన్ సూపర్ లీగ్



భువనేశ్వర్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో గోవా ఫుట్‌బాల్ క్లబ్ ఘనవిజయం సాధించింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో గోవా 4-2 గోల్స్ తేడాతో ఒడిశాను చిత్తుచేసింది. గోవా జట్టు తరఫున బ్రిసన్ ఫెర్నాండెస్ (8వ, 53వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో విజృంభించగా... ఉదాంత సింగ్ (45+2వ నిమిషంలో), అమెయ్ రణవాడె (56వ ని.లో) ఒక్కో గోల్ కొట్టారు. ఒడిశా తరఫున అహ్మద్ (29వ నిమిషంలో), జెరీ (88వ ని.లో) చెరో గోల్ చేశారు. ఓవరాల్‌గా మ్యాచ్‌లో ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై గోవా 7 షాట్స్ ఆడగా... ఒడిశా 5 షాట్లు కొట్టింది. తాజా సీజన్‌లో 13 మ్యాచ్‌లాడిన గోవా 7 ఇజయాలు, 2 పరాజయాలతు, 4 'డ్రా'లతో 25 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో మూడో స్థానానికి చేరింది. ఒడిశా 14 మ్యాచ్‌ల్లో 5 విజయాలు, 4 పరాజయాలు, 5 'డ్రా'లతో 20 పాయింట్లు సాధించి ఆరో స్థానంలో ఉంది. శనివారమే జరిగిన మరో మ్యాచ్‌లో జంషెడ్‌పూర్ ఫుట్‌బాల్ క్లబ్ 2-1 గోల్స్ తేడాతో బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్‌పై గెలుపొందింది. జంషెడ్‌పూర్ తరఫున జోర్డన్ ముర్రే (84వ నిమిషంలో), మొహమ్మద్ ఉవైస్ (90వ నిమిషంలో) చెరో గోల్ సాధించగా... బెంగళూరు తరఫున అల్బెర్టో నొగురె (19వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. మ్యాచ్ ఆరంభంలో దూకుడు కనబర్చిన బెంగళూరు 19వ నిమిషంలోనే గోల్ చేసి ఆధిక్యంలోకి దూసుకెళ్లగా మ్యాచ్ మరికాసేపట్లో ముగుస్తుందనగా జంషెడ్‌పూర్ వెంటవెంటనే రెండు గోల్స్ చేసి విజయం సాధించింది. ఈ సీజన్‌లో 14 మ్యాచ్‌లాడిన బెంగళూరు 8 విజయాలు 3 పరాజయాలు, 3 'డ్రా'లతో 27 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక రెండో స్థానంలో కొనసాగుతుండగా... జంషెడ్‌పూర్ 13 మ్యాచ్‌ల్లో 8 విజయాలు 5 పరాజయాలతో 24 పాయింట్లు సాధించి నాలుగో స్థానంలో ఉంది. ఆదివారం జరగనున్న మ్యాచ్‌లో పంజాబ్ ఫుట్‌బాల్ క్లబ్‌తో కేరళ బ్లాస్టర్స్ జట్టు తలపడుతుంది.



రహమత్ షా

రహమత్ షా అద్భుత సెంచరీ

అఫ్గానిస్తాన్ రెండో ఇన్నింగ్స్ 291/7

బులవాయో: సహచరులంతా ఒకరి వెంట ఒకరు పెవిలియన్ చేరుతున్న క్లిష్ట సమయంలో రహమత్ షా (275 బంతుల్లో 139; 14 ఫోర్లు) అసాధారణ పోరాటం కనబర్చాడు. ఫలితంగా జింబాబ్వేతో రెండో టెస్టులో అఫ్గానిస్తాన్ మెరుగైన స్కోరు దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 46/3తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అఫ్గానిస్తాన్... శనివారం ఆట ముగిసే సమయానికి 91 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. ఒక దశలో 69 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో పడ్డ జట్టును రహమత్ షా ఆదుకున్నాడు. జింబాబ్వే బౌలింగ్‌కు ఎదురు నిలుస్తూ పరుగులు రాబట్టాడు. ఇస్మత్ ఆలమ్ (122 బంతుల్లో 64 బ్యాటింగ్; 4 ఫోర్లు) అజేయ అర్ధశతకంతో రహమత్‌షాకు అండగా నిలిచాడు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 132 పరుగులు జోడించడంతో అఫ్గానిస్తాన్ మంచి స్కోరు చేయగలిగింది. అబ్దుల్ మాలిక్ (1), రియాజ్ హసన్ (11), కెప్టెన్ హస్మతుల్లా (13), జియా ఉర్ రహమాన్ (6), అఫ్సర్ (5) విఫలమయ్యారు. జింబాబ్వే బౌలర్లలో ముజర్‌బానీ 4 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు అఫ్గానిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 157 పరుగులకు ఆలౌట్ కాగా... జింబాబ్వే జట్టు 243 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో మరో రెండు రోజుల ఆట మిగిలుండగా... చేతిలో 3 వికెట్లు ఉన్న అఫ్గానిస్తాన్ జట్టు ప్రస్తుతం 205 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఇస్మత్ ఆలమ్‌తో పాటు స్పిన్ ఆల్‌రౌండర్ రషీద్ ఖాన్ (12 బంతుల్లో 12 బ్యాటింగ్; 1 ఫోర్) క్రీజులో ఉన్నాడు.

దక్షిణాఫ్రికా 615

- రికెల్టన్ డబుల్ సెంచరీ
- కైల్ వెరీన్ శతకం
- పాకిస్తాన్ 64/3



కైల్ వెరీన్

కేప్‌టౌన్: పాకిస్తాన్‌పై తొలి టెస్టులో ఘన విజయం సాధించిన దక్షిణాఫ్రికా... రెండో టెస్టులోనూ భారీ స్కోరుతో విజృంభించింది. ఓవర్‌నైట్ స్కోరు 316/4తో శనివారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య దక్షిణాఫ్రికా చివరకు 141.3 ఓవర్లలో 615 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ రికెల్టన్ (343 బంతుల్లో 259; 29 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ ద్విశతకంతో చెలరేగగా... వెరీన్ (147 బంతుల్లో 100; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) 'శత'క్కొట్టాడు. పేస్ ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ (54 బంతుల్లో 62; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్పిన్ ఆల్‌రౌండర్ కేశవ్ మహరాజ్ (35 బంతుల్లో 40; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా రాణించడంతో దక్షిణాఫ్రికా కొండంత స్కోరు చేయగలిగింది. తొలి రోజు కెప్టెన్ బవుమాతో కలిసి నాలుగో వికెట్‌కు 235 పరుగులు జత చేసిన రికెల్టన్... రెండో రోజు వెరీన్‌తో కలిసి ఆరో వికెట్‌కు 148 పరుగులు జోడించాడు. పాకిస్తాన్ బౌలర్లలో మొహమ్మద్ అబ్బాస్, ఆఘా సల్మాన్ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ శనివారం ఆట ముగిసే సమయానికి 21 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసింది. కెప్టెన్ షాన్ మసూద్ (2), కమ్రాన్ గులామ్ (12), సౌద్ షకీల్ (0) పెవిలియన్ చేరగా... మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ (77 బంతుల్లో 31 బ్యాటింగ్; 4 ఫోర్లు), మొహమ్మద్ రిజ్వాన్ (9 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో 7 వికెట్లు ఉన్న పాకిస్తాన్... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 551 పరుగులు వెనుకబడి ఉంది. సఫారీ బౌలర్లలో రబడ 2, యాన్సెన్ ఒక వికెట్ పడగొట్టారు.

పోటా పోటీ



అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు మద్దతుగా శనివారం రాజధాని సియోల్‌లో జరిగిన ప్రదర్శనలో 'అభిశంసనను వ్యతిరేకించండి' అనే ప్లకార్డులు చేబూని భారీగా పాల్గొన్న జనం


అభిశంసనకు గురైన అధ్యక్షుడు యూన్ సుక్ యెల్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో జరిగిన ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

యుద్ధభూమిలో రక్తమోడుతున్న రష్యా

రోజుకు 1,180 మంది సైనికుల మరణాలు

గత ఏడాది ఏకంగా 4,30,000 మంది రష్యన్ సైనికుల దుర్మరణం

గుడ్లురిమి చూస్తూ పొరుగుదేశం ఉక్రెయిన్‌పైకి దురాక్రమణ జెండాతో దూసుకొచ్చిన రష్యా ఇప్పుడు యుద్ధభూమిలో నెత్తురోడుతోంది. రష్యా సేనలు రక్తమోడుతున్నా పుతిన్ పటాలానికి పెద్దగా ఒరిగిందేమీ లేదని యుద్ధ విశ్లేషకులు తాజాగా ప్రకటించారు. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా దళాలు 2024 సంవత్సరంలో భారీ మూల్యం చెల్లించుకున్నాయని, ఏకంగా 4,30,790 మంది రష్యా సైనికులు అంటే రోజుకు 1,180 మంది సైనికులు రణక్షేత్రంలో ప్రాణాలు పోగొట్టుకున్నారని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే యుద్ధరంగ మేథోసంస్థ 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ వార్'తాజాగా వెల్లడించింది. యుద్ధం మొదలవడానికి ముందు, ఆ తర్వాత ఆయా ప్రాంతాల్లోని వీడియో ఫుటేజీలు, భౌగోళిక మార్పులకు సంబంధించిన ఉపగ్రహ ఛాయాచిత్రాలను విశ్లేషించి సంస్థ ఈ అంచనాకు వచ్చింది. గత ఏడాది ఒక్క నవంబర్ నెలలోనే 45,720 మంది రష్యా సైనికులు చనిపోయారు. డిసెంబర్‌లో ఏకంగా 48,670 మంది మృతిచెందారని సంస్థ పేర్కొంది. ''యుద్ధం మొదలైననాటి నుంచి చూస్తే దురాక్రమణకు గతేడాది రష్యా సైన్యం భారీ మూల్యం చెల్లించుకుంది. రష్యా ఆయుధాలు, డ్రోన్లు, యుద్ధట్యాంక్‌లు, సైనికులను అంతంచేశాం''అని ఉక్రెయిన్ కమాండర్ ఇన్ చీఫ్ ఒలెస్కాండర్ సిరిస్కీ చెప్పారు.

కొన్ని గ్రామాల నుంచి తిరుగుముఖం

గత ఏడాది తూర్పు ఉక్రెయిన్‌లోని డోనెట్‌స్క్ ప్రాంతంలోని 4,168 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని భూభాగాన్ని రష్యా ఆక్రమించుకుంది. అయితే ఉక్రెయిన్ బలగాల నుంచి తీవ్రస్థాయిలో ప్రతిఘటన ఎదురవడంతో కొన్ని గ్రామాల నుంచి రష్యా సేనలు వెనుతిరిగాయి. ఈ గ్రామాల విస్తీర్ణం ఉక్రెయిన్ మొత్తం విస్తీర్ణంలో 0.69 శాతం ఉండటం గమనార్హం. 31,000 జనాభా ఉన్న కురకోవ్‌తోపాటు అవ్‌దీవ్కా, సెలిడోవ్, వులేదార్‌లు రష్యా వశమయ్యాయి. అవ్‌దీవ్కాను ఆక్రమించడానికి రష్యా చెమటోడ్చింది. అవ్‌దీవ్కా ఆక్రమణకు రష్యాకు నాలుగు నెలలు, సెలిడోవ్, కురకోవ్‌ల ఆక్రమణకు రెండు నెలల సమయం పట్టింది. ఇంతచేసినా వీటి గుండా మరింతగా ఉక్రెయిన్ భూభాగంలోకి చొచ్చుకుపోయే అవకాశం రష్యాకు దక్కలేదు. ఇంత నెమ్మదిగా ముందుకు సాగుతున్న రష్యాకు ఒక్క డోనెట్‌స్క్ ఆక్రమణకే మరో రెండు సంవత్సరాల సమయం పట్టొచ్చు. ఈ లెక్కన మొత్తం ఉక్రేయిన్‌పై ఆధిపత్యం సాధించాలంటే ఇంకెంత కాలంపడుతుందో మరి.

రోజుకు 28 చదరపు కి.మీ.ల ఆక్రమణ

గత ఏడాది నవంబర్‌లో అధిక సైన్యంతో రష్యా ఆక్రమణ స్థాయిని పెంచింది. దీంతో అక్టోబర్‌లో రోజుకు 14 చదరపు కి.మీ.లుగా ఉన్న ఆక్రమణ స్థాయి నవంబర్‌కొచ్చేసరికి రెట్టింపైంది. అంటే రోజుకు 28 చదరపు కి.మీ.లకు పెరిగింది. అయితే డిసెంబర్‌లో ఉక్రెయిన్ సేనల ప్రతిఘటన పెరగడంతో రష్యా బలగాలు కాస్తంత నెమ్మదించి రోజుకు 18 చదరపు కి.మీ.ల స్థాయిలోనే ఆక్రమించుకోవడడం మొదలెట్టాయి. అయినాసరే డిసెంబర్ 29వ నాటికి లెక్కేస్తే ఏకంగా 2,100 మంది రష్యా సైనికులను మట్టుబెట్టామని ఉక్రెయిన్ పేర్కొంది. డిసెంబర్ 19వ తేదీన 191 చోట్ల భీకర యుద్ధం జరిగిందని ఒలెక్సాండర్ చెప్పారు.

వేల సైనిక వాహనాలు ధ్వంసం

రష్యాకు చెందిన వేల సైనిక వాహనాలను ఉక్రెయిన్ ధ్వంసంచేసింది. 3,689 యుద్ధ ట్యాంక్‌లను పేల్చేసింది. 13,000 యుద్ధ ట్యాంక్ మందుగుండును నాశనంచేసింది. ''సముద్రజలాల్లో ఐదు రష్యా యుద్ధనౌకలను దాడిచేసి ముంచేశాం. 458 చిన్నపాటి యుద్ధ పడవలను పేల్చేశాం''అని ఉక్రెయిన్ నేవీ విభాగం తెలిపింది. ''మిత్రదేశం ఉత్తరకొరియా నుంచి రప్పించిన సైనికులను రణరంగంలోకి పంపినా లాభంలేకుండా పోయింది. ఉ.కొరియా సైనికుల్లో పావు శాతం మంది ప్రాణంతీశాం. ఒక్క కుర్‌స్క్ రీజియన్‌లో 3,000 మందిని మట్టుబెట్టాం. వారిని సజీవంగా పట్టుకోవడం కుదరట్లేదు. చిక్కే అవకాశమున్న వాళ్లను తోటి రష్యన్లే ముఖాలు కాల్చేసి చంపేస్తున్నారు''అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇటీవల ప్రకటించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సైన్యంలోకి మరింతగా జనం

ఉపాధి, మెరుగైన జీవనం కోసం అనధికారికంగా రష్యాలోకి చొరబడుతున్న శరణార్థులు, వలసదారులను ఈ ఏడాది ఏప్రిల్‌కల్లా పంపేస్తానని పుతిన్ చెప్పారు. అయితే రష్యా సైన్యంలో చేరితే మాత్రం వారికి చట్టబద్ధంగా ఇక్కడే ఉండనిస్తామని పుతిన్ ప్రభుత్వం చెబుతోంది. దీంతో సైన్యంలోకి ఎక్కువ మంది చేరుతారని, వాళ్లందర్నీ ఉక్రెయిన్ యుద్ధక్షేత్రంలోకి తరలించాలని ప్రభుత్వం ఆశిస్తోంది. చమురు అమ్మకాలతో వస్తున్న అధిక లాభాలను యుద్ధం కోసం రష్యా ఖర్చుచేస్తోంటే, పశ్చిమదేశాలు అందిస్తున్న ఆయుధాలు, ఆర్థికసాయంతో ఉక్రెయిన్ యుద్ధంలో పోరాడుతోంది. లక్షలాది శ్రామికశక్తి లోటుతో రష్యా ఆర్థికవ్యవస్థ పలచబారుతుంటే, ప్రాణభయంతో కోట్లాది మంది ఉక్రేనియన్లు పోలండ్, హంగేరీ, రొమేనియా, స్లోవేకియా తదితర దేశాలకు వలసపోతూ దేశాన్ని 'తక్కువజనాభాగల దేశం'గా మార్చేస్తున్నారు. ఇలాంటి యుద్ధం ఇంకెంత కాలం కొనసాగుతుందో మరి.

అమెరికా దిగువసభలో నలుగురు హిందువులు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలతోపాటు జరిగిన పార్లమెంట్ దిగువసభ ఎన్నికల్లో గెలిచిన నలుగురు హిందువులు శుక్రవారం సభలో అడుగుపెట్టారు. అమెరికాలో మైనారిటీ వర్గమైన హిందువులు ఒకేసారి నలుగురు దిగువసభకు ఎన్నికవడం చరిత్రలో ఇదే తొలిసారి. ఆరుగురు భారతీయ మూలాలున్న వ్యక్తులు ఈసారి దిగువసభ ఎన్నికల్లో గెలవగా వారిలో నలుగురు హిందువులుకావడం విశేషం. గెలిచిన డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థుల్లో క్రైస్తవేతర, యూదుయేతర మతవిశ్వాసం ఉన్న వ్యక్తులు కేవలం 14 మంది మాత్రమే. వీరిలో హిందువులు నలుగురు, ముస్లింలు నలుగురు, బౌద్ధులు ముగ్గురు, ఏ మతాన్ని ఆచరించని వాళ్లు ముగ్గురు ఉన్నారు. హిందువులు సుహాస్ సుబ్రహ్మణ్యం, రాజా కృష్ణమూర్తి సుబ్రహ్మణ్యం, రో ఖన్నా, శ్రీ థానేదార్ తాజాగా ఎన్నికల్లో విజయపతాక ఎగరేయడం తెల్సిందే. భారతీయ మూలాలున్న మహిళా అమెరికన్ ప్రమీలా జయపాల్ తన మతం ఏమిటనేది పేర్కొనలేదు. భారతీయ మూలాలున్న మరో సీనియర్ దిగువసభ సీనియర్ సభ్యుడు డాక్టర్ అమీ బెరా దేవుడొక్కడే అనే విశ్వాసాన్ని తాను నమ్ముతానని చెప్పారు. ''12 ఏళ్ల క్రితం నేను దిగువసభలో ప్రమాణంచేసేటప్పుడు నేనొక్కడినే భారతీయఅమెరికన్‌ను. ఇప్పుడు మా బలం ఆరుకు పెరిగింది''అని అమీబెరా అన్నారు. మొత్తం సభ్యుల్లో క్రైస్తవులదే మెజారిటీ కాగా 31 మంది(ఆరు శాతం) యూదు మతస్థులున్నారు. గెలిచిన రిపబ్లికన్ పార్టీ సభ్యుల్లో 98 శాతం మంది, డెమొక్రటిక్ పార్టీ సభ్యుల్లో 75 శాతం మంది క్రైస్తవులు ఉన్నారు.

స్పీకర్‌గా మళ్లీ మైక్

52 ఏళ్ల మైక్ జాన్సన్ ప్రతినిధుల సభ స్పీకర్‌గా మళ్లీ ఎన్నికయ్యారు. అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ పదవికి శుక్రవారం ఎన్నికలు నిర్వహించగా కేవలం మూడు ఓట్ల స్వల్ప మెజారిటీతో ఆయన నెగ్గారు. గత వందేళ్ల చరిత్రలో ఇంత తక్కువ మెజారిటీతో గెలిచిన స్పీకర్‌గా మైక్ చరిత్ర సృష్టించారు. రిపబ్లికన్ పార్టీ తరఫున మైక్ బరిలో దిగారు. దిగువసభలో 219 మంది రిపబ్లికన్లు ఉండగా, 215 మంది డెమొక్రాట్లు ఉన్నారు. ఈయనకు అనుకూలంగా 218 ఓట్లు, వ్యతిరేకంగా 215 మంది పడ్డాయి. డెమొక్రటిక్ సభ్యుడు హకీమ్ జెఫ్రీస్ సైతం మైక్‌కే ఓటేయడం విశేషం. స్వల్ప మెజారిటీతో నెగ్గిన మైక్ వెంటనే స్పీకర్‌గా ప్రమాణస్వీకారం చేశారు.


మహా కుంభమేళా సమీపిస్తున్న వేళ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లోని సంగంలో శ్రీ నిరంజని అఖాడాకు చెందిన నాగా సాధువుల ప్రదర్శన

మన్మోహన్ జీ, మరవలేం!

దివంగత ప్రధానిని గుర్తు చేసుకున్న కుటుంబం, సన్నిహితులు

న్యూఢిల్లీ: దివంగత ప్రధాని మన్మోహన్‌సింగ్ జ్ఞాపకాలను ఆయన కుటుంబీకులతో పాటు సన్నిహిత మిత్రులు స్మరించుకున్నారు. మన్మోహన్ స్మృత్యర్థం శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమం ఇందుకు వేదికైంది. ఆయన భార్య గురుశరణ్ కౌర్, కుమార్తెలతో పాటు పలువురు సన్నిహితులు పాల్గొన్నారు. తండ్రితో తమ అనుబంధాన్ని, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కూతుళ్లు ఉపీందర్‌సింగ్, దామన్‌సింగ్, అమృత్‌సింగ్ కంటతడి పెట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న మాంటెక్ సింగ్ అహ్లూవాలియాతో పాటు పలువురు మాజీ దౌత్యవేత్తలు, సివిల్ సర్వెంట్లు మంత్రిగా, ప్రధానిగా మన్మోహన్ శైలిని, సవాళ్లు ఎదురైనప్పుడు ఆయన వ్యవహరించిన తీరును కొనియాడారు. 92 ఏళ్ల మన్మోహన్ వృద్ధాప్య సమస్యలతో డిసెంబర్ 26న మరణించడం తెలిసిందే.

గాజాలో 15 మంది మృత్యువాత

డెయిర్ అల్-బలాహ్: గాజాలోని ఖాన్ యూనిస్‌పై శనివారం ఉదయం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒక చిన్నారి ఉంది. ఒక కారు, ఒక ఇల్లు, ఒక వీధిపై ఈ దాడులు జరిగాయని స్థానికులు తెలిపారు. గాజాలోని సరయా కాంప్లెక్స్ సమీపంలో జరిగిన దాడిలో ఒక నివాసం నేల మట్టమైందన్నారు. గత 24 గంటల వ్యవధిలో ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడుల్లో 60 మంది చనిపోగా 270 మందికి పైగా గాయపడ్డారని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది.

కేజ్రీవాల్‌పై పర్వేశ్ వర్మ

సీఎం అతిశీ వర్సెస్ రమేష్ బిదూరి

- 29 అభ్యర్థులతో బీజేపీ తొలి జాబితా
- వీరిలో ఇద్దరు 'ఆప్', ఒక కాంగ్రెస్ మాజీ మంత్రి
- న్యూఢిల్లీ బరిలో ఒక సీఎం, ఇద్దరు మాజీ సీఎంల కుమారులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఇంకా షెడ్యూల్ రిలీజ్ చేయలేదు. కానీ.. ప్రధాన పార్టీలన్నీ గెలుపుగుర్రాలను ప్రకటించేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 70అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను శనివారం బీజేపీ 29మందితో తొలి జాబితా విడుదల చేసింది. మాజీ సీఎం కేజ్రీవాల్, తాజా సీఎం ఆతిశీలతో ఇద్దరు మాజీ ఎంపీలు తలపడబోతున్నారు. ఈ జాబితాలో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఇద్దరు మాజీ మంత్రులకు కూడా చోటు దక్కింది. కేజ్రీవాల్ ప్రాతినిథ్యం వహిస్తున్న న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానం నుంచి ఢిల్లీ మాజీ సీఎంల కుమారులు బరిలోకి దిగుతున్నారు. దీంతో ఈ స్థానం హాట్ స్పాట్‌గా మారింది. ఈ జాబితాలో ఇద్దరు మహిళలకు టిక్కెట్లు దక్కాయి. రేఖా గుప్తాను శాలిమార్ బాగ్ నుంచి, కుమారి రింకూని సీమాపురి(ఎస్సీ) నుంచి బీజేపీ రంగంలోకి దింపుతోంది.

కేజ్రీవాల్ వర్సెస్ ఇద్దరు మాజీ సీఎంల కుమారులు

ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ మూడు దఫాలుగా న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి విజయం సాధిస్తూ వస్తున్నారు. నాలుగోసారీ ఇక్కడి నుంచే బరిలో ఉన్నారు. కాంగ్రెస్ తరఫున మాజీ సీఎం షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్, బీజేపీ నుంచి మాజీ ముఖ్యమంత్రి సాహెబ్‌సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మ పోటీ చేయనున్నారు. దీంతో ఈ సీటుపైనే అందరి దృష్టి పడింది. కల్కాజీ స్థానం నుంచి తొలిసారి ఆప్ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచిన సీఎం ఆతిశీపై మాజీ ఎంపీ రమేష్ బిదూరిని బీజేపీ పోటీకి దింపింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో అధిష్టానం ఆయనకు ఎంపీ టికెట్ ఇవ్వలేదు. ఈసారి మాత్రం ఏకంగా సీఎం ఆతిశీపై పోటీకి నిలపడం గమనార్హం.

ఇద్దరు ఆప్ మాజీ మంత్రులకు టికెట్లు

ఆప్‌ను వీడి బీజేపీలో చేరిన ఇద్దరు మాజీ మంత్రులకు బీజేపీ అధిష్టానం టికెట్లు కేటాయించింది. పటేల్ నగర్ ఎస్సీ స్థానం నుంచి ఆప్ మాజీ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్, ప్రస్తుతం నజఫ్‌గఢ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కైలాష్ గెహ్లోత్‌కు చోటు కల్పించింది. అయితే నజఫ్‌గఢ్‌కు బదులుగా ఆయన స్థానాన్ని మార్చి బిజ్వాసన్ స్థానం నుంచి బరిలోకి దింపుతోంది. గాంధీ నగర్ నుంచి మాజీ కాంగ్రెస్ మంత్రి అరవిందర్‌సింగ్ లవ్లీకి బీజేపీ టికెట్ ఇచ్చింది. అలాగే, ఆప్ నుంచి ఛత్తర్‌పూర్ ఎమ్మెల్యేగా గెలిచి బీజేపీలో చేరిన కర్తార్ సింగ్ తన్వర్ సిట్టింగ్ స్థానం నుంచి పోటీ చేయనున్నారు.

ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ-కాంగ్రెస్ పొత్తు

- ఆ పార్టీలు దీనిని బహిరంగంగా ప్రకటించాలి: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ-కాంగ్రెస్‌లు తమ మధ్య పొత్తు ఉందనే విషయాన్ని బహిరంగంగా ప్రకటించాలని ఆప్ చీఫ్ కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఆప్ లక్ష్యంగా ఈ రెండు పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తున్న వేళ కేజ్రీవాల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. కొందరు మీడియా వ్యక్తులు మినహా మరెవరూ కాంగ్రెస్‌ను సీరియస్‌గా తీసుకోవడం మానేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్టీలు రెండు తెరవెనుక మైత్రిని సాగిస్తున్నాయని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆరోపించారు. ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలైన కాంగ్రెస్, ఆప్‌ల మధ్య హరియాణా అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొత్తు పొసగలేదు. అప్పటి నుంచి రెండు పార్టీల నేతలు కత్తులు దూసుకుంటున్నారు. ఇటీవల కాంగ్రెస్ సీనియర్ నేత అజయ్ మాకెన్ కేజ్రీవాల్‌ను జాతి వ్యతిరేకి అంటూ విమర్శించడం..ప్రతిగా కేజ్రీవాల్ కాంగ్రెస్ పార్టీని ఇండియా కూటమి నుంచి బయటకు పంపించేయాలని ఇతర పార్టీలను కోరుతాననే దాకా వెళ్లింది. శనివారం ఫిరోజ్‌షా మార్గంలోని తన నివాసం ఎదుట పంజాబ్‌కు చెందిన మహిళలు నిరసనకు దిగడంపై కేజ్రీవాల్ స్పందిస్తూ.. 'వీరు పంజాబ్ మహిళలు కారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన వారు. పంజాబ్ మహిళలకు ఆప్‌పై నమ్మకముంది. వాళ్లు మమ్మల్ని విశ్వసించారు'అని చెప్పారు. బీజేపీకి ఒక ఎజెండా లేదు. ముఖ్యమంత్రి అభ్యర్థే లేరు. నాపై విమర్శలు చేయడం ద్వారానే బీజేపీ నేతలు ఎన్నికల్లో గెలవాలనుకుంటున్నారు' అని దుయ్యబట్టారు.

ఢిల్లీలో స్కూల్ వద్ద విద్యార్థి దారుణ హత్య

ముగ్గురు విద్యార్థులు సహా ఏడుగురి అరెస్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీ తూర్పు ప్రాంతంలోని షకర్‌పూర్‌లో శుక్రవారం ఒక స్కూలు విద్యార్థి(14) హత్యకు గురయ్యారు. సాయంత్రం 6 గంటల సమయంలో స్కూలు వెలుపలే ఈ దారుణం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి అదే పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులతోపాటు మొత్తం ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్కూలులో శుక్రవారం తొమ్మిదో తరగతి చదివే బాధిత విద్యార్థికి మరికొందరు విద్యార్థులతో ఓ విషయంలో గొడవ జరిగింది. సాయంత్రం 4 గంటల సమయంలో నిందితుడైన విద్యార్థి వేరొకరి ఫోన్‌తో కాల్ చేసి, జరిగిన విషయం తెలిపాడు. 'మన వాళ్లను పంపించు'అంటూ అవతలి వ్యక్తికి ఫోన్‌లో చెప్పాడు. ఆరు గంటల సమయంలో బాధిత విద్యార్థి బయటకు రాగా అక్కడే తన బృందంతో వేచి ఉన్న నిందితుడు గొడవకు దిగాడు. వెంట తెచ్చుకున్న కత్తితో అతడి పొట్టలో పొడిచాడు. వారంతా అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని వెంటనే ఆస్పత్రికి తరలించినా లాభం లేకపోయింది. సీసీ ఫుటేజీ ఆధారంగా మొత్తం ఏడుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఐదుగురు బాలురు కాగా, మిగతా ఇద్దరిలో ఒక కాలేజీ విద్యార్థి, మరొకరు డెయిరీ దుకాణం యజమాని. దారుణానికి దారి తీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

నేడు ఢిల్లీలో ప్రధాని మోదీ పర్యటన

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన లాంఛనంగా ప్రారంభిస్తారు. ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్‌ను ప్రారంభించనున్నారు. సాహిబాబాద్ ఆర్ఆర్‌టీఎస్ స్టేషన్ నుంచి న్యూ అశోక్‌నగర్ ఆర్ఆర్‌టీఎస్ స్టేషన్ వరకు నమో భారత్ రైలులో ప్రయాణిస్తారు. అలాగే ఢిల్లీ మెట్రో రైలు నెట్‌వర్క్ నాలుగో దశలో భాగంగా నిర్మించిన జనక్‌పురి-కృష్ణపార్కు మార్గాన్ని సైతం ప్రారంభిస్తారు. 26.5 కిలోమీటర్ల రిథాలా-కుండ్లీ సెక్షన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సెంట్రల్ ఆయుర్వేద రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ భవన నిర్మాణానికి పునాదిరాయి వేస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. మోదీ శుక్రవారం ఢిల్లీలో పర్యటించిన సంగతి తెలిసిందే. దేశ రాజధానిలో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న సంగతీ తెలిసిందే.

ఢిల్లీ విమానాశ్రయంపై పొగమంచు ఎఫెక్ట్..

19 విమానాలు దారి మళ్లింపు..మరో 400 ఆలస్యం

న్యూఢిల్లీ: దట్టమైన పొగమంచు ప్రభావం ఢిల్లీ విమానాశ్రయంపై వరుసగా రెండో రోజూ పడింది. దృగ్గోచరత క్షీణించడంతో శనివారం ఉదయం 19 విమానాలను దారి మళ్లించారు. మరో 400 వరకు సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. ఢిల్లీ, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన మరో 45 విమాన సర్వీసులను రద్దు చేశారు. దేశంలోనే అతి పెద్ద విమానయాన సంస్థ ఇండిగో శనివారం ఉదయం ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు తన సర్వీసులను పూర్తిగా నిలిపివేసింది. అర్ధరాత్రి దాటాక 12.15 గంటల నుంచి 1.30 గంటల మధ్య విజిబిలిటీ బాగా తగ్గిపోయిందని ఓ అధికారి తెలిపారు. అనంతరం పరిస్థితి యథాస్థితికి చేరుకుందన్నారు. దట్టమైన మంచు ప్రభావంతో ఢిల్లీతోపాటు చండీగఢ్, అమృత్‌సర్, శ్రీనగర్, గౌహతి, పట్నాల్లోని విమానాశ్రయాల్లో పగటి వేళల్లోనూ విజిబిలిటీ తక్కువగా ఉందని ఇండిగో తెలిపింది. ఢిల్లీలో దట్టంగా మంచు కురవడంతో శుక్రవారం సైతం 400 పైగా సర్వీసులు ఆలస్యంగా నడిచాయి.

తప్పుడు నీటి బిల్లుల్ని మాఫీ చేస్తాం!

ఢిల్లీ ప్రజలకు కేజ్రీవాల్ మరో హామీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ రాష్ట్ర ప్రజలకు మరో హామీ ఇచ్చారు. మరోసారి అధికారంలోకి రాగానే ఎక్కువగా వచ్చిన మంచి నీటి బిల్లులను మాఫీ చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో ప్రతినెలా 20 వేల లీటర్ల ఉచిత మంచినీరు అందిస్తున్నామని.. దీనివల్ల 12 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందన్నారు. అంతేగాక తనను అక్రమంగా జైల్లో ఉంచినప్పుడు ఢిల్లీ జల్ బోర్డు తప్పుడు నీటి బిల్లులు ఇచ్చిందని ఆరోపించారు. భారీగా వచ్చిన ఆ బిల్లులను చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. 'బిల్లు తప్పని భావించిన వారు ఇప్పుడు చెల్లించకండి. మేం అధికారంలోకి రాగానే వాటిని మాఫీ చేస్తాం'అని కేజ్రీవాల్ ప్రకటించారు.

బాణసంచా యూనిట్‌లో పేలుడు..

ఆరుగురు మృత్యువాత

సాక్షి, చెన్నై: తమిళనాడులో ఓ బాణసంచా తయారీ యూనిట్‌లో సంభవించిన పేలుడులో ఆరుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. విరుధునగర్ జిల్లా శివకాశీ సమీపంలోని సాత్తూరు అప్పయ్య నాయకన్ పట్టిలోని పరిశ్రమలో శనివారం ఉదయం ఘటన చోటుచేసుకుంది. కార్మికులు బాణ సంచా తయారీకి అవసరమైన రసాయన ముడి పదార్థాలను కలిపే పనిలో ఉండగా ఘటన చోటుచేసుకుంది. పేలుడు తీవ్రతకు ఫ్యాక్టరీ ప్రాంగణంలోని నాలుగు గదులు నేలమట్టమయ్యాయి. ఆరుగురు చనిపోగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పితంపూర్ ప్లాంట్ వద్ద ఉద్రిక్తత

ధార్(మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా పితంపూర్‌లోని వ్యర్థాల శుద్ధి ప్లాంట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భోపాల్ ఘోర విషాదానికి కారణమైన యూనియన్ కార్బైడ్‌లోని 337 టన్నుల వ్యర్థాలను ఆ ప్లాంట్‌కు తరలించి శుద్ధి చేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం సుమారు 150 మంది ప్లాంట్‌పైకి రాళ్లు రువ్వారని పోలీసులు తెలిపారు. వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఉన్నతాధికారులు పితంపూర్‌లో పౌర సంఘాల ప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేశారు. కోర్టు ఉత్తర్వులను అనుసరించి వ్యర్థాల తరలింపు చర్యలు కొనసాగుతాయని అధికారులు వివరించారు. ఈ విషయంలో ప్రజలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు కొనసాగుతాయని చెప్పారు. వదంతులను నమ్మొద్దని ప్రజలను కోరారు. శుక్రవారం పితంపూర్ బచావో సమితి సారథ్యంలో పట్టణంలో బంద్, నిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్లాంట్ వద్దకు చేరిన సుమారు 600 మందిని పోలీసులు చెదరగొట్టారు. ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. ప్లాంట్ పరిసరాల్లో ఈ నెల 12 వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఆత్మాహుతికి యత్నించిన ఇద్దరు వ్యక్తులకు 10 నుంచి 15 శాతం కాలిన గాయాలయ్యాయి. వీరికి ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోందని తెలిపింది.

హుగ్లీ వారధిపై వాగ్యుద్ధం..!

బాబుల్ సుప్రియో, అభిజిత్ గంగూలీ గొడవ

కోల్‌కతా: చారిత్రక హుగ్లీ రెండో వంతెన చారిత్రక హుగ్లీ రెండో వంతెన శుక్రవారం రాత్రి పశ్చిమబెంగాల్ మంత్రి బాబుల్ సుప్రియో, బీజేపీ ఎంపీ అభిజిత్ గంగూలీ మధ్య రాజకీయ డ్రామాకు వేదికగా మారింది. ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం జరిగింది. సుప్రియో హౌరాలోని తన నివాసానికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తన వెనుక వస్తున్న కారు హారన్‌ను అదే పనిగా మోగిస్తుండటంతో ఆయనలో సహనం నశించింది. దీంతో ఒక్కసారిగా తన వాహనాన్ని వారధిపైనే నిలిపివేసి, వెనుక వస్తున్న వాహనం వద్దకు చేరుకున్నారు. అంత దురుసుగా వాహనం ఎందుకు నడుపుతున్నావంటూ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కారులో వెనుక సీటులో కూర్చున్నది మాజీ జడ్జి, ఎంపీ అభిజిత్ గంగూలీ అని గమనించిన ఆయన, అంత ప్రమాదకరంగా కారు నడపటమేంటని ప్రశ్నించారు. దీంతో, ఇద్దరూ వాడీవేడిగా వాదులాడుకున్నట్లు సాక్ష్యులు తెలిపారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటానంటూ సుప్రియో హెచ్చరించినా గంగూలీ మాత్రం మౌనంగానే ఉండిపోయారు.అదే సమయంలో వంతెనపై భారీగా జనం గుమికూడారు. వాహనాలు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం ఘటనపై బాబుల్ సుప్రియో మాట్లాడుతూ..గంగూలీ తనను తీవ్ర పదజాలంతో దూషించడంతో వాదులాట జరిగిందన్నారు. ఇలాంటి ప్రవర్తన ఏమాత్రం ఆమోదనీయం కాదని, గంగూలీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'పదేపదే హారన్ మోగించడం ఆపాలని, డ్రైవర్‌ను ర్యాష్ నడపొద్దని చెప్పాలని మాత్రమే గంగూలీని కోరాను. ఆయన మాత్రం నన్ను తిడుతూనే ఉన్నారు'అని సుప్రియో అన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో జర్నలిస్ట్ దారుణ హత్య

- పరారీలో ప్రధాన నిందితుడు కాంగ్రెస్ నేత
- అతడి ఇద్దరు సోదరులతోపాటు ముగ్గురి అరెస్ట్..
- సిట్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిజాపూర్‌కు చెందిన జర్నలిస్ట్ ముకేశ్ చంద్రాకర్(33) దారుణ హత్యకు గురయ్యారు. జనవరి ఒకటో తేదీ నుంచి కనిపించకుండా పోయారు. చంద్రాకర్ సోదరుడి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేసి శుక్రవారం బిజాపూర్‌లోని చట్టన్‌పారా బస్తీలోని సివిల్ కాంట్రాక్టర్ సురేశ్ చంద్రాకర్‌కు చెందిన సెప్టిక్ ట్యాంకులో మృతదేహాన్ని కనుగొన్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు శనివారం సురేశ్ ఇద్దరు సోదరులతోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జిల్లా నేత అయిన సురేశ్ పరారీలో ఉండగా ఆయన కోసం ప్రత్యేక బృందాలను పంపినట్లు డిప్యూటీ సీఎం విజయ్ శర్మ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఐపీఎస్ అధికారి మయాంక్ గుర్జార్ సారథ్యంలో 11 మందితో సిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. అటవీ భూమిని ఆక్రమించి చంద్రాకర్ నిర్మించిన కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ యార్డును స్థానికులు ధ్వంసం చేశారు. ఇలా ఉండగా, బిజాపూర్‌లో సురేశ్ చేపట్టిన రోడ్డు పనుల్లో భారీగా అవినీతి చోటుచేసుకున్నట్లు డిసెంబర్ 25న ఎన్‌డీటీవీలో ప్రసారమైన కథనమే ఈ ఘటనకు దారి తీసినట్లు భావిస్తున్నారు. ముకేశ్ చంద్రాకర్ హత్యను ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ), ఎడిటర్స్ గిల్డ్, ఇండియన్ ఉమెన్ ప్రెస్ కార్ప్స్ తీవ్రంగా ఖండించాయి.

పార్లమెంటరీ ప్రభుత్వానికి మరోపేరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

పార్లమెంటరీ పద్ధతులు - పారిభాషిక పదజాలం

పార్లమెంట్ సమావేశాల్లో వివిధ చర్చలు, తీర్మానాలు, ఓటింగ్ మొదలైన ప్రక్రియలుంటాయి. పార్లమెంట్‌లో ఉపయోగించే ప్రతి పదానికి ప్రత్యేక అర్థం ఉంది. పార్లమెంటరీ ప్రక్రియను బ్రిటన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు.

Session - సమావేశ కాలం: పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు ఉన్న మధ్య కాలాన్ని సమావేశాల కాలం అంటారు. సమావేశాలను అవసరాన్ని బట్టి ఎన్ని రోజులైనా నిర్వహించుకోవచ్చు. నిబంధన- 85 ప్రకారం ఆరు మాసాలకు ఒకసారి, సంవత్సరానికి రెండుసార్లు జరపాలి.

Agenda - ఎజెండా: పార్లమెంటులో చర్చించాల్సిన కార్యక్రమాల పట్టికను ఎజెండా అంటారు. ఎజెండాను సభ వ్యవహారాల కమిటీ నిర్ణయిస్తుంది. ఈ కమిటీలో 15 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 10 మందిని లోక్‌సభ నుంచి, 5 గురిని రాజ్యసభ నుంచి తీసుకుంటారు. దీని అధ్యక్షుడిగా స్పీకర్ ఉంటారు.

Dissolution-సభ రద్దు: రాజకీయ అనిశ్చిత పరిస్థితి సమయంలో లోక్‌సభ పదవీ కాలం పూర్తి కాకముందు లేదా అయిన తర్వాత నిబంధన- 85 ప్రకారం రాష్ట్రపతి లోక్‌సభను రద్దు చేస్తారు.

Adjournment - సభ వాయిదా: సభా కార్యక్రమాలను నిర్వహించేందుకు తగిన పరిస్థితి లేనప్పుడు సభల అధ్యక్షులు సభలను వాయిదా వేస్తారు. తిరిగి ఎప్పుడు సమావేశం అవుతాయో వాయిదా వేసినప్పుడే ప్రకటిస్తారు. దాని ప్రకారం తిరిగి సభలు సమావేశం అవుతాయి.

Sine-die - నిరవధిక వాయిదా: సభ కార్యక్రమాలను నిర్వహించేందుకు తగిన పరిస్థితి లేనప్పుడు సభాధ్యక్షులు సభను వాయిదా వేస్తారు. తిరిగి ఎప్పుడు సమావేశం అవుతాయో తర్వాత ప్రకటిస్తారు. దాని ప్రకారం సభలు సమావేశం అవుతాయి.

Prorogue - దీర్ఘకాలిక వాయిదా: సభ సమావేశాలు ముగియడం లేదా పరిసమాప్తం కావడాన్ని దీర్ఘకాలిక వాయిదా అంటారు. రాష్ట్రపతి దీర్ఘకాలిక వాయిదా వేస్తారు. తిరిగి రాష్ట్రపతి పిలుపు ఇచ్చేంతవరకు సభలు వాయిదా పడతాయి. గరిష్ఠంగా ఆరు నెలలు వాయిదా పడొచ్చు.

Question Hour - ప్రశ్నోత్తరాల సమయం: సమావేశాల్లోని ప్రతిరోజూ మొదటి గంటనే ప్రశ్నోత్తరాల సమయంగా పేర్కొంటారు. ఈ సమయంలో సభాధ్యక్షుడి పూర్వానుమతితో సభ్యులు ప్రశ్నలు అడుగుతారు. వాటికి సంబంధిత మంత్రి సమాధానం ఇస్తారు.ప్రశ్నలు ప్రధానంగా రెండు రకాలు..

1. **నక్షత్రం గుర్తు ఉన్న ప్రశ్నలు:** అంటే ప్రాధాన్యత గల ప్రశ్నలు. వీటికి సమాధానాలను మౌఖికంగా ఇస్తారు. వీటి విషయంలో అనుబంధ ప్రశ్నలను అడగవచ్చు.
2. **నక్షత్రం గుర్తు లేని ప్రశ్నలు:** అంటే ప్రాధాన్యత లేని ప్రశ్నలు. వీటికి సమాధానాన్ని సంబంధిత మంత్రి లిఖిత పూర్వకంగా ఇస్తారు. వీటి విషయంలో అనుబంధ ప్రశ్నలను అడిగే అవకాశం లేదు.

Zero Hour - శూన్య కాలం: ప్రశ్నోత్తరాలు - భోజన సమయానికి మధ్య గల సమయమే.. శూన్య కాలం. ఈ టైమ్‌లో సభాధ్యక్షుడి ఆమోదం తీసుకొని అప్పటికప్పుడు వివిధ సమస్యలపై సభ్యులు ప్రశ్నలు అడుగుతారు. మంత్రులు సమాధానం ఇస్తారు. ఇది పార్లమెంట్ ప్రక్రియలో పేర్కొనలేదు. ఈ పదాన్ని మీడియా ప్రవేశపెట్టింది. 1962 నుంచి పాటిస్తున్నారు.

Calling attention motion - సావధాన తీర్మానం: ఏదైనా అత్యంత ముఖ్యమైన, ప్రజాసంబంధ అంశంపై సంబంధిత మంత్రి నుంచి అధికారికంగా సమాధానం రాబట్టేందుకు ఈ తీర్మానం ప్రవేశపెడతారు. దీన్ని ప్రవేశపెట్టేందుకు ఇద్దరు సభ్యుల మద్దతుతో సభాధ్యక్షుడికి నోటీస్ జారీ చేయాలి. అధ్యక్షుడు అంగీకరిస్తే సంబంధిత మంత్రి సమాధానం ఇస్తారు. దీన్ని 1954 నుంచి ఉపయోగిస్తున్నారు.



Half an Hour Discussion - అరగంట చర్చ: లోక్‌సభలో సోమ, బుధ, శుక్రవారాల్లో, రాజ్యసభలో ఏ రోజైనా లేదా ప్రతిరోజైనా చివరి అరగంటను కేటాయించుకోవచ్చు. ఈ సమయంలో ప్రశ్నోత్తరాలకు తగిన ప్రాధాన్యత లభించని అంశాలపై చర్చిస్తారు.

Short Duration Discussion - స్వల్ప కాలిక చర్చ: ప్రజా సంబంధమైన ముఖ్యాంశాల మీద సభ్యులు చర్చ లేవనెత్తవచ్చు. సభా కార్యక్రమాల చివర దీన్ని స్పీకర్ అనుమతిస్తారు. ఇందులో ఓటింగ్ ఉండదు.

No confidence Motion - అవిశ్వాస తీర్మానం: ప్రభుత్వం ప్రజా విశ్వాసం కోల్పోయిందని భావించినా లేదా ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఆ ప్రభుత్వాన్ని తొలగించేందుకు ఈ తీర్మానాన్ని ప్రతిపక్షాలు ప్రవేశపెడతాయి. దీన్ని ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సభ్యుల్లో 50 మంది మద్దతుతో స్పీకర్‌కు నోటీస్ జారీ చేయాలి. స్పీకర్ ఆమోదిస్తే తీర్మానం చర్చకు వస్తుంది. అనంతరం ఓటింగ్ జరుపుతారు. ఈ ఓటింగ్‌కు హాజరై ఓటువేసిన సభ్యులు సాధారణ మెజార్టీతో తీర్మానాన్ని ఆమోదిస్తే ప్రభుత్వం కూలిపోతుంది. మొట్టమొదట 1961లో నెహ్రూ ప్రభుత్వంపై జె.బి. కృపలానీ ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఎక్కువ సార్లు (8) పి.వి. నరసింహారావు ప్రభుత్వంపై ప్రవేశపెట్టారు. ఈ తీర్మానం ద్వారా 1999లో అటల్ బిహారి వాజ్‌పేయి ప్రభుత్వం కూలిపోయింది.

Confidence Motion - విశ్వాస తీర్మానం: ప్రజా విశ్వాసం తమ ప్రభుత్వానికి ఉందని నిరూపించుకునేందుకు అధికార పక్షం తనపై తాను పెట్టుకునే తీర్మానం. ఇది లోక్‌సభలో సాధారణ మెజార్టీతో నెగ్గాలి. లేకుంటే ప్రభుత్వం కూలిపోతుంది. ఈ తీర్మానం ద్వారా వి.పి.సింగ్ (1990) ప్రభుత్వం పడిపోయింది.

Quorum - నిర్దిష్ట పూర్వక సంఖ్య: నిబంధన -100 ప్రకారం పార్లమెంట్ కోరం సభాధ్యక్షుడితో కలుపుకొని 1/10. కోరం అంటే పార్లమెంట్ సమావేశాలకు హాజరు కావాల్సిన సభ్యుల సంఖ్య. కోరం లేకుంటే సమావేశాలను వాయిదా వేయవచ్చు.

Adjournment motion - వాయిదా తీర్మానం: అత్యంత ముఖ్యమైన సమకాలీన సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. దీన్ని ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సభ్యుల్లో 50 మంది మద్దతుతో నోటీస్ జారీ చేయాలి. స్పీకర్ ఆమోదిస్తే తీర్మానం చర్చకు వస్తుంది.

Lame duck session: గత లోక్‌సభలో సభ్యులుగా ఉండి ప్రస్తుత లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయిన వారితో ప్రస్తుత లోక్‌సభ సభ్యులు జరిపే చివరి సమావేశం. ఇది బ్రిటన్‌లో ఉంటుంది. మన దేశంలో లేదు.

Filibustering - ఫిలిబస్టరింగ్: పార్లమెంట్ కార్యక్రమాల్లో ఒక బిల్లు ఆమోదం పొందకుండా చేసేందుకు సభ్యులు ఉద్దేశపూర్వకంగా చేసే దీర్ఘకాలిక ఉపన్యాసం. సభ సమయం ముగిసేందుకు ఇబ్బందులు సృష్టించడం.

Gerry mandering-గెర్రిమాండరింగ్: అధికార పార్టీ నియోజకవర్గాల సరిహద్దులను తమకు అనుకూలంగా మార్చుకోవడం. ఎన్నికల్లో విజయం సాధించేందుకు చేసే ప్రయత్నం.

Floor Crossing - ఫ్లోర్ క్రాసింగ్: ప్రతిపక్ష పార్టీ నుంచి అధికార పక్షంలోకి పార్టీ ఫిరాయిస్తే ఫ్లోర్ క్రాసింగ్‌గా పేర్కొంటారు.

Carpet Crossing - కార్పెట్ క్రాసింగ్: అధికార పక్షం నుంచి ప్రతిపక్షంలోకి పార్టీ ఫిరాయిస్తే కార్పెట్ క్రాసింగ్‌గా పేర్కొంటారు.

Crossing - క్రాసింగ్: ఒక ప్రతిపక్ష పార్టీ నుంచి మరో ప్రతిపక్ష పార్టీలోకి మారడం.

Carpetbagger - కార్పెట్ బెగ్గర్: ఒక స్థానికేతర అభ్యర్థి స్థానిక అభ్యర్థిపై ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నిక కావాలనుకోవడమే కార్పెట్ బెగ్గింగ్.

గిలెటిన్: పార్లమెంట్ సమావేశాల ముగింపు దశలో వివిధ బిల్లులపై సమగ్రమైన చర్చ జరిపేందుకు తగిన సమయం లేని సందర్భంలో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లులను ఆమోదించడాన్ని 'గిలెటిన్' అని పేర్కొంటారు.

హంగ్ పార్లమెంట్: లోక్‌సభకు జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీ సంపూర్ణమైన మెజార్టీని సాధించనప్పుడు ఏర్పడే పరిస్థితిని 'హంగ్ పార్లమెంట్' లేదా 'త్రిశంకు సభ' అంటారు.

Horse Trading - హార్స్ ట్రేడింగ్: లోక్‌సభ లేదా విధాన సభ ఎన్నికల్లో ఏ పార్టీ పూర్తి మెజార్టీ సాధించనప్పుడు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీని సాధించేందుకు సభ్యుల కొనుగోలు కోసం జరిపే బేరసారాలను 'హార్స్ ట్రేడింగ్' అంటారు.

గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

1. జీరో అవర్ (Zero Hour) అంటే?
   1) ముందుగా నోటీస్ ఇవ్వకుండానే అత్యంత ముఖ్యమైన విషయాలు లేవనెత్తడం
   2) లోక్‌సభలో ద్రవ్య బిల్లును ప్రవేశపెట్ట డం
   3) ప్రతిపక్ష పార్టీల మనవిని పరిశీలించడం
   4) ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లకు మధ్య భోజన విరామం
2. అవిశ్వాస తీర్మాన మనవిని స్పీకర్ అనుమతించాలంటే ఎంత మంది లోక్‌సభ సభ్యుల మద్దతు ఉండాలి?
   1) 35 2) 50 3) 25 4) 20

సమాధానాలు: 1) 1; 2) 2;

మాదిరి ప్రశ్నలు

1. గ్యాలప్‌పోల్ అంటే ఏమిటి?
   1) ప్రతిపక్షాల అభిప్రాయాన్ని తీసుకోవడం
   2) సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరడం
   3) ప్రజాభిప్రాయాన్ని సేకరించడం
   4) ఎన్నికల ప్రచారం
2. గెర్రి మాండరింగ్ అంటే అర్థం?
   1) నియోజకవర్గ సరిహద్దులను మార్చడం
   2) ఓటర్లను ప్రభావితం చేయడం
   3) సైనిక పరిపాలన విధించడం
   4) ఏదీ కాదు
3. పార్లమెంటరీ ప్రక్రియలో పేర్కొనని పదం?
   1) ప్రశ్నల గంట (Question Hour)
   2) శూన్య కాలం (Zero Hour)
   3) దీర్ఘకాలిక వాయిదా (Prorogue)
   4) వాయిదా తీర్మానం (Adjournment Motion)
4. 'గిలెటిన్' తీర్మానం అంటే?
   1) బిల్లులను చర్చించి ఓటింగ్ జరపడం
   2) సమావేశ గడువు ముగిసేలోగా బిల్లులన్నింటినీ మూకుమ్మడిగా ఆమోదించడం
   3) 1, 2 4) ఏదీకాదు
5. మనదేశంలో మొదట ఏ లోక్‌సభ ద్వారా 'హంగ్ పార్లమెంట్' ఆవిర్భవించింది?
   1) 9వ లోక్‌సభ 2) 10వ లోక్‌సభ
   3) 8వ లోక్‌సభ 4) ఏదీకాదు
6. మన పార్లమెంట్‌లో ఉపయోగించని పదం ఏది?
   1) Lame - duck - session
   2) Point of order
   3) Censure motion
   4) Vote on Account
7. పార్లమెంటరీ కమిటీల్లో అతిపెద్ద కమిటీ?
   1) ప్రభుత్వ ఖాతాల సంఘం
   2) ప్రభుత్వ అంచనాల సంఘం
   3) ప్రభుత్వ ఉపక్రమాల సంఘం
   4) సభ వ్యవహారాల సంఘం
8. ఏ కమిటీకి కంప్ట్రోలర్ అండ్ అడిటర్ జనరల్ 'మిత్రునిగా, మార్గదర్శిగా, తాత్వికునిగా' వ్యవహరిస్తారు?
   1) జీతభత్యాల కమిటీ
   2) సభ హక్కుల కమిటీ
   3) ప్రభుత్వ ఖాతాల సంఘం
   4) గ్రంథాలయ కమిటీ
9. వీటిలో ఏ కమిటీకి స్పీకర్ అధ్యక్షుడిగా కొనసాగుతారు?
   1) ప్రభుత్వ ఉపక్రమాల కమిటీ
   2) ప్రభుత్వ ఖాతాల కమిటీ
   3) సభ వ్యవహారాల కమిటీ
   4) ప్రభుత్వ అంచనాల కమిటీ
10. ఒక బిల్లు స్వభావాన్ని బట్టి నిబంధన 110 ప్రకారం ఆ బిల్లు సాధారణ బిల్లు లేదా ఆర్థిక బిల్లు అని ఎవరు నిర్ణయిస్తారు?
    1) రాష్ట్రపతి 2) కేంద్ర ఆర్థిక మంత్రి
    3) లోక్‌సభ స్పీకర్ 4) అటార్నీ జనరల్
11. జీరో అవర్ కాలపరిమితి ఎంత?
    1) ఒక గంట 2) 45 నిమిషాలు
    3) అర్ధ గంట 4) నిర్ణీత సమయం ఉండదు
12. నక్షత్రం గుర్తు గల ప్రశ్నలకు సమాధానాలను ఎలా ఇస్తారు?
    1) లిఖితపూర్వకంగా 2) మౌఖికంగా
    3) 1, 2 4) ఏవీకాదు
13. ఆర్థికేతర బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపినప్పుడు?
    1) ఆమోదించవచ్చు
    2) పునఃపరిశీలనకు పంపవచ్చు
    3) తన వద్దే ఉంచుకోవచ్చు
    4) పైవన్నీ
14. నిబంధన 120 ప్రకారం పార్లమెంట్ వ్యవహారాల్లో ఏ భాషను ఉపయోగించాలి?
    1) సభ్యుని మాతృభాష
    2) హిందీ 3) ఇంగ్లిష్
    4) అన్నీ
15. పార్లమెంట్ ఉమ్మడి సభ సమావేశానికి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ లేనప్పుడు ఎవరు అధ్యక్షత వహిస్తారు?
    1) రాజ్యసభ ఛైర్మన్
    2) రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్
    3) ప్యానల్ స్పీకర్స్‌లో సీనియర్
    4) రాష్ట్రపతి
16. వీటిలో సరికానిది?
    1) బడ్జెట్ - ఆర్టికల్ -112
    2) ఉమ్మడి సమావేశం - 108
    3) తాత్కాలిక బడ్జెట్ - 116
    4) పార్లమెంట్ - 78
17. వీటిలో ఏ తీర్మానం అత్యంత ముఖ్యమైన తీర్మానం?
    1) సమాపాన తీర్మానం
    2) విశ్వాస తీర్మానం
    3) వాయిదా తీర్మానం
    4) సావధాన తీర్మానం
18. భారత పార్లమెంట్ సార్వభౌమాధికార సంస్థ కాదు ఇందుకు కారణం?
    1) సమాఖ్య వ్యవస్థ
    2) లిఖిత రాజ్యాంగం
    3) న్యాయ సమీక్ష 4) అన్నీ
19. ప్రోరోగ్ (Prorogue) అంటే ఏమిటి?
    1) పార్లమెంట్‌ను వాయిదా వేయడం
    2) పార్లమెంట్‌ను రద్దు చేయడం
    3) సమావేశం కొనసాగించడం
    4) పార్లమెంట్ సమావేశాన్ని ముగించడం
20. పార్లమెంటరీ ప్రభుత్వానికి మరోపేరు?
    1) లౌకిక ప్రభుత్వం 2) సంక్షేమ ప్రభుత్వం
    3) సమాఖ్య ప్రభుత్వం
    4) బాధ్యతాయుత ప్రభుత్వం
21. ఆర్థిక కమిటీల్లో ఏ కమిటీ సంయుక్త పార్లమెంటరీ కమిటీ?
    1) ప్రభుత్వ ఖాతాల కమిటీ
    2) అంచనాల కమిటీ
    3) దత్త శాసనాల కమిటీ
    4) ఎస్సీ, ఎస్టీలపై కమిటీ

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 2; 5) 1; 6) 1. 7) 2; 8) 3; 9) 3; 10) 3; 11) 4; 12) 2; 13) 4; 14) 4; 15) 2; 16) 4; 17) 3; 18) 4; 19) 4; 20) 4; 21) 1.

అర్థ వ్యాకోచానికి ఉదాహరణలు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు - కంటెంట్ (ఎస్ఏ)

అర్థ పరిణామం

భాషలోని వర్ణాలు, ధ్వనులు, వాక్య నిర్మాణం, వ్యాకరణ నిర్మాణం మారినట్లుగానే అర్థాలు కూడా మారడం సహజం. నన్నయ భారతంలో 'కంపు' అనే పదాన్ని వాసన అనే అర్థంలో వాడారు. నేటి భాషలో అది చెడు వాసన అనే అర్థంగా మారింది. ప్రతి పదానికీ చరిత్ర ఉంది. ఒక మాటకు ఒకే అర్థం కాకుండా అనేకార్థాలుంటాయి. కొత్త కొత్త భావాలు, ఆలోచనలు, అవసరాలు వచ్చినప్పుడు ఉన్న పదాలనే కొత్త సందర్భాల్లో వాడటం వల్ల కొత్త అర్థాలు ఏర్పడటం సహజం. పాతకాలంలో ఇల్లు అంటే పూరిల్లు అనే అర్థం ఉండేది. ఆధునిక కాలంలో ఇల్లు అంటే పెంకుటిల్లు, డాబా, మేడ, అపార్ట్‌మెంట్ అనే అర్థాల్లో రూఢమైంది.

అర్థ పరిణామానికి హేతువులు

అర్థ పరిణామానికి స్థూలంగా ప్రధానమైన ఐదు కారణాలను పేర్కొనవచ్చు. అవి..

- నాగరికతలో మార్పు రావడం
- చారిత్రక కారణాల వల్ల కొన్ని పదాలు ప్రసిద్ధిలోకి వచ్చి అర్థాంతరంలో ఉపయోగించడం వల్ల
- అలంకారిక ప్రయోగం
- పరిసరాల్లో మార్పు రావడం
- భావాభివ్యక్తిలో మార్పు
- ఇవేకాకుండా ప్రకరణార్థాలు, నానార్థాలు, శ్లేషార్థాలు, పలుకుబడులు, జాతీయాలు, వ్యాకరణార్థాలు, పర్యాయపదాల వల్ల అర్థాల్లో మార్పు వస్తుంది.

అర్థ పరిణామ భేదాలు

భాషావేత్తలు.. అర్థ వ్యాకోచం, అర్థ సంకోచం, అర్థ సౌమ్యత లేదా అర్థ గౌరవం, అర్థ గ్రామ్యత లేదా అర్థాపకర్ష, లక్ష్యార్థాలు, కేవల సంకేతార్థాలు, వస్తు పరిణామం, అలంకారిక ప్రయోగం, లోక నిరుక్తి వంటి భేదాలను పేర్కొన్నారు. వాటిని పరిశీలిద్దాం..

అర్థ వ్యాకోచం లేదా అర్థ విస్తృతి

ఒక పదం పాతకాలంలో పరిమితార్థంలో ఉండి, తర్వాత కాలంలో విశాలార్థంలో విస్తృతం కావడాన్ని అర్థ వ్యాకోచం లేదా అర్థ విస్తృతిగా పేర్కొనవచ్చు. ఆంగ్లంలో దీన్ని Extention of the meaning అంటారు. అర్థ వ్యాకోచానికి కొన్ని ఉదాహరణలు..

- **చెంబు:** రాగి లోహంతో చేసిన దాన్నే ప్రాచీన కాలంలో చెంబు అనేవారు. నేడు ఏ లోహంతో చేసినా చెంబు అంటున్నారు. ప్రత్యేకార్థం నుంచి విస్తృతార్థంలో ఇత్తడి చెంబు, ప్లాస్టిక్ చెంబు, వెండి చెంబు అని వ్యవహరిస్తున్నారు.
- **నూనె:** ప్రాచీన కాలంలో నువ్వుల నుంచి తీసినదాన్నే నూనెగా పరిమితార్థంలో వ్యవహరించేవారు. ప్రస్తుతం వేరుశెనగ, కొబ్బరి, సన్‌ఫ్లవర్ నుంచి తీసిన వాటిని కూడా నూనెగానే సామాన్య అర్థంలో వాడుతున్నారు.
- **అష్టకష్టాలు:** ప్రాచీన కాలంలో ఎనిమిది రకాలైన కష్టాలను పేర్కొన్నారు. అవి.. 1) దేశాంతర గమనం (విదేశాలకు వెళ్లడం) 2) భార్యా వియోగం 3) ఆపదల్లో బంధు దర్శనం 4) శత్రుస్నేహం 5) నీచ ఉచ్ఛిష్ట భోజనం 6)పరాన్న భోజన ప్రతీక్షణం 7)అప్రతిష్ట 8)దారిద్ర్యం. నేడు వీటినే అసంఖ్యాకమైన కష్టాలు అనే అర్థంలో వాడుతున్నారు.
- **అవధాని:** ప్రాచీన కాలంలో అవధానం చేసే వ్యక్తినే అవధాని అనేవారు.నేడు బ్రాహ్మణుల పేర్ల చివర అవధాని చేరుతోంది. ఇక్కడ అర్థ విస్తృతి జరిగింది.
- **కమ్మలు:** ప్రాచీన కాలంలో తాటి ఆకులతో చేసి చెవులకు ధరించే ఆభరణాలనే కమ్మలనేవారు. నేడు చెవులకు ధరించే బంగారం, వెండి, ప్లాస్టిక్ ఆభరణాలన్నింటినీ విస్తృతార్థంలో కమ్మలంటున్నారు.

అర్థ సంకోచం

ప్రాచీన కాలంలో విస్తృతార్థంలో ఉండి నేడు పరిమితార్థానికి వచ్చిన పదాలను అర్థ సంకోచం అంటారు. అర్థం కుంచించుకుపోవడమే అర్థ సంకోచం.

ఉదాహరణ:

- ప్రాచీన కాలంలో స్త్రీ, పురుషులిద్దరూ ధరించే వస్త్రాలను చీర, కోక అనేవారు. ఇప్పుడు కేవలం స్త్రీలు ధరించే వస్త్రాలు అనే అర్థంలో పరిమితమయ్యాయి.
- పూర్వం అవ్వ అనే పదాన్ని స్త్రీ అనే సామాన్య అర్థంలో వాడేవారు. ఇప్పుడు కేవలం వృద్ధ స్త్రీ అనే అర్థానికే పరిమితమైంది.
- పని, ప్రయత్నం అనే అర్థంలో ప్రాచీనకాలంలో ఉద్యోగం అనే పదం వాడేవారు. నేడు కేవలం ప్రభుత్వ, ప్రైవేటు, పారిశ్రామిక సంబంధమైన సంస్థల్లో చేసే ఉద్యోగం అనే అర్థంలో పరిమితమైంది.
- **శ్రాద్ధం:** దీనికి పూర్వం శ్రద్ధతో చేసే పని అనే అర్థం ఉండేది. ఇప్పుడు చనిపోయిన వారికి నిర్వహించే కర్మకాండగా రూఢమైంది.
- **అర్థ సంకోచం జరిగిన కొన్ని పదాలు:** వ్యవసాయం, మృగం, ఆరాధ్యుడు, సంభావన, నెయ్యి, సాహెబ్, జంగమ, కర్మ.

అర్థ సౌమ్యత లేదా అర్థ గౌరవం లేదా అర్థోత్కర్ష

పూర్వకాలంలో నిందార్థంలో వాడిన పదాలు కాలక్రమంలో విశిష్టార్థ బోధకాలై వాటికి అర్థ గౌరవం కలిగినప్పుడు వాటిని అర్థ సౌమ్యత లేదా అర్థోత్కర్ష అంటారు.

ఉదాహరణలు:

- **సభికులు:** ప్రాచీన కాలంలో జూదగాళ్లు అనే అర్థంలో వాడేవారు. నేడు సభలోని వారు అనే గౌరవార్థంలో వాడుతున్నారు.
- **వైతాళికులు:** పూర్వం రాజును నిద్రలేపే వారు అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం సంస్కర్తలు, మూఢాచారాలపై అవగాహన కలిగించేవారు అనే గౌరవార్థంలో వాడుతున్నారు.
- **ముహూర్తం:** గతంలో నిమిష కాలం, అల్పకాలం అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం పవిత్రమైన శుభకార్యాలు నిర్వహించే కాలం అనే అర్థంలో రూఢమైంది.
- **మర్యాద:** 'హద్దు' అనే అర్థంలో ఉండేది. నేడు గౌరవం అనే అర్థంలో వాడుతున్నారు.
- **అదృష్టం:** కనిపించనిది అనే అర్థం ఉండేది. నేడు సంపద, భాగ్యం అనే అర్థంలో ఉంది.
- **అంతస్తు:** మేడ పై భాగం అనే అర్థంలో పూర్వం వాడేవారు. ప్రస్తుతం పరువు, ప్రతిష్ఠ అనే అర్థ గౌరవాన్ని సంతరించుకుంది.
- ఆంగ్లంలో Knight అనే పదం Servant అనే అర్థంలో పాతకాలంలో ఉండేది. ప్రస్తుతం ప్రజ్ఞాశాలి అనే అర్థంలో వాడుతున్నారు.
- nice అనే పదం stupid అనే అర్థంలో ఉండేది. నేడు అందమైన అనే అర్థంలో వాడుతున్నారు.

అర్థ గ్రామ్యత లేదా అర్థాపకర్ష లేదా అర్థ న్యూనత

ప్రాచీనకాలంలో గౌరవార్థంలో ఉండి కాలక్రమంలో నిందార్థంలో ప్రయోగిస్తున్న పదాలను అర్థ గ్రామ్యత లేదా అర్థాపకర్ష అంటారు.

- **కంపు:** ఒకనాడు సువాసన అనే అర్థం ఉండేది. ప్రస్తుతం దుర్వాసన అనే అర్థంలో వాడుతున్నారు.
- **ఛాందసుడు:** పూర్వకాలంలో వేద పండితుడు అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం అమాయకుడు, లోకజ్ఞానం లేనివాడు అనే నిందార్థంలో వాడుతున్నారు.
- **కర్మ:** పూర్వం పని అనే అర్థంలో వాడేవారు. ప్రస్తుతం పితృకర్మ అనే అర్థానికి పరిమితమైంది.
- **దేవదాసి:** ఒకప్పుడు దేవాలయాల్లో నృత్య గానాదులు నిర్వహించే స్త్రీ అనే అర్థం ఉండేది. ప్రస్తుతం వేశ్యకు పర్యాయపదంగా మారింది.
- **సాని:** పూర్వం రాణి, దొరసాని అనే గౌరవార్థంలో వాడేవారు. ప్రస్తుతం వేశ్య, వ్యభిచారిణి అనే అర్థంలో వాడుతున్నారు.

అర్థాపకర్ష జరిగిన కొన్ని పదాలు: కళావంతులు, కైంకర్యం, పూజ్యం, ఘటం మొదలైనవి.

లక్ష్యార్థ సిద్ధి

పదాలకు అసలు అర్థాలతోపాటు కొన్ని లక్ష్యార్థాలు ఏర్పడి రూఢికెక్కాయి. లక్ష్యార్థాలకు అనేక మూలాలుంటాయి. లక్ష్యార్థాలు ఏర్పడేందుకు 1) ఆధార ఆదేయ సంబంధం 2) కార్యకారణ సంబంధం 3) అకాంశి సంబంధం ఉంటుంది.

1. **ఆధార ఆదేయ సంబంధం:** ప్రాచీనార్థం, ముష్టి - పిడికిలి, నేడు భిక్ష, భిక్షం ఆధారమైంది. పిడికిలి కాబట్టి భిక్ష అనే లక్ష్యార్థం ఏర్పడింది.
2. **కార్యకారణ సంబంధం:** పూర్వం దాహం అనే పదానికి దహించడం, తపించడం అనే అర్థాలు ఉన్నాయి. కార్యకారణ సంబంధం వల్ల దప్పిక, దాహం అనే లక్ష్యార్థాలు ఏర్పడ్డాయి.
3. **లక్ష్యలక్షణ సంబంధం:** ప్రాచీనార్థంలో సూది.. వస్త్రాలు కుట్టేందుకు ఉపకరించేది. ప్రస్తుతం డాక్టర్లు వాడే ఇంజక్షన్ అనే లక్ష్యార్థంలో సూది వాడుతున్నారు.

కేవలం సంకేతార్థాలు

ఒక పదానికి జన వ్యవహారంలో ఒక అర్థం ఉండగా, ఒక వృత్తి, విజ్ఞాన శాస్త్రపరంగా ఆ పదాన్ని ప్రత్యేక అర్థంలో వాడతారు. ఇలాంటి వాటిని సంకేతార్థాలు అంటారు.

1. **వాయువు:** సామాన్యార్థం గాలి(ప్రాచీ నకాలం), నేడు పశువైద్యులు, పశువులకు వచ్చే వ్యాధిని గాలి అంటున్నారు. ఇది సంకేతార్థం.
2. **ద్రవ్యం:** ప్రాచీనార్థం.. ధనం, డబ్బు. నేడు ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు, పదార్థం అనే సంకేతార్థంలో వాడుతున్నారు.
3. **ఇంధనం:** ఇంతకుముందు వంట చెరకు, చిదుకులు, పెట్రోలు వంటి అర్థాల్లో వాడేవారు. నేడు ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం ఉష్ణశక్తినిచ్చే చమురు, బొగ్గు వంటి వాటికి సంకేతార్థంగా వాడుతున్నారు.

వస్తు పరిణామం

ఒక పదం ప్రాచీన కాలంలో సూచించే వస్తు రూపం, నిర్మాణం మొదలైన వాటిలో కాలక్రమంలో వచ్చిన భేదాన్ని సూచించే విస్తృతిని వస్తు పరిణామం అంటారు.

1. లక్కపిడతలు అంటే పూర్వం పిల్లలు ఆడుకొనే లక్కతో చేసిన బొమ్మలు. ప్రస్తుతం లక్కబొమ్మలే కాకుండా కర్ర, లోహంతో చేసిన బొమ్మలను కూడా లక్కపిడతలు అంటున్నారు. ఇది వస్తు పరిణామం.
2. **ఆయుధం:** ప్రాచీన కాలంలో విల్లు, గద, కత్తి వంటివి ఆయుధాలు. నేడు తుపాకీ, రైఫిల్, ఫిరంగి, అణ్వస్త్రాలు వంటి వాటిని ఆయుధాలుగా పిలుస్తున్నారు. ఇది వస్తు పరిణామం.

అలంకారిక ప్రయోగం

అలంకారికమైన పోలికను చెప్పడం వల్ల జరిగే అర్థ పరిణామాన్ని అలంకారిక ప్రయోగం అంటారు.

ఉదా॥ ఆమె రంభ, వాడు మన్మథుడు

1. రంభ, మన్మథుడు వంటి ఉపమానాల ద్వారా వారు సౌందర్యవంతులనే అర్థం స్ఫురిస్తుంది.
2. **ఎండ నిప్పులు చెరుగుతోంది** - ఎండ తీవ్రతను సూచించేందుకు నిప్పు ఉపమానాన్ని జోడించినందున ఇది అలంకారిక ప్రయోగం.
3. **చూపుల వెన్నెలలు:** చూపుల చల్లదనాన్ని సూచించేందుకు వెన్నెల ఉపమానాన్ని ప్రయోగించినందున ఇది అలంకారిక ప్రయోగం.

- తీపి మాటలు, చేదు నిజం, పచ్చి అబద్ధం, వంటివి అలంకారిక ప్రయోగాలు.

లోక నిరుక్తి

కొందరు తమకు పరిచయమున్న పదాలను తమకు పరిచయం లేని పదాలస్థానంలో వాడతారు. కాలక్రమేణా అవి జన వ్యవహారంలో బహుళ ప్రాచుర్యం పొందుతాయి. అలాంటి పదాల మార్పును లోక నిరుక్తి అంటారు.

1. నారద సింహాచలం: జన వ్యవహారంలో నార్త్ సింహాచలం నారద సింహాచలంగా మారింది. నార్త్ సింహాచలం ఒక రైల్వే స్టేషన్ పేరు. అది తెలియనివారు నారద సింహాచలంగా పిలవడంతో అలాగే ప్రసిద్ధి చెందింది. అదేవిధంగా బోరస్ మిఠాయి, మొక్కజొన్న, చక్రకేళి, మధురవాడ వంటి పదాలు లోక నిరుక్తికి ప్రసిద్ధాలు.

గత పోటీ పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో అర్థ సంకోచం జరిగిన పదాలు? (టెట్, జనవరి 2012)
   1) చందమామ, వస్తాదు, కోక
   2) ఛాందసుడు, కైంకర్యం, పత్రం
   3) సీసా, నూనె, ముష్టి
   4) ఆరాధ్యుడు, సీసా, పత్రం
2. దివంగతులగు, శివైక్యం చెందు మాటల్లో జరిగిన అర్థ పరిణామం? (టెట్, జనవరి 2012)
   1) అర్థ సంకోచం 2) లోక నిరుక్తి
   3) లక్ష్యార్థ సిద్ధి 4) సభ్యోక్తి

సమాధానాలు: 1) 4 2) 4

మాదిరి ప్రశ్నలు

1. పదజాలానికి అర్థంలో జరిగే మార్పును ఏమంటారు?
   1) ధ్వని పరిణామం 2) శబ్ద పరిణామం
   3) అర్థ పరిణామం 4) వ్యాకరణ పరిణామం
2. నన్నయ భారతంలో వాడిన కంపు పదంలో ప్రస్తుతం జరిగిన అర్థ పరిణామం?
   1) అర్థ న్యూనత 2) అర్థాపకర్ష
   3) అర్థ గ్రామ్యత 4) పైవన్నీ
3. తెలుగులో అర్థ పరిణామాన్ని గురించి మొట్టమొదట పరిశోధన చేసిన భాషావేత్త?
   1) ఆచార్య దొణప్ప 2) ఆచార్య జి.ఎస్.రెడ్డి
   3) ఆచార్య యల్.చక్రధరరావు
   4) ఆచార్య చేకూరి రామారావు
4. కింది పదాల్లో అర్థ వ్యాకోచానికి ఉదాహరణలు?
   1) కంపు, సంభావన, మృగం
   2) ధర్మరాజు, కమ్మ, పత్రం
   3) చెంబు, నూనె, ధర్మరాజు
   4) ఛాందసుడు, సాని, కమ్మ
5. ప్రాచీనకాలంలో విస్తృతార్థంలో ఉండి ఇప్పుడు పరిమితార్థానికి పరిమితమైతే అది ఏ అర్థ పరిణామం?
   1) అర్థ వ్యాకోచం 2) అర్థ సంకోచం
   3) అర్థ గ్రామ్యత 4) లోక నిరుక్తి
6. ప్రాచీన కాలంలో గౌరవార్థంలో ఉండి ప్రస్తుతం నిందార్థానికి దిగజారితే దాన్ని ఏ అర్థ పరిణామం అంటారు?
   1) అర్థ సౌమ్యత 2) వస్తు పరిణామం
   3) అర్థోత్కర్ష 4) అర్థ సంకోచం
7. సాని, కైంకర్యం, కర్మ, దేవదాసి వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామం?
   1) అర్థ సంకోచం 2) అర్థ న్యూనత
   3) సభ్యోక్తి 4) మృదూక్తి
8. తుపాకీ, రైఫిల్, ఫిరంగి వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామం?
   1) లోక నిరుక్తి 2) అలంకార ప్రయోగం
   3) వస్తు పరిణామం 4) అర్థ సంకోచం
9. వాచ్యం చేయకూడని పదాల అర్థాన్ని నూతన పద బంధాలతో చెప్పడాన్ని ఏ అర్థ పరిణామం అంటారు?
   1) అర్థ గ్రామ్యత 2) సభ్యోక్తి
   3) మృదూక్తి 4) అర్థోత్కర్ష
10. సభికులు, అంతస్తు, అదృష్టం పదాల్లో జరిగిన అర్థ పరిణామం ఏది?
    1) అర్థ సంకోచం 2) అర్థ వ్యాకోచం
    3) అర్థోత్కర్ష 4) లోక నిరుక్తి
11. ముష్టి-ఇంజక్షన్, దాహం వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామాన్ని ఏమంటారు?
    1) వస్తు పరిణామం 2) లక్ష్యార్థ సిద్ధి
    3) లోక నిరుక్తి 4) అర్థ సంకోచం
12. చనిపోవు, కులాల పేర్లు, గర్భవతి వంటి పదాల్లో జరిగిన అర్థ పరిణామం ఏది?
    1) అర్థ గౌరవం 2) అర్థ గ్రామ్యత
    3) సభ్యోక్తి 4) మృదూక్తి
13. దీపం కొండెక్కింది, నల్లపూసలు పెరిగిపోయాయి వంటి పదాలు ఏ అర్థ పరిణామానికి ఉదాహరణలు?
    1) సభ్యోక్తి 2) మృదూక్తి
    3) అర్థ గౌరవత 4) అర్థ సంకోచం
14. మొక్కజొన్న, నారద సింహాచలం, చక్రకేళి, వంటి పదాలు ఏ అర్థ పరిణామానికి ఉదాహరణలు?
    1) సభ్యోక్తి 2) లక్ష్యార్థ సిద్ధి
    3) లోక నిరుక్తి 4) అర్థ గౌరవం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 3; 5) 2; 6) 3; 7) 2; 8) 3; 9) 2; 10) 3; 11) 2; 12) 3; 13) 2; 14) 3.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ముల్కీ నిబంధనల సడలింపుతోనే ఉద్యమాలు మొదలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఉద్యమ చరిత్ర

స్వతంత్ర భారతదేశంలో హైదరాబాద్ రాష్ట్రం

ఈ అంశానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. టీఎస్‌పీఎస్సీ గ్రూప్స్ సిలబస్‌లో ఈ అంశాన్ని ప్రముఖంగా పొందుపర్చారు. కాబట్టి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారు ఈ అంశాన్ని మూడు భాగాలుగా విభజించుకొని ప్రిపేరవ్వాలి. బూర్గుల రామకృష్ణారావు నాయకత్వంలో ఏర్పాటైన మంత్రివర్గం గురించి ప్రధానంగా అధ్యయనం చేయాలి. 1952లో జరిగిన ముల్కీ ఆందోళనలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. వీటి గురించి తెలుసుకునే క్రమంలో మూడు విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.అవి..

1. స్థానిక ఉద్యోగాలు – ఒక డిమాండ్.
2. సిటీ కాలేజ్ సంఘటన – ప్రాధాన్యం
3. జస్టిస్ జగన్మోహన్ రెడ్డి కమిటీ నివేదికలోని ముఖ్యాంశాలు.

ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు, ప్రత్యేక తెలంగాణ డిమాండ్, చర్చలు,రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్(ఎస్సార్సీ) ఆవిర్భావం, కారణాలు, ఎస్సార్సీలోని ప్రధానాంశాలు, సిఫారసుల గురించి క్షుణ్నంగా తెలుసుకోవాలి. వీటితోపాటు చిన్న రాష్ట్రాలు, ఎస్సార్సీపై రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను కూడా అధ్యయనం చేయాలి.

బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గం

స్వతంత్ర భారతదేశానికి సార్వత్రిక ఎన్నికలు తొలిసారిగా 1952లో జరిగాయి. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఈ ఎన్నికల్లో హైదరాబాద్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియోజక వర్గం నుంచి గెలుపొందారు. హైదరాబాద్ రాష్ట్ర రాజ్‌ప్రముఖ్ ఉస్మాన్ అలీ ఖాన్ 1952 మార్చి 6న కింగ్ కోఠిలోని తన నివాసంలో బూర్గులతో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు.

బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గం

1. బి.రామకృష్ణారావు – సీఎం
2. బిందు దిగంబర రావు – హోం శాఖ
3. గోపాలయ సుబ్బు క్రిష్ణ మెల్కోటె–ఆర్థిక శాఖ
4. మర్రి చెన్నారెడ్డి – వ్యవసాయ, పౌరసరఫరాల శాఖ
5. దేవిసింగ్ చౌహాన్ – గ్రామీణాభివృద్ధి శాఖ
6. సి. జగన్నాథరావు – న్యాయశాఖ
7. అన్నారావు ఘనముఖి–పంచాయతీరాజ్
8. ఫూల్‌చంద్ గాంధీ – ఆరోగ్య, విద్యాశాఖ
9. నవాబ్‌జంగ్ బహదూర్ – పబ్లిక్ వర్క్స్
10. శంకర్ డియో – సామాజిక సేవలు
11. వి.బి.రాజు – సమాచార, ప్రణాళిక, కార్మిక
12. కె.వి.రంగారెడ్డి – అటవీ, కస్టమ్స్, ఎక్సైజ్
13. కొరటికర్ వినాయక రావు – వాణిజ్యం, పరిశ్రమల శాఖ

హైదరాబాద్ రాష్ట్ర మంత్రివర్గ నిర్మాణ, పరిపాలనాపరమైన ముఖ్యాంశాలు

- బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే వరంగల్‌లో గైర్ ముల్కీ(స్థానికేతరులు) ఉద్యమానికి అంకురార్పణ జరిగింది.
- హైదరాబాద్ రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు వి.డి. దేశ్‌ముఖ్ (మరాఠ్వాడ సుబా). ప్రతిపక్ష పార్టీ పేరు 'పీపుల్స్ డెమోక్రటిక్ ఫెడరేషన్'.
- బి. రామకృష్ణారావు కేబినెట్‌లో పనిచేసిన ఏకైక ఆంధ్ర నాయకుడు వి.బి.రాజు. ఆయన సికింద్రాబాద్ శాసనసభ స్థానానికి ఎన్నికయ్యారు.
- టి. హయగ్రీవాచారి అధ్యక్షతన వరంగల్‌లో మొదటి విశాలాంధ్ర మహాసభ 1950లో జరిగింది. హైదరాబాద్ రాజధానిగా విశాలాంధ్రను వెంటనే ఏర్పాటు చేయాలని ఈ మహాసభలో పట్టుబట్టారు.
- శ్రీశ్రీ అధ్యక్షతన 1954లో రెండో విశాలాంధ్ర మహాసభ హైదరాబాద్‌లో జరిగింది.
- 1956లో ఢిల్లీలో జరిగిన పెద్ద మనుషుల ఒప్పందంలో హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో బి.రామకృష్ణారావు పాల్గొన్నారు. 1956 అక్టోబర్ 31 వరకు ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగారు.
- పెద్ద మనుషుల ఒప్పందం తర్వాత 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. బి.రామకృష్ణారావు కేరళ గవర్నర్‌గా నియమితులయ్యారు.

స్థానికులకు ఉద్యోగాలు - ముల్కీ ఉద్యమం (1952)

1948లో పోలీసు చర్య అనంతరం హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైంది. తర్వాత దాదాపు నాలుగేళ్లపాటు హైదరాబాద్ సంస్థానాన్ని స్థానికేతరులే పరిపాలించారు. రెండేళ్లపాటు సైనికపాలన ఉండగా, మరో రెండేళ్లు అధికారులు హైదరాబాద్ రాష్ట్రాన్ని పాలించారు. ఇంగ్లిష్, తెలుగు స్పష్టంగా రావనే సాకుతో ఈ కాలంలో చాలామంది స్థానికులను ఉద్యోగాల నుంచి తొలగించారు. మద్రాసు నుంచి, బయటి ప్రాంతాల నుంచి చాలా మందిని రప్పించారు. తహశీల్దార్ల నుంచి కార్యదర్శుల వరకు అనేక ఉద్యోగాల్లో స్థానికేతరులనే నియమించారు. ఇలా ఒక సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేసుకొని నాలుగేళ్లపాటు పరిపాలన సాగించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అధికారులు దొంగ ముల్కీ సర్టిఫికెట్‌లను జారీ చేసి బయటి వారిని ఉద్యోగాల్లో నియమించుకున్నారు. ఇక్కడి ప్రజల పట్ల గైర్ ముల్కీలు(స్థానికేతరులు) అహంభావాన్ని ప్రదర్శించి, అవమానపర్చేవారు. ఇక్కడి వారితో అవహేళనగా మాట్లాడేవారు. ఉన్నతస్థాయి అధికారుల వల్ల అనేక అవమానాలకు గురైన స్థానికుల్లో చైతన్యం పెరిగింది. 1951లో ముల్కీల నిర్వచనాన్ని కేంద్ర ప్రభుత్వం సవరించింది. ఈ సవరణ ప్రకారం వరుసగా 15 ఏళ్లపాటు స్థానికంగా నివాసం ఉన్నవారంతా ముల్కీలవుతారు. దీనికి ఏవిధమైన ప్రమాణ పత్రం సమర్పించాల్సిన అవసరం లేదు. ఆ తర్వాత కేంద్రం మళ్లీ ముల్కీ అర్హతను 12 ఏళ్లకు కుదించింది. దీంతో స్థానికుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.

మొదటి సార్వత్రిక ఎన్నికల్లో తమ హక్కులను సాధించుకోవాలని తెలంగాణ ప్రజలు భావించారు. 1952లో అధికారంలోకి వచ్చిన బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం సంయమనాన్ని పాటిస్తూ ముల్కీల సవరణల జోలికి పోలేదు. 1952 మార్చిలో బూర్గుల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక.. ముల్కీ హక్కులను పునరుద్ధరించాలని, విద్యావంతులైన స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేశారు. గైర్ ముల్కీ ఉద్యమం క్రమంగా విస్తృతమైంది.ప్రజల్లో చైతన్యం పెరగడంతో హక్కుల సాధన కోసం ఉద్యమించారు.

గైర్ ముల్కీ ఉద్యమంలో ప్రధానంగా వినిపించిన నినాదం 'మద్రాసీ గో బ్యాక్, ఇడ్లీ సాంబర్–గో బ్యాక్'. 1952 జూన్ 26న వరంగల్‌లో విద్యార్థుల నాయకత్వంలో గైర్ ముల్కీ ఉద్యమం ప్రారంభమైంది. అయిదు రోజులపాటు నిరంతరంగా కొనసాగింది. 1952 జూలై 31న విద్యార్థులంతా కలిసి ఒక తీర్మాన పత్రాన్ని ఆమోదించి, ఆందోళన విరమించారు.



తీర్మాన పత్రంలోని అంశాలు

'దొంగ ముల్కీ పత్రాలతో ఉద్యోగాల్లో ప్రవేశించిన స్థానికేతరులపై విచారణ జరపాలి. ప్రభుత్వం వారిని తొలగించి స్థానికుల నిరుద్యోగ సమస్య తీర్చాలి. ఇక మీదట సరైన రుజువు లేనిదే ముల్కీ సర్టిఫికెట్లు ఇవ్వరాదు' అని ఐక్య విద్యార్థి సంఘం కోరింది.

ఈ తీర్మానాన్ని వరంగల్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్ ఎ.బుచ్చయ్య ప్రవేశపెట్టారు. దానికి విద్యార్థులు అంగీకరించేలా కృషి చేశారు. ఆయన కృషి వల్లే హన్మకొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా ఈ తీర్మానానికి అంగీకరించారు. ఈ విధంగా స్థానిక నిరుద్యోగ యువకులు చైతన్యవంతులై తమ హక్కుల సాధన కోసం ఉద్యమించారు. 1952 ఆగస్టు 7న ఖమ్మం ప్రాంతంలో కూడా గైర్ ముల్కీ ఉద్యమం తలెత్తింది. ఈ ఉద్యమాలన్నీ స్థానికులకు జరిగిన అన్యాయాలు, వారు ఎదుర్కొన్న అవమానాలకు వ్యతిరేకంగా జరిగినవే. నాటి తెలంగాణ సమాజంలో ఆవిర్భవించిన ఈ ఉద్యమాలన్నీ చైతన్య స్ఫూర్తితో వచ్చినవే. వీటి వెనుక ఎవరి ప్రోద్బలం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇతర ప్రాంతాల వారికి, ఇతర రాష్ట్ర ఉద్యోగులకు అవకాశం ఇస్తున్నందుకు; ఇతర రాష్ట్ర విద్యార్థులకు ఇక్కడి పాఠశాలు, కళాశాల్లో ప్రవేశాలు కల్పిస్తున్నందుకు నిరసనగా స్థానిక విద్యార్థులు రెండు రోజులపాటు సమ్మె చేశారు. 1952 ఆగస్టు 8న వరంగల్ జిల్లా మానుకోట (మహబూబాబాద్)లో దాదాపు వెయ్యిమంది విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లకుండా ప్రదర్శనలు చేస్తూ 'బే ముల్కీలు వాపసు పోవాలి' అని నినాదాలు చేశారు. విద్యార్థుల నాయకత్వంలో సంఘటితమై బలమైన ఉద్యమం రూపుదిద్దుకుంది. వరంగల్ విద్యార్థి సంఘం పిలుపు మేరకు ఈ ఉద్యమం పెద్ద ఎత్తున జరిగింది. దీంతో ముల్కీ నిబంధనలను సవరించి, కఠినతరం చేయడానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉందని 1952 ఆగస్టు 10న అన్ని పత్రికల్లో వార్త వచ్చింది.

మాదిరి ప్రశ్నలు

1. హైదరాబాద్ రాష్ట్రంలో తొలిసారిగా ఎన్నికలు ఎప్పుడు జరిగాయి?
   ఎ) 1952 ఫిబ్రవరి బి) 1950 ఫిబ్రవరి
   సి) 1949 ఫిబ్రవరి డి) 1951 ఫిబ్రవరి
2. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుడు ఎవరు?
   ఎ) జె.ఎన్.చౌదరి బి) ఎం.కె.వెల్లోడి
   సి) నవాబ్‌జంగ్ బహదూర్
   డి) మీర్ అలీఖాన్
3. బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో ఆంధ్రుడైన వి.బి. రాజు ఏ శాఖకు మంత్రిగా వ్యవహరించారు?
   ఎ) కార్మిక, ప్రణాళిక బి) విద్య, ఆరోగ్యం
   సి) సాంఘిక సంక్షేమం డి) పరిశ్రమలు
4. హైదరాబాద్ రాష్ట్ర ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన వారు?
   ఎ) బి. రామకృష్ణారావు
   బి) మెల్కోటే
   సి) రావి నారాయణరెడ్డి
   డి) మర్రి చెన్నారెడ్డి

సమాధానాలు

1) ఎ; 2) బి; 3) ఎ; 4) సి.

What is the colour of milk?

MODEL QUESTIONS


Directions: Read the questions carefully and answer them.

1. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to the group?
   A) Sand B) Stone C) Cement
   D) Brick E) Wall
   Explanation: Sand, stone, Cement and Brick are the raw materials.
   Ans: E
2. If Yellow is called Green, Green is called Black, Black is called White, White is called Red, Red is called Blue, Blue is called Orange then what is the colour of milk?
   A) White B) Black
   C) Red D) Green
   E) None of these
   Explanation: The colour of milk is white, and white is called red.
   Ans: C
3. Pointing to a photograph Seema said "He is the only grandson of my mother's father-in-law, and my father has neither brother nor sister". How is the man in photograph related to Seema?
   A) Father B) Uncle
   C) Cousin D) Brother
   E) None of these
   Ans: D
4. If '+' means '×', '×' means '÷', '÷' means '–' and '–' means '+' what is the value of
   17 + 15 – 135 × 9 ÷ 70?
   A) 270 B) 240 C) 170
   D) 200 E) None of these
   Ans: D
5. If it is possible to make a meaningful word from the fourth, the sixth, the eighth and the eleventh letters of the word GOURMANDISE using each letter only once first letter of the word is your answer. If more than one such word can be formed your answer is X. If no such word can be formed your answer is Y.
   A) D B) R C) M D) X E) Y
   Explanation: READ, DEAR, DARE.
   Ans: D
6. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to the group?
   A) Silver B) Gold C) Nickel
   D) Copper E) Brass
   Explanation: Brass is an alloy where as the remaining are elements.
   Ans: E
7. In a certain code EXTRA is written as % 5 # 73 and NOSE is written as 4@8%; how is STORE written in that code?
   A) 5#@7% B) 8#@7%
   C) 8#@%5 D) 8@75%
   E) None of these
   Ans: B
8. In a row of children facing North, Shamika is third to the right of Nikhil who is seventeenth from the right end of the row. Ravi is fifth to the left of Shamika and is twentieth from the left end. Total how many children are there in the row?
   A) 39 B) 38 C) 37
   D) Cannot be determined
   E) None of these
   Explanation: Shamika is 14^{th} from the right end. Ravi is 19^{th} from the right end.
   20 + 19 – 1 = 38
   Ans: B
9. How many such pairs of letters are there in the word EXAMINATION each of which has as many letters between them in the word, as they have in the English alphabet?
   A) None B) One C) Two
   D) Three E) None of these
   Explanation: EI, NO
   Ans: C
10. In a certain code ACQUIRE is written as EIRUQAC, how is DENSITY written in that code?
    A) YTISNDE B) YITSNED
    C) YTISNED D) YITSNDE
    E) None of these
    Explanation: The letters in the word ACQUIRE
    A=1, C=2, Q=3, U=4, I=5, R=6, E=7 are rearranged as 7564312
    Ans: D

Directions (Q. No. 11-16): Study the following information carefully and answer the questions given below. An organization wants to recruit System Analysts. The following conditions apply.

The candidate must:

i) be an engineering graduate in Computer/IT with at least 60% marks.
ii) have working experience in the field of Computer at least for 2 years after acquiring the requisite qualification.
iii) have completed minimum 25 years and maximum 30 years of age as on 1.12.2015.
iv) be willing to sign a bond for Rs. 50,000.



BANK EXAMS

REASONING

v) have secured minimum 55% marks in selection test.

However, if a candidate fulfills all other conditions except-

a) At i) above, but is an Electronics Engineer with 65% or more marks the case is to be referred to the General Manager (GM)-IT.

b) At iv) above, but has an experience of at least 5 years as a Software Manager, the case is to be referred to the VP.

In each question below, detailed information of candidate is given. You have to carefully study the information provided in each case and take one of the following courses of actions based on the information and the conditions given above. You are not to assume anything other than the information provided in each question. All these cases are given to you as on 01.12.2015. You have to indicate your decision by marking answers to each question as follows. Mark answer-

A) If the case is to be referred to VP.
B) If the case is to be referred to GM.
C) If the data provided is not sufficient to take a decision.
D) If the candidate is to be selected.
E) If the candidate is not to be selected.

11. Ms. Suneeta is an IT Engineer with 60% marks at graduation as well as in selection test. She is working as a Software Engineer for last 3 years after completing engineering degree and has completed 27 years of age. She is willing to sign the bond of Rs. 50,000.
12. Rakesh Rao is a Computer Engineer Graduate and thereafter is working as a Software Manager for past 6 years. He has secured 72% marks at graduation and 67% marks in selection test. His date of birth is 5th December 1986. He is not willing to sign the bond for Rs. 50,000.
13. Nishant is an Electronics Engineer passed out in June 2012 at the age of 22 years. Since then he is working as a Programmer in a software company. He has passed the selection test with 66% marks and is willing to sign the bond.
14. Abhijit is a Computer Engineer with 65% marks passed out in 2011 at the age of 22 years. Since then he is working as a Software Engineer, in a private firm. He is willing to sign the bond for the required amount. He has secured 63% marks in selection test.
15. Giridhar is working as a Software Engineer in a reputed company for past 4 years after completing Computer Engineering wi-th 68% marks. He has cleared the selection test with 75% marks & is willing to sign the bond. His DOB is December 17, 1988.
16. Mr. Rajan is working as a Programmer for the last 6 years in an engineering firm after passing engineering examination. He has passed Electronics Engineering with 76% marks. His date of birth is 16.05.88. He has cleared the selection test with 62% marks and is willing to sign the bond for Rs. 50,000.

Explanations:

11. Ms. Suneeta fulfils all the conditions. Hence she is to be selected. **Ans: D**
12. Rakesh Rao fulfils all the conditions except (iv) but he has been working as a software manager for the last 6 years so according to (b) his case is to be referred to V.P.
    Ans: A
13. Since the marks obtained by Nishant in graduation are not given. So the data provided is not sufficient to take a decision
    Ans: C
14. Abhijit fulfils all the conditions. Hence he is to be selected.
    Ans: D
15. Giridhar fulfils all the conditions. Hence he is to be selected. **Ans:D**
16. Mr.Rajan does not fulfil the condition (i) But he passed the Electronics Engineering will more than 65%. Hence according to (a) his case is to be referred to G.M.
    Ans: B
17. **Directions:** Given a statement followed by two assumptions numbered I and II. You have to consider the statement and the following assumptions and decide which of the assumptions is implicit in the statement.
    Mark (A) if only assumption I is implicit
    Mark (B) if only assumption II is implicit
    Mark (C) if either I or II is implicit
    Mark (D) if neither I or II is implicit

Statement: Even with the increase in the number of sugar factories in India, we still continue to import sugar.

Assumptions:

I) The consumption of sugar per capita has increased in India.
II) Many of the factories are not in a position to produce sugar to their fullest capacity.

Explanation: As the statement says that despite increase in the number of sugar factories in India we are still continuing to import sugar, it must be that either the consumption of sugar has increased or many of the factories are not producing sugar to the maximum capacity. **Ans: C**

విద్య, ఉద్యోగ సమాచారం

సీబీఎస్‌ఈలో 212 గ్రూప్-బి, గ్రూప్-సి పోస్టులు

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన గ్రూప్-బి, గ్రూప్-సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 212
- **పోస్టుల వివరాలు:** సూపరింటెండెంట్-142, జూనియర్ అసిస్టెంట్-70.
- **అర్హత:** 12వ తరగతి, బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. టైపింగ్ వచ్చి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- **వయసు:** సూపరింటెండెంట్ పోస్టుకు 30 ఏళ్లు ఉండాలి. జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు 18 నుంచి 27 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్ పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** సూపరింటెండెంట్ పోస్టుకు టైర్-1, టైర్-2 పరీక్షలు ఉంటాయి. జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు టైర్-1 పరీక్ష మాత్రమే ఉంటుంది.
- **సూపరింటెండెంట్:** టైర్-1, టైర్-2 పరీక్షలు ఉంటాయి. టైర్-1 ఓఎంఆర్ షీట్ ఆధారంగా పరీక్ష జరుగుతుంది. మొత్తం 450 మార్కులకు 150 మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ప్రశ్నలు ఉంటాయి. కరెంట్ అఫైర్స్, జనరల్ అవేర్‌నెస్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంటెలిజెన్స్, లాజికల్ రీజనింగ్ అండ్ అనలేటికల్ ఎబిలిటీ, అర్థమేటికల్-న్యూమరికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, జనరల్ హిందీ, జనరల్ ఇంగ్లిష్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్, హిందీలో ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు.
  ఇందులో క్వాలిఫై అయిన అభ్యర్థులు టైర్-2 పరీక్ష రాస్తారు. టైర్-2 ఆబ్జెక్టివ్ టైప్ మరియు డిస్క్రిప్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. మొత్తం 150 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం మూడు గంటలు.
- **జూనియర్ అసిస్టెంట్:** ఓఎంఆర్ ఆధారంగా పరీక్ష జరుగుతుంది. టైర్-1 పరీక్ష మొత్తం 300 మార్కులకు 100 ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అండ్ జనరల్ అవేర్‌నెస్, రీజనింగ్ అండ్ మ్యాథమేటికల్ ఎబిలిటీ, జనరల్ హిందీ అండ్ ఇంగ్లిష్, బేసిక్ నాలెడ్జ్ ఆఫ్ కంప్యూటర్ ఆపరేషన్, స్కూల్ ఎడ్యుకేషన్, ఎగ్జామినేషన్ బోర్డ్, అడ్మినిస్ట్రేషన్ వంటి అంశాలు నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష మాధ్యమం ఇంగ్లిష్, హిందీ. పరీక్ష సమయం రెండు గంటలు. ఎంపికైన అభ్యర్థులకు స్కిల్ టెస్ట్(టైపింగ్ పరీక్ష) ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 02.01.2025.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 31.01.2025.
- **వెబ్‌సైట్:** https://www.cbse.gov.in